నీయము జేసును, బంగాళాదేశమందు కాళి ప్రసన్నమయి ఆరూపుధరియించి అనే ప్రజలను [illegible] భుడకుధరక్తపానము జేసును, దక్షిణదేశమందు మళయాళభగవ అనేకశక్తి ప్రజలను నశింపజేసును పశ్చిమానకుమాతంగి అనేకశక్తిప్రజలను మెడలం చిరణోస్త్ర్యాహానకు [illegible] -బెజవాడగోలగొండపట్నమవును-కనకదుర్గమ్మ ద్వారమందు తూర్పున యేడుపేలపట్టనన్ని వ్రాలును, - ఆకాలమందు సూర్యు గడగడవణకి నక్షత్రములు వ్రాలును అనేక వుత్పాతాలువుట్టిని - ముఖంబున బాన సర్పాకారంవచ్చి అనేకధ్వనిచేత [illegible] నందకొండయందు తటాకములోవుం పుదకపానీయము జేసును అనేకముఖముల [illegible] విచిత్రములు పుట్టును, కొండవేటి మయందు దుర్గములో మంటలు పుట్టి [illegible] శక్తి చేకలు వేసును శ్రీ ల పర్వతంయందు నందిచెవుల్లో [illegible] పుట్టును - భీమరాంబనుల్లో ముసళ్ళు జే రబడి పాడయిపోవును - ఈశాన్య [illegible] గంగలో శాపంచాతపచ్చయం పడియున్న [illegible] కలికాలం పురుషుని పాదముసోకి పాపవిమ క్తియవును, ఆకాలమందు విషగాలిపుట్టి ఆగాలివలన జనులకు రోగాలుపుట్టును తి పతి వెంకటేశ్వరుని [illegible] మూడుదినములు వేసినవాకిళ్ళు వేసి ట్టుగానే వుండును గరుడధ్వజము [illegible] నాధంబుట్టి [illegible] వీరరాఘు స్వామికి [illegible] చమటలు పుట్టును మేము వచ్చే కాలమున భూమియందు యనేక [illegible] అమిక్కుటమయిన ధ్వ యిచ్చీని, [illegible] -పగలు చుక్కలు కనుపించిని యనేకమయిన ధు మకేతువుపుట్టి [illegible] పాంచా సంసార [illegible] మల్లికార్జున [illegible] భోగయాచార్యులవారికి నేన భార్యనయము [illegible] రాజ్యంపరిపాలన చేస్తూవున్నానయని శిష్యులకు తెలియచాయగా యంతటశిష్యు [illegible] వచ్చేకాలానకు మేము జీవంతులమై యుండేలాగున్న [illegible] కలియుగం [illegible] సంవత్స ములు [illegible] ఆనందంలనుమీకు చెప్పిన భవిష్యత్తుజరుగబోవుతూ వు న్న విషయము [illegible] తెలియచేస్తాము సావధానంగావినండి ఆత్మపరత [illegible] నిత్యమయిన వస్తువు జననము [illegible] అటువంటి మీరేనని దేహాద్రభములచాత [illegible] దేహంయేను కాదుయని వుండవలసినది మీ [illegible] మహా [illegible] చాయాదానకు మీచాత కాదుమీకు సూక్ష్మమయిన జ్ఞాన [illegible] వినండి- దేహంపడిచేసమ యమందు మీయొక్క గురుమూలమం [illegible] రహస్యములున్న తత్వమక్యా మహావాక్యములున్న మీకు కృపచేస్తాము [illegible] పృథివియందుమీరుజన్మంబుల [illegible] వారలయి పవిత్ర గృహాలయస్థును, యీదేవాలయందు వి

హులయి వుండేవారుకొందరు పుణ్యతీర్థనదులయందు జనన సంకేతం యయిన వారు కొందరు ఈలాగునఉద్భవించి మాభక్తులయి వుందురు యయితేమీకు వకదాకలాంచ వృత్తాన్తు వినండి మాభక్తులయినవారు వత్తులయిలోకానకు భయపడుతూ లోకభ్రిమలకు దూరస్తులయి నిత్యానిత్యవస్తు వివేకంగలిగినవారలయి ప్రపంచంమూస్త్రైదానికి నైరలక్షులయివుందురు ఐతేవార లోకములోజననమై మాప్రపంగురు ధ్యానంమాయుందు భక్తిక్రియాజ్ఞానములుగలిగి రాత్రింపగలు బ్రహ్మంగారు చెప్పిన కాలజ్ఞాన సూత్రీప్రమాణాలు సత్యం యనిన్ని మారాకకు నిరక్షిస్తూ వీరధైర్యము గలిగి బ్రహ్మనందులయి మాయొక్క ఆరాధనములు మొదలయిన వాటియందు యనేక బ్ర[illegible] క్రియాజ్ఞానములు గలిగి సుఖాన వుందురు యటువంటి మహా[illegible]కానోకరు వుందురు ఓయిభక్తులారా వారేమీరు యనుకొని [illegible]దనముస్న సంతోషపడుతుంటూవుండవలసినదని ఈశ్వరమ్మగారు [illegible]యుక చేశినారుఅప్పుడుశిష్యులుఅమ్మా మేముఆనందభరితులమైనాము అమ్మాపరబ్రహ్మంగారికికొమాళ్ళుయెందరుయే మహాత్యం జరిగించినారో అనివిన్న వంశాయగా అప్పుడు ఆనతిచ్చిన విశరములు బ్రహ్మంగారి కొమాళ్ళునో వింపయ్యహోంకారయ్య, శంభులింగయ్య, కరిరాజయ్య, పోతులూరయ్య యీఐదుగురు కొమాళ్ళు అన్దులోపెద్దకొమారుడు గోవిందయ్యగారి తండ్రిఐనవీరబ్రహ్మేన్ద్రియస్వాములవారు అల్లాటపల్లెలో వీరభద్రుని దగ్గిరవుపదేశం ఐనారుగనుక అందునుంచి గోవిందయ్యగారు పన్నెండు సంవత్సరముల వయసుగలవారలై అల్లాటపర్వతంమీద యాభైఏండ్లుగా తపస్సుకూర్చిండిరి అక్కడనుంచి తనశక్తిచాతలోకమంతాదత్తాత్రేయ అవుతారంయెత్తి అవుతరించి అనేక వేదాంత గ్రంధములుజెప్పి ప్రజలకు వెల్లడిజేసివున్నారు అప్పుడు పర్వత గృహాయందుకూర్చుని అల్లాటపల్లెవీరభద్రునిదగ్గిర వుపదేశమై కందిమల్లయపల్లెకువచ్చి అక్కడమఠంలో ప్రవేశించి మఠంలోవుండి తనశిష్యులకు యావృత్తాంతం తెలియజెప్పి అప్పుడు మాతల్లియైనమహాలక్ష్మమ్మగారిని వివాహంచేసుకొనిరి మాతల్లియైన లక్ష్మమ్మగారికి కొమార్తెలుయీశ్వరమ్మయియున నేనునాచెల్లెండ్లు పార్వతమ్మ, శకరమ్మ, గోవిందమ్మ, గిరిరాజమ్మ, ఈఐదుగురముకొమార్తెలముతర్వాత మాతండ్రియైన గోవిందయ్యగారు మాతల్లిలక్ష్మమ్మయిద్దరు వకసమాధిలో కూర్చుండిరినాచెల్లెండ్లుకొన్నిసంవత్సరములువివాహములేకుండా వుండి వారివారికి యిచ్చిన కాలజ్ఞానములు యిరువైఐదువేల కాలజ్ఞానములు వారివారిసమాధిలోనే కూర్చునేకాలమందు ఆగ్రంధములు వుచ్చుకొని వారున్ను సమాధితపోనిష్టకూర్చుండి తపస్సుచేస్తూవుండిరి నేనున్ను వికృతినామసంవత్సరములోతపోనిష్టకుకూర్చుండ బోతూవున్నానని శిష్యులకు తెలియచేయగాశిష్యులు వకవిన్నపంజేసి

అమ్మగారికి విరుద్ధముగా మీరువివాహంలేకుండా వుండడంయేమని యడుగగా అప్పు డుయీశ్వరమ్మగారుపూర్వవృత్తాంతంయల్లడిగా శిష్యులకు తెలియజేసెనుగనుక ఇంతట నైనాజ్ఞానంవహించవలశినదిఇదిన్నిగాక శ్రీపోతులూరివీరబ్రహ్మేంద్రయస్వా ములవారు ఈయేడుకోట్లభూమండలములో యేకచక్రాధిపతిగాయేలబోతూవుండెదు బోతున్నవిగనుక ఇంతటనైనా జ్ఞానవహిన్ని ఈపత్రిక చూచిన వారెవరైనాగానిబ్ర హ్మక్షత్రియవైశ్య శూద్రాదులు మొదలై అష్టాదశవర్ణాలవార్నున్నుజ్ఞానంఅనేశో [illegible] ష్ట నిగ్రహాత్వ ములను భూలోకములో మహాప్రళయాంతక ములు శా తిన్ని వెతిగించుకొని అంధకారం బంధురంభైన పెనుమాయను నాశనంజేసి శ్రీపోతు లూ[illegible] వీరబ్రహ్మంగారు దైవమనిబాగా యోచించుకొని త్రికరణశుద్ధిగాన ధృక్తి గలిగిదినదినము [illegible] జేసిన వారికిఏమి బాధలులేకుండా బ్రహ్మానస్థాన్ని పొంది పీరధైర్యము గలిగి వీరసహానులై [illegible] కుకువుండి వీరధర్మం చూడబోతూవున్నా రుదేశములోకివచ్చిన దేవతాపంపులు వారిదర్శనానకు [illegible]శేరవు వారికిఅంట నేరవు సకలజనులుయీకాలజ్ఞానము చూచిమీయొక్క అజ్ఞానమైనటువంటిమోక్షములవిడిచి మోక్షజ్ఞానమువహించి దేహాభిమానము వీడగొట్టి పంచభూతములు చలనంలేకుండాయే కమనస్సుగా సుతికేసివ్యాత్మలమస్తు అహోరాత్రిస్మృతూ యొక్కమహావిద్యావశా శురి మహామంత్రంజింహా గ్రమస్థమానక యేరుకమరువకుండా అంకుశాన అప్పటప్ప టికి పాడిచి అహోరాత్రిళ్ళు పఠనజేస్తూవున్నవలశినది ఈప్రకారంవున్నటువంటిమహా నుభావులుఆచంద్రార్కస్థాయిగా వర్ధిల్ల బోతూవున్నారు. ఈప్రకారంపూజశాయ కథనమధాంధముచాత మావాక్యములునమ్మక కల్లనియెంచితాలో [illegible]శన చేసినవ్వారి నిముఖ్యవచ్చే మహాప్రళయాంతకములైన దేవతాపంపులు విరుచుకతిని పోతూవున్న వి. ఇదిగాక అనేకమైన వుత్పాతములవల్ల నష్టమైపోదురు చాలాయోచించుకోవలసి నది ఇదివీరగురు వాక్యం తప్పదు.

శ్రీవీరబ్రహ్మార్పణమస్తు. శ్రీ శ్రీ శ్రీంజేయనుసహాయం.

కాలజ్ఞానము ముగిసినది.

కీర్తన॥ ధన్యాసిరాగం - ఆదితాళం.

చచ్చేటందుకువుట్టివున్నవు - సందులుమూరకురోరన్న॥

యున్నాళ్ళుండినయముడు విడువడు - యెందుకుదడిశెవురోరన్న॥ ప॥

సాధులతోను సంగతిజేసి సంధియెరుగరావోరన్న॥

[illegible]రుపాదము[illegible]గరవోరన్న॥ చ॥

[illegible] - [illegible]గరవోరన్న॥

శ్రీరస్తు.

ఆత్మజ్ఞానోదయము.

ఆత్మజ్ఞానము వలయువారలకు

వుపయుక్తంబగునటుల

ధూర్జటి- లక్ష్మీనారాయణయ్యగారిచే

రచియింపంబడి

యనమదల- అనంతాచార్యులవారి

స్వకీయ

(విద్యా) వివేకకళానిధిముద్రాక్షరశాలయందు

ముద్రింపించిప్రచురింపఁబడియె.

౧౮౮౮-సం॥ మదరాసు.



విషయసూచిక.

శ్రీరస్తు.

శ్రీకృష్ణాయనమః.

ఆత్మజ్ఞానోదయము.

హరిః ఓం ॥ గురుర్బ్రహ్మాగురుర్విష్ణు । గురుర్దేవోమహేశ్వరః।
గురుస్సాక్షాత్పరబ్రహ్మ । తస్మైశ్రీగురువేనమః ॥

శ్లో॥ రామోమత్కులదైవతంసకరుణంరామంభజేసాదరం। రామేణాఖిలఘోరపాపరహితో రామాయ తస్మైనమః । రామాన్నాస్తి జగత్రిమైకసులభో రామస్యదాసోస్మ్యహం । రామేప్రీతిరతీవమేకులగురో శ్రీరామరక్షస్వమాం ॥సీతామనోమానసరాజహంస।సంసారసంతాపహరక్షమాల్లో । శ్రీరామదైత్యాంతకశాంతరూప । శ్రీతారకబ్రహ్మనమోనమస్తే ॥ బ్రహ్మామృతానందఫలప్రదాయినం। వేదాంతవిజ్ఞానసుగంధపుష్పితం । సీతాశుభాంగాంచిత బాహుశాఖినం । శ్రీరామకల్పద్రుమమాశ్రయామః॥

శ్లో॥ అనంతశాస్త్రంబహువేదితవ్య।మల్పశ్చకాలోబహవశ్చవిఘ్నాః।
యత్సారభూతం తదుపాసితవ్యం।హంసోయథాక్షీరమివాంబుమిశ్రమ్॥
అనిచెప్పియుండుప్రకారమువివేకముగల యోగులగువారికి సారభూతమయిన అధ్యాత్మశాస్త్రమే వుపాసింపతగినదనిన్ని అట్లుగాని యెడలఅన్ని శాస్త్రములు తెలుసుకొనుటకుఅశక్యములనిన్ని అందులోకొన్నిశక్యములు గాక దేవా ... స్త్రీ తాత్పర్యములుబహువిధములు గనుకఅవియున్నియూ

జీవితము కాలము స్వల్పమనిన్ని యేదో ఒకవిధమున సాధించుదమంటె పు త్ర దారాది సంసార బాహుళ్యమువల్ల విఘ్నములుకలుగుచున్నవనిన్ని ఈ మొదలయిన హేతువులనుబట్టి శాస్త్రములయందుసారభూతమయిన వస్తు నిర్ణయమేదికలదో దాన్ని సద్గురుడుపదేశమువల్ల చక్కగా తెలుసుకుంటే అప్పుడు ఆత్మజ్ఞానోదయమవునని సాక్షాత్ భగవంతుడు అర్జునునకు ఉపదేశము చేసియున్నారుగనుక నావంటిపామరులకుజ్ఞానముకలుగు నిమిత్తమయి సులభమయిన శబ్దములతోనున్న మిగుల సంక్షేపముగానున్న ఆత్మజ్ఞానోదయవిషయమయి వ్రాయుటమయినది. లోకమునందు ఈశ్వరానుగ్రహము కలవారికిసులభముగా ఆత్మజ్ఞానముకలిగేవుపాయముచెప్పుచున్నాను. అదెట్లనగా:—ప్రాణులకు యేడు ఆవరణములున్నవని వేదాంత శాస్త్రములయందు చెప్పబడియున్నవి. అవియేవియనగా, దుఃఖము, శరీరపరిగ్రహము, కర్మము, రాగద్వేషములు, అభిమానము, అవివేకము, అజ్ఞానము. అందులో దుఃఖమయినది శరీరపరిగ్రహమువల్లవచ్చినది. శరీరపరిగ్రహము కర్మవల్లవచ్చినది. కర్మ రాగద్వేషాదులచేతవచ్చినది. రాగద్వేషాదులు అభిమానమువల్లవచ్చినవి. అభిమానమవివేకమువల్లవచ్చినది. అవివేకమజ్ఞానమువల్లవచ్చినది. అజ్ఞానమనాదియైనది గనుక అది ఫలానివిధముగా వచ్చినదని నిర్ధారణచేయుటకు దుర్లభముగావున్నది. అయితే అనాదియని చెప్పబడే అజ్ఞానము ఆత్మజ్ఞానముకలిగితే పోతుంది. అజ్ఞానముపోగానే అవివేకముపోవును. అవివేకముపోగానే అభిమానము పోవును. అభిమానముపోగానే రాగద్వేషాదులుపోవును. రాగద్వేషములుపోగానే కర్మముపోవును. కర్మపోగానే శరీరపరిగ్రహముపోవును. శరీరపరిగ్రహముపోగానే దుఃఖముపోవును. గనుక వివేకియయినవాడు ఆత్మజ్ఞానము సద్గురుమూలకముగా సంపాదించవలయును. ఆయాత్మజ్ఞానమెట్లుకలుగుననగా, ఆత్మానాత్మ విచారమువల్లనే కలుగును. అదెట్లనగా:—శుద్ధబ్రహ్మ యందుకల్పితంబయినమాయావుత్పత్తి [illegible] గ,

ివల్ల స్వర్గనరకములనియు యిహాపరములనియుఆదియనాదివేదమనే ము చరాచరము అండపిండము జ్ఞానాజ్ఞానము సత్తునసత్తుహితాహి ము మానాభిమానము కర్మాకర్మము ధర్మాధర్మములుశుభాశుభము దానిద్రపక్వాపక్వము కామనిష్కామము సీతోష్ణముయుక్తాయుక్తము శనిరాశ శోక మోహముగాగద్వేషము మొదలయినవిద్వంద్వములుగా ప్రందుబంధములలోచిక్కుపుట్టుగిట్టువారు అవయవములతోగూడినదేహ ముతానుకాదనితెలిసి తాను దేహియనిమనుస్సునందు నిజముగా తెలిసి వాడయి తాను మోక్షాధికారియనితెలియబడుచున్నాడు. ఈభూమి యందు అండజస్వేదజోద్భిజజరాయుజంబులనినాలుగువిధయోనులయం పుత్పత్తిఅయినయేడువిధదేహములలో దేవతాభేదంబులు ౧౧ లక్ష , మానవభేదంబులు ౯ లక్షలు, మృగభేదంబులు ౧౦లక్షలు, పక్షి భేదంబులు ౧౦ లక్షలు, జలచరభేదంబులు ౧౦ లక్షలు, నేలప్రాకేజంతు భేదంబులు ౧౩ లక్షలు, గిరితరుగుల్మతృణలతాదిస్థావరభేదంబులు ౧౯ లక్షలు. ఇవియన్నియుచేరి ౮౪లక్షల దేహభేదంబులలో యిహపరలో జ్ఞాపకశక్తికలిగినది ఉత్తమశరీరమనిన్ని పరలోకమెరుగక యిహలోక మమాత్రమే యెరిగివర్తించుటమధ్యమశరీరమనిన్నియిహపరలోకములు రెంటినినెరుంగక చలనములేకస్థావరముగానుండునది అధమశరీరమనిన్ని యీలాగు వుత్తమమధ్యమ అధమశరీరములలోమధ్యమ అధమశరీరముల మోక్షములేక వుత్తమశరీరములయిన మానవశరీరములకే మోక్షాధి కారశక్తి గలిగియున్నది గనుక యీ ౮౪ లక్షల దేహములలోమానవ దేహమున జన్మించుట అరుదుగనుక అదితెలుసుకొనిఅధమమయినరా గద్వేషములనెడి ౧౬ గుణములను మోక్షాపేక్షగలవారు విడుతురు. ఈ గుణములనువిడువనిపక్షమందు జన్మపరంపరగాసంసారతాపత్రయముల మున భవ బంధములనుభవించుకొరకుకలిగినజడపదార్థమయినయీస్థూ దేహము నశించుకాలమున వుపాధులుసంభవించిచిత్తభ్రమవలనయీ

తెలుసుకోలేక యమధర్మరాజాయాధమునకు ఆహారముగా యీజీవులు చిక్కుచున్నారు గావున అటువంటిఆపద సంభవించుటకుముందే యీగుణములను దహించివివేకమును కలుగచేసుకొన్నయెడల మోక్షాధికారులయి వర్తింతురు.

రాగద్వేషప్రకరణము:—౧. రాగము ౨. ద్వేషము ౩. కామము ౪. క్రోధము ౫. లోభము ౬. మోహము ౭. మదము ౮. మాత్సర్యము ౯. యీర్ష్య ౧౦. అసూయ ౧౧. డంభము ౧౨. దర్పము ౧౩. అహంకారము ౧౪. యిచ్ఛ ౧౫. భక్తి ౧౬. శ్రద్ధ అని ౧౬విధములుగలవు. అందులో స్త్రీవిషయమయికలిగెడిచిత్తవృత్తికిరాగమనబడును. తనకు ఒకడు అపకారముచేసినయెడల ఆ అపకారమునకు ప్రతిఅపకారముచేయవలయుననితోచెడిచిత్తవృత్తికిద్వేషమనిపేరు. గృహారామక్షేత్రధనధాన్యాదులనుసంపాదింపవలయుననెడిచిత్తవృత్తికికామమనిపేరు. తానుసంపాదించినట్టిపదార్థంబులకుయెవడువిఘ్నముకలుగజేయునోవానిమీద వుగ్రముగలిగెడి చిత్తవృత్తికిక్రోధమనిపేరు. అర్జించినద్రవ్యము ను శెలవుచేయకూడదనే చిత్తవృత్తికిలోభమనిపేరు. అయిశ్వర్యమదముచేత కృత్యాకృత్యములు నెరుంగలేని చిత్తవృత్తికిమోహమనిపేరు. సకలసంపదలుకలిగి నేనుయేమిచేసినాచెల్లుననితోచెడిచిత్తవృత్తికి మదమనిపేరు. ఒకడుతనకంటెనధికుడయివుండెనేనివానిసంపదనుచూచిసహించలేని చిత్తవృత్తికి మాత్సర్యమనిపేరు. దుఃఖముపరులకురాకుండావుండగా తనకురావచ్చునా అనేచిత్తవృత్తికి యీర్ష్యఅనిపేరు. మనవలెనే పరులు సుఖముగా వుండవచ్చునా అనేచిత్తవృత్తికిఅసూయయనిపేరు. తానుచేసిన ధర్మకార్యము నలుగురుయెరిగి మెచ్చవలయుననేచిత్తవృత్తికిడంభమనిపేరు. తానుపెద్దవాడనియయితరులెవరు తనకుసరికాదనియుననితో [illegible] మనిపేరు. ఓరినిను. శిక్షించేవాడునేననియెరుంగ

త్తవృత్తికి అహంకారమని పేరు. అనిర్వాచ్యంబులగు శౌచాదిక్రియలను చేయవలెననెడి చిత్తవృత్తికి యిచ్ఛయని పేరు. గురుదేవతాదులయందు గల ప్రీతికిభక్తియని పేరు. గురువులయందును వేదాంతవాక్యములయందు దున్న యాగాదిక్రియలయందునుగల విశ్వాసమునకు శ్రద్ధయని పేరు. ఈలాగున రాగద్వేషంబుల స్వరూపంబుల నెరుంగవలయును. ఏలనంటే యివి ప్రయత్నములులేకనే వచ్చుచున్నవి. ఈరాగద్వేషాదులు యేలవచ్చుచున్నవంటే అభిమానముచేత వచ్చుచున్నవి. ఈయభిమానమెందుచేతవచ్చుచున్నదంటె అవివేకముచేతవచ్చుచున్నది. ఈయవివేకమెందుచేత వచ్చుచున్నదంటే అజ్ఞానమువల్ల వచ్చుచున్నది. గనుకమోక్షాపేక్షగలవారు రాగద్వేషములకుప్రేరేపణకర్తలుగావుండుఅభిమానము, అజ్ఞానము, అవివేకము, వీట్నివదలి ఆత్మానాత్మవిచారముచేసిసంసారబంధంబులవదలి త్వరలో జీవన్ముక్తి సుఖంబుపొందవలయును. ఏలనగా రావణాసురుడుమొదలు మధుకయిటభులవరకు వరప్రసాదులుగానున్నమహాబలపరాక్రమశాలులుగానున్నవుండిన్ని యీగుణములలో వొకొక్కగుణము వొకొక్కనికి వున్నందున వొకొక్కడు పుత్రమిత్రకళత్రాదులతోడ యిహపరసౌఖ్యములను అనుభవింపక శత్రువులవల్ల ప్రాణహాని రాజ్యహానిబంధునాశముమొదలయిన అనేకఅనర్థములనుఅనుభవించిరి. ఈరాగద్వేషములన్నియును నరకమునకున్ను జననమరణములకున్ను సకలసంసారభవబంధములకున్ను హేతుకరములుగావున్నవని శాస్త్రములలో చెప్పబడియున్నందున మోక్షాపేక్ష గలవారికియివివుండకూడదు. ఈరాగద్వేషములు విడుచుటకేది ఉపాయమనగా సత్సహవాసము వల్లను శాస్త్రవిచారణవల్లను తనవివేకమువల్లను పెద్దలఆశీర్వచనముల వల్లనుగురువుల సహవాసముచేత వారికృపకలుగ చేసుకొని వారుబోధచేయు జ్ఞానమనే వజ్రాయుధమువల్ల వాటిని ఛేదించి మోక్షమును చెంద

సాధనచతుష్టయము:— బ్రహ్మసత్యము జగన్మిథ్యయని వేరుం గునదే నిత్యానిత్యవస్తువివేకము. ఇహమందు వనితాదిభోగములతో చేరి న గృహకుటుంబ ధనధాన్యములయందు ప్రీతియు పరలోకమందురంభా సంభోగము మొదలగు కోరికలనున్ను వమనాన్నమూత్రపురీషాదులవలె నే మనస్సున యెంచక ప్రపంచమునకు కారణకర్తగా ప్రకాశించు భగ వంతుని యెడల విశ్వాసముగానుండడమే ఇహాముత్రార్థఫలభోగ విరా గమయినది. శమ, దమ, ఉపరతి, తితీక్ష, సమాధానము, శ్రద్ధ, మొదల యిన యీ ఆరుచేరి శమాదిషట్క సంపత్తిఅయినది. అందు శమమన గా మనోనిగ్రహము. దమమనగా జ్ఞానేంద్రియ కర్మేంద్రియ ములను విషయములలో బడనివ్వక ఆటంకపరుచుట. ఉపరతియనగా సకలపాప కర్మంబులు విడిచి సకలపుణ్యకర్మంబులుచేసి భగవంతునికి ప్రీతిచెయు ట. తితీక్ష అనగా సకలముపోవుటకు వ్యసనములేకయు సకలమువచ్చుట కు సంతోషములేకయు సమబుద్ధితోగూడి యుండడము. సమాధానమ నగా పెద్దలతోచేరి శ్రవణంబుచేయుకాలంబున మనసునున్నుయింద్రియ ములనున్ను విషయములలో బడనివ్వకనిలువుట. శ్రద్ధయనగా వేదాంత శాస్త్రములయందునుగురువులయందును ఈశ్వరునియందునుఅధికవిశ్వా సముతో గూడియుండుట. అగ్నిలోబడినవాడు, జలమునుచూడ పారె డుచందమున యెప్పుడు మోక్షముకలుగునో అని అతితీవ్రముతో కూడి యుండడమునకు ముముక్షుత్వమని పేరుగనుక యీనాలుగు సాధనములు గలవారే మోక్షార్హులని యెంచబడుదురు. ఇదిగాక మోక్షాపేక్షకలవా రికియిచ్ఛా- భక్తి, వైరాగ్యములు, కలిగివున్న యెడల వారు మోక్షము పొందుటకు హేతువుగావుండునని తెలుసుకోవలసినది. గనుక అందు యిచ్ఛ అనగా ఆకలిదాహము నిమిత్తమయి అన్నపానాదులు గ్రహిం [illegible]యునచే చితవ, తికి యి

సుగానుండును. లేక బాధగానుండును. గనుక వీటివలన పుణ్యపాపంబులు, స్వర్గనరకంబులు, బంధమోక్షంబులు, లేవని తెలుసుకోవలయును. భక్తియనగా వేదాంతశాస్త్రములయందును సర్వాంతర్యామియైన ఆత్మస్వామియెడలను గలిగెడువిశ్వాసము. వైరాగ్యమనగా మనోవాక్కాయకర్మములయిన త్రికరణములతోడ యదార్థముగా నతిప్రీతితోడనడవడము. కాబట్టి ముముక్షువులు భక్తివైరాగ్యములు పొందవలసినదియేలనంటే భక్తివైరాగ్యములవల్ల పూర్వము ఖట్వాంగమహారాజు మొదలయినవారు అనేకమంది మోక్షము చెందిరని శాస్త్రములు మొరబెట్టుచున్నవి. గనుక ముముక్షువులకు భక్తివైరాగ్యములు అవశ్యముగా వుండవలయును.

గుణత్రయము:— సాత్వికము, రాజసము, తామసము, అని మూడుగుణములుకలవు. అందుసాత్వికమనగా సన్మార్గము గనుకఅది దైవసంపత్తుకలిగివుండును. రాజసగుణములోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన మొదలయినవాటికికలిగివుండును. తామసమనగా రాక్షసుల సంపత్తుగలిగి వుండడము గనుక వివేకులగువారు సదా సాత్విక గుణమును వహించియుండవలయును. మార్గములో నొకపాదునూతిపయిపచ్చిక మూతపడియుండ చీకట్లో నొకడునడుచుచు యాకూపమును తెలియకబడినరీతిగా అస్థి, మాంసము, రక్తము, చర్మము మొదలయినవాటితో పూరితంబైన స్త్రీల దేహంబునుచూచి మోహంబునచిక్కి విషయానందభరితులయి జీవులుప్రారబ్ధమునుఅనుభవించుచున్నారు. గనుక ఈయజ్ఞానంబురహితంబుచేయకోరి బ్రహ్మోపాసన చేసినయెడల సంసారవ్యాపారాదులునశించును. విషయసుఖంబులను యిచ్ఛయించినయెడలవివేకమునాశంబుచెందును, గనుక శృతిస్మృతివాక్యములను సద్గురు మూలకముగా గ్రహించిశ్రవణమనననిధిధ్యాసనంబులుజేసినముక్తికలుగును.

స్థూలపంచీకరణము:— పృథివ్యాది పంచభూతములలో మొద [illegible] గమునందు అగ్ని, అ

గ్నియందుదకము, ఉదకమందు పృథ్వి, యీపంచభూతముల నొక్కటిని రెండుభాగములుచేసి యందులో మొదటియర్థభాగమువుండగా మిగతఅర్థభాగమును నాలుగుభాగములు గాచేసి యితరభూతములయొక్క భాగములతో జేర్చితే యీ ౨౫న్నూగూడి స్థూలపంచీకరణమయినది.

పంచకములు:— జ్ఞాత, మనస్సు, బుద్ధి, చిత్తము అహంకారములకు అంతఃకరణములనిపేరు. ఇవి ఆకాశపంచకములో చేరినవి. ప్రాణోపానవ్యానోదాన సమానములకుప్రాణేంద్రియములనిపేరు. ఇవి వాయుపంచకములో చేరినవి. శ్రోత్రత్వక్కుచక్షు జిహ్వాఘ్రాణములకు జ్ఞానేంద్రియములనిపేరు. ఇవిఅగ్నిపంచకములో చేరినవి. శబ్దస్పర్శరూపరసగంధములకు పంచతన్మాత్రలనిపేరు. ఇవి అప్పుపంచకములోచేరినవి. వాక్పాణిపాదగుహ్యాగుదములకు కర్మేంద్రియములనిపేరు. ఇవి పృథ్వీపంచకములో చేరినవి.

సూక్ష్మపంచీకరణము:— ఈపంచభూతముల నొక్కొక్కటిని ౨ భాగములుచేసి యందులో అర్థభాగముండగా తక్కిన అర్థభాగమును ౪ భాగములుగాచేసి యితర భూతములయొక్క భాగములతో చేర్చితే యీ ౨౫ న్నూ కూడి సూక్ష్మపంచీకరణమయినది.

చేతనాచేతన విచారము:— ఈప్రపంచములో చేతనములనిన్ని అచేతనములనిన్ని రెండువిధములు. అందులో పాదములతోనడుచుజంతువులకున్ను రెక్కలతోయెగురు పక్షులకున్ను నేలపాకాడు జంతుభేదములకున్ను చేతనములనిపేరు. పృథ్వి. జలము, పర్వతములు, వృక్షాదులు మొదలయినవి అచేతనములనిచెప్పబడుతున్నవి. ఇదిగాకప్రపంచములో ఆత్మయనియు అనాత్మయనియు రెండువిధములు. అందు ఆత్మ అనగా ప్రపంచాతీతుడు. అనాత్మ అనగాప్రపంచాతీతుడు కానివాడు.

లయినవి. ఈ అనాత్మతో కూడుకొని తోచెడి యాత్మ జీవుడనియు, ఈశ్వరుడనియు రెండువిధములుగా తోచుచున్నవి. ఈజీవేశ్వరులనేకానేక విధములుగా తోచుచున్నారు. జీవుడు అనేకవిధములుగా తోచినను ఒక్కడున్న యీశ్వరుడు కూడ నెందుకు అనేకవిధములుగా తోచుచున్నాడనగా అతడాలాగుననే తోచును. అదెట్లనిన అతడు పుణ్యక్షేత్రముల యందును పట్నములయందును గ్రామాదులయందును ప్రతిగృహమందును మృచ్ఛిలా దారు తామ్రాదిప్రతిమలుగా తోచుచున్నాడు. ఇట్లుండగా ఈశ్వరుడెందుకీలాగున తోచుచున్నాడనగా పైనచెప్పబడిన మృచ్ఛిలా దారు తామ్రాదిప్రతిమలకు యీశ్వరబుద్ధే గాని ప్రతిమాదిబుద్ధి యెప్పుడు లేదు. వాటియందీశ్వరబుద్ధి లేనియెడల గోపురప్రాకారాది మంటపములకున్ను పూజాభిషేకములకున్ను యేలజనులు వ్యర్థముగా కోట్యాంతర ద్రవ్యములను వ్రయము చేయుచున్నారు. గనుకనే పైనచెప్పబడిన ప్రతిమాదులయందు ఈశ్వరబుద్ధి రావచ్చునని నామతము. ఇదిగాక, అనాత్మస్వరూపములయిన ప్రతిమాదులయం దీశ్వరబుద్ధి రావచ్చునా అంటే రావచ్చును. ఏలనంటె మిక్కిలి యమేధ్యమయిన దేహేంద్రియాది సంఘాతమే నేననువానికి ఆప్రతిమాదులయందు ఈశ్వరబుద్ధి యేలరాకూడదు. మరియు దేహేంద్రియాదులు శుక్లశోణితంబులవలన బుట్టినవిగనుకనున్ను మాంసమూత్రపురీషాదులవల్ల నిర్మింపబడినవిగనుకనున్ను యివి యమేధ్యములనుటకు ఉచితమే ఇందుకనేకదృష్టాంతములు గలవు. అవి యనావశ్యకముగనుక యీప్రకారంబుగా ఆత్మానాత్మవిచారము చేసి యెవ్వ యాత్మస్వరూపంబు నేనని యెరుంగుచున్నాడో వాడే ముక్తుడు.

<u>దుఃఖము స్వాభావికము కాదనుట</u>:— ప్రాణులకు దుఃఖము స్వాభావికమా లేక ఆగంతుకమా అని ఆలోచనచేసినయెడల అది యాగంతుకమే కాని స్వాభావికముకాదని తోచుచున్నది. ఇది స్వాభావిక [illegible] నొనరు యత్నము చేయుదురు గనుక యితి

గంతుకమనియే చెప్పవలయును. ఇందుకు కొన్నిదృష్టాంతములుచెప్పెదను. అవియెవియనగా వేపాకుకు చేదుస్వాభావికము గనుక చేదులేనివేపాకు యెక్కడనూలేదు. వేపాకునుచేదు వకనిమిషమయినను వదలియుండదనెడి సంగతి యేలాగున అందరికి తెలుసునో అదేలాగు దుఃఖముజనులకు స్వాభావికముకాదని స్పష్టముగా తెలుసుకోవలెను. ఇదేరీతిన అగ్నికి ఉష్ణత్వంబు స్వాభావికంబు. జలంబునకుశైత్యంబుస్వాభావికంబుగనుకఆత్మకు దుఃఖము స్వాభావికమని చెప్పకూడదు గనుకఅది ఆగంతుకమనేచెప్పవలయును. అట్లయితే దుఃఖమెందుచేతవచ్చినదంటే శరీరపరిగ్రహముచేత వచ్చినది. ఎంకెందు శరీరపరిగ్రహము కలదో అందందు దుఃఖముగలదు. ఈశరీర మెందుచేతవచ్చినదంటే కర్మము తోగూడిన పంచీకృత పంచమహాభూతంబులవలననే వచ్చినదని తోచుచున్నది-(కర్మమెవరికి నశించిపోవుచున్నదో వారికి శరీరమురాదు. కర్మముకలిగనేని శరీరముకలుగునని శృతులు పలుకుచున్నవిగనుక)కర్మమునునశింపచేసి జ్ఞానసంపాదనచేసుకొన్నయెడల మోక్షముకలుగును.

<u>కర్మవిచారము</u>:— కర్మ అనగా ప్రాణులయొక్క వుత్పత్తి వృద్ధి నిమిత్తమయి చేయబడునది. పుణ్యకర్మమనియు,మిశ్రకర్మమనియు, పాపకర్మమనియు, మూడువిధములుకలవు. వీటికిఫలములు యేలాగనగా పుణ్యకర్మంబునకు దేవాదిశరీరప్రాప్తి, మిశ్రకర్మంబునకు మనుష్యశరీరప్రాప్తి, పాపకర్మంబునకుతిర్యగాదిశరీరప్రాప్తి,పుణ్యోత్కర్షంబునకు హిరణ్యగర్భశరీరప్రాప్తి, పుణ్యమధ్యమంబునకుయింద్రాది శరీరప్రాప్తి, పుణ్యసామాన్యంబునకు యక్షరాక్షపిశాచాది శరీరాదిప్రాప్తి, పాపోత్కర్షంబునకు పరులకుసంతాపకరంబయిన గుచ్ఛగుల్మవృశ్చికయూక వనమక్షికాది శరీరప్రాప్తి, పాపమధ్యమంబునకు ఆమ్ర, పనస, నారికేళ, మహిషాశ్వ, గర్దభాది శరీరప్రాప్తి, పాప

బునకు నిష్కామ కర్మానుష్ఠానముచేతను చిత్తశుద్ధి, తద్వారా, సాధన చతుష్టయసంపత్తి, తద్వారా, సద్గురులాభముకలిగిసద్గురులాభపూర్వకంబుగా చేయబడినశ్రవణ, మనన, నిధిధ్యాసలచేత వచ్చినట్టి జ్ఞానముద్వారా జీవన్ముక్తి సుఖంబిచ్చునట్టి శరీరప్రాప్తి, మిశ్రమధ్యమంబునకు స్వాశ్రమోచిత కామ్యకర్మంబులకు యోగ్యమయిన శరీరప్రాప్తి, మిశ్ర సామాన్యంబునకు ఛండాలవ్యాధాది శరీర ప్రాప్తికలుగును. గనుక వివేకియగువాడు కర్మఫలతారతమ్యమును విచారించిమిశ్రోత్కృష్టంబు యేవిధంబున సిద్ధించునోయని అందుకుతగిన ప్రయత్నము చేయవలయును. మరిన్ని విచారపరులకు జ్ఞానయోగముచేతనున్ను కర్మనిష్ఠులకు కర్మచేతనున్ను యీ రెండువిధములయిన నిష్టలుకలవు. పురుషుడు కర్మారంభముచేయనందువల్లవానికి జ్ఞానయోగనిష్ట కలగదనిన్ని కర్మపరిత్యాగమువల్ల పురుషుడు నైష్కర్మ్యలక్షణ జ్ఞానసిద్ధిని పొందచాలడనిన్ని చెప్పబడియున్నది. పురుషుడుక్షణమైనను కర్మ చేయకవుండడు. ఏలనంటే వాడు ప్రకృతిలోబుట్టినగుణములచేత స్వాధీనములేనివాడై కర్మనుచేయుచున్నాడు. ఎవడయితే వివేకములేక కర్మేంద్రియములను నిగ్రహించి మనస్సుచేత యింద్రియములను చింతించుచున్నాడో వాడు కపటముయిన ఆచారముగలవాడని తెలుసుకోవలయును. గనుక యెవడయితే మనస్సుచేత యింద్రియములను నిగ్రహించి ఫలాకాంక్షలేక నేకర్మను చేయుచున్నాడో వాడుఉత్తముడని యెఱుంగవలయును. మఱియు భగవత్ప్రీతిగాచేయబడు కర్మతప్ప తక్కినకర్మ బంధకము గనుకబుద్ధిశాలియైనవాడుకర్మనుఫలకాంక్షలేకుండా చేయవలయును. మరియు బుద్ధిశాలిగావుండువాడు ప్రాణులుఅన్నమువలన బుట్టుచున్నవనిన్ని అన్నమువర్ష దేవతవలన బుట్టుచున్నదనిన్ని వర్ష దేవత యజ్ఞమువలన బుట్టుచున్నదనిన్ని యజ్ఞము కర్మవలనబుట్టుచున్నదనిన్ని ఆకర్మ వేదమువల్లబు

మైన ఆపరమాత్మ యజ్ఞమునందు యెల్లప్పుడు ప్రతిష్ఠితుడైవున్నట్టుగా నున్ను తెలుసుకోవలయును. ఎవ్వడయితే ఆత్మయందు రతికలిగినవాడో, ఆత్మయందు తృప్తిపొందినవాడో, ఆత్మయందుసంతోషించువాడో, అటువంటివానికి కర్మతోటి పనిలేదుగనుక అటువంటివాడు కర్మ చేసిన దానివల్లగాని చేయకపోవడమువల్లగాని ప్రయోజనములేదు. మరిన్ని అట్టివానికి లోకవిషయములతోటియేమిప్రయోజనమున్నులేదు. కాబట్టిబుద్ధిశాలియైనవాడు ఫలసంగవర్జితుడై కర్మను యెల్లప్పుడు చేయవలయును. అట్లా పురుషుడు కర్మచేసినయెడల వానికిమోక్షము సిద్ధముగాప్రాప్తమగును. పూర్వము జనకాదులు కర్మానుష్ఠానముచేతనే జ్ఞానసిద్ధినిపొందిరి గనుక ఉత్తములుగావుండువారు ఏయేకర్మలను ఆచరించుచున్నారో ఆయాకర్మలనే పామరులున్ను ఆచరించవలయును. మరిన్నిఉత్తములు దేనిని ప్రమాణముగా ఒప్పుకొనుచున్నారో పామరులున్ను ఆప్రమాణమునే అనువర్తించుచుందురు. అందరు కర్మనువిడిచిపెట్టితే వారుచెడిపోవడముకాకుండా వర్ణసంకరము అయిపోవునుగనుక అందరు కర్మను అగత్యము ఆచరించవలయును. మరిన్నికామము, క్రోధము యీరెంటిని బుద్ధిశాలిశత్రువులుగా భావించును పొగ నిప్పునున్ను, తుప్పు అద్దమునున్ను, మావి గర్భపిండమునున్ను, యేరీతిగా కప్పియున్నదో ఆప్రకారమే కామము జ్ఞానమును కప్పుకొనియున్నది. మరిన్ని ఆకామము తృప్తిలేనిదిగానున్ను యిచ్ఛారూపమయినదిగానున్ను కోరగానే వుండునటువంటిదిగానున్ను జ్ఞానికినిత్యశత్రువయినదిగానున్ను వున్నదిగనుకయిది మనోబుద్ధులచేత జ్ఞానమును కప్పిపురుషుని మోహింపచేయుచున్నది. గనుక వివేకిగావుండువాడు ప్రథమతః యేమిచేయవలయుననగా యింద్రియములను నిగ్రహించవలయును. తర్వాత ఆత్మజ్ఞానమునున్ను అనుభవజ్ఞానమునున్ను నశింపచేయు కామమును విడిచిపె

[illegible] ...ములు దేహము

నిన్ని బుద్ధి మనస్సుకంటె శ్రేష్ఠమయినదనిన్ని ఆత్మ బుద్ధికంటె శ్రేష్ఠముయినదనిన్ని యెఱింగి బుద్ధికంటె శ్రేష్ఠమయినఆత్మను చక్కగా తెలుసుకొనిబుద్ధిచేత మనస్సును నిగ్రహించి దుఃఖోత్పత్తికి కారణభూతముయిన్న కామమునుయెవడు చంపుచున్నాడో వాడికి ఆత్మజ్ఞానముకలిగి తద్వారా మోక్షము సిద్ధముగాకలుగును.

<u>ఆత్మానాత్మవిచారము</u>:— ఆత్మఅనిన్ని అనాత్మఅనిన్ని రెండు విధములుకలవు అందులో ఆత్మ అనగా దేహత్రయవిలక్షణుడయి, అవస్థాత్రయసాక్షియై, పంచకోశ వ్యతిరక్తుడయి, చతుర్వింశతితత్త్వాతీతుడయి సచ్చిదానందుడయి వుండువాడని యెఱుంగవలయును. మరియుఆత్మ చంపెడివాడు కాడు. వాడుచచ్చునట్టివాడుకాడు. అయితే వాడుస్థిరరూపుడు. వాడుఅనాదియైనవాడుగనుక వానికి నాశములేదు. ఇంకావాడునిత్యుడనిన్ని ఏకరూపియనిన్ని వికారరహితుడుఅనిన్ని పుట్టుకలేనివాడనిన్ని, క్షయరహితుడనిన్ని, యెఱుంగవలయును. మరిన్ని మనుష్యుడు జీర్ణవస్త్రములను పారవేసి కొత్తవస్త్రములను యేలాగునకట్టుకొనుచున్నాడో ఆలాగుననేఆత్మఅనువాడు శిథిలములుగావుండు శరీరములనువదలి యితరములయిన శరీరములను గ్రహించుచున్నాడు. ఈఆత్మఅనువానిని ఆయుధములు ఛేదింపలేవు, నిప్పు కాల్చచాలదు, నీళ్లుతడపచాలదు, వాయువు శోషింపచాలదు. మరిన్ని యీఆత్మ నేత్రములకు అగోచరుడనియు, మనస్సునకు అచింత్యమనియు, కర్మేంద్రియములకువిషయముగాదనియు,యెఱుంగవలయును. మరిన్నిఆత్మసంహారింపబడు వాడుకాడనిన్ని ఆత్మవిచారముచేయువాడు తెలుసుకోవలయును. ఆత్మవిచారముచేయువాడు కర్మబంధమును నివర్తించుకొనుటకు ప్రయత్నపడడము కర్తవ్యముగనుక అందుకు యోగమే సాధనముగావుండుట వలనయికను యోగమార్గమును విచారింతము. యోగమన

దుఃఫలాపేక్షలేక పోడడమే యోగమని యెఱుంగవలయును. ఈయోగ మును యెవడు అభ్యాసము చేయునో వానిని జననమరణములు అంటవు. ఈయోగమునకు నిశ్చయాత్మకమయిన బుద్ధియే ముఖ్యమయినది. ఈయోగమును సాధించువాడు త్రయగుణ్యరహితుడుగానున్ను, శీతోష్ణాదిసుఖదుఃఖ రహితుడుగానున్ను శాశ్వతమయిన సత్వగుణవిశిష్టుడుగానున్ను, యోగక్షేమరహితుడుగానున్ను ఆత్మజ్ఞానముకలవాడుగానున్ను, కర్మఫలములయందుకోరికలేకుండా నిత్యనైమిత్తికాదికర్మలను చేయువాడుగానున్ను, ప్రాప్తిఅప్రాప్తులయందున్ను, జయాపజయములయందున్ను, లాభాలాభములయందున్ను, శీతోష్ణాదులయందున్ను, శత్రుమిత్రులయందున్ను, సమదృష్టిగలవాడుగానున్ను వుండవలయునని యెఱుంగవలయును. ఈయోగమును సాధించువాడు స్థితప్రజ్ఞకలవాడుగా వుండవలయును. ఎవ్వడయితే ప్రత్యగాత్మస్వరూపమునందు తనకు తానే ఆనందించిమనోగతములయిన సమస్తకామములను విడిచిపెట్టుచున్నాడో వాడున్ను, ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక, దుఃఖములు సంభవించినపుడు భయపడని మనస్సుగలవాడున్ను, సుఖములయందు ఆశలేనివాడున్ను, భయము, రోషము, ప్రీతి, యివిలేనివాడున్ను సకల విషయములయందు అభిలాషలేనివాడై అప్రార్థిత ప్రాప్తములయిన శుభాశుభములను బొందిన్ని సుఖదుఃఖములు చెందనివాడున్ను తాబేలు తనకరచరణాద్యవయవములను లోపలికి యేలాగుయీడ్చుకొనుచున్నదో ఆరీతిగా తనయింద్రియములను సర్వవిషయములలోనుంచి మరలించుకొను యోగి అయినవాడున్ను, స్థితప్రజ్ఞుడని యెఱుంగవలయును. మరిన్ని వుపవాసాదులు చేయు పురుషునకు యింద్రియములనుంచి ఆయా యింద్రియవిషయములే నివర్తి అగును గాని అభిలాషమాత్రము వదలదని పెద్దలు చెప్పుదురు. అయితే పరమాత్మను జ్ఞానముచేత తెలిసికొన్న మనుష్యునకు అభి

లయోగికి యింద్రియనిగ్రహము ముఖ్యమయినది. అట్లా యింద్రియని గ్రహములేకుండా విషయములనుతలచెడువానికి తదాసక్తికలిగి ఆఆ సక్తిచేత భోగేచ్ఛకలిగి, ఆభోగేచ్ఛకు విరోధముకలుగుచుండగా క్రోధ ముకలిగి, ఆక్రోధమువల్ల అవివేకముకలిగి, ఆఅవివేకమువల్ల విస్మృతి కలిగి, అటుతర్వాత బుద్ధినశించి, కడపటతానున్ను నశించునని తె లియంగవలయును. గనుక యెవడైతే ప్రియాప్రియములు లేక యిం ద్రియములను తనమనస్సునకు స్వాధీనముచేసుకొంటున్నాడో అటువం టివాడు శరీరపోషకమునకు మాత్రముఇంద్రియవిషయములనుఅనుభవిం చువాడుగావుండినను అటువంటివాడు నిర్మలత్వమును పొందును. ఇ టువంటి నిర్మలమయిన చిత్తముగల పురుషుణ్ని యెటువంటి దుఃఖ మున్ను అంటదు. గనుక అట్టివానికి అతిత్వరలో బుద్ధిస్థిరమగుచున్నది మరిన్ని ఇంద్రియనిగ్రహములేనివానికి ఆత్మవిషయమైన బుద్ధిన్ని, ఆత్మ స్వరూపభావమున్ను, చిత్తోపరతిన్ని, బ్రహ్మానందసుఖమున్ను, కలు గదనితెలియంగవలయును. ఎవనియొక్క ఇంద్రియములు వానిమనస్సు నకు స్వాధీనములేక విషయములయందు ఇచ్ఛావిహారముగావుండునో అట్టిమనస్సు వానియొక్క ఆత్మానాత్మ వివేకమును నీళ్లలోనవోడను గా లి త్రిప్పటలు పెట్టేలాగున త్రిప్పటలుపెట్టునని తెలియంగవలయును. మరి యు ఆత్మానాత్మవివేకజ్ఞానము పామరులకు చీకటిమాదిరిగా తెలియ కుండావున్నది. సమస్తమయిన నదులయొక్క జలములు సముద్రములో ప్రవేశించిన్ని ఆసముద్రము యేలాగున హద్దుమీరకుండా స్థిరముగావు న్నదో ఆదేలాగుననే ఇంద్రియవిషయములన్నియు అచంచల మనస్సు గల పురుషునియందు ప్రవేశించినప్పటికిన్ని ఆపురుషుడు నిర్వికారుడై శాంతచిత్తముగలవాడుగావుండును. విషయాసక్తుడైనమనుజుడు శాం తినిపొందలేడు. ఈలాగున యెవడైతే ఆత్మవిచారణచేయునో వానికి

చెప్పుదురు. అనాత్మ అనగా సమష్టివ్యష్ట్యాత్మకమైన శరీరత్రయము. వ్యష్టియనగా ఒక్కప్రాణిశరీరము. సమష్టియనగా సమస్తప్రాణులశరీరములు. అయితే శరీరములు స్థూలము, సూక్ష్మము, కారణమని మూడువిధములు. ఈశరీరత్రయములలోపల సమస్త ప్రాణులయొక్క స్థూలశరీరంబులును సమష్టి స్థూలశరీరంబులనియు, సమస్తప్రాణులయొక్క సూక్ష్మశరీరంబులును సమష్టిసూక్ష్మశరీరంబులనియు, సమస్తప్రాణుల కారణశరీరంబులును సమష్టికారణ శరీరంబులనియు, ఒక్కప్రాణియొక్క స్థూలశరీరము వ్యష్టి స్థూలశరీరమనియు, ఒక్కప్రాణియొక్క సూక్ష్మశరీరమువ్యష్టిసూక్ష్మశరీరమనియు ఒక్కప్రాణియొక్క కారణ శరీరము వ్యష్టి కారణశరీరమనియు యీప్రకారంబుగా వ్యష్టిసమష్టి వివరణం బెఱుంగునది. ఈలాగునయెందుకు చెప్పవలయునంటే ఆత్మకుజీవత్వము యీశ్వరత్వమువచ్చుకొరకయి చెప్పవలయును. ఈప్రకారముగా యెవడు ఆత్మానాత్మవిచారముచేసి తానుబ్రహ్మస్వరూపమని యెఱుంగుచున్నాడోవాడుజీవన్ముక్తుడు.

<u>శరీరత్రయవిలక్షణము:—</u> ఆత్మశరీరత్రయ విలక్షణుడని చెప్పబడియున్నది. శరీరత్రయము నెరుగకమునుపే శరీరత్రయ విలక్షణత్వ మెరుగుట దుర్లభముగనుక మొదటశరీరత్రయ స్వరూపంబునువిచారింతము. శరీరమనుపేరు దేహమునకెందుకు వచ్చినదంటె శరీరమనునదిఅన్నము లేకనున్ను వ్యాధులచేతనున్ను, ముదిమిచేతనున్ను, జీర్ణించిపోవుచున్నది గనుక దీనికీపేరు వచ్చినది. శరీరత్రయమనగా స్థూలము, సూక్ష్మము, కారణము అనిమూడు విధములుకలవు. అందులో స్థూలశరీరము జీర్ణించువిధము పయినచెప్పియున్నది గనుక యికను సూక్ష్మశరీరము జీర్ణించు విధాయకముచెప్పవలయును. అదెట్లనగా అదివృద్ధిపూర్వకముగా జీర్ణించుననిచెప్పవలయును. వృద్ధియనగా రాగద్వేషాదు[లు అనేకప్ర]కారంబుగా పరిణమించుట. వాట్లయొక్క సంకోచమే జీర్ణత్వ

వరియుంచు కానబడుచున్నది యనిన అజ్ఞానంబునందు వృద్ధియునుము క్షుత్వంబునందు సంకోచంబును కానబడుచున్నది గనుక వీట్లకు శరీర మని పేరువచ్చినవి. ఈశరీరములకు దేహములని పేరు యేలవచ్చినవం ట్యయీస్థూలదేహములు అగ్నిచేతనున్ను తాపత్రయముల చేతనున్ను భస్మాకారముగాదహింపబడుచున్నవిగనుక వీటికిస్థూలదేహములనిన్ని, సూక్ష్మకారణదేహములు జ్ఞానమనెడి యగ్నిచేత దహింపబడుతున్నవి గనుక వాటికి సూక్ష్మకారణ దేహములనిన్ని పేరువచ్చినవి. ఇకను శరీరత్రయములకు వివరముజెప్పడమవును. అవియేవియనగా స్థూల శరీరమనియు, సూక్ష్మశరీరమనియు, కారణశరీరమనియు, ౩ విధము లనిముందుచెప్పియున్నాము.(స్థూలశరీరమనునది జ్ఞానేంద్రియములు ౫, కర్మేంద్రియములు ౫, ప్రాణాదివాయువులు ౫, శబ్దాదివిషయములు౫, అంతఃకరణములు ౪ యీ ౨౪ తత్వములతోగూడి స్తంభమువలె ప్రత్య క్షముగా తోచుచున్నది గనుక దీనికి స్థూలశరీరమని పేరువచ్చినది) జ్ఞా నేంద్రియములు ౫, కర్మేంద్రియములు ౫, ప్రాణాదివాయువులు ౫, మనస్సుబుద్ధియీరెండు చేరి యీ ౧౭ తత్వములతోకూడుకొని యుం డు దానికి సూక్ష్మశరీరంబని చెప్పబడును.) ఈసూక్ష్మశరీరము లీనమయి నశబ్దాదివిషయములను అంగీకరించుచున్నది గనుకనున్ను ఆత్మను సలక్ష ణముచేత తెలియపరుచుచున్నది గనుకనున్ను దీనికిలింగశరీరమనిపేరువ చ్చినది. కారణశరీరమనగా పయినచెప్పబడిన స్థూలసూక్ష్మ శరీర ములుఅజ్ఞానముచేత బుట్టిచున్నవి గనుక దీనికి కారణశరీరమని పేరు వచ్చినది. ఈప్రకారముగా శరీరత్రయముల నెరుంగవలయు. ఆత్మ విలక్షణత్వము శరీరత్రయమునందును శరీరత్రయ విలక్షణంబాత్మయం దును లేకుండుటయే శరీరత్రయ విలక్షణత్వమని యెరుంగవలయును ఈ ప్రకారము శరీరత్రయములనున్ను శరీరత్రయ విలక్షణత్వమునున్ను యె

తత్వాదినిరూపణము:—తత్వములనగా జ్ఞానేంద్రియ పంచకమున్ను, కర్మేంద్రియపంచకమున్ను, ప్రాణాదిపంచకమున్ను, శబ్దాదిపంచకమున్ను, మనసాదిచతుష్టయమున్ను, యివి యన్నియుంగూడి యిరువది నాలుగు తత్వంబులని చెప్పంబడును. ఈప్రకారము చెప్పబడ్డ ౨౪ తత్వములున్ను అపంచీకృతములున్ను శరీరత్రయమున్ను అవస్థాత్రయమున్ను అజ్ఞానమున్నుయివి యంతయుచేరి ముప్పదియారు తత్వములు ఆయినవి. మరియుపైనచెప్పబడ్డ ౩౬ తత్వంబులున్ను షడ్భావ వికారములున్ను షట్కోశికంబులున్ను షడూర్మ్యలున్ను అరిషడ్వర్గములున్ను జీవత్రయములున్ను, గుణత్రయములున్ను, కర్మత్రయములున్ను, వచనాదానగమన విసర్గానందంబులున్ను, సంకల్పాధ్యవసాయాభిమానాధారణంబులున్ను, వైచిత్ర్యాది చతుష్టయంబులున్ను, దిగ్వాతార్కాది చతుర్దశాధిష్టానదేవతలున్ను, యివియన్నియునుగూడి ౯౬ తత్వంబులు అయినవిగనుక యీతత్వములకు విలక్షణుండై అసంగుడయిన సాక్షినేనని యెవడెరుగుచున్నాడో వాడేధన్యుడు.

అగామి, సంచితప్రారబ్ధములు:—ఆగామి, సంచితము, ప్రారబ్ధము, అనిమూడు కలవు. అందులో ఆగామియనగా యికమీద చేయవలశినకర్మము. యికనుఅనుభవింపతగినదిగా వచ్చుటకు సిద్ధమయిన దానికి సంచితమనిపేరు. చేయబడినవర్తమానముకు వచ్చియుండు దేహానుభవాదికమునకు ప్రారబ్ధమనిచెప్పబడును. ప్రారబ్ధమనునది మూడువిధములు. అవియేవియనగా, యిచ్ఛాప్రారబ్ధమనియు, అనిచ్ఛాప్రారబ్ధమనియు, పరేచ్ఛాప్రారబ్ధమనియు, మూడుగలవు. ఈప్రకారంబుగా ఆగామిసంచిత ప్రారబ్ధములను చక్కగావిచారించి యివి అహంకారమునకేకాని అహంకారసాక్షిఅయిన తనకులేదని యెవడెరుగుచున్నాడో వాడే కృతార్థుడు.

స్థఅనిమూడవస్థలుగలవు. అందులో జాగ్రదవస్థ అనగా సకలేంద్రియ ములవలనను బాహ్యార్థజ్ఞాన మెంతపర్యంతము వచ్చుచున్నదో అంతప ర్యంతము జాగ్రదవస్థఅనిపేరు. స్వప్నావస్థఅనగా సకలేంద్రియములవ లనను బాహ్యార్థ జ్ఞానమురాక మనస్సే విషయాకారముగా పరిణమించి కర్త్రాద్యాకారముగా నెంతపర్యంతము తోచుచున్నదో అంతపర్యంత ము స్వప్నావస్థయనిపేరు. సుషుప్తియనగా సకలేంద్రియములవల్లను బాహ్యార్థజ్ఞానమురాక మనస్సును కర్త్రాద్యాకారముగా పరిణమింపకవి షయాద్యాకారముగా నైననుతోపింపక నెంతపర్యంతముండునో అంత పర్యంతము సుషుప్తియనబడును. ఈయవస్థాత్రయసాక్షిత్వము ఆత్మకె ట్లువచ్చినదనగా అవస్థాత్రయముతో కూడుకొనియుండిన్ని యీమూడ వస్థలనున్ను వాటియొక్క వ్యాపారములనున్ను అవస్థాత్రయవాస లనున్ను నెరుంగునదే అవస్థాత్రయసాక్షిత్వమని చెప్పబడుతున్నది గా నయీలాగున అవస్థాత్రయమునున్ను వాటిసాక్షిత్వమునున్ను చక్కగా విచారించి నేనే సాక్షిస్వరూపుడని యెవడెరుగుచున్నాడో వాడేజీవ న్ముక్తుడని తెలుసుకోవలెను.

పంచకోశవివరణము:—అన్నమయకోశము, ప్రాణమయకోశ మూ, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము, అని పంచకోశములుగలవు. వీటిలో అన్నమయకోశమనగా అన్నమువ ల్ల జన్యమయి స్థంభమువలె స్థూలమయి కరచరణాద్యవయవాకారమ యి షడ్భావవికారమయి షట్కోశాత్మకమయి తోచునట్టి స్థూలశరీర ము అన్నమయకోశమని చెప్పబడును. ప్రాణమయకోశమనగా కర్మేం ద్రియములు ౫ ను పంచప్రాణములు ౫ ను చేరి, యీ ౧౦ అవయ ములతో కూడుకొనియుండు దానికి ప్రాణమయకోశమనిపేరు. మను స్సును, జ్ఞానేంద్రియములయిదును చేరి యీఆరు అవయములతోకూడి

త్రిగుణములు గన్న చేరి విజ్ఞానమయకోశమయినది ప్రియామోదప్ర మోదవృత్తిమత్తయి అజ్ఞాన ప్రధానమయిన అంతఃకరణమునకుఆనంద మయకోశమని చెప్పబడుతున్నది ప్రియామోద ప్రమోదములు అను పే దములలో ప్రియమనగా యిష్టమయినవస్తువునుచూచినమాత్రమే కలిగి నసంతోషమునకు ప్రియమని పేరు. ఆచూచినవస్తువులభించినతర్వాత కలిగినట్టిసంతోషమునకు మోదమని పేరు. అలభించినవస్తువునుఅనుభవించి నతర్వాత కలిగినసంతోషమునకు ప్రమోదమని పేరు. వీటికి కోశముల ని పేరైందుకు వచ్చినవంటే యీకోశములవలెనే ఆత్మనెరుగనీయకుం డా కప్పుచున్నవిగనుక వీటికికోశములని పేరువచ్చినవి. ఆత్మయును పం చకోశములు యేకముగా వ్యవహరింపబడునవియై తోచినప్పటికిన్ని ఆ త్మకాలత్రయములయందు పంచకోశములకంటె వ్యతిరిక్తుడయితోచుట యే పంచకోశవ్యతిరిక్తమని వివేకియైనవాడు తెలుసుకోవలయును.

ఆయాత్మకుపంచకోశములతో అన్యోన్యాధ్యాసముచేత కూ టమికలదా యనిన కలదు అనిచెప్పవలయు. అన్యోన్యాధ్యాసమనగా ఒకవస్తువునందలిధర్మము మరియొకవస్తువునందుతోచుట. అదెట్లనగా, అ న్నమయకోశమునకున్ను ఆత్మకున్ను జీవసామాన్యజాతి వికారలింగవ ర్ణ విశేషజాతి ఆశ్రమనామరూప సంస్కార వేషక్రియాదిద్వారా కూటమివచ్చినది. ప్రాణమయకోశనిష్టమయిన ధర్మంబులు ఆత్మనిష్ట ములగాను ఆత్మనిష్టములయినసచ్చిదానందధర్మంబులు ప్రాణమయకోశ నిష్టములుగానున్న ప్రాణములెస్సగాతోచుచున్నదని ప్రాణమయకోశము నందునుతోచుచున్నది, గనుక ప్రాణమయకోశంబునకున్ను ఆత్మకున్ను అ న్యోన్యాధ్యాసముచేత కూటమివచ్చినది. మనోమయకోశ నిష్టమయిన సంకల్పాది ధర్మంబులు ఆత్మయందును ఆత్మధర్మంబులయిన సచ్చి [illegible] దని మనోమయ

త్మకున్ను అన్యోన్యాధ్యాసముచేత కూటమికలిగినది. విజ్ఞానమయకోశనిష్టమయిన ధర్మంబులాత్మయందును ఆత్మధర్మంబులయిన సచ్చిదానందంబులు బుద్ధిలెస్సగా తోచుచున్నదని విజ్ఞానమయకోశంబునందును తోచుచున్నది, గనుకవిజ్ఞానమయకోశంబునకున్ను ఆత్మకున్ను అన్యోన్యాధ్యాసముచేత కూటమివచ్చినది. ఆనందమయకోశ ధర్మంబులుఆత్మయందును ఆత్మధర్మంబులగు సచ్చిదానందంబులు అజ్ఞానములెస్సగాతోచుచున్నదని ఆనందమయకోశ నిష్టముగానున్ను తోచుచున్నది కాబట్టి ఆనందమయకోశంబునకున్ను ఆత్మకున్ను అన్యోన్యాధ్యాసముచేత కూటమివచ్చినది గనుక యీప్రకారముగా పంచకోశములనున్ను ఆత్మనున్ను భిన్నములుగావిచారించి పంచకోశములుతోచినప్పటికిన్ని ఆత్మవ్యతిరిక్తముగా లేదని యెవడెరుగుచున్నాడో వాడే కృతార్థుడు.

<u>సచ్చిదానంద మఖండ స్వరూపవివేచన ప్రకరణము</u>:— సత్తు, చిత్తు, ఆనందము, అను నీమూడు శబ్దములుచేరి సచ్చిదానందమను పదమయినది- అందులో సద్రూపమనగా యేవస్తువు ఒకటిచేతనున్ను బాధింపబడక కాలత్రయములయందును యేకరూపమయి యున్నదో ఆవస్తువునకు సద్రూపమనిపేరు. అసద్రూపమాత్మయందున్నదాయనిన ఆత్మకాలత్రయములయందును ఒకటిచేతనున్ను బాధింపబడకుండావున్నాడుగనుక, ఆత్మయందు సద్రూపమున్నది. ఆత్మకుచిద్రూపమేలాగంటే ఏవస్తువయితే సాధనాంతరంబు నపేక్షింపక తానుతోచుచు తనయందారోపింపబడిన సమస్తపదార్థంబులను తోపింపచేయుచున్నదో అదిచిత్తనిచెప్పబడును. ఆత్మకుఆనందస్వరూపంబు యెటువలెనంటే నిత్యమయి నిరుపాధికమయి నిరతిశయమయిన సుఖస్వరూపత్వము ఆనంద స్వరూపత్వము. స్రక్చందనాదులవలన బుద్ధికి సర్వోత్కృష్టి

ప్పబడును. ఆసచ్చిదానంద స్వరూపుడయిన యాత్మకు అఖండత్వము కూడ నిరూపించవచ్చును. అఖండత్వమనగా దేశకాలవస్తువులవలన న పరిఛిన్నత్వమే అఖండత్వమని చెప్పబడును. ఈవిచారణవల్ల ఫలంబేమ నిన యీ చెప్పబడిన సద్రూపత్వ చిద్రూపత్వ ఆనందత్వములు మనయొం దే సిద్ధించియున్నవిగనుక సచ్చిదానంద స్వరూపుడైన ఆత్మ నేననిదృఢ నిశ్చయము వచ్చుటే దీనికిఫలము.

<u>అజ్ఞానస్వరూపనిరూపణము</u>:— ఏ అజ్ఞానమువలన సమస్తప్రాణులును జన్మమరణదుఃఖపరంపరను బొందుచున్నారో ఆ అజ్ఞానము యొక్క స్వరూపమెటువంటిదనగా తన్నుతానెరుంగకుండుటయేఅజ్ఞానమని చెప్పబడును. అయితే నేను మనుష్యుడను, నేను స్త్రీని. నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను వైశ్యుడను, నేనుశూద్రుడను, నేను బ్రహ్మచారిని, నేనుగ్రహస్తుణ్ణి, నేను వానప్రస్తుణ్ణి, నేను సన్యాసిని, నేనుమురికనాటివాడను, నేను వెలనాటివాణ్ని, నేనుమాధ్వుణ్ని, నేనువయిష్ణవణ్ణి, నేను సాతాని అనియీలాగున యింకా అనేకవిధముల నెరిగివుండుట తన్నుతాను యెరుగుటకాదు. ఇదిగాక వేదాంతశాస్త్రజ్ఞులు తమ్ముతామెరుగుదురా యనినవార్లలో ముముక్షువు లనియు అముముక్షువులనియు రెండువిధములు. ఈ రెండువిధములలోన ముముక్షువులు ౪ తరగతులయివున్నారు. వారెవరనగా, ప్రయోజనమునకయిచదివినవారు కొందరు. ప్రసిద్ధికొరకై చదివినవారు కొందరు. పూజ్యార్థులయి చదివినవారుకొందరు. ఇతరమత ప్రవిష్టులైయుండి వేదశాస్త్రధర్మమునుయెరిగి పెద్దలను దూషించవలెనని చదివినవారు కొంతమంది. ఈపైనజెప్పబడిన నాలుగు తరగతులవారు ఆత్మయెరిగినవారు కానేరరు. అయితేయీనాలుగు తరగతులవారికి కలుగుఫలమేమనగా వేదాంతమును దూషించుటకు చదివినవారికి నరకంబును తిర్యగాది యోనిప్రాప్తి

త్సువులుగావుండి చదువువారు ప్రతిబంధరహితులు, ప్రతిబంధసహితు అనిరెండువిధములు. అందులో ప్రతిబంధసహితులయి వేదాంతమునుచ దివినవారు కాలాంతరమందు అప్రతిబంధముచేత విడువబడి ఆత్మస్వ రూపమెరిగి ముక్తులగుదురు. ప్రతిబంధరహితులయి వేదాంతమునుచది వినవారు సద్యః ఆత్మస్వరూపమెరిగి ముక్తులగుదురు. తన్నెరుగనిఅజ్ఞా నము యెందువల్ల తొలగుననగా, ఆత్మజ్ఞానమువల్ల తొలగునుగాని క ర్మవల్ల తొలగనేరదు. ఏలనంటే కర్మ అజ్ఞానమునకు విరోధముకా దుగనుక అదిఅజ్ఞానమును వృద్ధిచేయునట్టిది, గనుక ఆత్మజ్ఞానముచే తనే అజ్ఞానమునశించవలయును- దీనికి నొకదృష్టాంతము చెప్పెదను. అదియేదియనగా, అమావాస్యచీకటియందు మార్గమునపోవునట్టి పురు షునకు దోవలోమరి నొకమనిషి యెదురయ్యేనేసి యెదురైనవాడుబ్రా హ్మణుడైనదియు, శూద్రుడయినదియు, తెలియబడక పురుషుడని సా మాన్యముగా తోచుచున్నాడు. గనుక అటువలెనే కర్మము అజ్ఞాన మును వృద్ధిపొందించి ఆత్మను సర్వాత్మనా తోచనీయదు. అయితేయ థార్థజ్ఞాన మెప్పుడువచ్చునంటే సూర్యోదయమయిన తర్వాత ఆ యంధకారము మాత్రము నశించిపోవుచుండగా కర్మచేత వృద్ధిబొందిం చబడ్డ అజ్ఞానము ఆత్మజ్ఞానముచేత నశించిపోవుచుండగా తనకు యథార్థజ్ఞానము కలుగును. అనగా జ్ఞానముచేత అజ్ఞానమునశించి పోయినను అజ్ఞానకార్యములయిన దేహేంద్రియాదులువుండి వారికి సుఖదుఃఖములు కలుగచేయుచు ప్రారబ్ధమెప్పుడు నశించునో అప్పుడు ఈ దేహేంద్రియాదులు నశించును. గనుక జ్ఞానమేలాగున వచ్చునన గా ఆత్మానాత్మవిచారణవల్ల వచ్చునని యెఱుంగవలయును గాని మ రెందుచేతనూ రానేరదు. అందుకొకదృష్టాంతము చెప్పెదను. అర్థ ముతో కూడుకొనిన గాయత్రి పురుషునిచేత పొందబడి వున్నప్పటికిన్ని ఆగాయత్రిఅర్థమును విచారించకనే తెలియదు. ఆమంత్రముయొక్క-

చేసినను తెలుసుతా లేక సేతువులో గాని గంగానదిలో గాని స్నానము చేస్తేకలుగునా కలుగనేరదు. అయితే యేమిచేయవలయుననగా గాయత్రిఅర్థము యెవరికి తెలుసునో అట్టిసాధువుల నాశ్రయించి వారినివిచారిస్తే తెలుసుకోవచ్చునుగాని లేని యెడలసాధ్యమయినదికాదు. మరియుకర్మోపాసనచేత జ్ఞానమురాదనునది వేదాంతసిద్ధాంతమేగాని స్మృతులు కర్మే జ్ఞానమునకుసాధనమని మొరబెట్టుచున్నవి. స్మృతులలో కర్మమేకదేశమే జ్ఞానమునకు పరంపరాసాధనమనిన్ని నానావిధకర్మలు జ్ఞానమునకు సాధనములుకావనిన్ని చెప్పబడియున్నది గనుకశృతికివిరోధము కాదు. అయితే లౌకికకర్మయనియు వైదికకర్మయనియు రెండువిధములు ఈరెంటిలో లౌకిక కర్మజీవనమునకు హేతువయినదిగాన దానివల్ల జ్ఞానముకలుగనేరదు. కడమకర్మ అయిన వైదికకర్మనిత్యమనియు, నైమిత్తికమనియు, కామ్యమనియు, నిషిద్ధమనియు, ప్రాయశ్చిత్తమనియు, నైదువిధంబులు. వీటిలో కామ్యకర్మచేత జ్ఞానము కలుగ నేరదుగాని స్వర్గాదులుకలుగును. నిషిద్ధకర్మచేత కాలసూత్రాది నరకములు కలుగును. ప్రాయశ్చిత్తకర్మ పురుషునకు అధికారత్వము నిచ్చిప్రత్యవాయువును పోగొట్టును. ఈమూడుకర్మలు రాజసతామస కర్మలనిచెప్పబడును. ఇవి జన్మసుఖ దుఃఖములనిచ్చును. ఈరాజసతామస కర్మలచేత జ్ఞానమురానేరదు. ఇందులో మిగిలిన సాత్వికకర్మ చిత్తశుద్ధికలుగచేసును. ఆ చిత్తశుద్ధి జ్ఞానమునకు పరంపరాసాధనమని చెప్పబడును. అదెట్లనిన యీనిత్యనైమిత్తికరూపమయినసాత్విక కర్మవలనచిత్తశుద్ధి, చిత్తశుద్ధిద్వారానిత్యానిత్యవస్తువివేకము, నిత్యానిత్యవస్తు వివేకముద్వారా ఇహాముత్రార్థఫలభోగవిరాగము,తద్వారాశమాదిషట్కసంపత్తి, శమాదిషట్క సంపత్తిద్వారాముముక్షుత్వము, మోక్షేచ్ఛద్వారా సద్గురులాభము, సద్గురులాభముద్వారాశ్రవణము, శ్రవణముద్వారామననము, మననముద్వారానిధిధ్యాసముకలిగితద్వారాజ్ఞానముకలుగునుగనుకయీ

రము సాక్షాత్సాధనము అని యెఱుఁగవలయును. ఇందుకొక దృష్టాంతమును చెప్పెదను. అది యేమనగా, ఆకలిగొన్నవానికి ఆయాకలి పోవుటకు పక్వమయిన అన్నము యెట్లుసాక్షాత్సాధనమో అట్లు అన్నమునకుగాను దున్నుట, విత్తుట యీమొదలయినవి పరంపరాసాధనములు. అటువలెనే విచారము జ్ఞానము కలుగుటకు సాక్షాత్సాధనము. కర్మోపాసనము పరంపరా సాధనముగనుక యీప్రకారముగా అజ్ఞానస్వరూపమున్ను ఆత్మస్వరూపమున్ను లెస్సగా విచారించి ఆయాత్మ నేనని యెవడెఱుంగుచున్నాడో వాడే జీవన్ముక్తుడు, యోగి, సచ్చిదానందస్వరూపముయినబ్రహ్మము.

తాపత్రయనిరూపణము:—ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములు, అనిమూడుతాపములుగలవు. అందులో శరీరములను వచ్చునట్టి క్షయరోగము శీతజ్వరము మొదలయిన వ్యాధుల చేత కలిగెడి దుఃఖమునకు ఆధ్యాత్మిక తాపమని పేరు. మనుష్యులు, గుఱ్ఱములు, యేనుగులు, పెద్దపులులు, అడవిపందులు, కుక్కలు, నక్కలు, సర్పములు, మశకములు, మక్షికములు, యూకములు, పిపీలిక, మత్కుణములు, మొదలైన జంతువులవల్ల కలిగెడి దుఃఖమునకు ఆధిభౌతిక తాపమని చెప్పబడుచున్నది. మంచు, యెండ, జలము, వర్షము, పిడుగు, వాయువు, గుడిగోపురములు,ప్రాకారపతనములు, మొదలయిన అచేతనములవలన వచ్చెడి దుఃఖమునకు ఆధిదైవిక తాపమని యెఱుంగవలయును. ఈతాపత్రయముల స్వరూపము కల్పితమని తెలుసుకొని యీతాపత్రయములు శరీరములకున్ను దేహేంద్రియాదులకున్ను యీరెంటికే గాని వీటికిసాక్షి అయిననాకు లేదని యెవడు తెలుసుకొనుచున్నాడో వాడే జీవన్ముక్తుడు.

శ్రవణమనన నిధిధ్యాసననిరూపణము:—భూతప్రతిబంధము, వ

బంధములు అనర్థములకు హేతుకరములు గనుక లోకవాసన, శాస్త్ర వాసన, దేహవాసన అను యీవాసనత్రయములను చక్కగా విచారిం చి పైనచెప్పబడిన ప్రతిబంధమును పోగొట్టుటకయి శ్రవణాదులచే సిజ్ఞానమును సంపాదించి ముక్తుడుకావలయునని శ్రుతిస్మృతి పురాణ ములలో చెప్పబడియున్నవి గనుక ముందుశ్రవణాదులనగా యేమియని విచారించెదము. శ్రవణమనగా సమస్తమయిన వేదాంతములకు షడ్విధ లింగములచేతను బ్రహ్మస్వరూపమయిన ఆత్మయందు తాత్పర్యమని బుద్ధియొక్క నిశ్చయమని యెఱుంగవలయును. మననమనగా శ్రుత్యర్థ మునువిని ఆయర్థంబును యుక్తులచేతను యేకవాక్యముచేసి చింతించుట. నిదిధ్యాసనమనగా విజాతీయములయిన కామక్రోధాదులను విడిచి స జాతీయమయిన అహంబ్రహ్మాస్మియనెడినిరంతరచింతనము. సర్వదా శ్ర వణముచేయుటచేత సకలసంశయములునశించును. మననముఅసంభావ నలను పోగొట్టును. నిదిధ్యాసనములు విపరీతభావమును పోగొట్టును గనుక వివేకియయినవాడు చిత్తమును విషయములయందు పోనివ్వక శ్రవణమనన నిదిధ్యాసనంబుల పలుమారుచేయుచుండునో వానికే జ్ఞా నముకలిగి తద్వారా మోక్షముకలుగును.

సుఖదుఃఖవిచారము:—లోకమందు కొందరు శాస్త్రపురాణము లలో అపుత్రస్యగతిర్నాస్తి । స్వర్గంనైవచనైవచ ॥ అనుశ్లోకమును చ దివి కొమాళ్లుగలవారికే యిహలోకమందును పరలోకమందును సుఖ ముకలదు. లేనివారికి యిహపరలోకములయందు సుఖములేదని కొంద రుచెప్పగా విని భ్రమసియున్నారు. వారిభ్రమను పోగొట్టుటకై కొమా ళ్లు కలవారికే దుఃఖముఅధికమని చెప్పేశాస్త్రమును పరిశోధించిముము క్షువులగువారు పుత్రమిత్రకళత్రాదులయందు అభిమానముంచక ఆ పరబ్రహ్మస్వరూపుడైన తనయందే మిక్కిలి అభిమానమును కల్పించు

కొడుకులు లేనివారు సంతానము లేదనే దుఃఖము చేత వొకబ్రాహ్మణుని పిలిచి మాకు పుత్రులు లేదే మాకేమిగతి యని యడుగగా మీరు పాపకర్ములు గనుక సంతానము కలుగలేదని చెప్పి మీరు రామేశ్వరము మొదలయిన స్థలములకు పోయి అక్కడవుండు దివ్యతీర్థములలో స్నానము చేస్తే మీ పాపకర్మములు నశించును, అటుతర్వాత మీకు పుత్రులు కలుగుదురని ఆబ్రాహ్మడు చెప్పగానే ఆమాటలువిని అదే ప్రకారముగా అనేకదినములు తీర్థయాత్రలు చేసి అక్కడక్కడ కాలానుసారంబుగ సకలదుఃఖములను అనుభవించిన్ని యిష్టసిద్ధిచెందక మరియొక శాస్త్రజ్ఞుణ్ణి పిలిపించి మాకు పుత్రులు లేకపోయిరే యిందుకేమి చేయవచ్చును, అని అడిగితే అతడు మీకు ప్రతిబంధములు కలిగి యుండుట చేత ముగ్గులు వేసి మంత్రింపించి ఆప్రతిబంధములను పారతోలించితిరేని మీకు పుత్రసంతతి కలుగునని చెప్పగానే వారు ఆమంత్రవాది మాటలు నమ్మి యేవిధమునైనను మాకు పుత్రసంతతి కలిగితే చాలునని అందుకు తగిన ప్రయత్నము చేయగా ఆమంత్రవాది పుట్టమ్మ, మాచకమ్మ, మాతంగి, కాటేరి, మునీశ్వరుడు, మన్నారుసామి, మొదలగువారికి తృప్తి చేయవలెనని వారివద్దనుండి సండాద్రవ్యము ఖర్చు చేయించిన్ని బిడ్డలు కలుగనందున వారు మిగుల వ్యసనపడి మరియొక జోస్యునివద్దకు పోయి జాతకము చూపించగా పుత్రవిషయమై చాలాదోషమువున్నందున నాగప్రతిష్ఠ మొదలయినవాటియందు ద్రవ్యము సెలవు చేస్తే పుత్రులు కలుగుదురని చెప్పగా వారు చెప్పిన మేరకు నాగప్రతిష్ఠ మొదలయిన వాటిని చేయించిన్ని పుత్రులు కలుగనందుకు వ్యసనసముద్రములో మునుగుచు తేలుచువుండెదరు గనుక పుత్రులు లేనందువల్ల తల్లిదండ్రాదులకు చాలాదుఃఖమును కలుగచేయుచున్నదనునది సత్యము అందుకు సందేహము లేదు. కలిగిన పుత్రుడు యేలాగున దుఃఖపెట్టుననగా దైవవశాత్ సంతానకాంక్ష కలిగినవారికి తనసంతటనే గర్భము నిలిచిన కొన్నాళ్లు అయిన తర్వాత ఒక కర్మవశాత్ గర్భపాతమవును.

ను ౧౦ నెలలు నిండునంతవరకు నిలిచియుంటే ప్రసవకాలమందు ప్రసవ వేదనచేత చాలాబాధకలుగును. ఆబాధలుచూడలేక మంత్రసాని మొదలయినవారు అయ్యా, తిమ్మంభొట్లు మీభార్యప్రసవవేదనచేత చాలాశ్రమపడుతూవున్నది. ప్రార్థనలు యేమయినావుంటే చేసుకోండి అనిచెప్పుదురు. అప్పుడతడు నేను అన్నిప్రార్థనలు ముందేచేసుకునివున్నాను. కుమారునికి ఆశపడినందుకు పెద్దప్రాణానికే మోసమువచ్చెనుగదాయిక యేమిచేయవచ్చును. పెద్దప్రాణము బ్రతికితేచాలును దేవుడు నమ్మునకలవిధములా దుఃఖపెట్టుచున్నాడనియును అందువల్లను తల్లిదండ్రులకు దుఃఖమేకలుగచేయుచున్నాడు. ఒకవేళసుఖప్రసవమయి పుట్టినవానికి ముట్టుదోషము పక్షిదోషము మొదలయిన దోషములుతాకును. అదిచూచి తల్లితండ్రులు దుఃఖపడి వానికి రక్షలుకట్టించి విభూతిమంత్రింపించి ఆశిశువును పెంచువిషయములోచాలాశ్రమపడుదురు అట్లుగాక బాల్యమందు యేమియుబాధలులేక చక్కగానే పెరిగినయెడల వాడు ౧౦ యేండ్లవాడై మిక్కిలి దుర్మార్గతచేత వూరిలోవుండు చిన్నవాండ్లందరిని కొట్టితాను వారిచేత దెబ్బలు తినివచ్చి తనతల్లితండ్రులకున్ను వూళ్ళోవుండుబాలురయొక్క తల్లిదండ్రులకున్ను కలహముపెట్టి గొప్పవ్యవహారములుకలుగచేసి తద్వారాచాలాదుఃఖము కలుగచేయును. అట్లుగాక బుద్ధిమంతుడైవుంటే వానికివుపనయనముచేసి వానినిచదివించగా వారికి చక్కగా విద్యరాకపోతే వారు వానియు శాఠ్యతనమును ఆలోచించక ఉపాధ్యాయుడు వానికి చక్కగా చదువచెప్పకనే ద్రవ్యముమాత్రము తీసుకునితిన్నాడని వారితో జగడముచేయుచు తద్వారా తల్లితండ్రులుదుఃఖమునే అనుభవించుచున్నారు. వాడు విద్యాహీనుడుగాక చదవరిఅయ్యేనేని వానికి పెండ్లిచేయవలయునని పశువులుకలవారియిండ్లకుపోయి పశువులనడిగితేవొకరు ౩౦౦ వరహాలుయివ్వవలయునని యున్ను, మరియొకరు ౨౦౦ వరహాలు యివ్వవలయునని

లియిచ్చి పెండ్లి చేయుటకు అనుకూలము లేక పోయెనుగదా, అనిన్ని పు [illegible]రు పడుచును యిచ్చుటకుసమ్మతిపడిరను పొంతనములు లేనందున ఆ తనయిష్టానుసారముగా అనుకూలించకపోయెనుగదా అనియును దుఃఖింతురుగనుక ఆకుమారునివల్ల తల్లిదండ్రులు దుఃఖమునే అనుభవించుచున్నారు. అట్లుగాకుండా నిర్విఘ్నముగా పెండ్లిఅయ్యేనే ఆపడుచు దేహారోగ్యముతప్పి క్షయరోగముచేత కృశించిపోగా అందుకుతల్లిదండ్రులు ఆచిన్నదానికి కూష్మాండఘృతము మొదలయిన మందులను యిప్పించుచుండచూచి ఆకుమారుడు కామాతురత్వము గలవాడయి భార్యానడు నుపయోగింపదని యెంచి జారుడై పరస్త్రీలతో గలయుచుండును. అప్పుడు అందువల్ల తల్లిదండ్రాదులకు కలుగు అపకీర్తికిగాను వారు చాలాదుఃఖము అనుభవించునదిగాకుండా యీకార్యములు సర్కారువారువిని దండనపెట్టింతురు. యిందువల్లకూడా తల్లిదండ్రులకు దుఃఖమే కలుగుచున్నది. ఇట్లుండగా ఆపుత్రుని యొక్క భార్యయున్గి సంసారమునకువచ్చి దానికి బిడ్డలు లేకపోతే అదియొకదుఃఖము. అధవాకలిగినట్లాయెనా అప్పుడు సంసారబాహుళ్యమువల్లను తమదరిద్రదశవల్లను బిడ్డలతో కూడా పుత్రుడు కష్టపడడమును చూచి తల్లిదండ్రులు దుఃఖింతురు. అప్పుడు తటస్థులువారినిచూచి యేలదుఃఖించెదరని అడిగితే చిన్నవాండ్లకు కట్టుకొనుటకుబట్టలేదు, కడుపుకు అన్నములేదు, ఇదిచూచి మేము తాళలేముమాకు చావయినారాలేదని అనేకవిధములుగా దుఃఖించుచున్నారు. ఇందువల్లకూడాపుత్రుడు తల్లిదండ్రులను దుఃఖపెట్టుచున్నాడు. గనుక పుత్రులుకలిగినా కలుగకపోయినా తల్లిదండ్రులకు దుఃఖమేప్రాప్తమవును అని చెప్పుటకు సందేహమేమియు లేదు. ఈపుత్రులవల్ల ఇహమందును పరమందును యీరెంటిలో సుఖములేదని తెలుసుకొని ముముక్షువులగువారు పుత్రమిత్రకళత్రాదులయందు అభిమానమునువదలి ఆత్మస్వరూపుడయిన తనయందే సుఖి, ప్రీతి

న్ని యెవఁడెరుంగుచున్నాఁడో వాఁడే జీవన్ముక్తుఁడని యెఱుంగవలయు.

వివేకప్రకరణము:—బ్రహ్మజ్ఞానము సంసారమును బోఁగొట్టు సాధనము. ఈబ్రహ్మజ్ఞానమునకు ముఖ్యసాధనము వివేకముగనుక అందులో బ్రహ్మమనఁగా వాక్కుచేత చెప్పశక్యముగాక మనుస్సుచేత తెలియఁబడక వృత్పత్తిస్థితిలయములు లేక అఖండమయి లోపల బయలు లేక యేదిక్కులేక విషయానుభవములేని సుఖస్వరూపమైన తెలివిమాత్రమై దేశకాలముచేత కొంచెముగా చేయఁబడక సదాస్వయం ప్రకాశమైన జాగ్ర స్వప్న సుషుప్తులకు సాక్షియయి అబాధ్యమయి సమస్తప్రపంచనివృత్తి దశకు సాక్షియయి చరాచర ప్రపంచమందు సద్రూపమయి నిండియున్నవస్తువు. ఇదిగాక మరిన్ని బ్రహ్మమయినది ఆదిలేనిది, పరమోత్కృష్టమయినది. అదివేదవిహితమగుటచేత సత్తయి సఘటపటాదులకంటెను విలక్షణమయినది. అది సర్వదిక్కులయందు చేతులు, కాళ్లు, నేత్రములు, శిరస్సులు, ముఖములు, చెవులు, కలిగినదై సమస్తప్రపంచమునందు వ్యాపించియుండునది. ఆబ్రహ్మము సకలేంద్రియ వ్యాపారములచేత ప్రకాశించుదానివలెనుండియు ఆసకలేంద్రియవ్యాపారములకుసంబంధములేనిది. ఆబ్రహ్మము సమస్తప్రపంచములు ధరించినదయిన్ని ఎందులనంటకయుండునది, అది త్రిగుణాత్మకముగానిదయిన్ని సత్వరజస్తమో గుణములను అనుభవించునట్టిది. ఆబ్రహ్మము సమస్త చరాచరములయందులోపల, వెలుపలవుండునది. అదిమిక్కిలిసూక్ష్మరూపము కలిగినదిగనుక దాన్ని తెలుసుకొనుటకు అశక్యమయినది. అది అజ్ఞానికి దూరముగాను, జ్ఞానికి సమీపముగాను వుండునట్టిది. ఆ బ్రహ్మము అపరిచ్ఛిన్నమయిన్ని సమస్తజీవకోట్లయందు పరిచ్ఛిన్నమయినదానివలెవుండునట్టిది. అదిసమస్తభూతములనుభరించునట్టిది. గ్రసించునట్టిది. మరలనాత, తిచేయునట్టిదని తెలుసుకోవలయును. మ

మయునదనియు అజ్ఞానమునకు వ్యతిరిక్తముయినదనియు తెలియతగిన ద[illegible] జ్ఞానగోచర మయినదనియు సమస్తప్రాణుల హృదయముల యందున్నదనియు పెద్దలు వక్కాణింతురు. మరిన్ని ముముక్షువగువాడు జ్ఞానమునే అభ్యసించవలయును. ఏలనంటే జ్ఞానంవినా మోక్షసిద్ధిలేదని శ్రుతివాక్యముగనుక జ్ఞానమువల్లనే మోక్షసిద్ధి. జ్ఞానములేక మోక్షము కలుగనేరదు, గనుక ముముక్షువు జ్ఞానమునే అభ్యసించవలయు. జ్ఞానమనగా దేహమున్ను లేక క్షేత్రమున్ను తదంతర్గతముయిన క్షేత్రజ్ఞున్ని విభజించి తెలియుటే జ్ఞానమని చెప్పబడుచున్నది. మరిన్ని జ్ఞానమనగా మోక్షప్రాప్తియందే ప్రయోజనదృష్టివుంచుట మరియు తన్ను తాను పొగడుకొనకయుండుట, తనధర్మమును తాను ప్రకాశము చేసికొనకయుండుట, హింసచేయకయుండుట, క్షమ, కృత్రిమములేకపోవుట, గురుసేవ, బాహ్యాభ్యంతరశుద్ధి, అచంచలము, మనోనిగ్రహము కలుగుట, ఇంద్రియవిషయములయందు ఆశలేకయుండుట, అహం[illegible]డుట, జన్మమరణము, ముసలితనము, రోగము, [illegible]యందుంగల దోషమును ఆలోచించి తెలిసికొనుట, విషయ[illegible]యందు ఆసక్తి లేకవుండుట, పుత్రదారగృహాదులకు గలుగు సుఖదుఃఖములు మొదలగునవి తనవిగావనియెంచుట, ఇష్టానిష్టప్రాప్తులయందు సర్వదా సమచిత్తత్వముకలిగియుండుట - జనసమూహమందు అనురాగములేకయుండుట, ఆత్మజ్ఞానమందు నిత్యభావముకలుగుట, మోక్షప్రాప్తియందే ప్రయోజనదృష్టియుంచుట, యివి అన్నియు జ్ఞానమని పెద్దలు చెప్పుదురు. అందు ప్రవృత్తిజ్ఞానమనియు, నివృత్తిజ్ఞానమనియు, రెండువిధములుగలవు. ప్రవృత్తిజ్ఞానమనగా విషయజ్ఞానమనియు, శబ్దజ్ఞానమనియు, వాచాజ్ఞానమనియును చెప్పబడును. నివృత్తిజ్ఞానమనగా అనుభవజ్ఞానమనియు, నిర్విషయజ్ఞానమనియు, స్వప్రకాశజ్ఞానమనియును చెప్పబడును. మరియు ఈలో

యుండి మరల బయటవచ్చుటకు సిద్ధముగ నుంటున్నవి. తలంపులను యనేకయుగముల మరల లేపుటకు మనస్థాపకమే తగినసాధనము. ఇవ్విధముగ మనము తలచెడి తలంపులును, చేసెడికార్యములును మనస్సుననే వసించుచున్నవి. అవియన్నియు మనస్సున సూక్ష్మముగ నణగి యుంటున్నవి. మనుజుఁడు మృతినొందునప్పుడు వాని మనస్సుననుండు సూక్ష్మమగు మనోవృత్తుల సమూహమే ఈలింగదేహమునఁ బ్రవర్తించుచున్నవి. ఆత్మ యిట్టితలంపులతోను, బహిర్వస్తుజ్ఞానముతోను, మిగుల సూక్ష్మరూపముఁబొందిన యొకవిధశరీరముతోను కప్పఁబడి బయట వచ్చుచున్నది. ఆ యాత్మయొక్క గతి పైఁజెప్పఁబడిన పలువిధతలంపుల ప్రయోజనముచేత నిర్ణయింపఁబడుచున్నది. మన హిందూశాస్త్రరీత్యా ఆత్మకు మూఁడుగతులు కలవు. మిగులఁ బుణ్యముఁజేసిన యాత్మలు సూర్యకిరణముల మార్గముగ సూర్యమండలముఁజేరి, యచ్చటనుండి చంద్రమండలముఁజేరి, యంతట దీప్తిమండలముఁజేరి, పిదప నక్కడనుండు నొక్కపుణ్యాత్మచే బ్రహ్మలోకమునకుం గొనిపోఁబడుచున్నవి. బ్రహ్మలోకమే బ్రహ్మవసించుస్థలము. అచ్చో నియ్యాత్మ సర్వశక్తిని సర్వజ్ఞత్వమునుబొంది ఈశ్వరునకు సమమగుచున్నది. ద్వైతుల సిద్ధాంతప్రకారమచ్చో నయ్యాత్మ లెప్పుడును వసించుచున్నవి. లేక, అద్వైతుల యభిప్రాయప్రకారము ఈశ్వరునితోఁగలసి యొక్కటియగుచున్నది. పుణ్యకార్యములను ఈశ్వరార్పణముచేయక తమకనియే చేసెడి మనుజులు మృతినొందిన పిదప చంద్రమండలముఁజేరి యచ్చో సూక్ష్మములగు దేవతాశరీరములనుబొంది దేవలోకమున వసించుదురు. బహుదినములవఱకు దేవతలుగనుండి స్వర్గభోగములనుభవించి పుణ్యము ముగిసినతోడనే పూర్వకర్మముచే పీడింపఁబడి భూమిపయింబడుచున్నారు. వారు వాయుమండల మేఘమండలమార్గములుగ వచ్చి వానచినుకులుగ భూమియందు దిగుచున్నారు. అచ్చట పైరుపచ్చలుగ మొలచి మనుజులకును మృగములకును ఆహారమై వానివల్ల స్థూలశరీరముఁబొంది భూమిపై మరల జన్మించుచున్నారు. మూఁడవవిధమైన మనుజులు,

అనగా పాపులు మృతినొందిన పిదప దయ్యములుగమాఱి చంద్ర మండలమునకును భూమికిని మధ్య వసించుదురు. కొన్ని పిశాచములు మనుజులకు విరోధముగను,కొన్ని స్నేహముగనునుంటున్నవి. అచ్చటఁ గొన్ని దినములుండిన పిదప భూమిపయింబడి మృగములుగ జన్మించి అటువెనుక ఆ మృగశరీరమునుండి విడుదలయై మనుజులై మరల మోక్షసాధనములగు కార్యములఁ జేయఁజాలినవారగుదురు. కొంత యేని యాశాపాశములనుండి నిర్మలసిద్ధులై యుండువారు మృతినొం దిన పిదప సూర్యమండలమార్గముగ బ్రహ్మలోకమునకుఁ బోవుదుర నియు, స్వర్గాదిభోగములనిచ్ఛయించి పుణ్యముఁజేయువారు చంద్ర మండల మార్గముగఁబోయి దేవశరీరమునుబొంది, పుణ్యఫలము ము గిసినతోడనే భూమిపయింబడి మనుజులై జన్మించి మరల మోక్ష మును బొందవలసిన సాధనములనుజేయ యోగ్యులై యున్నారని యు, పాపులు పిశాచములైమాఱి మృగాములుగ జన్మించి మరల మనుష్యజన్మమొంది గృహమును జేరవలసినమార్గమును వెదకఁదగిన వారగుచున్నారనియు మనము దెలిసికొంటిమి.

ఈభూమి కర్మభూమి యనుచున్నాము. మనుజుని పుణ్య పాపకర్మములీ ప్రపంచమునందే చేయఁబడుచున్నవి. ఒకమనుష్యు డు స్వర్గలోకముఁబొందఁగోరి మంచికర్మమునుచేసి దేవరూపమును బొంది పుణ్యఫలము ముగిసినతోడనే మరల కర్మభూమియందుఁ బడుచున్నాఁడు. ఇట్లు పడుటకుఁగారణము వాఁడు జన్మాంతరమందు జేసిన పాపకర్మమేగాని వేఱుకాదు. ఇట్లే పిశాచజన్మముఁ బొందిన వారందేయుండి క్రొత్తగ నొకకర్మమేనియుఁజేయక తాము ముందు జేసినపాపమునకుగాను కష్టమనుభవించి, అంతకు పిదప మృగశరీర మునఁ గొన్ని దినములు వసించి, అప్పట నేకర్మముంజేయకుండ కడ పట మనుష్యశరీరముం బొందుచున్నారు. పుణ్యపాపములచే సన్మా నమును దండనయుంబొందునపుడు క్రొత్తగ నొకకర్మను జేయుట లేదు. అప్పుడు స్వర్గమునో లేక నరకమునో యనుభవించుట మా [illegible] సనముగాని యదికమెనరయెడల దాని

ఫలము వెంటనే కలుగును. ఒక్కఁడు విశేషపాపములంజేసి స్వల్ప పుణ్యముమాత్రము జేసెనేని మొదట పుణ్యఫలమనుభవించి పిదప పాపఫలమనుభవించును. మరల భూలోకమునకురాక బ్రహ్మలోకమునకుఁబోవు మార్గమునకు దేవయానయనిపేరు. స్వర్గలోకమునకుం బోవు మార్గమునకు పిత్రుయానయనిపేరు. వేదాంతప్రకారము మనుష్యుఁడే ఈ భూమిలోనుండు సకలవస్తువులలోను శ్రేష్ఠుఁడు. ఈ భూలోకమే మనుజుఁడు ముక్తిఁబొందఁగూడిన శ్లాఘ్యమగుస్థలము. దేవతలు మోక్షముంబొందవలయునేని భూలోకముననే జన్మింపవలయును. కావున మనుష్యజన్మనే మోక్షముం బొందదగిన జన్మము.

బౌద్ధుల సిద్ధాంతమేమి? వారు ఆత్మయను నొకవస్తువుకలదనియే యొప్పుకొనుటలేదు. శరీరమునకును మనస్సునకును ఆత్మయే యాధారమని యేలఁదలపవలయు? మనస్సు, దేహము, ఇవియే చాలును. ఆత్మయేల? దానియుపయోగమేమి? క్రొత్తగ నొకవస్తువు నేల మనమే కల్పించుకొనవలయుననుచున్నారు. పైఁజెప్పఁబడిన న్యాయములన్నియు బలమైనవియే. బయటికి విచారించినయెడల ఈప్రశ్నలన్నియు న్యాయముగనే తోచుచున్నవి. మనస్సునను, శరీరమునను సంబంధపడిన యాత్మను ఆరెంటికిని యాధారముగ నేల దలపవలయును? మనస్సును శరీరమునటుండనిమ్ము. పలుమాఱు మాఱుచుండు జడవస్తువే శరీరము. పలుమాఱు మాఱెడి మనోవృత్తులే మనస్సు. ఈరెంటికిని యొకవిధమైనచేరిక నేది కలుగఁజేయుచున్నది? ఇట్టిచేరిక నిజముగనే లేదని తలంచెదము. ఇందుకు దృష్టాంతముగ నొక దివిటినెత్తి చుట్టెదము. అందుచే నొకవిధమైన యగ్నివట్రువ యేర్పడుచున్నది. నిజముగనే యట్టివట్రువ యేదియునులేదు. అయితే దివిటిని చుట్టుటచే నగ్నివట్రువ ఒకటి గాన్పించుచున్నది. అటులనే ఈ జీవునియందు వట్రువ అనునదిలేదు. మనలో నుదయించు ఒక్కొకవస్తువును వేర్వేఱుగనున్నది. ఇటుల వ్యత్యాసమగు తలంపులన్నింటిని నొక్కటిగఁజేర్చి మనస్సని చెప్పుచున్నాము. ఇటులనే

నశించు పలువిధవస్తువులకూటమును బ్రాణమనియెదము. ఇందుచే నన్నియు నొక్కటినుండి కలుగుచున్నదని మాయమగు సిద్ధాంతము ను మనమే యేర్పఱచుకొనుచున్నామేగాని నిజముగనట్టిదొక్కటియు లేదని విశదమగుచున్నది. ఈ ప్రపంచమున దేహము, మనస్సు అను నీరెండువస్తువులే కలవు. వానికివెనుక మఱియొక వస్తువునుంచఁదగ దు. పైఁజెప్పఁబడిన సిద్ధాంతమే బౌద్ధులసిద్ధాంతము. ఈసిద్ధాంతమును ప్రకృతపు తత్త్వశాస్త్రజ్ఞులు కొందఱు తాము క్రొత్తగ కనిపెట్టినట్లు ప్రస్తావించుచున్నారు. బౌద్ధుల తత్త్వశాస్త్రములయందంతటను ఈ సిద్ధాంతమే శ్రేష్ఠమైనది. ఈ ప్రపంచమే చాలును. మఱియొక ప్ర పంచమేల కలుగవలయును? ఒక్కొకవస్తువును గుణములచేరిక. ఈ వస్తువులన్నియు మఱియొక వస్తువునందైక్యమైయున్నదని దలంచ నేల? వస్తువను వ్యవహారము గుణముల మాఱుపాటుచేఁ గలిగినదే గాని వానికి పిదప చలనములేని మఱియొకవస్తువుచేఁ గలుగలేదు.

ఇటుల బౌద్ధులు వక్కాణించెదరు. ఈ బౌద్ధులన్యాయముల న్నియు నాశ్చర్యకరములైనవి. సామాన్యమనుజుఁడు తనయనుభవ మున పైఁజెప్పఁబడిన విధముననే తత్త్వార్థములం గనుఁగొనును. వే యింట నొక్కఁడే యాత్మస్వరూపమును నెఱుగఁజాలినవాఁడు. అనే కులకు ఈప్రపంచము మాఱి చుట్టి చేరివచ్చునటులఁ దోఁచుచున్నది. మనము సముద్రమధ్యమునఁజూడక గట్టును కనుంగొని యచ్చట నల లు ధ్వనించుటను కనుంగొని అట్టె యచ్చటనుండునని యెంచెదము. ఇది తప్పుగదా? ఈప్రపంచమున యాత్మయొక్కటే వ్యాపించియు న్నది. దానినే యద్వైతులు బ్రహ్మమని చెప్పుదురు. నామముచేతను రూపముచేతను ఈబ్రహ్మము వేఱగుచున్నది. సముద్రమునందలి యలలను జూడుము. ఒక యలయైనను సముద్రమునుండి వేఱుగాదు. వ్యత్యాసమైనదికాదు. అయితే అలలు సముద్రమునుండి వ్యత్యాస పఱచునదేది? పేరును, రూపమును. అలలయొక్కరూపము, దానికి మనమిడినపేరు దానిని సముద్రమునుండి వేఱుపఱచుచున్నది. పేరు, [illegible] రెండును నశించిన అలలు సముద్రమగుచున్నది. ఎవరు

నిజముగ సముద్రమును అలలను వేఱుపఱచగలరు? అటువలనే ఈ ప్రపంచమంతయు బ్రహ్మమయమైయుండియు నామరూపములచేత వ్యత్యాసమైన వస్తువులుగఁ గానఁబడుచున్నది. ఒక్కొక్కస్థలమున సూర్యుఁడు ప్రకాశించునటుల ఒక్కొకవస్తువునందును బ్రహ్మము ప్రకాశించుచున్నది. "నేను" "నీవు" అను వ్యత్యాసములేదు. అన్నియు నొక్కటియే. "అంతయు నేను" లేక "అంతయు నీవు." రెండు అను లెక్క కడపరకు తప్పు. ఈ ప్రపంచమంతయు పైఁజెప్పఁబడిన తప్పుసిద్ధాంతముచేఁ గలిగియున్నది. మనుజునకు జ్ఞానము కలుగగానే వాఁడీప్రపంచమున రెండువస్తువులు లేవనియు తానే ప్రపంచమనియు నెఱుఁగుచున్నాఁడు. నిర్వికారముగను నిత్యశుద్ధముగను పరిపూర్ణముగనుండు ఆత్మయొక్కటే ఈ ప్రపంచమున పలురూపములుగాఁ దోఁచుచున్నవి. నామరూపభేదములచేత అల సముద్రమునుండి వ్యత్యాసపడుచున్నది అలయొక్కరూపము నశించినయ్యది సముద్రమగును. అలకు ఆధారము సముద్రము. సముద్రమునకాధారము అలకాదు. అలయుండునంతవఱకు దానిరూపముకలదు. అల నిలిచెనేని దానిరూపమును బోవుచున్నది. పైఁజెప్పఁబడిన నామరూపములు మాయచే సంభవించినవి. ఈమాయయే ఒకవస్తువును మరియొకవస్తువునుండి భేదించుటను జూపుచున్నది. అయినను ఈ మాయకు ఉనికిలేదు. రూపమొకవస్తువునందుండునేగాని వేఱుగానుండ సాధ్యపడదు. కావున మాయయేలేదు. అయితే ప్రపంచమున సృష్టి భేదములను గలుగఁజేయుమాయను ఎట్లు లేదని చెప్పవచ్చునని ఒక మనుజుఁడు రెండు అని తలచునంతవరకు ఈమాయచే వాఁడు పీడింపఁబడుచున్నాఁడు. అంతయు నొక్కటియే యనుజ్ఞానము కలిగిన మాయయు వానినివదలి వేఱగుచున్నది. అట్టయిన ద్వైతులు చెప్పెడి స్వర్గము నరకమనునవి లేవా? మృతినొందినపిదప మనుజులు పిశాచములుగను దేవతలుగనగుదురనునదియు సత్యమా? ఒక్కఁడు వచ్చుటలేదు పోవుటయులేదని యద్వైతులు వక్కాణించుదురు. నీవెట్లురావచ్చును? పోవచ్చును? అఖండమగువస్తువే నీవైయున్న

ప్పుడు నీవు పోవలసినస్థలమేది ? ఒకబడియందు కొందఱు బాలురను కఠినప్రశ్నలడిగిరి. వారడిగిన ప్రశ్నలలో ఈ దిగువనుండునది యొకటి. "భూమి యేల పడలేదు ?" వారితలంపేదియన భూమికి "ఆకర్షణ" యను శక్తిగలదని బాలురకుఁ దెలియపఱచుటయే. అనేకులు బాలురాప్రశ్నయొక్క తాత్పర్యమునే తెలిసికొనలేక తమకుఁ దోఁచినట్లు ప్రత్యుత్తరముఁ జెప్పిరి. ఒక బాలికమాత్రము "భూమి దేనిపైఁబడును ?" అని యొక్క ప్రశ్న యడిగెను. పరీక్షించిన యాయనప్రశ్నయే యసంగతము. ప్రపంచమునకు పైనయనియు దిగువయనియు లేవు. ఒకవైపును పైనయని తలంచిన మఱియొకతట్టు దిగువయని యేర్పడును. ఇటులనే యాత్మనుగుఱించిన ప్రశ్నయు, ఆత్మకు జననమరణ దుఃఖములుగలవను ప్రశ్న లసంగతములు. పోవునదెవ్వరు ? వచ్చునదెవ్వరు ? నీవెచ్చట లేవు ? నీవులేని స్వర్గమేది ? మనుజునియాత్మ యెచ్చటను నిండినదికాదా ? అది యెచ్చటికిఁ బోవచ్చును? ఎచ్చటికిఁబోవ సాధ్యపడదు ! ఆత్మ యెచ్చటను నుండునది. కావున వేఱుజన్మమను మాయయు, స్వర్గనరకములను భేదములును జ్ఞానులంజూచిన పఱుగెత్తిపోవును. పూర్ణజ్ఞానులుకానివారికి బ్రహ్మలోకము కాన్పించి పిదప మాయమైపోవును. మాయలోఁ జిక్కియుండువారలకు స్వర్గనరకము లెప్పుడునుగలవు. అట్టులైన ప్రపంచమంతయు స్వర్గమునకుఁబోవుచున్నదనియు పిదప పుణ్యము ముగిసిన తర్వాత భూమియందు జన్మించుననియు, పాపముచేసిన నరకమనుభవించుననియు నమ్ముచున్న దే దానికేమికారణము ? నేనొకపొత్తముం జదువుచున్నాను. దానియందలి పుటలనొక్కటిగఁ ద్రిప్పుచున్నాను. త్రిప్పఁబడునదెవ్వరు ? వచ్చునదెవ్వరు ? పోవునదెవ్వరు ? నేనుకాను. పుస్తకముకదా ? అటువలెనే ఆత్మయెదుట నీప్రపంచమంతయు నొక్కపుస్తకమువలె కాన్పించుచున్నది. ఒక్కొకపుటయు చదివి త్రిప్పఁబడునటుల ఒక్కొకసమయమునను నూతనతలంపులు కలుగుచున్నవి. దానిని (ఆపుటను) చదివి త్రిప్పుచున్నాము. నూతనపుట వచ్చుచున్నది. అయితే యాత్మ యెప్పుడును ఒకటే. దానికి నాశములేదు.

ప్రపంచము మాఱుచున్నదేగాని యాత్మ మాఱలేదు. జననమరణ ములనునవి ప్రపంచమునఁగలవు. నీయందులేవు. భూమిచుట్టుట నెఱుగక సూర్యుఁడు చుట్టుచున్నాఁడని మనము తప్పుగాఁ దలంచినటులఁ ప్రపంచమునఁగల జడపదార్థములు నాశమగుటను మనము నాశమగుచున్నామని వృథాగాఁ దలంచి వ్యథఁజెందుచున్నాము. మనుజుల మనస్సు ఒక స్వరూపముననుండునపుడు భూమ్యాకాశ సూర్యచంద్ర నక్షత్రాదులు కానఁబడుచున్నవి. మఱియొక స్వరూపము నకువచ్చిన స్వర్గనరకములు కానంబడును. సతతము పుణ్యశాలులై యుండి స్వామి వైకుంఠమునను కైలాసముననున్నారనియుఁ దలంచి యాయననే సదా ధ్యానించువారలకుఁ దాము మృతినొందినపిదప నీ జగత్తు మఱిగి వైకుంఠముగను కైలాసముగను దోఁచును. దేవలోకమనునదియు నరకమనునదియు మనుజులు తామే కలుగఁజేసికొనుటయేగాక వేఱుకాదు. అనగా మనుజుల పుణ్యపాపములకుఁ దగినట్లు ఈజగత్తు ఇప్పుడుండు స్వరూపముమాఱి స్వర్గముగను బ్రహ్మలోకముగను నరకముగను అగును. అచ్చట దేవతలు కానఁబడుదురు. కావున ద్వైతులుచెప్పెడి స్వర్గనరక వ్యవహారములను అద్వైతులు నిజమనియే ఒప్పుకొనుచున్నారు. అయితే స్వర్గమనునదియు నరకమనునదియు వాని వాని కర్మచే నేర్పడుచున్నదేగాని వేఱుకాదు. మనజీవితమును, ఈ ప్రపంచమును, అసత్యమయ్యు యథార్థముగాఁ గాన్పించుచున్నవి. అటులనే స్వర్గనరకములును నిశ్చయముగాఁ దోఁచుచున్నవి. మనమాప్రపంచమును సత్యమనినమ్మిన, స్వర్గనరకములును సత్యములనియే తలంచవలయును. ఈ ప్రపంచమంతయు బ్రహ్మమనెడి సత్యసిద్ధాంతము నవలంబించువారలకు స్వర్గనరకములు స్వప్నమాత్రమగును. ప్రపంచము అందుండు సుఖదుఃఖములుమాత్రము వాస్తవములని నమ్మి స్వర్గనరకములబద్ధములని తలంచువాడు మూఢుడే. మనలను శరీరులనితలంచుటయే మనము నిత్యమునుచేసెడి గొప్పతప్పు. మనలను కేవలము మనుష్యులనియెంచుట తప్ప తప్పైనతలంపు వేఱేదియులేదు. మనమే యీప్రపంచమునకుఁ

గారణమగు దైవము. మనము దైవమునర్చించునదంతయు మనయాత్మనే యర్చించుటగాని వేఱుకాదు. మనలోనుండు పరమాత్మయే ఈశ్వరుఁడు. ఆయనయే మనము, మనమే ఆయన. వృథాగా నీశరీరమును "మనము" అని తలచి మంచిని చెఱుపుకొనుట బుద్ధిహీనత. మనలను పాపులనియు దుష్టులనియు మనము దలచుటయు చెప్పుకొనుటయు బుద్ధిహీనత. అసత్యములలో శ్రేష్ఠమగు యసత్యమిదియే. పాపిగనుండువాఁడే పాపినిఁజూచును. ఇచ్చట నొకబిడ్డ యుండునట్లు తలచెదము. ఆబిడ్డకెదుట వేయినవరనులతో నిండిన సంచినుంచెదము. ఒక దొంగవచ్చి యన్ని నవరనులనుఁ గొల్లబెట్టుచున్నాఁడు. దొంగ దొంగలించుచున్నాఁడను సంగతి బిడ్డకుఁదెలియునా? ఆబిడ్డకన్నియు నొక్కటియే. ఏల? బిడ్డమనస్సున దొంగలేదు. బయటను దొంగలేదు. పాపులకుఁ బాపముగలదు. పుణ్యశాలుల కది తోచదు. అటువలెనే దుష్టులకీప్రపంచము నరకముగనున్నది. కొంత పుణ్యముచేసినవారి కిది స్వర్గమగుచున్నది. సర్వమెఱింగిన జ్ఞానుల కిది బ్రహ్మముగఁ దోఁచుచున్నది. అప్పుడే నీకంటియందుండు పొరలు పడిపోవును. యథార్థస్వరూపమును నీవు జూడనగును. మాయమఱిగి జ్ఞానముకలిగినతోడనే కోటిజన్మములుగనుండిన జననమరణ దుఃఖములుకూడ నివర్తియగుచున్నవి. తాను మనుజుఁడనియు, దేవతయనియు, పిశాచమనియు, తాను భూమి, స్వర్గము, నరకములోనగు స్థలములలో వసించునట్లును కనిన స్వప్నములన్నియుఁ దొలఁగిపోవును. తానే సర్వత్రనిండిన బ్రహ్మమునునఁ దెలియుచున్నాఁడు. కాలము తనలో నుంటున్నది. కాలమునందు తాను లేదు. స్వర్గములు తనలోనున్నవి. తాను స్వర్గమునలేదు. మనుజులు సేవించెడి దేవతలన్నియు తనలోనున్నవి. తాను వారియందు లేదు. దేవతలు, మనుజులు, పైరులు, పచ్చలు, మృగములు, ఱాళ్లు అగు వీనిని కల్పించినది తానని యేయని తెలిసికొనును. మనుజుఁడు నిజస్వరూపము నెఱుఁగుచున్నాఁడు. ఇవ్విధమున మనుజుఁడు నిరుగుముగ ము కినొందుచున్నాఁడు. అందువెనుక సకలవిధమాయ

లును మఱిగిపోవుచున్నవి. దుఃఖములును భయమును తొలగుచున్నవి. జననమరణములు నశించుచున్నవి; సుఖదుఃఖములుండు తావు తెలియక మఱిగి పోవుచున్నవి. భూమి, స్వర్గము, జడపదార్థములు, మనస్సు ఇవి అన్నియు మఱిగిపోవుచున్నవి. సకలవస్తువులును ఒకే బ్రహ్మముగఁ గాన్పించును. మనుజుఁడు తానే యాబ్రహ్మమను జ్ఞానమునుబొందును. ఆకాశమున పలువిధ మేఘములు కన్పట్టి మఱుగునటుల మనయాత్మకెదుట భూమి, స్వర్గము, నరకము, సూర్యుఁడు, చంద్రుఁడు, సుఖము దుఃఖములగునివి కనుబడి మఱిగిపోవుచున్నవి. ఆకాశము మాఱుటలేదు. మేఘములు మాత్రము మారుచున్నవి. ఆకాశము మాఱునని మనము తలంచుట తప్పు. అట్టులే మనలను అపరిశుద్ధములుగా మనము తలంచుట తప్పు. మనము కాలముచే నిర్మయింపఁబడినవారమనియు, మనము వేఱు అనుటయు తప్పుతలంపు. పారమార్థికమనుజుఁడు సర్వత్రనిండియుండిన ఏకమగు బ్రహ్మమే. ఇప్పుడు రెండు ప్రశ్నలు బయలుదేరుచున్నవి. పారమార్థికమనుజుఁడగు ఈబ్రహ్మమును మనము పొందనగునా? ఔను పొందనగును. మాయనుండి విడుదలయయి మహాత్ములీ ప్రపంచమున నింకను ఉంటున్నారు. అట్టయిన బ్రహ్మమును చూచినతోడనే వారు మరణము నొందిరా? మనము తలచునట్లు అంత శీఘ్రముగా మృతి నొందలేదు. ఒకగడకు తగిలించిన రెండుచక్రములు చుట్టుచున్నవి. నేనారెంటిలో నొక్క చక్రమునాపి గడను తీసివేయుచున్నాను. నేనుపట్టిన చక్రము ఆగుచున్నది. తక్కిన చక్రము కొంతదూరము పోయి క్రిందపడుచున్నది. అటులనే ఆత్మ ఒకచక్రము. శరీరము మనసుచేరి మఱియొకచక్రము. కర్మమనునది గడ. జ్ఞానమే చేతితో పట్టుట. ఆత్మయను చక్రమాగును. అయ్యది వచ్చును పోవును జీవించును మృతినొందును అను తలంపు నిలిచిపోవుచున్నది. అయ్యది నైసర్గికమనియు దానికి కోరికలుగలవనియు అది పరిపూర్ణమైనదనియు నిరాశమైనదియు దలచు తలంపులకు నిలుపుదలయగుచున్నది. శరీరము మనస్సు అగు చక్రమున పురాతనకర్మలు అంటు

కొనియున్నవి కావున నాచక్రము కొన్నిదినములు తిరుగును. పురాతనకర్మలు తొలగినతోడనే మనస్సును శరీరమును పడిపోవుచున్నవి. ఆత్మ బంధమునుండి విడిపోవుచున్నది. అందుమీఁదట స్వర్గమునకుఁ బోవుననియు మరలఁ దిరిగివచ్చుననియు బ్రహ్మలోకమునకుఁబోవుననియు నిట్టి వ్యవహారములు లేవు. ఎచ్చటఁబోవుచున్నది? ఎచ్చటినుండి వచ్చుచున్నది? ఇటుల నీజన్మమునందే ముక్తిని బడయువారలకు జీవన్ముక్తులని పేరు. ఈ జీవుఁడు ముక్తినిబడయునే వేదాంతులయభిప్రాయము. ఒకానొక కాలమున ఇండియా పడమటి సముద్రతీరమున యడవిమార్గమునఁ బోవుచుంటిని. అనేకదినముల పర్యంతము వనమార్గమునఁబోవు వాడుక నాకుఁగలదు. ఒక్కొక దినమునను సొగసైన సరస్సులను వానిఁజుట్టియుండు వృక్షములను జూచువాడుక నాకుఁగలదు. అయ్యవి ఎంతనాశ్చర్యముగఁ గానఁబడుచున్నవి? అట్లుండియు వృథాగా దానిని యరణ్యమననేల యని జనుల నయింగినిసితి? ఒకమాసమీరీతినఁ బ్రయాణము జేయుచుండి నొకనాడు దప్పికొని సొగసగు నానరస్సున జలముఁగ్రోలం జెంతఁజేరితిని. సరస్సు అకస్మాత్తుగా మటిగిపోయెను. వెంటనే ఓహో! ఇది మృగతృష్ణగదాయని భావించితిని. అందుతోడ గతించిన ఒకమాసముగ నేఁజూచిన సరస్సులన్నియు ఎండమావులనియే ఎఱింగితిని. ఈ ప్రపంచమును ఇటులనే మృగతృష్ణనుఁ బోలిన సరస్సని మోసబోవుచున్నాము. కర్మబంధముండునందనుక ఈ ప్రపంచము మనల విడువదు. జ్ఞానముదయించిన క్రమక్రమముగ నీ పాశములు విడిపోవును. అప్పటికి ప్రపంచవు నిజస్వరూపము మనకుఁ దెలియవచ్చును. అయితే ఇచ్చోనొక్క యుపాయముగలదు. ఒక్కొక్క దేశమందుండు జను లీతత్త్వము నాధారముఁజేసికొని నేను పుణ్యపాపముల కతీతుఁడను. నన్నేనిబంధనయు బంధింపదు. నాకిష్టమగు నటులఁ జేసెదనని చెప్పుచున్నారు. ఈ దేశమున నిట్లు వదరు మూఢులనేకులుగలరు. వారందఱును "నన్నొక్కటియు బాధింపదు. నేనే

ణించుచున్నారు. ఇది సరికాదు. ఆత్మ సకలబంధములకు నతీతమను నది నిజమైనను పైఁజెప్పఁబడినవారిటులఁ జెప్పుట సరికాదు. చట్టము కలిగినచో బంధము కలుగును. చట్టమునకుఁ బైట ముక్తిగలదు. ముక్తి యనునది యాత్మకే. ప్రతిబింబమునను మనము బంధవిముక్తులమైయున్నారము. ధారాళముగ నడచుటకును మాటాడుటకును, మనకు శక్తిగలిగి యుండుటచే మనము బంధములేనివారమే. అయితే కొంచెము యోచించిన మనశరీర మొకయంత్రమేగాని వేఱుకాదు. యంత్రములకు బంధము గలదు. కనుక నేదినిజము. బంధములేదను నది స్వప్నమేనా? ఒక కక్షివారు బంధవిమోచనమనునది లేదని చెప్పుచున్నారు. మఱియొక కక్షివారు బంధమనునది లేదనుచున్నారు. ఇది యెట్లు సంభవించును? మనుజుఁడు వాస్తవముగనే ముక్తుఁడై యుంటున్నాఁడు. పారమార్థికపురుషుఁడు విముక్తుఁడుగాక యెట్లుండనోపును? అయితే వాఁడు మాయాసంబంధమగు నీ ప్రపంచమునకు వచ్చినట్టియిన నామరూపములను బొంది బంధమునకు లోఁబడుచున్నాఁడు. స్వేచ్ఛయనునది యర్థములేనిపదము. ఇచ్ఛ బంధమును వదలియుండఁజాలదు. పారమార్థిక పురుషుఁడు బంధమునఁ జిక్కుపడిన పిదప నిచ్ఛయనునది కలుగుచున్నది. మనుజునియిచ్ఛ బంధమునందలి కట్టుబడినను దాని కాధారమగునది కట్టుబడలేదు. కావున మనుష్యులుగాగాని, దేవతలుగాగాని మనముండినపుడు మనయాత్మ ముముక్షువను యభిప్రాయము మనకుఁదోఁచుచున్నది. మనము తెలిసియో తెలియకనో అట్టిముక్తినిఁ బొందఁ బ్రయత్నించెదము. ఒక మనుష్యుఁడు ముముక్షువైనయెడల చట్టమునకెట్లు కట్టుబడును? ఈ ప్రపంచమునగల యెట్టిచట్టముగాని వానింగట్టఁజాలదు.

వాఁడే యీప్రపంచముగనుంటున్నాఁడు. వాఁడే యీప్రపంచమనుటయు వానికీప్రపంచము లేదనుటయును రెండు నొక్కటియే. పురుషుఁడు, స్త్రీ, దేశము అనుభేదములగు యల్పతలంపులు పారమార్థికపురుషునకెట్లు తోఁచును? నేను పురుషుఁడను, నేను స్త్రీని, నేను

బిడ్డను అని వాఁడెట్లుచెప్పును? అవియన్నియు నసత్యములుకావా? పురుషునకు బాధ్యత, స్త్రీకి బాధ్యతయని యెట్లుచెప్పనగును? పురుషుఁడులేడు, స్త్రీయులేదు. ఆత్మకు పురుషుఁడు, స్త్రీయను జాతిభేదములేదు. ప్రపంచమునే నేను వస్త్రముగ ధరియించియున్నాను. పైఁజెప్పఁబడినట్లు అభిప్రాయపడిన యనేకులు కార్యమున పసలేక యున్నారు. ఏలనయ్యా మీరు పాపకర్మమునుఁ జేసెదరని యడిగిన, అంతయు మాయ ఏపాపమునుజేయ నావల్లకానేరదని చెప్పుదురు. వారియోగ్యతను మనమెట్లు కనుఁగొనవచ్చును? అందుల కొక యుపాయముగలదు.

మంచి, చెడుగు అను రెండును ఆత్మయొక్క వికారరూపములైనను మంచి యతిసమీపముగను, చెడుగు కొంతదూరముగను ఉన్నది. ఆత్మను కప్పియుండెడి పైఁజెప్పఁబడిన రెంటియందును చెడుగును దాటినపిదపనే మంచికిఁబోవలయును. ఆత్మనుఁ బొందువానికేమి యంటుకొనియుండును? కొంతకర్మ మంటుకొనియుండును. ఈ కర్మము పూర్వజన్మమునఁజేసిన సత్కర్మమే. పురాతనపు పాపకర్మములను కడవఱకు దాటనివారు యథార్థము ననుభవింపఁజాలరు. కనుక నాత్మనుబొందునపుడు మనుజునకు మిగిలియుండునది వాని పుణ్యకర్మమే. వాఁడు దేహిగానుండి చేయుకార్యమంతయు మంచి చేయుటకొఱకే ఎల్లఱకును మంచియేకోరుచున్నాఁడు. వానిచేతులు సత్కర్మలనే చేయుచున్నది. వానిమనసు సద్విషయములయందే నాటుచున్నది. వాఁడెచ్చటికిఁ బోయినను వానిరాకనుఁజూచి యందఱు నానందింతురు. అట్టిమనుజుఁ డెచ్చటికిఁబోయినను వానిందర్శించిన దుష్టులందఱు శిష్టులగుదురు. వాఁడు మౌనమును ధరించియుండినను వానిదర్శనమే మంచిని గలుగఁజేయును. కావున నాతెగమనుష్యులు పాపముఁజేయుదురా? దుష్టకార్యముఁజేయుదురా? నిజస్థితికిని నిష్ప్రయోజనపుమాటలకును చాలాభేదముకలదు. బుద్ధిహీనుం డేమైనను మాటలాడవచ్చును. చిలుకలుకూడ మాటలాడుచున్నవి. మాటలాడుట ఒకటి, అనుభోగించుట మఱియొకటి. తత్త్వ

ములును, సిద్ధాంతములును, గ్రంథములును, గుళ్లును, మతములును, శ్లాఘ్యములైనవి. అయితే యాత్మను దర్శించి యంతయు బ్రహ్మమే యనుజ్ఞాన ముదయించగానే పైఁజెప్పఁబడినవియన్నియు మఱిగిపోవుచున్నవి. ఇందులకు దృష్టాంతముగ దేశపటములు శ్లాఘ్యముతే. అయితే దేశమునే ప్రత్యక్షముగఁ జూచినపిదప నాపటములనావశ్యములు. కావున బ్రహ్మము నెఱిగినవారలకు పుణ్యపాపకర్మములనావశ్యములు. సత్యమెఱిగినవారితోడ నీవెంతతర్కించినను వారు తమ సిద్ధాంతములను వదలరు. నీవొక దేశమును జూచియుండునట్లు తలచెదము. ఆదేశముంజూడనివాఁడు ఆదేశమే లేదని నీతోడందర్కించును. వాఁడు జెప్పుదాని నావంతయేనియు గమనింతువా? గమనింపవు. స్వానుభవముచే బ్రహ్మమునెఱుగనివాఁడు రమారమి నాస్తికుఁడేయగును. ఏలనన వాఁడును యాత్మవిచారణఁజేయుటలేదు. వీఁడును యాత్మవిచారణఁ జేయుటలేదు.

మంచిది, మన మాయాత్మవిచారణముఁ జేయుదము. మన యాత్మయే ఈప్రపంచస్వరూపముగనున్నదని తెలిసికొనుచున్నాము. అందుమీఁదట మనముచేయవలసిన కార్యమేమి? ఒకమూలఁ గూర్చుండి యేపనినిఁజేయక దినములుగడపి కడపట ప్రాణమును వదలుటయా? అట్లుండుటచేఁ బ్రపంచమునకేమి ప్రయోజనము? ఇది పురాతనపు ప్రశ్న. మొదట నామంచి ప్రపంచమునకేలఁ బోవలయును? అది ప్రపంచమునకుఁ బోవలయుననుట కేదేని కారణముకలదా? ఈప్రశ్న నడుగుట కెవ్వనికి బాధ్యతగలదు. "అది ప్రపంచమునకేమి ఫలమిచ్చును?" అను ప్రశ్నార్థమేమి? ఒకబిడ్డకుఁ గలకండయందుఁ బ్రియము. నీవు అంతరగ్నిశాస్త్రమును గుఱించి పరిశీలనఁజేయుచున్నావు. అప్పుడాబిడ్డ నిన్నుఁజూచి 'ఏమిచేయుచున్నావు? అందుండి కలకండ దొరకునా?' యని యడుగుచున్నది. అందులకు నీవేమి బదులుచెప్పెదవు? అటువలెనే మనుష్యులు లేచి 'అద్వైతముచే లోకమున కేమిప్రయోజనము? ఏదయినను ద్రవ్యములభించునా?' యని యడుగుదురు. వేదాంతముఁ జదువుటచేఁ బ్రపంచవిషయములపై

విరక్తిగలుగునని జనులు దలచి భయపడుదురు. వేదాంతి యెప్పుడీ ప్రపంచమునందు సకలజనులను తనయాత్మవలెఁ జూచునో అప్పుడు వానికి లోకమునందు సకల జీవరాసులవిషయమైయును ప్రీతి గలుగుననుట ప్రసిద్ధముకాదో? స్త్రీలు వేదాంతము చదువుటచేఁ దనపురుషుఁడే ప్రత్యక్షదైవమని వానిం ఘనపఱచును. అంతయు నీశ్వరస్వరూపముగఁ దోచును. తల్లి బిడ్డలను కృష్ణస్వామియని తలంచును. రాజు శత్రువును దైవమని మదినెంచి విశ్వసించును. కష్టమంతయు సుఖముగఁ బర్యవసించును. అప్పుడే ప్రపంచమంతయు ఆనందమయమై తోచును. ఈభూమియే స్వర్గముగ మాఱును. చూపోవమి, అసత్యము, అహంకారము, లోనగుదుర్గుణములు తొలఁగి పోవును. లోకమున పలుభావములుగలవు. మొదటిది: మన మితరులను మృగములుగఁదలచి మనలను మనుష్యులని తలంచెదము. గొప్పపట్టణములలో ఎందఱు ధనవంతులు బండియందుఁగూర్చుండి పశువులకు బదులుగ మనుష్యులే యీడ్చుకొనిపోవునటులఁ జేయుచున్నారు. పశువు లాగవలసిన బండిని మనుష్యుడే యీడ్చునటులఁ జేసియు యజమానుఁడు తనకుఁ దాను మనుష్యునిగఁ దలపోసి తక్కిన వారల మృగములనికదా తలపోయుచున్నాఁడు. ఈభావనకే శత్రుభావనయని పేరు. కొందఱు కొంతవివేకముచేత మనమును ఇతరులును మనుష్యులే. అయితే వారలు నికృష్టులు, మనముత్కృష్టులము, వారలవద్ద 1000 రూపాయలుండిన మనవద్ద 10000 రూపాయలున్నవని తలంచెదరు. ఇదియే ఉదాసీనభావన. శత్రుభావనగల వాఁడు మఱియొకయింటివాఁడు ధనవంతుడుగనుండుటఁజూచి వానికి భగవంతుఁడు ధనమిచ్చియున్నాఁడు. మనకు బలమిచ్చియున్నాఁడు. కనుక వాని నొకేపోటునఁ బొడిచి చంపి వానివద్దనుండు ధనమునపహరింపవలయునని దలపోయును. ఉదాసీనభావముఁగలవాఁడు కొంతవివేకముతోడఁ దానెక్కువయనియు ఇతరులు తక్కువనియు మదినెంచుచున్నాఁడు. ఇదియే శత్రుభావనకును ఉదాసీనభావనకును గల తారతమ్యము. పైఁజెప్పఁబడినటుల నీప్రపంచమునందువారిని

మన సహోదరులవలెఁ దలంచి వారివిషయమై మనము విశ్వాసముగనుండుట మిత్రభావము. ఈభావముకంటెను శ్రేష్ఠమగుభావమొకటికలదు. అదియే యాత్మభావన. అనగా సకలజీవరాసులను మనయాత్మవలె భావించుట ప్రపంచమున నొక్కొక మనుజుఁడును తనయాత్మను ప్రేమించుచున్నాఁడు. ఒక్కొకనికిని తనయాత్మకంటెను ప్రియమగు వస్తువు వేఱేదియు లేదు. మిత్రభావనయందెంతకాల మున్యోన్యముండునో అంతకాలముమాత్రమే సుఖముగలదు. ఏదేనియు విరోధముగలిగిన నది మున్ముఁ జెప్పఁబడిన భావములన్నిటియందును క్రమముగ పర్యవసించును. ఇట్టి సంకట మాత్మభావనయందు లేదు. ఆత్మపై ద్వేషముగలవాఁడే లేఁడు. కావున వేదాంతులు అందఱిని తమయాత్మవలె భావించుచున్నారు. అందుచేఁ బ్రపంచమునకనంతమగు నుపయోగములు గలుగవా? ఈ ప్రపంచమునందు మనుజుఁడు, వృక్షము, పైరు, పచ్చ, సూర్యచంద్ర నక్షత్రములు లోనగునన్నియు వేదాంతినిఁ జూచి ‘తత్త్వమసి’ యని చెప్పుచున్నవి. అట్లనగా అది నీవుగనేయున్నావని భావము. పారమార్థిక పురుషుఁడెచ్చటను నిండియుండు బ్రహ్మమే.

వివేకానందస్వాములు చికాగోపట్టణమునఁజేసిన మొదటి ప్రసంగము.

చికాగోయనునది అమెరికాలో నుండు ఒక గొప్పపట్టణము. ఇందుఁ గొన్ని సంవత్సరములకు మునుపు ప్రపంచములోని సకల మతస్థులు నొకటిగఁజేరి యొక గొప్పసభగాఁగూడి అందు వారి వారి మతసిద్ధాంతములనుగుఱించి ప్రస్తాపించిరి. అక్కాలంబున మన హిందూమతసిద్ధాంతములను అందఱికిని సులభముగ విశదపఱచ వివేకానందస్వాములు అను మహనీయు లచ్చటికి విచ్చేసిరి. వారా మహాసభయందు మొట్టమొదటఁజేసిన యుపన్యాసము నీదిగువ బొందుపఱచుచున్నారము.

"అమెరికాలోని నా సహోదరీలారా! నా సహోదరులారా! మీరలందఱును మమ్ముల గొప్పపఱచి యుపచరించినందులకై మీకుఁబ్రతివందనముఁ జేయుటకై నేను నిలుచునప్పుడు నా మనస్సున నుండు నపారసంతోషమును ఇంతయనిఁజెప్ప నెవరిచేనగును? ఈ ప్రపంచముననుండు పరిశుద్ధులగు మహర్షులకు బ్రతినిధిగా నన్ను భావించుకొని మీకు వందనముఁజేసెద. సకలమ్మతములకును తల్లిమతమెదియో దాని ప్రతినిధిగానుండి మీకు వందనమొనర్చెద. పలువిధజాతులవారును, పలుమతస్థులునగు కోటానకోట్లగు హిందూ మహాజనులకుఁ బ్రతినిధిగానుండి మీకు వందనమొనర్చెద.

బహుదూరదేశమునందుండి వచ్చియుండు ఘనులలోఁ గొందఱు సర్వసమయసమరసమగు ప్రసంగములను జేయుదురనియు వారలకు ఇతరమత నిరసనఁజేయు దుర్వాడుకయు ఇతర మతస్థులను హింసించెడి దుర్వాడుకయు లేదని వక్కాణించెడి యిచ్చటి ప్రసంగులకు నామనఃపూర్వకమైన వందనము సమర్పించెదను. సకలమతస్థులను యాదరించి యందఱికిని జ్ఞానమును వెదఁజల్లగల తల్లిమతమునఁ జేరినవాడనను గర్వము నాకుఁగలదు. మేమెల్లమతములును వాస్తవములనియే ఒప్పుకొనియెదము. మా మతగ్రంథములు ప్రా

యఁబడియుండు శ్రేష్ఠమగు సంస్కృతభాషన బహిష్కారమును పదమునకు వినియోగమే లేదు. ప్రపంచమున నుండు పలుదేశముల నుండి తఱుమఁగొట్టఁబడి పఱుగెత్తి వచ్చిన నానావిధమతస్థులను సంరక్షించి నానాదేశస్థుల నాదరించుచువచ్చెడి హిందువులలో నే నొక్కఁడనని తలఁచఁదలఁచ నామనస్సు సంతోషముచే పూరించుచున్నది. రోమ్‌పట్టణస్థులచే గుడి కొట్టివేయఁబడి దేశభ్రష్టులగు ఇజరేలులను గొప్పపఱచి యాదరించితిమి. ఇంకను యన్యమతస్థులుచేయు నుపద్రవమును సహింపనేరక స్వదేశములను వదలి పఱుగెత్తివచ్చి ఇండియాలో వసించిన లెక్కలేని యితరమతస్థులకు చేయిచ్చి కాపాడితిమి. దీనికి సంబంధించిన యొకశ్లోకము నా బాల్యమునుండి నా మనస్సున నాటియున్నది. ఆ శ్లోకమును ఇండియాలో ననుదినమును వేలకొలఁది జనులు చెప్పుచునే వచ్చుచున్నారు. అదెదియన: " పలుస్థలములలోఁ బాఱు యనేకనదులు అంత్యమున సముద్రమునఁబడి యొకటియగునటుల జగదీశా ఈ ప్రపంచమున మనసుపోయినట్టెల్ల ఒక్కొక మతమును (అదిసరియైనదియో సరికానిదియో) యనుసరించు భక్తులు కడపట నీపాదారవిందములనే జెందుచున్నారు " అనునదే.

భగవద్గీతలలోఁ జెప్పఁబడియుండుదానికి వేఱుసాక్షి లేదు. ప్రకృతమున నిచ్చటఁజేరియుండు మహాసభయే చాలును. " ఎవఁడేప్రకార మేమార్గము ననుసరించి నన్నుఁ బొందఁగోరుచున్నారో వానికాప్రకార మామార్గముగనే వాని కెదురేగి వానిం బొందుదును " అని శ్రీకృష్ణభగవాను లానతిచ్చియున్నారు. లోలోని మత కలతలు, మూఢభక్తి, మతభేదము, యగు నివి బహుదినములుగ నీ భూమియందుఁ బ్రబలివచ్చుచున్నవి. ఇవి యెన్నియో దేశములు నాశముఁజేసి మనుజులఁబోనడచి, నాగరికతను హతముచేసి సద్గుణములను వధించి విపరీతములం గలుగఁజేసెను. ఈమతభేదమనునది లేకుండినయెడల మనుష్యులు మహత్తరమగు మేలును బొందియుందురు. ఇప్పుడీమతభేదమునకు మృత్యువు సమీపించినది. నేటియుద

యయిన నీ సభగూడుటకై(గోట్టఁబడినగంటయే మతభేదము నశిం చుటకొఱకైన గుఱుతు. ఒకేస్థలమునకుఁబోవు సహోదరులగు పలుమతస్థులికను కత్తిచేతను కటారిచేతను ఒకరిగొంతు నొకరు నులి మి ఛేదించి నశింపక పరస్పరాన్యోన్యముతోడఁ బ్రబలుచు వచ్చు చుందురని నమ్ముచున్నాఁడను

హిందూమతము.

ఈప్రపంచమునఁ బెక్కుదినములుగనుండు మతములు మూ డు :— 1. హిందూమతము. 2. జొరాస్టర్ మతము. 3. యూదియ మతము. వాని కన్నిటికిని అప్పుడప్పుడు ఆపదలు గలిగినను స్థావ రము చెడక నిలుకడఁజెందుటకుఁ గారణము వాని పునాదిబలమేగా ని వేఱుకాదు. యూదియమతము క్రీస్తుమతమును తనకు లోఁబఱ చుకొన శక్తిలేక యపజయముఁ బొందెను. ప్రకృతమున నుండు కొం దఱు పారసీకులచే వారిమతము ప్రాణముతోనున్నదనుకొనవచ్చును. వీనిగురి యిట్లుండ హిందూమతనిలుకడను గమనింతము. ఇండియా లో వేదమార్గమును వేఱుతోడ నూడఁబెఱకఁ దలంచి యనేకమత స్థులు ప్రబలిరి. వారు ప్రబలి యెంతప్రయత్నించియు హిందూమత ము నూపుటకు వారిచేఁ గాకపోయెను. హిందూవేదాంతము తనకు విరోధముగఁబ్రబలిన సకలమతములను వాతవేసికొనెను. ఇండి యాలో విగ్రహారాధనఁజేయువారును, ద్వైతులును, జైనులును, బౌద్ధులును, ఇంకను పలుమతస్థులును గలరు. వీరందఱు వచ్చినది ఒకస్థలమునందుండియే. హిందువులలోనుండు శైవము, వైష్ణవము, లోనగు సకలమతములకును ఆధారమొక్కటియే. అదియే అందఱి కిని పొత్తు. అట్టిపాత్త్రయిన పాత్రేది? దానినే మనమిట్టిదియని యెఱు గవలయును. అదియే వేదము. సర్వమతస్థులకును వేదమే యాధా రము. వేదమున కాద్యంతములు లేవు. ఒకపుస్తకమునకు ఆద్యంత ములు లేవనుట యిచ్చటనుండువారల కాశ్చర్యముగను పరిహాసము

గను దోచును. అయితే వేదమనుటచే పుస్తకమని యర్థముం గొనుట తప్పు. పలుసమయములయందుఁ బలుమహర్షులచేఁ గనిపెట్టఁబడిన ఈశ్వరసంబంధమగు విషయములే వేదములు. భూమికెట్టివస్తువునైనను ఆకర్షించుశక్తికలదు. ఈశక్తి యిప్పుడు కలిగినదికాదు. నిన్న మొన్న కలిగినదికాదు. భూమిసృష్టింపఁబడిననాటినుండి దానికీ శక్తి గలదు. దానిం గొన్నిసంవత్సరములక్రిందనే తత్త్వశాస్త్రజ్ఞులు కనుఁగొనిరి. అటులనే వేద మిట్టికాలమునఁగలిగినదని చెప్పుట యసంగతము. జీవుఁడును ఈశ్వరుఁడును ఒక్కటియనునది ఎప్పుడును కలిగినదే. దానిని మనము మఱచిపోయినను అవి వేఱుకావు. ఇట్టివేదము లధ్యయనముఁజేసినవారు ఋషులు. వారిలోఁ గొందఱు స్త్రీలు. ఇచ్చట నొకయాక్షేపణ కలుగవచ్చును. చట్టముల కంత్యము లేకుండవచ్చును. అది లేకుండు టెట్లని కొందఱు ఆక్షేపింపనగును. వేదమునందు సృష్టికాద్యంతములులేవని చెప్పఁబడియున్నవి. సృష్టిలేనిదినములేదు. ప్రకృతపు తత్త్వశాస్త్రజ్ఞులును వాని నొప్పుకొనుచున్నారు. ఏమియులేనికాలము ఉండియుండిన ప్రాణశక్తి ఎచ్చటనుండినది? కొందఱు దేవునివద్దనుండునట్లు బదులుచెప్పుదురు. అట్టయినదేవుఁడు కొంతకాలము శక్తిని దాచుకొని కొంతకాలము వెల్లడిపఱచుచునుండియుండవలయును. అట్లు స్థితి మాఱునట్టిదైనను ప్రకృతపు ఆంగ్లేయ జడతత్త్వశాస్త్రము చెప్పిన మృతినొందవలయును గదా? కావున సృష్టిలేనిసమయ మొకప్పుడునుండినదిలేదు. ఈశ్వరుఁడనేకప్రళయములవఱకును సూర్యచంద్రనక్షత్రాదులను సృష్టించి నశింపఁజేయుచున్నాఁడు. ఇదియే హిందువులసిద్ధాంతము. ఈ సిద్ధాంతము ప్రకృతపు ఆంగ్లేయతత్త్వశాస్త్రజ్ఞుల యభిప్రాయమున కనుగుణించియున్నది.

నేనిచ్చటనుండి కనులమూసికొని నాస్థితి నెఱుఁగఁగోరెదను. నేను, నేను. నాకు నన్ను గుఱించి నామనసునఁ దోచునదేది? శరీరమని. అట్టయిన నేననునది మాంసముచేనయిన నా దేహమునుమాత్రమా సూచించుచున్నది, 'కాదు' అని వేదములు మొఱలిడు

చున్నవి. నేను శరీరమున వసించు నొకసూక్ష్మవస్తువు. నేను శరీరము కాదు. శరీరము నశించును. నేను మృతినొందను. నేనీదేహమున నుంటున్నాను. ఇది మృతినొందినను నేనుందును. నేను పూర్వమును ఉండియుంటిని. ఏమియులేక యాత్మ నెట్లు సృష్టింపనగును? సృష్టి యనగానే రెండువస్తువులుచేరియైనదని యర్థమగును. అటులఁ గలిగిన వస్తువు నాశమొందుట, అనగా, మరల వేఱగుట నిశ్చయము కావున ఆత్మ సృష్టింపఁబడినదై యుండెనేని అది మృతినొందవలయును. కనుక ఆత్మ సృష్టింపఁబడినదికాదు. కొందఱు సుఖశరీరులుగను భాగ్యవంతులుగనున్నారు. కొందఱు అందముగనున్నారు. కొందఱు ధైర్యశాలులు. కొందఱు మిగుల బీదలుగ జన్మించుచున్నారు. కొందఱికి కాలుచేతులు లేవు. కొందఱు నిండుసోమరిపోతులు. వీరందఱు నీశ్వరునిచే సృష్టింపఁబడియుండిరేని న్యాయమును, దయయుగల యీయీశ్వరుఁడు ఏల వారల నట్లు సృష్టింపవలయును? ఈశ్వరుఁడేల యంతపక్షపాతముగ నుండవలయును? ఇప్పుడు కష్టపడువారు మఱియొక జన్మమున సుఖమును పొందుదురనిన సరియగునా? మహానీతిగనుండు కరుణానిధియగు దేవునిచే సృష్టింపఁబడిన మనుష్యులేల కష్టపడవలయును? కనుక ధనవంతుఁడుగను దరిద్రుఁడుగను, సొగసుకాఁడుగను, అనలక్షణుఁడుగను, బుద్ధిమంతుఁడుగను, మూఢుఁడుగను సృష్టించుటకుఁ దగు కారణములుండవలయును. అవియే వారువారు ముందుచేసిన కర్మములు. పూర్వజన్మపుణ్యపాపములకుఁ దగినట్లు జనులు సుఖదుఃఖము లనుభవింతురు. జనకుఁడేలాగో పుత్రుఁడును ఆలాగే. అను సామెతగలదు. తండ్రియొక్క రూపమును, సౌందర్యమును, సామర్థ్యమును విశేషముగఁ బుత్రునికిఁ గలుగుచున్నవి. వీనినిగుఱించి మఱియొకసారి చెప్పందొడంగెదము.

ఇది కొన్ని కొన్ని విషయములయందు నిజమైనను పుత్రుని గుణమంతయు తండ్రిమూలముగఁ గలుగుచున్నదనుటయే నిజము కాదు. మనకుగల బుద్ధి, గుణము అను నీవిషయములు పూర్వజన్మ [illegible]ముల చేతనే గాని వేఱుకాదు. కావున జన్మాంతరము

కలదని యేర్పడుచున్నది. అట్టియిన పూర్వజన్మమున మనముచేసిన కార్యములు నీజన్మమునవేల మఱచుచున్నాము. ఇందులకు బదులు బహుసులభముగఁ జెప్పనగును. నేనిప్పుడు ఇంగ్లీషు మాటలాడుచున్నాను. అది నా స్వకీయభాషకాదు. నా స్వకీయభాషయందుమంతు మాటలు నామనసున నిప్పుడు లేవు. అయినను వానిందలంచిన వెంటనే యవి జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. జ్ఞాపకమనునది మనస్సు అను సముద్రపు పై భాగము. దానియడుగున మన యనుభోగము లన్నియు లోతుగఁబడియున్నవి. మనము ప్రయత్నముచేసినట్టయిన గత జన్మమునఁ జేసినకార్యములు మనజ్ఞాపకమునకు రానగును. పై జెప్పఁబడినది నిరూపింపఁబడవలయునని యిష్టముగలవేని మన పూర్వీకులగు ఋషులకార్యమును గమనించుట యావశ్యము. మనజ్ఞాపకమును సుస్థిరముగఁ జేకూడిన జ్ఞానసూత్రములను ఋషులు చేసియున్నారు. కనుక పైనఁజెప్పఁబడిన న్యాయములచే నొక్కొకహిందువు తనను ఆత్మగాఁ దలచుచున్నాఁడని తెలియుచున్నాము. ఆత్మను కత్తిచే నెత్తసాధ్యపడదు. దానిని యగ్ని కాల్చనేఱదు. దానిని జలము తడపఁజాలదు. ఒక్కొకయాత్మయు చుట్టు గీతలేక దేహామున మధ్యస్థానమునమాత్రము బొందిన ఒకవిధ వట్టువు. మరణమనునది మధ్యస్థలమునఁగల మాఱుబాటేగాని వేఱుకాదు. ఆత్మ జడముకాదు అది యెప్పుడును శుద్ధమైనదియు నిండినదియు. ఏకారణముచేతనో దానికి మాయాసంబంధముకలిగి తనను జడమని దలంచువాఁడుక కలదు. దీనికి కారణమిట్టిదియని మనకు తెలియదు. పరిపూర్ణానంద మయముగనుండు ఆత్మ మాయాసంబంధముచేత జీవుఁడని దలఁబడుటయేల? ఇది దేవునికార్యమని కొందఱు చెప్పుదురు. అయితే అది తగుసమాధానముకాదు. తగుసమాధానముకలిగినను కలుగకుండినను మాయయనునది ఉన్నదనియు ఆమాయచే ఆత్మ జీవుఁడుగఁ దలంచఁబడుచున్నాఁడనుట నిశ్చయమే.

మనుష్యునియాత్మ నాశములేనిది. పూర్ణముగను శుద్ధముగ నుండునది. మరణమనునది యొక శరీరమునసుండు యాత్మ మఱి

రొక శరీరమునకు మారుననదని వ్యవహారము. ఈ జన్మ కర్మముల చేఁగలిగినది. ఈ జన్మమున మనముచేయు పుణ్యపాపములకుఁ దగినట్లు రాగల జన్మమున మనకు ఫలముకలుగును. హిందూ వేదాంతుల సిద్ధాంతప్రకారము అందఱును పాపులుకారు. సింహములు తమ్ముతాము మేకలనుకొని యూరకుండునట్లు ఆత్మయగు మనము మనలను జడలమనిదలంచి పుణ్యపాపములచే కష్టమనుభవించి మాయలోఁజిక్కి చింతించెదము. మాయను తప్పించుకొనువాఁడు వెంటనే ముక్తుఁడగును. దైవమునే మనకుఁ బ్రియవస్తువుగఁ దలంచి మనము భక్తిగలిగియుండిన ఆయన పరమకరుణచే మనలఁ జుట్టియుండెడి మాయ తొలఁగిపోవును. శ్రీకృష్ణభగవానులు చెప్పిన దేమన, "మనుజుఁడీప్రపంచమున తామరాకుతీరున నుండవలయును. తామర నీళ్లలోనేయుండినను దానిచే తడియుట లేదు. అటులనే మనుజుఁడు ప్రపంచముననుండుట నిజమైనను వాఁడు ప్రపంచవ్యాపారముల యందు తనబుద్ధిని చొరనీయక యెల్లకర్మములను ఈశ్వరార్పణము జేసి తన హృదయమును శరీరమును దైవకార్యమునకేయని కట్టిపెట్టిన నిశ్చయముగ మోక్షముం బొందవచ్చును." మనము వస్తువులను పొందవలయుననియు స్వర్గమును బొందవలయుననియు ఈశ్వరుని బ్రార్థించిన మంచిది. అయినను దైవమే మనప్రియకరమగు వస్తువనియు, ఆయనను పొందుటదె మనకు శ్రేష్ఠమగు కార్యమనియు యెంచి మనము ఆయనను ఆరాధించుట శ్రేష్ఠమగు విషయము. ముక్తినిఁ బొందుటకు మొదట మాయను తొలఁగింపవలయును మాయను తొలఁగింప దేవునికృప కావలయును. ఆకృపను సంపాదించుటకు ఆయనను బ్రార్థింపవలయును. ఇట్లు ఈశ్వరునిఁ బ్రార్థించునపుడు మనమనస్సు శుద్ధముగనుండుట యావశ్యము. అశుద్ధమగు హృదయముగలవారలకు ఈశ్వరునికృప యొకనాఁడును కలుగదు. కావున మనుజుఁడు శుద్ధమైనహృదయముతో నీశ్వరునియందు భక్తిగలిగి యుండిన ఆయనకృప నాదరువుచేసికొని మాయను దొలగించి ముక్త

రోజాపుష్పమునకు ఏమిపేరు పెట్టినను దానివాసన మారదు. అది యెప్పుడును పరిమళమునే వీచుచుండును. అటువలెనే హిందువులు పరబ్రహ్మమును శివుఁడు, విష్ణువు, బ్రహ్మ, సుబ్రహ్మణ్యుఁడు, గణపతియని పలువిధములఁ జెప్పుదురు. ఇందుచే హిందువులు ఒక దేవు నియర్చింపక పలుదైవముల నర్చించుచురనుటఁదగునా? అన్యమతస్థులు హిందువులను విగ్రహారాధనఁ జేయువారని వాదుకొనియెదరు. విగ్రహారాధనచేయుటను హేళనమునకేడమిచ్చునా? పరమాత్మయందు భక్తిగనుండుటకు మనస్సు ఒక్కటే మార్గమున నిలుపవలయును. అందులకై హిందువులు ఎచ్చటఁజూచినను దేవాలయములను గట్టి అచ్చట విగ్రహములను స్థాపించి వానికి వేదమంత్రములచే ప్రాణప్రతిష్ఠచేసి అందఱును పోయి దర్శించునట్టి యేర్పాటును చేసియున్నారు. ఇట్టి విగ్రహమును, గుడియును జ్ఞానికనావశ్యము. ఏలనన జ్ఞాని భగవత్స్వరూపము నెఱిగియున్నాఁడు. అట్టిజ్ఞానులిక్కాలముననుండుట యరుదు. కావున సకలమతస్థులును గుళ్లకు పోవలసినదవశ్యమే. విగ్రహములను పూజింపవలసినది యావశ్యమే. విగ్రహమందేనా దైవముంటున్నాడు? మనహృదయమున లేడా? వృథాగా ఱాతిని, తామ్రమును దైవమని తలంపవచ్చునాయనిన గుడియందేనా దైవముంటున్నాడు? ఆయన యెచ్చటను నిండియుండలేదా? అట్లయిన ఆయనను క్రైస్తవులు ఇంటియందుండే ధ్యానముచేయక గుడికిపోయి స్తోత్రముచేయనేలయని ప్రశ్నకలుగును.

క్రైస్తవులు మిక్కటముగ ద్రవ్యమును సెలవుచేసి బ్రహ్మాండమైన గుళ్లను ఏల కట్టవలయును? ఏల శిలువను పరిశుద్ధమనియెంచి గుడియందుంచవలయును? వారుమాత్రము శిలువను ఉంచవచ్చును, మనేము విగ్రహమునుంచఁగూడదా? ఇంకను మనము జాబులకు మొదటను పుస్తకములకు మొదటను వినాయకునిరూపము వేసిన, క్రైస్తవులు మనలను హేళనము చేయుచున్నారుకదా? అటువంటి క్రైస్తవులు వ్రాయుకాగితములలో శిలువను వ్రాయుటలేదా? క్రైస్తవులు శిలువను ధరించుచున్నారు. మనవారలు లింగమును

కట్టుకొనుచున్నారు. రోమన్ కాతలిక్కులు జపమాల నుంచుకొని జపముచేయుటను మనము పలుతడవలు చూచియున్నాము. అట్లుండ రుద్రాక్షమాలను తుళసిమాలను మనము ధరించుకొనిన, దానిని యనాగరికమని వారలు ఎట్లు చెప్పనగును? రోమన్ కాతలిక్కు క్రైస్తవులు మాదాగుడికి పోయిన మనము జగదీశ్వరియగు అంబికాలయమునకుఁ బోవుచున్నాము. ఒకవేళ ప్రాటెస్టాంటు పాదరీలు విగ్రహములనుంచుకొనకనే మనస్సుచేతనే ధ్యానము చేయుచున్నారంటే వారును తమమనస్సున దేవుని యొకరూపముగ భావించియే గదా ధ్యానింపవలయును. మనము దేవుని యొకరూపముగభావించి చాలదని ఎదుట విగ్రహముగనుంచి షోడశోపచారములను జేసెదము. క్రైస్తువులు జపముచేయునప్పుడు ఏల నాకాశమును చూచుచున్నారు? దేవుఁడు ఆకాశముననుండుననియు దానిని వదలి భూమికి దిగివచ్చుటలేదనియు వ్రతము పెట్టుకొని యున్నాడా? లేదు. కనుక మనము ఊపిరివిడువక ప్రాణముతో నుండఁగలిగిన విగ్రహమును పూజింపక దేవునిస్తోత్రముచేయనగును. ఈశ్వరుఁడు సర్వవ్యాపియని చెప్పెడి క్రైస్తువులు విగ్రహమున మాత్రము ఆయన వ్యాపింపలేదని ఎట్లు చెప్పనగును? స్నేహితులుగనుండు ఇద్దఱిలో నొకనిపటమును మఱియొకఁడుంచుకొనుట సహజము. అందులకుఁ గారణము ఆపటమును చూచునప్పుడెల్ల స్నేహితునిఁ జూచునట్లుండునుగదా? అటువలెనే మనము కోరియుండు భగవంతునిఁ జూచుటకై మనము విగ్రహారాధనను చేసియే తీరవలయును. అట్లు చేసినట్లయితేనేగాని తనను తానెఱుగు జ్ఞానముండదు. పైనఁజెప్పఁబడిన సంగతులవల్ల క్రైస్తవమతమును దూషించునట్లెంచఁగూడదు. క్రైస్తువులలో గొందఱు హిందూమత సంప్రదాయములను హేళనముచేయుట యనుచితమనిమాత్రము మందలించితిమేగాని వేఱు కాదు.

ప్రపంచమసత్యమా? సత్యమా? యనునది యొక గొప్ప [illegible] తేలనేరదని పెద్దలుచెప్పిరి. లోకమసత్యమెననేమి?

సత్యమైననేమి? దాని నెఱుగుటవల్ల మనకుఁ గలుగు ప్రయోజన
మేమి? ప్రపంచమున సుఖదుఃఖములు గలవు అనుటను ఒక్కొకరును
ఒప్పుకొనుచున్నారు. కావున సుఖదుఃఖములను విడనాడి నిత్యా
నందమునే బొందవలయునేని ప్రపంచయాశలం దొలగించుట మంచి
చిది. ఈ యాశలను మఱచుట యావశ్యమని యేర్పడునపుడు ప్రపం
చమసత్యమైననేమి? సత్యమైననేమి?

బుద్ధిమంతుఁడు చేయవలసిన కార్యమేమి? లోకమున బుద్ధి
శాలియగువాఁడు ఆత్మవిచారణ చేయవలయును. ఆత్మ యిట్టిదనియు
అనాత్మ యిట్టిదనియు ఎఱుగవలయును. "నేను" అనునది శరీరము
నిర్దేశించలేదనియు ఆత్మనే నిర్దేశించుచున్నదనియు ఒక్కొక్కరును
తెలిసికొని అనాత్మయగు దేహముపై నభిమానముంచక ఆత్మనుగు
ఱించి విచారింపవలయును. ఆత్మ నాశరహితమనుదానిని ఎల్లమత
స్థులును ఒప్పుకొనియున్నారు. దేవుఁడున్నాఁడాయన గొందఱులేదని
నాస్తికవాదముఁజేయ నారంభింతురు. ప్రపంచమున్నదాయన గొంద
ఱు లేదని వాదింపఁదొడంగుదురు. బ్రహ్మము కలదాయన దానింజూ
చినదెవ్వరని కొందఱు చెప్పుదురు. అయితే ఒక్కొక్కఁడును తాను
న్నాఁడాయనుదానినిగుఱించి సందేహించుటలేదు. కనుక ఏది నిశ్చ
యమని ఒక్కొక్కఁడును నమ్ముచున్నాఁడో దానిని మొదట విచారింప
నిమ్మని పరమకరుణచే నాది శంకరాచార్యస్వాము లాత్మవిచారణఁ
జేయుటకై మనకు బోధించుచున్నారు. అట్లు తనలోనుండు నాత్మ
స్వరూపమును విచారింప నారంభించువాఁడు వేదాంతియై తనయా
త్మయే అనగా తానే యెచ్చటను వ్యాపించియుండు బ్రహ్మమని
యెఱుగుచున్నాఁడు.

"ప్రపంచమునుగుఱించి యద్వైతుల సిద్ధాంతమేమి?"
అద్వైతులు ప్రపంచము మిథ్యయనియుఁ జెప్పలేదు, అమిథ్యయని
యుఁ జెప్పలేదు. అద్వైతస్థాపకులగు ఆది శంకరాచార్యులు ప్రపం
చము సత్యాసత్యములు గలిసియున్నదనుచున్నారు. అట్లు సత్యా
సత్యములు కలిసినవస్తువొక్కటికలదా? కలదు. మన దేహముననుండు

నఖములును, కేశములును, దేహమున సంబంధించినవిగనేయున్నవి. నఖకేశములఁగోసిన యుపద్రవము కలుగుటలేదు. కావున నవి శరీరమునుండి వేఱుగఁదోచుచున్నవి. కనుక నవి శరీరమునసుండి కలుగుచున్నవనుటయు సందేహములేదు.

"కావడి యెన్నివంకలుపోయినను ఇల్లుచేరవలసినదే" యను సామెతచొప్పున ఏమతస్థుఁడైనను వాఁడద్వైతమార్గమునే యనుసరించి తీరవలయును. ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతమనునివి యన్నియు ఒకవిధ యద్వైతమేగాని వేఱుకాదు. అద్వైతులకు యేమతస్థులును విరోధులుకారు.

భ్రమయనునది ఏమి? నిజమైన యొకవస్తువును మఱియొక వస్తువుగ భావించి భీతిఁజెందుటయే భ్రమ. ఒకప్పుడు టేకుమ్రానితో గొప్పయేనుఁగు జేయఁబడి యొకచోట నుంచఁబడియుండెను. అప్పుడొకవడ్లవాఁడును, ఏనుఁగు నెన్నఁడుంజూడని వానిచెలికాఁడును ఆ త్రోవంబోయిరి. ఇరువురును మూఁడవ మనుష్యునిఁజూచి యదిగో కనుపడునదేమియని యడిగిరి. వాఁడచ్చటనుండినది టేకుమ్రానితోఁ జేయఁబడిన ఏనుఁగుయని చెప్పెను. ఏనుఁగు అను శబ్దమునే వినని వడ్లంగిచెలికాఁడు "ఒరేయబ్బా! అదియా యేనుఁగు! బ్రహ్మాండముగ నున్నదే, భయముతోఁచుచున్నదే, దీనింజూచిన నామనను తత్తరించుచున్నది. ఒకవేళ నిది ప్రాణముఁగలిగిన మనలం జంపవచ్చినను వచ్చును. దీనిసమీపమున మనము నిలువఁదగదని మెల్లన వెనుదీసి కొంతసేపటికి నామడదూరము పాఱిపోయెను. వడ్లంగి యిది టేకుమ్రానితోఁజేయఁబడినదని వినినఁదోడనే "అలాగా, ఇది టేకుమ్రానా! టేకుమ్రాను మిగుల గట్టిదియనుదురే. ఏదియో దానిని : గొంత చివ్విచూతము" అని యులిచే నేనుఁగు కుంభస్థలములు, దంతములు, శరీరము, కాళ్లు మొదలగు యవయవములను కొంచెము కొంచెముగఁ జివ్వి దానిని ముక్కున నాఘ్రాణించెను. పైఁజెప్పఁబడిన యిరువురిలో బుద్ధిశాలియెవ్వఁడు? వడ్లంగియేకదా! పాఱిపోయినవాఁడు జీవములేని యేనుఁగురూపమును జూచి జీవముగలదని

భయపడెను. అటులనే యసత్యమగు ప్రపంచమును సత్యమని విశ్వసించి తాను సచ్చిదానంద స్వరూపమగు బ్రహ్మమని తలపక సుఖదుఃఖములను తానుగనే యేర్పఱచికొని కష్టపడువాఁడే భ్రమగొనినవాఁడు.

“బ్రహ్మము నొకనిమేషమునఁ జూపవలయును” అని పూర్వకాలపు రాజొకఁడు తనవద్దకే తెంచిన సాధువులనందఱిని యడిగి బదులుజెప్పఁ దెలియక మిణుకరించువారి నందఱిని శిరచ్ఛేదనము చేయుచువచ్చెను. ఈప్రకారమా క్రూరరాజుచే ననేక సాధువులు మృతినొందిరి. ఒకనిమిషమున బ్రహ్మమునుఁ జూపుటయనున దెవరికి సాధ్యమగును? ఇట్లుండ శుకస్వాములవారారాజుయొక్క బుద్ధిహీనతంబోఁగొట్టి సాధువుల రక్షింపఁదలచి వానివద్దకే తెంచిరి. రాజు వేటకు బయలుదేరునపుడు, శుకాచార్యులవారు వానియెదుటికి కాషాయధరులై వచ్చుటను వాఁడు జూచి వట్టాకత్తినిఁ దీసి “ఓరిసన్యాసీ! ఎచ్చట బ్రహ్మము? దానింజూపెదవా? లేక నినుం ద్రుంతునా?” యనెను. వెంటనే శుకులా రాజుంజూచి ఓరాజా! ప్రవృత్తినివిడువుము. వెంటనే బ్రహ్మముం గందువనిరి. వెంటనే కత్తిని క్రేలాఁకవిడిచి బ్రహ్మమెక్కడయని యడిగెను. శుకస్వాములు ‘రాజా, అశ్వారూఢుఁడవై యున్నావు, అదియే యొకప్రవృత్తి. చేతినాడించుచున్నావు, నోరు తెఱచుచున్నావు, అది యొకప్రవృత్తి. ఈ ప్రవృత్తులనన్నింటిని విడువుము. నీవు బ్రహ్మమును జూతువు’ అనిరి. రాజు చలనము లేక కొంతదడవు నిలిచియుండ శుకస్వాములవారు వాని కొక్కొకతత్త్వముగ నుపదేశించి యాత్మజ్ఞానమును గలుగఁజేసెను.

కర్మయోగము.

కర్మమనగా పనియనియర్థము. కొన్నివేళలయం దీపదమునకు పనిచేఁగలిగిన ఫలమనియునర్థము. పూర్వజన్మమునఁజేసిన పుణ్యపాపములకుఁదగినట్లు ఈజన్మమున మనమనుభవించు ఫలాఫలములను కర్మమనియే చెప్పుచున్నాము. కర్మయోగమున నుపయోగపడు కర్మమను పదమునకు పని (లేక) కార్యమని యర్థమగుచున్నది. మనుజులు పొందవలసిన ముఖ్యమగు వస్తువు జ్ఞానమేగాని వేఱుకాదు. అనేకులు జ్ఞానమును గోరక సుఖమునే కోరుచున్నారు. సుఖమున కంతముకలదు. సుఖమే మనుజుఁడు పొందవలసిన ముఖ్యమగువస్తువని కొందఱు దలంచెదరు. ఇది బుద్ధిహీనత. సుఖముండుచోట దుఃఖము కలదు సుఖమును బొందువాఁడు దుఃఖమునుగూడ పొందుచున్నాఁడు. బిడ్డ పుట్టునపుడు సంతోషపడుదుము. అది చచ్చునపుడు దుఃఖమును బొందుదుము. నేటికి రుచ్యమైన భక్ష్యము భక్షించునపు డానందమును బొందుదుము. రేపటికది లభింపలేదని మనోదుఃఖమును బొందుదుము. ధనికులకెప్పుడును నిష్టమగు పదార్థము లభించునని కొందఱు చెప్పుచున్నారు. ధనికునకు బీదవానివలె యాకలియుండుటలేదు. బీదవారికి సంవత్సరమున కొకసారి జ్వరము వచ్చిన ధనికులకు వేయిసారులు జ్వరమువచ్చును. ఒకవేళ మంచి యాకలియు శరీరారోగ్యమునుండునట్లు భావించుకొనినను వార్ధకమనునది యందఱికిని వచ్చుటచేఁ గఠినపదార్థములగు మామిడికాయ, ఓంకాయ మొదలగువానిం దిన యోగ్యముగాక దంతములూడిపోవుచున్నవి. అయిన నిష్టమగు పదార్థము నికను తినసాధ్యపడక మృతినొందుదుమను దుఃఖమొక్కొక్కనికిని కలుగునుకావున సుఖముండిన దుఃఖముండునమనది నిజము. జారుడగువాఁడు రాత్రియంతయు వెలయాలితోఁ గూడి యనుభవించి మఱునాఁడుదయమున దేహము శుష్కించి కన్నులు లొట్టబోయి నిండు వ్యాధిచేఁ బీడితుఁడగును. వాఁడు సుఖమని దలపోయునదంతయును కష్టముగఁ

అయితే సుఖదుఃఖములు మనసున [illegible] యందాక్షేపణ లేదు. దుఃఖమొందునపుడు డికను దుష్కృత్యమును జేయుట లేదని తీర్మానించుదుము. లోకమున మనము పడు దెబ్బలును పోట్లును మనమనస్సున నొకవిధమైన జ్ఞానమును కలుగఁజేయుచున్నవి. పశువులు భూమిపై నడచిన వాని కాలియడుగుల జాడలు నేలపయిం జెలియునట్లు మనకుఁగల సుఖదుఃఖములు, కోపతాపములు, ప్రేమాప్రేమలు మనమనస్సున నొక్కొక్క గుఱుతును గలుగఁజేసి పిదప మఱిగిపోవుచున్నవి. ఇట్టిగుఱుతులన్నియు నొకటిగఁజేరి మనుజుని గుణముగా నేర్పడుచున్నవి. ఒక మనుష్యుని మంచివాఁడనియు దుష్టుఁడనియుఁ జెప్పుట వానియొక్క నిర్దేశమగు కార్యమువలన గాదు. వాఁడు జన్మించిన దినము మొదలిదివఱకును వాని మనస్సునఁ దోచిన పలువిధజ్ఞానముల సమూహమే వానిగుణమును సూచించు సాధనములు. మనము చేసెడి లేక పొందెడి మంచి చెడుగులే మన గుణమునకై సహేతువులు. కొన్ని సమయములయందు సుఖముకన్నను దుఃఖమే మనము కడతేఱుటకుఁదగిన గుఱుతైయుంటున్నది. ఇందులకు దృష్టాంతముగ నొకకథఁజెప్పెదము. రమారమి ముప్పదిసంవత్సరములకు మునుపు దక్షిణదేశమున నల్లూరనుచిన్నసగరమున నొక శివాలయముండెను. అందుఁ బూజారిగానుండినవానివద్ద నొక బ్రాహ్మణ చిన్నవాఁడు పనిచేయుచుండెను. వాఁడొకనాడు కొంత తామసించి వచ్చినందునఁ బూజారి కోపముంగొని వానిం జక్కగాఁగొట్టి గాయపఱచెను. నాటి సాయంత్రము పండ్రెండేండ్ల ప్రాయముగల యీ చిన్నివాఁడా యూరువదలి ప్రయాణమై ఒకమాసములోపల చెన్నపట్టణమునకు వచ్చి చేరెను. ఇచ్చట ధనవంతుఁడగు నొకశెట్టిగారి సహాయముచే నాంగ్లేయభాష నభ్యసించి పదియాఱేండ్ల ప్రాయమునఁ బరీక్షయందుఁ దేరి మొదటఁ బదియైదు రూపాయల సంబళమునకు నుద్యోగమున నమరి పిదప రెండుమూడు సంవత్సరములకే నల్లూరి

యుండె సబ్ మేజస్ట్రీటుగా నియమింపఁబడెను. అప్పుడాయూరనుండువారందఱును క్రొత్తమేజస్ట్రీటునుఁ జూడవచ్చిరి. వారితోఁగూడఁ బూజారియు వచ్చెను. ఆయనం జూడగానే మేజస్ట్రీటు కుర్చీని వదలి లేచి యాయనకు సాష్టాంగముగ నమస్కరించి యాశీర్వాదము పొంది లేచి నిలిచియుండెను. దానింజూచి యందఱును నచ్చెరువందిరి. రమారమి ఏడు సంవత్సరములైనందునఁ బూజారికి సబ్ మేజస్ట్రీటు యొక్క ముఖజాడ తెలియకపోయెను. వెంటనే మేజస్ట్రీటు చేతులు కట్టుకొని మర్యాదతోడం బూజారింజూచి స్వామీ నేనే నారాయణుఁడను, తమవద్ద పరిచారకముఁ జేయుచుంటిని. ఒకనాడు పుష్పముఁ దీసికొనిరాఁగా తామసమాయెను. అందుచేఁ దెబ్బలుతింటిని. చదివి యుద్యోగముచేయవచ్చునని దలచి యూరిని వదలివచ్చితిని. భగవంతుని కటాక్షముచేతను తమ యాశీర్వాదముచేతను మంచి యుద్యోగమును బొందితిని. నాకుఁగలయైశ్వర్యమునకును గౌరవమునకును కారణము తాము నాటిదినము బలముగఁగొట్టిన దెబ్బలే. ఇకను తాము నన్ను వదలిపోఁగూడదు. నాకు జనకునివలెనుండి నా కుటుంబమును నిలిపి కాపాడవలయునని చెప్పెను. ఇట్టి దృష్టాంతములనేకములుగలవు. ఇందుచే దుఃఖమే గొప్పగురువని యేర్పడుచున్నది. సుఖదుఃఖములు జ్ఞానముంగలుగఁజేయ మంచిసాధనములేను.

పైనఁజెప్పఁబడిన జ్ఞానమనునది మనుజునిలోనే యున్నది. దానికి బయటలేదు. సకలజ్ఞానములును మనమనస్సున నుంటున్నవి. బయటనుండి జ్ఞానము వచ్చుటలేదు. తెలివిలేమిచే నట్లు చెప్పుచున్నామేగాని వేఱుకాదు. ఒక గొప్పపెట్టెలోఁ బలువిధ ఫలములుండెను. పైననే అరటిపండ్లుంచఁబడి ఒకగుడ్డచే మూయఁబడియుండెను. దానిదిగువ దివ్యమగు మామిడిపండ్లు పఱచఁబడి ఒకగుడ్డచే మూయఁబడియుండెను, దానికిదిగువ పరిమళము వీచెడి యతి మధురములైన పనసపండ్లుంచఁబడి గుడ్డచే మూయఁబడియుండెను. దానికిని దిగువ నధిక వెలగల రేగుపండ్లచే నింపింపఁబడి నాణ్యమగు పట్టు [illegible]బడియుండెను. దానికిని దిగువ దివ్యమైన రత్నముం

డెను. ఈరత్నములగు జ్ఞానమును బొందవలయునేని మనుష్యుఁడు మనస్సను పెట్టెను తెఱచి ఒక్కొక్కటిగాఁ బరిశోధింపవలయును. కావున జ్ఞానమును బొందవలయునేని మనస్సును పరిశుద్ధముచేసి దానిలోనుండు వానిం దెలిసికొనవలసినది యావశ్యకము. మనుష్యునియొక్క మనస్సే లోకమునగల సకలపుస్తకములచే నిండియుండు తావు. దానిని దీర్ఘముగఁ బరీక్షించి యెఱుగుట వదలి నిష్ప్రయోజనముగ బయటనుండు పుస్తకముల మాత్రము చదివి ఫలమేమి? అయితే జ్ఞానమును బొందుటకుపాధ్యాయులును పుస్తకమును ఒకవిధ సాధనములనుట కభ్యంతరములేదు. మనస్సులోనుండు జ్ఞానమును బొందుట కీలోకము మంచిసందర్భముగ (అనగా) కారణముగనున్నది. ఇందుల కొకదృష్టాంతముకలదు. ఒకఁడు బీదవాఁడుగానున్నాఁడు. వానివద్దకు మఱియొకఁడు పోయి 'ఓరీ నీతండ్రి మిగుల ధనికుఁడుగ నుండెను. ఆయన ధనమంతయు నేమాయెను? నీయింటి దొడ్డియందు దాచియుండును. నీవు చక్కఁగాఁ ద్రవ్వి చూడుమనెను. అలాగే వాఁడు త్రవ్విచూచి ధనమును కనుగొనెను. అటువలెనే మనుష్యుఁడు తనమనస్సుననుండు జ్ఞానమును లోకమను నొకకారణముచేఁ గనుఁగొనుచున్నాఁడు. చెట్టుననుండి యాకులుపడినవి. అవియేల క్రిందపడెనని ఒకబుద్ధిశాలి యోచించి భూమికి యాకర్షణయను శక్తిగలదని దెలిసికొనెను. మనస్సున నుదయించిన యీ జ్ఞానమునకుఁ జెట్టునుండి రాలిన యాకులు కారణముగనుండెను. కట్టెలో నిప్పు మఱిగియుండునట్లు మనుష్యుని మనస్సున జ్ఞానము మఱిగియున్నది. కట్టెనొరిసిన నగ్ని కలుగునట్లు సందర్భముగలిగినప్పుడు మనస్సుననుండు జ్ఞానము బయలుపడుచున్నది. మనలోఁ గలుగు కోపతాపములు, గుణము, అడకువ, వ్యసనము, సంతోషము అను విషయజ్ఞానములన్నియు, మనమీప్రపంచమున ననుభవించు దెబ్బలకుఁ బోటులకుఁ దగునట్లు మనమనస్సుననుండియే తోచుచున్నవి. ఈ దెబ్బలన్నియు కర్మమే. మనము మనజీవితకాలమంతయు కర్మమును చేయుచున్నాము. నేను నీతోడ మాటలాడుచున్నాను. ఇదియొకకర్మ. నీవు

వినుచున్నావు. ఇది యొకకర్మ. మనము శ్వాసము విడుచునది యొకకర్మ. మనస్సుచేతనో లేక శరీరముచేతనో చేసెడి సకలకార్యములును కర్మలే. మనముచేసెడి ప్రతికర్మయును మనమనస్సున నొకవిధమైన గుఱుతును గలుగఁజేయుచున్నది.

కొన్నికార్యము లనేక భిన్నకార్యముల సమూహము. మనము సముద్రపుగట్టున నిలిచిన నలలశబ్దమును వినుచున్నాము. అయిన నాయల లొక్కొకటిగఁజేసిన శబ్దమును మనము విననగునా? ఇటులనే ఒక్కొక కర్మపు గుఱుతును మనము చూచుటయరుదు. అయితే వానిసమూహమును జూడనగును.

ఒకమనుజుని నైజగుణ మెఱుఁగవలయునేని వాని సాధారణపనులను గమనింపవలయును. అందులకొక దృష్టాంతముఁ జూపెదము: ఈచెన్నపట్టణమున మిగుల ధనికుఁడగునొక మొదలారియుండెను. ఈయన మిగుల ధర్మిష్ఠియని వినఁబడిన యొక బీదబ్రాహ్మణుఁడొక సమయమున నీప్రభువనేకస్నేహితులతోడ మేడమీఁదఁ గూర్చుండి యుండ నేవిధముననో వాకిటికావలివాని నేమరించి లోనికింజని మేడపై నెక్కి యాచించెను. వెంటనే యాయన 10 రూపాయల నోటునాయనచేతనిచ్చి దగ్గఱనుండు భటునింజూచి, ఓరీ, బ్రాహ్మణునకుం ద్రోవఁజూపి బియ్యము మొదలగువాని నిచ్చి పంపుమని యాజ్ఞాపించెను. అచ్చటనుండువారందఱును మొదలారి ధర్మగుణముం జూచి యచ్చెరువొందిరి. ఇది యటుండనిమ్ము. బ్రాహ్మణునకేమి లభ్యపడినదని చూతము: యజమానుని యభిప్రాయమును జక్కఁగ నెఱిఁగిన భటుఁడు బ్రాహ్మణుఁడు దిగిరాగానే యాయనవద్దనుండు నోటునూడఁబెఱికికొని గొంతుపట్టి నెట్టి బయటఁద్రోసెను. మొదలారిచ్చిననోటు మఱియొకబ్రాహ్మణునకీప్రకారము దానముచేయనుపయోగించునట్లాయనపెట్టెలోపోయి చేరెను. కనుక చక్కఁగా వాడుకయైతేనేగాని యొకని నైజగుణము నెఱుఁగ సాధ్యపడదు. భగవత్కాలక్షేపము చేయునపుడు శాస్త్రజ్ఞులు వేదాంతమును మాటలాడువానింజూచి వారిని గొప్పవారని యెంచుటచే బ్రయోజనములేదు.

కాలక్షేపము ముగిసినతోడనే యాయనసడతను గమనింపవలయును. ఒక్కొక సందర్భముచే నొక్కొకమనుజుఁడు ప్రఖ్యాతినొందుచున్నాఁడు. అందుచే వానిని గొప్పవాఁడని యెంచఁదగదు. వాని సాధారణ కార్యములు గొప్పవిగనుండిన వానిని గొప్పవాఁడని చెప్ప నభ్యంతరము లేదు.

కర్మచే గుణమేర్పడుననుటను మనము మఱవరాదు. మనుజుఁడు లోకములోని సకలశక్తులను బొంది వాని నుపయోగపఱచుచున్నాఁడు. గొప్పయిండ్లను గట్టుచున్నాఁడు. నీటియావిరిచేఁ బొగయోడలను నడుపుచున్నాఁడు. అంతరిక్షశాస్త్రమునెఱిఁగి బండ్లను నడుపుచున్నాఁడు. ఇంకను యిటువంటి శక్తులను తానుపొంది యితరులకు నిచ్చుచున్నాఁడు. ఆయన చేయునప్పుడెల్ల వానిగుణము కొంచెము కొంచెముగ నేర్పడుచున్నది. లోకమున మనముచూచెడి సకల కట్టడములును కార్యములును మనుష్యుని తలంపుచేతఁగాని లేక ఇచ్ఛచేఁగాని కలిగినవియని తెలిసికొనుచున్నాము. ఇట్టి యిచ్ఛ వానిగుణముచేఁగలిగినది. గుణము కర్మచే నేర్పడినది. కావున కర్మకనుగుణముగ నిచ్ఛ గలుగుచున్నది. ప్రపంచమునందు మహాత్ములందఱు నద్భుతకార్యములను జేసి ముగించిరి. వారలు ఒకేజన్మమునఁజేసిన కర్మచే నిట్టిబలమైన యిచ్ఛయును శక్తియును పొందినవారు కారు. ఎన్నియో జన్మములుగ విడువకఁ జేయుచువచ్చిన కర్మలచే నద్భుతకార్యములను జేసి ముగించిరి. యేసుక్రీస్తు మహాచార్యుఁడై యేర్పడి యనేకుల క్రిస్తవులుగాఁ జేసినది సామాన్యమైనవిషయము కాదు. ఆయన తండ్రియగు వడ్లంగివద్దనుండి యంతసామర్థ్యము కలిగినదని యెవరైనను చెప్పుదురా? కావున నాయన పూర్వజన్మకర్మఫలముచే మతస్థాపనము చేసెననుట చక్కగాఁ బ్రసిద్ధమగుచున్నది. అటులనే బౌద్ధులయొక్క కార్యమును. కేవలము ఒక రాజకుమారుఁడనుట చేతనే బౌద్ధునకంతసామర్థ్యము కలుగలేదు. ఆయనయొక్క విశేష మనోయిచ్ఛ యనేకజన్మములయందుఁ జేసియుండిన కర్మలచేఁ గలిగినది.

కావున పైనఁజెప్పఁబడిన యద్భుతకార్యములన్నియు కర్మచేతనే నుద్భవించినవి. కష్టపడినట్టయితేనేగాని యెవడును ఒకవస్తువుంబొందఁజాలఁడు. ఇది యెప్పటికినిగల విధి. కొన్నివేళలయందు దీనిని వేఱుగఁ దలంచుచున్నాము. అయితే కడపట దీని నిజమునుఁ దెలిసికొందము. మనుష్యుఁడు తాను ధనికుఁడుకావలయునని సర్వవిధములచేతను మిగులఁ గష్టపడి ప్రయత్నముచేయుచున్నాఁడు. మనము మన శరీరసౌఖ్యమునకుగాను ఎన్నియో వస్తువులను సంపాదించుచున్నాము. తుదకు ఎంతమట్టునకు మనమనుభవింపవలసిన ప్రాప్తియో యంతమట్టునకే యనుభవింతుము. ఒకఁడు గొప్పయింటిని కట్టుకొనుచున్నాఁడు. ఆకస్మికముగ మృతినొందుచున్నాఁడు. కట్టినయింటిని యనుభవించుటకు లేక మృతినొందుచున్నాఁడుకదా? ఒకడు పెద్ద పుస్తకశాలనొకటి యేర్పఱచికొని యందు వేలువేలుగాఁబుస్తకముల నుంచిపెట్టుచున్నాఁడు. అమూఘునికి కొన్నిపుస్తకములు మాత్రమే చదువునంతటి భాగ్యముకలదు. అట్టిభాగ్యము కలుగుట కర్మచేతనేగాని వేఱుకాదు. మనమిట్టిదాని ననుభవింపవచ్చునని మనకర్మ నిర్ణయించుచున్నది. మనముండుస్థితికి మనమే కారణము. రాబోవు జన్మమున మనమెట్లు కావలయునని దలంచెదమో యట్లగుటకు మన చేతనగును. ఇప్పుడుండుస్థితి పూర్వజన్మవాసనచేఁగలిగినదని చెప్పగా రాబోవు జన్మస్థితి యీజన్మకర్మచేఁ గలుగుననుట కభ్యంతరమేమి? కావున మనము కర్మఁజేయవలసిన విధి కలిగియున్నాము. కర్మ నీ ప్రకారము చేయవలయునని యేలఁ దెలిసికొనవలయును? ఒక్కొకఁడు నొక్కొకకార్యము చేయుచున్నాఁడు. అది చాలదాయనిన చాలదనియే చెప్పవలయును. నిష్ప్రయోజనకార్యములఁ జేయుటచే వృథా ప్రయాసయేగాని తగుఫలము లభించుటలేదు. సకలకర్మలను మనోశక్తిని వృద్ధిపఱచి దానిమూలముగ నాత్మను కనుఁగొనునట్లుండవలయును.

మనుష్యుఁడు పలువిధములగు నభిప్రాయములతో కర్మచేయుచున్నాఁడు. ఉద్దేశ్యములేక కార్యము కలుగనేరదు. కొందఱు

ప్రఖ్యాతి నొందఁగోరుచున్నారు. కొందఱు ధనమార్జింపఁ గోరుదురు. కొందఱికి అధికారమునందాశ. కొందఱికి స్వర్గము లభ్యపడవలయునని యాశకలదు. అందులకై కర్మ చేయుదురు. కొందఱు వృత్తి నొందిన పిదప తమపేరుండవలయునని మిగుల ప్రయాసపడుదురు. ఇట్లే యొక్కొకరు నొక్కొక మంచి నుద్దేశించి కర్మను చేయుచున్నారు. కర్మను కర్మకొఱకే చేయుము. కొందఱికి పేరును ప్రఖ్యాతియు నావశ్యములేదు. మంచిచేయుటచే మంచిదియని తోఁచుటవలన వారు మంచి కర్మను చేయుదురు. ప్రఖ్యాతిఁ బొందవలయునని చేసెడి ప్రయత్నములన్నియు విఫలములైనను అంత్యదశయందుఁ గొంచెము ప్రఖ్యాతికలుగును. స్వప్రయోజనమును విడనాడి కర్మను చేయువారలకు సత్వరలో మహిమకలుగును. వారిపై ప్రపంచమునకంతయు ప్రీతికలుగును. అట్టివారల కాత్మజ్ఞానము సులభముగ లభ్యమగును. స్వప్రయోజనము నాపుటయే సామర్థ్యము. నాలుగు గుఱ్ఱములు కట్టిన బండిని మాఱినొకదానిపైఁబడునట్లు తోలుట సామర్థ్యమా? లేక పడకుండునట్లు గుఱ్ఱముల నిల్చిపట్టుట సామర్థ్యమా? కోపమును పొందుట బుద్ధిశాలితనమా? దాని నడంచుట సామర్థ్యమా? మనశ్శక్తిని మనలోనే నిలుపుకొనుట మంచిదికాదో? స్వప్రయోజనమును మాని ధైర్యమునిమిత్తమునైనను లోకోపకారములైన కార్యముల నొక్కఁడు చేసినట్టయిన వాఁడు చేయఁదలంచిన యన్నికార్యములను చేసియేతీరును. మనమీప్రపంచమునే నిజమనినమ్మి సొత్తులనాశించి యనేకుల మోసబుచ్చుచున్నాము. కొంత యోర్పుతోడ యోచించినట్టయిన ఈ ప్రపంచము మిథ్యయనియు నిజమైనలోకము వేఱనియు నందులకై యీసొత్తు నావశ్యకములేదనియు నితరులను మోసముచేయకుండుటయే యీప్రపంచమును చేయుమార్గమనియుఁ దెలియుచున్నాము. అయ్యో! మనుష్యుల కంతటియోర్పును బుద్ధియు లేకపోయెనే.

కర్మముచేయ మనము బద్ధులమై యుంటున్నాము. దానిఫలమనుభవింప బాధ్యపడలేము. ఫలమును ప్రకటింపఁగూడదు. దానిని

గమనింపగూడదు. ఒకని కుపకారము చేయునపుడు వాఁడు మనకు ప్రత్యుపకారము చేయునాయని యోచింపఁదగదు. అట్లు యోచించిచేయు నుపకార మొకవిధవ్యాపారమేగాని యుపకారము కానేరదు. దేనినైనను గొప్పకార్యము చేయువాఁడు దాని ప్రయోజనమున కాసపడఁగూడదు.

కర్మ మెట్లుండవలయుననునది యొక ప్రశ్న. ఎప్పుడును మనము కర్మను చేయుచునే యుండవలయును. ఒక నిమిషమైన నూరకుండఁగూడదు. అట్టియైన యకర్మము (పనిచేయకుండుట) యొక్క యుద్దేశ్యమేమి? అన్నిటింబోనడచి యేకార్యమును లేకయుండుట మంచిదేనా? లేక యెప్పుడును కర్మచేయుచునే యుండుట మంచిదా? ఈరెంటిని వేలువేలుగాఁ బరీక్షించిన నొక్కటియు మంచిది కానేరదు. మూఢుఁడుగనుండువాఁడు సర్వసంగపరిత్యాగము చేసితినని చెప్పుకొనుచు నూరకుండిన చావవలసినదేను. సముద్రమునసుండు మత్స్యము గట్టునకువచ్చిన మృతినొందును. అటులనే ప్రపంచమునఁ గష్టపడి తిరిగిన మూఢుఁడు దానిని వదలిన పాపముఁబొందును. ఇటులనే యరణ్యములలోని యేకాంతవాసులను లోకములోనికిం గొనివచ్చిన నొక నిమిషమునఁ జెడి నశింతురు. ప్రపంచమున నెప్పుడును కష్టపడి తిరుగువారిని యేకాంతమగు నొకతావున వసించునట్లు చేసిన వెంటనే మృతినొందుదురు. జ్ఞానియగువాఁడు కర్మయందకర్మను, అకర్మయందు కర్మను చేయును. జనకమహారాజు సకలైశ్వర్యములతోఁడ రాజ్యభారము జేసినను, ఆ యైశ్వర్యములఁ గొంతయైనఁ జింతింపక భగవద్భక్తిపరాయణుండైయుండెను. మానులగు యోగులు చూచుట కూరకుండినట్లగపడినను ఒకనిమిషముకూడ వ్యర్థము కాకుండునట్లు ఈశ్వరధ్యానమునే చేయుచున్నారు. ఇదియే కర్మయోగపు మహిమ. దీనిం బొందినవాఁడే కర్మయొక్క రహస్యము నెఱిఁగినవాఁడగును. ఆరంభమున నొకకార్యము నుద్దేశించి కర్మలను చేసి పిదప క్రమక్రమముగ స్వప్రయోజనమునే కోరుటను

వదలి ఫలమును కోరక కర్మను చేసితిమేని తుదకు భగవంతుని పరమ కారుణ్యముచే జ్ఞానముం బొందుదుము.

గార్హస్థ్యము—సన్న్యాసము.

మనుష్యులకు సాత్విక, రాజస, తామసగుణములను మూఁడు గలవు. కొన్ని సమయములయందు మనము తావువదలి కదలక కూర్చుండునట్లు యోచనయుఁ జేయక సోమరులుగ నుంటున్నాము. ఇది తామసగుణలక్షణము. కొన్ని సమయములయందు మనకు మిగులఁ జురుకుదనమును హోరమును గలుగుచున్నవి. ఇదియే రాజసగుణ స్వభావము. మఱికొన్నివేళల సోమరితనమును చురుకుదనమును లేక నిదానముగఁ గార్యములను చేసెదము. ఇదియే సాత్వికగుణ లక్షణము. కొందఱికి పైన చెప్పఁబడిన గుణత్రయమున నేదైన నొకటి యధికముగనుండును. సోమరితనముగానుండుట యొకని స్వభావము. మఱియొకని స్వభావము చురుకుగానుండుట. మఱియొకనియందు శాంతము నిదానము అనునవి కార్యాకార్య వ్యవహారములచేఁ గలుగుచున్నవి. ఈలోకమునందుండు సర్వప్రాణులయందు నిట్టి గుణత్రయమున నేదియో యొకటి యెక్కువగ నుండుటను మనము చూచుచున్నాము.

పైఁజెప్పఁబడిన గుణత్రయమును గుఱించి కర్మయోగమున ప్రస్తావింపఁబడెను. పైజెప్పఁబడిన గుణము లేమహిమగలవియనియు వానిని మనమెట్లుపయోగింపవలయుననియుఁ దెలిసికొనుట యావశ్యకము. మనుష్యులు దేశదేశములుగా వేఱువేఱాచారముల ననుష్ఠించుచున్నారు. ఒకదేశపువారలకు మంచియని తోఁచువిషయము మఱియొకదేశమునకు గీడుగఁదోఁచును. ఇందులకు దృష్టాంతముగ బంగాళాదేశపు బ్రాహ్మణులు మత్స్యమాంసాదులను భుజించుచున్నారు. వారలట్టుల భుజింపనియెడల శక్తియొక్క కృపనుఁ బొందఁజాలరట. పైన చెప్పఁబడిన బ్రాహ్మణులు దక్షిణదేశపు బ్రాహ్మణులఁ జూచిన పరిహాసముచేయుదురు. శ్రీకృష్ణమూర్తిని మనదేశస్థులొక

రూపముగను, ఉత్తరదేశస్థులు మఱియొక రూపముగను వ్రాయుచున్నారు. మనవార లుత్తరదేశపు కృష్ణవిగ్రహమును చూచిన నిదియేమి గుజ్జపువానివలెనున్న దేయనుదురు. ఐరోపీయులు పశువధ పాపము కాదనుకొను. హిందువులు దానిని మహాపాతకములలో నొకటిగఁ దలచుచున్నారు. కావున నొక మనుష్యుఁడు మంచికార్యమిట్టిదియనియు చెడుకార్యమిట్టిదియనియుఁ బరిశోధించుట ప్రయాస. మన యాచారములంబట్టి యితరుల యాచారముల నంగీకారములని చెప్పుట తప్పు.

ఆచార్యులందఱు నోర్పుతోడ నుండవలయునని బోధించుచున్నారు. ఎవఁడుగాని నీ కుడిదవడపైఁగొట్టిన నీవు వానిపయిం గినియక నీ యెడమదవడపైఁ గొట్టుమని వానిం బ్రార్థించుమని యోర్పును గుఱించి యనేకులాచార్యులు విశేషముగఁ జెప్పుచున్నారు. చెడు కార్యములు చేయువారి విషయమై యోర్పును చూపుటయే న్యాయమని పెద్దలు చెప్పుచుందురు. ఇట్టి యభిప్రాయమును మన మొకనను సరించితిమేని ప్రపంచమున కట్టుబాటు చెడును. దుష్టులందరును మనసొత్తులఁ దీసికొని మనలం దఱుముదురు. ఇట్టియోర్పును మన మొక దినమున ననుష్ఠించిన ననర్థముకలుగును. ముందొకప్పుడు తిరువళ్లువర్ నాయనార్ అనువారియోర్పును పరిశోధింపఁదలచి యొక బాలుఁడు వారిచెంతకువచ్చి వారిచే నేయఁబడిన నాలుగుమూర గుడ్డను దీసికొని ‘ఇదియేమి ధర’ యని యడిగెను. వారు నాలుగు రూకలనిరి. వెంటనే బాలుఁడాగుడ్డను రెండుగా చించి యొకతుండు వెలయెంత యనెను. నాయనారు రెండు రూకలనిరి. మఱల నా బాలుఁడు రెంటిలో నొక గుడ్డను మరల రెండుగాఁ జించి యందొకదానిం జూపి దానివెల యెంతయనెను. వారు ఓర్పుతోడ దీనివెల ఒక రూకయనిరి. బాలుఁడు వారి యోర్పునుజూచి యింటికిఁబోక నాయనారు భార్య నూత జలమును చేదుచుండగా నిష్కారణముగ నామెను కలహమున కీడ్చి దూషించెను. దీనింజూచి నాయనారు పఱుగెత్తివచ్చి యాబాలునిం జక్కగా మర్దించిరి. వెంటనే యాబాలుఁడు

"అయ్యా తిరువళ్లువర్ నాయనారే, మీరు వ్రాసిన నీతివాక్యము లితరులకేగాని మీకుపయోగములేదు కాబోలు" నని చెప్ప నాయనారు "ఓరీమూఢుడా మనుజుఁడు అన్నిటియందు నోర్పుతోడనుండుట మూఢతనము. చేయవలసినకార్యములను చేయక తప్పించువాఁడు పాపికదా"? యనెను. అటులనే యనేకు లేకార్యముం జేయక వట్టి సోమరులై తమ్ము సాధువులనిమాత్రము చెప్పుకొనుచు తిరుగుట బుద్ధిహీనతయే. ఒకఁడు మనలను కొట్టునట్లు భావించుదము. వాఁడు బలవంతుఁడుగను మనము బలహీనులముగనుండుటచే వానిచే దెబ్బలుపడి వానిందండింప మార్గములేక యూరకుంటున్నాము. ఎవఁడుగాని మనల నూరకేల నుండవలయునని యడిగిన మనము సాధువులము, మనకు నోర్పే భూషణము, అందుచే నోరుపుతోడ నుంటిమియని చెప్పుకొనుట తప్పు. అట్లయిన నిజముగ మనము బలశాలులమైయుండి యోరిమిన నూరకుంటిమేని యోర్పుతోడనుండినటులనే యేర్పడును. బీదవాఁడు తనకు బంగారునగలపై యాశలేదని చెప్పుకొనినవాఁడు ఆశ వదలినట్లు తలంపఁబడునా? ఒకనాఁడును అటులఁదలపఁబడఁడు. ముందు భారతయుద్ధము జరిగినప్పుడు భీష్మద్రోణ కృపాచార్యులాదిగాగల పెద్దలను బంధువులను యుద్ధరంగమునఁ జూచిన యర్జునుఁడు బంధుప్రీతిచే వారింజంపనొల్లక రథమునమూరకఁ గూర్చుండెను. శ్రీకృష్ణమూర్తి యర్జునినిఁ పైఁగినిసి క్షత్రియధర్మమును విడనాడ మేరగాదనియు కేవలము శత్రులంజూచి యొకవిధ విశ్వాసముచేతనో లేక భయముచేతనో యుద్ధముచేయ కూరకుండుట క్షత్రియధర్మమునకు విరోధమనియు నిట్లు కర్మలోభియగుట దోషమనియు వచించిరి. కావున మనము చేయవలసిన కార్యములను చేయక వదలుట మిగులపాపమగుచున్నవి. ఎవఁడు తనపై తానే యసహ్యపడుచున్నాఁడో తాను పాపియని భావించుచున్నాఁడో వానివంటి మూఢుఁడులేడు. మన శరీరము, కర్మ ఈ రెండే మనము ముక్తినిబడయుటకుఁదగు సాధనములు. మనము చేయవలసిన మొదటిపని మనపై మనమసహ్యపడకుండుటయే. మనపై మనకు నమ్మకమును

విశ్వాసమును లేనియెడల మనము కడతేఱుటెట్లు? తనవిషయమై నమ్మకములేనివానికి దేవునివిషయమైకూడ నమ్మకముండదు. ఆయా స్థితికిఁ దగినట్లు మన ధర్మమును మంచిసడతయును మాఱుచున్నవను టను మనమెఱుఁగవలయును. తన్నెదిర్చినవానిం జంపునంతటి సామర్థ్యముగలవాఁడూరకుండుట పుణ్యమగును. తన్నెదిర్చినవానిని తన బలహీనతచేతను అధైర్యముచేతను తానెదుర్కొనకుండుట పాపమగును. మనము ముక్తినిఁబడయుగోరితిమేని జన్మాంతరము, వేదము, ఈశ్వరారాధన, వర్ణాశ్రమధర్మము వీనివిషయమై మనకు విశ్వాసము గలిగియుండవలయును.

జన్మాంతరమననేమి? మనయాత్మ వసించెడి యీశరీరమును ధరించుటకుమునుపు వేఱుశరీరములను ధరించియుండినదియు, ఇకను మృతినొందినపిదపఁ గ్రొత్తశరీరమును ధరింపఁబోవునదియునే జన్మాంతరమనఁబడును. అనగా ముందుజన్మము రాబోవు జన్మము అను వ్యవహారములు జన్మాంతరమనఁబడును. ఈ జన్మాంతర సిద్ధాంతమును క్రైస్తవులొప్పుకొనరు. వారికి పూర్వముండిన యూదులొప్పుకొని యున్నారు. ఈసిద్ధాంతమును దేశాంతరులు చక్కఁగాఁ బరిశీలించిన వారుకారు. మనవారు జన్మాంతరము, దేవతాభక్తి వీనివిషయమై విశ్వాసముగలవారు కొందఱు జన్మాంతరమనుమాటకు విపరీతార్థము చేయుదురు. తండ్రికి బిడ్డకలుగుట జన్మాంతరమందురు. ఇది యపార్థము. కొందఱాంగ్లేయశాస్త్రిలు కోతివలన మనుష్యుఁడు కలిగెనని చెప్పుదురు. బల్లి, పాము, ఉడుము, మొసలి యివియన్నియు నొకజాతిప్రాణులనియు నిట్టిదమునే కోతియు మనుష్యుఁడును నొకజాతివారనియు చెప్పుదురు. ఇవియన్నియు సర్వాబద్ధములు. మన యాత్మ శరీరమునందు మఱిగియున్నది. ఈశరీరము జీర్ణించిపోయిన నది మఱియొకశరీరమునుఁ బొందును. ఈప్రకార మొక్కొకజన్మమున శరీరమునువదలుటయు మరల పొందుటయుగానుండు నాత్మ ప శరీరమునుగాని నిలుకడలేక పొందవచ్చును. అప్పుడే ముక్తియనునది కలుగును. ఇట్టిముక్తి నొంద జ్ఞానమావశ్యకము. జన్మాంతరము కలిగి

యుండున ట్లివరుచూచిరి యని చెప్పెడివారు తమవీపును తాము చూచుచున్నారా? వారు తమవీపును తాము చూడనేరకుండియు వీపు అనునది యొకటికలదనిమాత్ర మొప్పుకొనుచున్నారుకదా? ఇటులనే జన్మాంతరముకలదని నమ్మవలసినది యవశ్యమే. జీవుఁడును, శరీరమును గలవని యెల్లమతస్థులు నొప్పుకొనుచున్నారు. సద్వంశమున జన్మించిన యొకబాలుఁడు తనబాల్యము మొదలు దొంగతనమునసే బుద్ధిని వినియోగించుచున్నాఁడు. వీనికి దొంగతనము నేర్పిన దెవ్వరు? జన్మాంతరకర్మమేగాని వేఱుకాదు. ముందుజన్మమున నెచ్చటనైనను కన్నమువేయునప్పుడు పాముకాటుచేఁ జచ్చియుండవచ్చును. ఆకర్మశేషముచేత పుట్టునప్పుడే దొంగవ్యాపారముతోఁ బుట్టుచున్నాఁడు. మఱికొంద అయోగ్యవంశమందుఁ జనియించి బాల్యముమొదలు సత్కార్యములం జేయుచువచ్చుచున్నారు. ఈ గుణము వారల జననీజనకులవద్దనుండి వచ్చినదికాదు. కావున పూర్వజన్మకర్మ విశేషముచే నీసుగుణములు తోఁచుచున్నవి. సుశీలుఁడగు బ్రాహ్మణవంశమునందుఁ బుట్టియు ననాచారులై పంచమునియింట భోజనముచేయువారు పూర్వజన్మమున మాలలై యుండినవారని తలంచవచ్చును. ఒకఁడు మృతినొందినపిదప వానిశరీరమును ప్రత్యక్షముగఁ జూచుచునే అయ్యోపాపము మృతినొందెనని యందురు. ఇచ్చట మృతినొందెననుట యెవరిని సూచింపుచున్నది? మృతినొందినవాని యాత్మనుకదా. ఆత్మ చచ్చునో? ఎప్పుడును చావదు. కావున నిచ్చట చచ్చెననుదానియర్థము ఆత్మ దేహమును వదలినదనుటయే గాని వేఱుకాదు. ముందు సంయోగము కలిగియుండినట్టయితేనే గాని యిప్పుడు వియోగము కలుగనేరదు. ఆత్మయు దేహము నెప్పుడొక్కటిగఁజేరినవి? కొందఱు మనుష్యుఁడు బిడ్డగాఁబుట్టగానే ఆత్మ దేహమునఁ బ్రవేశించుచున్నదందురు. వీరలకింతయే తెలియును. వైద్యులనడిగినట్టయిన వారలు బిడ్డగర్భమున నుత్పత్తియగునప్పుడే ఆత్మయు శరీరమును ఉత్పత్తియయినవియని చెప్పుదురు. ఈయాత్మ యెచ్చటినుండివచ్చినదని యొకప్రశ్న. ఈప్రశ్నను యోచించిచూచిన

జన్మాంతరము కలదని యేర్పడుచున్నది. చిన్నవిత్తనము నొకదాని నొకభూమియందు నాటుచున్నాము. అది గొప్పవృక్షమగుచున్నది. అందుండి ఫలము కలుగుచున్నది. ఆఫలమునందుండు విత్తనములచే మరల వృక్షమగుచున్నది. ఆదియందు విత్తనమువలన వృక్షముకలిగినదా లేక వృక్షమునుండి విత్తనముకలిగినదా యనిన దానిం గనుంగొన నొకరిచేతనుకాదు. అటులనే జీవుఁడెప్పు డుత్పత్తియాయెనని యడిగినట్టయిన దానియుత్పత్తికాలమును జెప్ప నెవరికైనను శక్యమా? ఒకప్పుడును చెప్పసాధ్యపడదు. ఆత్మ సకలప్రాణులయందును అంతర్యామిగనున్నాఁడు. కొన్నిచెట్లను అడుగంట నఱికిన పెరుగక గడుసుపోవును. కొన్నిచెట్లు చివరననఱికిన గడుసుపోఅక మరల చిగురించును. టెంకాయచెట్టును చివరన నఱికిన అంతటితో నుపయోగములేకపోవును. ఇదియంతయు వానిలోనుండు జీవస్థానముల నెఱిగి ఛేదింపనందున గలిగిన విపరీతములు. మఱ్ఱి విత్తనము మిగుల చిన్నది. అందుండి గొప్పవృక్షముద్భవిల్లుట నెల్లజనము ప్రత్యక్షముగనే జూచుచున్నారము. కావున వృక్షముఁ బెరుగుటకు కారణమగు జీవుఁడు మిగుల చిన్నదియగు దానివిత్తనమునందుకదా ఉన్నది. చింతవిత్తనమును నాటుచున్నాము. అది మొలచుచున్నది. ఆవిత్తనము రెండుభాగములుగ చీలి మధ్యనుండి యొక్కమొలక బయలు దేరుచున్నది. ఆకాలమున నావిత్తనముయొక్క రెండుచీలికలను మనము విఱిచినప్పటికిన్ని బాధకములేదు. ఆమొలక పెద్దదయి చెట్టుగాఁ బెరుగుచున్నది. కావున చింతచెట్టునకు కారణమగు జీవుఁడు చింతవిత్తున నెచ్చటనో యుండునట్లుగదా యేర్పడుచున్నది. ఇటులనే సకలప్రాణులలోనుండు జీవుఁడు అణువుకన్ననణువుగా నేదియో యొకస్థలమున నుంటున్నాఁడనియు, అది తనకనుకూలమగు వస్తువుల నాకర్షించి శరీరపోషణను కలుగఁజేయుచున్నదనియుఁ దెలిసికొనుచున్నాము. మంచిభూమియందు వడ్లను విత్తిన పైరు తలగట్టి యెదుగుచున్నది. బీడుభూమియందు వృద్ధియగుటలేదు. ఏల? సత్క్షేత్రమందు వేసిన విత్తనము తనకనుకూలమగు వస్తువులధికముగనుండు క్షేత్ర

మున విత్తఁబడుటచే వాని నాకర్షించి పైరునకు బలమిచ్చుచున్నది. బీడుభూమియందు విత్తనమునకనుకూలమగు వస్తువులు లేవు. కావున నచ్చో పైరు వృద్ధియగుట లేదు. విత్తనములను కాల్చిన వానికి మొలచుగుణము లేకపోవును. అటువలెనే మనజీవుని తపస్సనెడి యగ్నిచే దహించిన మఱుజన్మము కలుగనేఱదు. కొందఱు జన్మాంతరమున్న దనిన నేదియో గతజన్మమున మీరుచేసిన కార్యములలో నొకటిని చెప్పుడని యడుగుదురు. అది యెట్లు సాధ్యమగునని ప్రశ్నయడుగు వారు గమనించుటలేదు. అట్టివారిని "నీవు నేటిదినము భోజనము చేసితివే యెన్నిమాఱులన్నమును నోటవేసికొంటివి?" యని యడిగిన బదులు చెప్పఁదెలియక మిఃణకరింతురు. నేటిదినము జరిగిన సంగతిని మనము మఱవఁగూడిన స్థితిలోనుండునప్పుడు గతజన్మము నఁజేసిన కార్యములనెట్లు జ్ఞాపకమునసుంచుకొనసాధ్యపడును? అయి నను ఒకటిరెండు విషయములను ఇందు బొందుపఱచుచున్నాము. ఒకపశువు దూడనీనినతోడనే యాదూడ పశువుయొక్క పొదుగునందు నోరునంచి పాలను గ్రోలుచున్నది. ఇట్లు చేయుమని యాదూడకు నేర్పినదెవ్వరు? దీనిని మఱచినప్పటికిని ఆహారమును మఱచువా డుక యేప్రాణికిని లేదు. మన చిన్నప్రాయమున నెవరియింటియందైన నను దివ్యమైన పచ్చడి చేయఁబడియుండి దానిని మనము భుజించి యుండినట్టయిన దచ్చినందునుక నాపచ్చడి జ్ఞాపకము మనలవదలుట లేదు. పంచేంద్రియములలో నాలుకయు, చెవియు, జన్మాంతరమున ననుభవించిన సుఖముల నీజన్మమున మఱచుటలేదు. కుక్కపిల్లలు కన్నులుమూసికొని పాలు ద్రాగుచున్నవి. పెద్దపామనియు అది విషముగలదనియు తెలియని లేఁబ్రాయమునఁగూడ తల్లి చనుబాలను తెలిసికొనుచున్నాము. చిన్నబిడ్డలు సంగీతములనువిని యానందించి యుప్పొంగి నిద్రబోవుచున్నారు. ఇవియన్నియు జన్మాంతరయనుభవ మును సూచించుచున్నవి. కావున నార్యులకు జన్మాంతరముకలదను నమ్మకముకలదు. ఈవిషయమై ముందొకప్పుడొక హిందూప్రసంగి కిని క్రీస్తుపాదరికిని జరిగిన సంభాషణ నిచ్చట నుదహరించెదము.

పాదిరి:—“పూర్వీక హిందువులును ప్రకృతపు క్రీస్తువులును జన్మాంత రము లేదనుచున్నారు. కావున వారలు బుద్ధిశాలులు. ప్రకృతపు హిందువులును పూర్వీక క్రీస్తువులును జన్మాంతరముకలదని నమ్ముచు న్నారు. కావున వారలు బుద్ధిహీనులు” అని చెప్పెను. అందులకు హిందూప్రసంగి:—“జన్మాంతరము లేదని చెప్పువారిని బుద్ధిశాలులని భావించెదము. మీరలు చెప్పినట్టుగానే ఒకనియొక్క తల్లి వ్యభిచారము చేసినది. మఱియొకనిభార్యయు వ్యభిచరించినది. వీరిఉభయులలో నెవఁడు సిగ్గుచెడి బయటికివచ్చును? వ్యభిచరించిన తల్లినిగలవాఁడూరికుం డిన లోకములోనివారలు వానిని “వ్యభిచారిబిడ్డయయినందుననే బయట తలపెట్టుటలేదు, ఇంటిలోపలనే పడియున్నాడు” అనుదురు. వాఁడు బయటవచ్చిన ‘ఓరీ, కొంచెమైనను మానములేక వ్యభిచారి కనిన బిడ్డ బయటవచ్చినాఁడు’ అని చెప్పుదురు. ఏవిధమునైనను వ్యభిచరించిన తల్లిని గలిగినవాని పని కష్టమగుచున్నది. భార్య వ్యభి చరించినట్టయిన వెంటనే దానిని విసర్జించి మఱియొకతెను పెండ్లి చేసికొనవచ్చును. అప్పుడు భార్య దుష్టురాలైనదిగనుక దానిని నిరాకరించి మఱియొక మంచిభార్యను వివాహముచేసికొనియెనని శ్లాఘింతురు. అటులనే మాపూర్వీకులందఱును బుద్ధిశాలులని మీరే యొప్పుకొంటిరి. అందువలనఁ బుద్ధిశాలులైనవారికి పుత్రుఁడై జన్మిం చిన నేము బుద్ధిశాలులు కావచ్చును. మీపూర్వీకులను మూఢులని మీరేచెప్పితిరి. అందుచే మూఢులకు జన్మించిన మీరలు జ్ఞానులెట్లగుదురు? నీ జనకుఁడు తెలివిలేనివాఁడు, నాతండ్రి బుద్ధిశాలియని యేర్పడుచున్నది. కావున నెట్టయినను నేను గౌరవముగలవాఁడననియు, మీరు బయటికివచ్చియు యోగ్యతలేని యగౌరవస్థులనియు స్పష్టమగుచున్నది” అనిరి. పాదిరి సిగ్గుపడి ప్రత్యుత్తరము చెప్పలేకపోయెను. కావున జన్మాంతరములేదని చెప్పుట బుద్ధిహీనతచేతనేగాని వేఱు కాదు. జన్మాంతరము కలదని నమ్మినట్టయితేనే మనకు ముక్తికలుగును. జన్మాంతర విశ్వాసములేనివారులకు మోక్షమబ్బదు.

నీమనస్సునకును దేహమునకును చెడుగును గలుగఁజేయఁగూ

డిన కార్యములను నీవు వర్జింపవలసినది యావశ్యకము. "ఎవరితోడను విరోధించకుము. ఏమిహాని సంభవించిన నోర్పుతోనుండుము" అని బుద్ధిచెప్ప నందఱికిని సులభము. జనుల్లయపవాదభీతిచే నోర్పుతోనుండఁ గూడునేగాని మనయంతఃకరణమున మనము పడు నవస్థ మనకేకదా తెలియును. ద్రవ్యము విషమని లోకులు వినునట్లు చెప్పుదురు. అట్లు చెప్పునప్పుడంతయు ద్రవ్యమార్జింపవలయునని యెడియాశ నీకు మిగులఁగలిగియుండును. కావున మొదట నైహిక సుఖంబుల ననుభవించినట్టయిన పిదప వానియందసహ్యము దోచును (అందలి విరక్తిఁ జెందుదువు). అన్ని యనుభవముల, ననుభవించి నంతట, నవి తుచ్ఛభోగములన్ని నీకు దెలివి గలుగును. ప్రపంచసృష్టి మొద లనేకదినములుగ ననేకులు "ఆశలన్నింటిని వర్జింపవలయును" అని వాడుకగాఁ బ్రసంగించుచుందురు. అట్టయిన నాప్రకారమాశలను వదలినవారు కొందఱే.

ఒక్కొకఁడును వానివానికిఁదగినట్లు దేవేని నొకకర్మను చేయవలయును. ఒకఁడు చేయునట్లు తానునుచేయఁ దృఢీకరించుట తప్పు. వాఁడు వాఁడు ప్రత్యేకముగ నొక్కొకమార్గము ననుసరింపవలయును. రేగుచెట్టు స్వభావమును తాటిచెట్టు స్వభావమునకుఁ బోల్చి దెలియఁగూడనట్లొక జాతివారి యాచారములును మఱియొకజాతి యాచారములకుఁ బోల్చి పరిశీలనఁజేయఁ దగదు. హిందువులలో బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములని నాలుగాశ్రమములు గలవు. అందొక్కొక యాశ్రమమునందుండువారికిని యాయా యాశ్రమమునకుందగిన ధర్మములు గలవు. ఈ యాశ్రమములయందొక్కొకటియు మఱియొకటికన్నను ఎక్కుడని తలవఁదగదు. ఒక్కొకటియు క్రమప్రకార మనుష్ఠింపఁబడినట్టయిన ఘనమైనదనియే చెప్పనగును.

గృహస్థుఁ డెప్పుడు నీశ్వరప్రీతిగానే సకలకార్యములను చేయవలయును. బ్రహ్మజ్ఞానముఁ బడయ వలయుననుటయే వానిముఖ్యోద్దేశముగ నుండవలయును. వాఁడెప్పుడును తనకు విధింపఁబడి

యుండు కర్మలనొసర్చి యన్నింటిని యీశ్వరార్పణము చేయుట యావశ్యకము.

ఈ ప్రపంచమున నొకకార్యముచేసి దానిఫలమపేక్షింపకుండుట యసాధ్యము కదా? ఒకనికి సహాయముచేసి వానివద్దనుండి ప్రత్యుపకారమపేక్షింపకుండుట యాశ్చర్యము కదా? ఏదేని నొక సత్కార్యమునుచేసి యందువలనఁ బ్రతిఫలము నపేక్షింపకుండుట యసాధ్యము కదా?

గృహస్థుఁడు సదా ద్రవ్యము నార్జింపవలయును. అయితే యసత్యము, మోసము, చౌర్యము మొదలగునవిచేసి ద్రవ్యమార్జింపఁ దగదు. పరులద్రవ్యముం గొల్లఁగొనరాదు. తా నీశ్వరునికై యును బీదలకై యును సృజియింపఁబడినవాఁడను విషయమును వాఁడొకప్పుడును మఱువఁదగదు.

జననీజనకులు ప్రత్యక్షదైవములని తెలిసి గృహస్థుఁడగువాఁడెప్పుడును వారలను సప్రమతితోడం దృప్తిపఱచవలయును. తలిదండ్రులు తృప్తిఁ బొందినట్లయిన ఈశ్వరుఁడును తృప్తిఁ బొందుచున్నాడు. ఎవఁడు తన జననీజనకులవిషయమై కఠినోక్తు లాడకుండునో వాఁడే గుణజ్ఞుఁడు.

జననీజనకు లెదుటఁ బరిహాసోక్తులు వచింపఁదగదు. వారల విషయమై కోపమును అతురతయుఁ జూపఁదగదు. తలిదండ్రుల యెదుట పుత్రులు తలవాంచి నిలచియుండఁదగు. వారలుండునపుడు పుత్రులు వారియెదుట నిలచియుండవలయునే గాని కూర్చుండఁ దగదు.

ఏ గృహస్థుఁడు తనతల్లి, తండ్రి, భార్య, బిడ్డలు వీరలకు భోజనాదుల నొసంగక వారలాకటఁగృశించుచుండ తానుమాత్రముదరమును పూరించుకొనుచున్నాఁడో వాఁడు పాపియగును. ఈ శరీరము కలుగుటకుఁ గారణము జననీజనకులే. కావున వారల రక్షింపఁ [illegible] సకల బాధలంబొందవలయును.

ఏ గృహస్థుఁడును తనభార్యపయిం గినియఁదగదు. తల్లివలె భార్యను కాపాడుట ధర్మము. గృహస్థుఁడు తనకెట్టి యాపద సంభవించినను భార్యపయిం గినియఁ దగదు.

ఏ గృహస్థుఁడు తనభార్యను వదలి పరస్త్రీని మనసా చెడుతలంపుతోడఁ దలంచుచున్నాఁడో వాఁడు నరకమునకుఁ బోవును రహస్యముగఁ గూడ నొకఁడు పరస్త్రీని స్పృశింపఁ దగదు. పరస్త్రీ వస్త్రమును స్పృశింపఁ దగదు. ఆ స్త్రీ లేనిసమయమునఁ గూడ ఆబిడ వస్త్రమును చేతనంటఁదగదు.

స్త్రీలయెదట సయోగ్యపుమాటలాడుటయు తన ఘనతను గుఱించి చెప్పుకొనుటయుందగదు. నేను ఘనకార్యముఁ జేసితిని ఆ గొప్ప పనిని చేసితిని యని ప్రగల్భము లాడఁదగదు.

గృహస్థుఁడు తన భార్యను ద్రవ్యవస్త్రాభరణాదులచేతను, ప్రీతి విశ్వాసములచేతను తృప్తిబొందింపనగును. ఆబిడను ఎవ్విధమున నైనం గష్టపఱచఁదగదు. ఎవ్వఁడు పతివ్రతయగు తన భార్యయొక్క ప్రీతినిఁ బొందుచున్నాఁడో వాఁడు పుణ్యశాలియే యగుచున్నాఁడు.

బిడ్డలను నాలుగేండ్లవఱకును చక్కఁగాఁ బోషింపవలయును. ఐదవయేఁడు ప్రవేశింపగానే విద్యాభ్యాసము చేయవలయును. పుత్రునకు ఇరువదియేండ్లు కాగానే వానిం దనమిత్రునిగ భావింపనగును. ఇవ్విధముననే పుత్రికావిషయమై కూడ తండ్రి ప్రేమయుంచి వారలను ఇతరులకు వివాహముచేసి శక్త్యానుసారము వస్త్రాభరణముల నరణముగ నొసంగవలయును.

అందుమీఁదట సోదరులను సోదరీలను వారి బిడ్డలను గృహస్థుఁడు కాపాడవలసినది ధర్మము. పిదప బీదలగు బంధులను, మిత్రులను, సేవకులను పోషింపవలయును. అందుమీఁదటఁ దనస్వగ్రామస్థులను బోషింపవలయును. విశేషద్రవ్యము కలిగి తన బంధువులకుఁ గొంచెమేని దాని నుపయోగపఱచనివాఁడు పాపియగును. అతిథుల నుపచారము చేయుట గృహస్థుని ధర్మము.

విశేషయాహారము ఉడుపు స్వకాయప్రీతి శరీరాలంకారము తలవెండ్రుకల దువ్వుకొనుట అను నివ్విషయములయందధికయాశఁ గొనుటఁదగదు. గృహస్థుఁడు పరిశుద్ధహృదయుఁడై శుభ్రదేహియై సదాజాగరూకుఁడై పట్టుదల గలవాఁడుగ నుండఁదగును.

శత్రులకు శత్రుఁడుగనుండవలయును. వారిని యవశ్యముగ నెదిర్చి తన ధర్మమును నెఱవేర్చవలయును. ఒకమూలఁ గూర్చుండి దుఃఖించుచు నోర్పుతోడం బ్రసంగింపఁదగదు. తన శత్రులకెదుటఁ దన శౌర్యముం జూపనివాఁడు కర్మభ్రష్టుఁడగును. స్నేహిత బంధులనెడ శాంతముం గలిగియుండవలయును.

దుష్టులకు లోఁబడక వారలకు మర్యాదఁ జూపకుండుట గృహస్థునకు ముఖ్యధర్మమైయున్నది. ఏలనన దుష్టులకు లోబడినట్టయిన వారి దౌష్ట్యమునకు సాహాయ్యమగునటుల నగుచున్నది. సజ్జనులను గౌరవింపకుండుట తప్పు. తనకెదురుపడినవారందఱితోడం జెలిమిఁ జేయఁదగదు. బహుదినములవఱకు నొకనిగుణముగని పిదప వానితోడం జెలిమిగావించుట యొప్పును.

ఈదిగున నుదహరింపఁబడు మూడు విషయములను గుఱించి గృహస్థుఁడు వచింపఁదగదు. అందఱియెదుటను తాను గడనఁజేసిన ప్రఖ్యాతినిగుఱించి చెప్పుకొనుటయు తనపేరునుగుఱించిగాని తన సామర్థ్యమునుగుఱించిగాని పొగడుకొనరాదు. తనద్రవ్యమునుగుఱించియు తనతోడ నెవ్వరైనఁ జెప్పియుండిన రహస్యమునుగుఱించియైనను వెల్లడిచేయుట దోషము.

గృహస్థుఁ డేదేని తప్పుకార్య మొనర్చియుండెనేని, లేక తాఁ జేసిన ప్రయత్నము విఫలమాయెనేని యావిషయములనుగుఱించి బయట నెవ్వరితోడను వెల్లడిపఱుచఁదగదు. మనముచేసిన తప్పిదమును లోకములోనివారలతోడం జెప్పుటచే నేమిప్రయోజనము? ఆతప్పిన కార్యములను మరలఁ ద్రిప్పసాధ్యపడదు. ఒక్కొకఁడును తాఁజేసిన తప్పుకార్యమునకుఁ దగుఫలమనుభవించియే తీరవలయును. గృహస్థుఁడితరుల సహాయములేక తానే కార్యములఁ జక్కపఱచుటధర్మము.

ఒకమనుష్యుఁడు తాను బీదయనిగాని ధనికుఁడనిగాని చెప్పుకొనఁదగదు. తనవద్దనుండు ద్రవ్యమునుగుఱించి తానే గొప్పగాఁ జెప్పుకొనుట బుద్ధిహీనత. స్వబుద్ధిప్రకారము ప్రవర్తింపవలయును. అంతరంగవిషయముల నంతరంగముననే యుంచుకొనవలయునని శాస్త్రములు మొఱలిడుచున్నవి.

గృహస్థుఁడే యందఱికిని సహాయము చేయఁదగినవాఁడు. సంపాదింప సామర్థ్యముగలవాఁడు వాఁడే. బీదలు, భిక్షలు, స్త్రీలు, మొదలగునందఱును గృహస్థుని చేతనే పోషింపఁబడుచున్నారు. కావున కుటుంబియగువాఁడు కొన్ని కార్యములను చేసియే తీరవలయును. వానిం జేయుటకుఁ దగు ధైర్యము వానికి గలిగియుండవలసినది యావశ్యకము. కావున వాఁడేదేని యల్పకార్యములఁ జేసినను, ఏకార్యమునఁ దప్పిపోయినను, దానిని వెల్లడిచేయఁదగదు. ఏవ్యాపారమందైనను లాభనష్టములు కలుగునట్లుండిన నాసంగతి ఇతరులకుం జెప్పఁదగదు. చెలికానితోనైనను బీదఱికమును దెలియపఱచుకొనకుము. ప్రపంచమున సాధారణముగ దయాదాక్షిణ్యములు జయశీలురయందుఁగలవే గాని యపజయము పొందువారలవద్ద కించిత్తయిన నాగుణముండు వాడుక లేదు. (మనుజుఁడు మొదట జ్ఞానమును పిదప ద్రవ్యమును నార్జింపవలయును. వాఁడివ్విధముగ చేయఁడేని పాపియగును. ద్రవ్యమార్జింపని గృహస్థు తనపోష్యమునకుఁ గాచియుండువారలకు ద్రోహియగును.)

మనదేశమున ననేకులు ధనవంతులుండనియెడల నింతనాగరికతయు, ఇన్ని సత్రములు నెచ్చటినుండి కలుగును?

ధర్మముజేయు దలంపుతోడ ధనమార్జించుట దోషముకానేరదు. మంచిసాధనములచే ద్రవ్యమార్జించి దానిని సత్పాత్రముననుపయోగించువారు సద్గతిని పొందుదురు. వారలకును గుహాంతరంబులనేకాంతముగఁ దపమొనర్చెడివారలకును భేదమించుకయేని లేదు. ఎవ్విధంబుననైనను మంచిపేరును గడనఁజేయుట గృహస్థునకు ముఖ్య [illegible]

గృహస్థు జూదమాడుటను, దుష్టసహవాసముచేయుటను వదలి అసత్యమాడకయు నితరుల హింసింపకయు నుండవలయును.

తనచేఁగాని కార్యమునుచేయునట్లు ఉత్తరకుమారప్రజ్ఞలు పలికి జనులనేమరించు వాడుకను విడనాడవలయును. ఒకసమయమున నెఱవేఱుకార్యము మఱియొకసమయమున నెఱవేఱనేరదు.

మనుష్యుఁడెప్పుడును నిజమునే మాటలాడవలయును. జనులకు ప్రీతికరములగు మృదుభాషలాడి వారలకు మంచిచేయవలయును. తనయపారద్రవ్యమునకుప్పొంగి మదించఁగూడదు. ఇతరుల కార్యములయందునుఁ బ్రవేశింపఁదగదు.

గుంటలం ద్రవ్వుటచేతను, బాటలచాలున వృక్షములనాటించుటచేతను, మనుష్యులకు నితరప్రాణులకును, ధర్మసత్రములం గట్టుటచేతను, వారిధులు, శాలలు లోనగు నుపయోగకరములగు స్థలముల నేర్పఱచుటచేతను, మహాయోగులు పొందఁగూడిన యుత్తమపదవిని గృహస్థుఁడు పొందును.

పైనఁజెప్పఁబడిన గృహస్థధర్మములు కర్మయోగమున నొక భాగము. గృహస్థు యుద్ధభూమియందు గతించిన వీరస్వర్గమునకుఁ బోవును. తనదేశమునకైయును, మతమునకైయును శ్రమపడి ప్రాణముం గోలుపోవువాఁడు తపస్సిద్ధిగల యోగులుపొందు లోకమును బొందును. ఒకఁడు చేయవలసిన కార్యము మఱియొకఁడు చేయఁదగని కార్యముగానుండినను రెండుకార్యములఫలిత మొకటియేయని పైఁజెప్పఁబడిన న్యాయములచేత విస్పష్టమగుచున్నది. కావున గార్హస్థ్యము, సన్న్యాసము అనునవి రెండును గొప్పవియే. అగట్టుకన్నను ఈగట్టు పచ్చగానున్నదియని మేకలు తలంచుటకలదు. రెండుగట్టుల యందును పచ్చిక విశేషముగనుండియు ఆరెంటిలో నేదేని యొక గట్టున పచ్చికమేసి కడుపునింపుకొనక నవి పలుమఱు అగట్టున కీగట్టునకుం దిరుగువాడుక గలదు. అటులనే మనుష్యులు గార్హస్థ్యము

తుదకు దేనినైన ననుసరించి సుఖమునొందక యునికిచేసి యుల్లాడు దురు.

పూర్వకాలమున నొకరాజు గార్హస్థ్యము గొప్పదియా సన్న్యాసము గొప్పదియా యని ప్రశ్నయుదిగి సందేహముతీరక చింతనొందు చుండెను. తుదకు నొకసన్న్యాసి వానివద్దకురాగా ఆయనంజూచి, స్వామీ గార్హస్థ్యము గొప్పదియా సన్న్యాసము గొప్పదియా యని యడుగ నాయన క్రమముగ ననుష్ఠించిన రెండును గొప్పవియే. ఒకటికన్న మఱియొకటి తక్కువైనదికాదని బదులుచెప్పెను. దీనిని నిరూపింపవలయునని సన్న్యాసియు సరే కానిమ్మని చెప్పెను. మఱుదినమున సన్న్యాసియా రాజును తనవెంటఁబెట్టుకొని దేశాటనము చేసి తుదకు నొకనగరమునకు వచ్చిచేరెను. ఆనగరమున నాటిదినమున విశేషప్రయోజనము జరుగుచుండెను. ధ్వజములు, మకరతోరణములు మొదలగువానిచే నిండియుండెను. వీధులయందు నేకులు దివ్యాలంకృతులై నిలచియుండిరి. సన్న్యాసియు రాజును నొకతట్టునిలచి వేడుకఁజూచు చుండిరి. ఇటులనుండ నాయూరి రాజకుమారిత యెల్లఱును జూచు మనేవచ్చి తుదకు నొకబాలసన్న్యాసి కంఠమునఁ బుష్పమాల వైచెను.

తన్నాశ్రయింప నెనుఁగవచ్చు లక్ష్మిని కాలందన్ని తొలఁగు నటుల నాబాలసన్న్యాసి తనమెడనవైచిన పుష్పమాలను క్రిందఁ బాఱ వైచెను. అందఱు నాశ్చర్యపడిరి. రాజపుత్రిక యాయనపాదముల పయింబడి మ్రొక్కి తనను వివాహమాడి తనతండ్రిరాజ్యమును కైకొనునట్లు ప్రార్థించెను. సర్వాంగసుందరియై వెలుగు నాచిన్నదానిని సన్న్యాసి చూడనొల్లక ముఖముం ద్రిప్పుకొనెను. ఇదియేమియన్యాయము! రూపవతియగు చిన్నదానిని, రాజ్యమును నొల్లని దురదృష్టుఁడును కలఁడాయని యచ్చటనుండుజనులందఱు నొకరితోనొకరు చెప్పుకొనుచుండిరి. ఈ సంగతిని వినిన యాచిన్నదానితండ్రియగు యాయూరిరాజు పరుగిడివచ్చి యాయనపాదముల కెఱఁగి స్వామీ మీదాసుఁడగు నాదు కుమరితెను, రాజ్యము సంగీకరింపవలయు

వని మిగులఁ బ్రార్థించెను. సన్న్యాసియు మిగుల వగనొంది పాఱి పోవుచుండెను. రాచకుమార్తెయు నా సన్న్యాసిని వెంబడించెను. తామే నాకు నాథులు. నేను తమరిని భర్తగా వరించితిని. తమరిని వదలి యొకక్షణమైన నుండఁజాలనని రోదనము చేయుచు రాచకుమార్తె పరువులిడివచ్చుటంగని సన్న్యాసి బొత్తుగ నిర్దయుఁడై యంధకారబంధురంబగు నరణ్యములలో దూరి యెచ్చటనో యదృశ్యుం డాయెను. ఆ సన్న్యాసిని పట్టుదలతో వశపఱచుకొననలయునని వెంబడించి రాచపుత్త్రికయు నాయన పోయినమార్గముం దెలియనేరక యేమియుం దోచక నిలచెను. ఆ యరణ్యమునుండి వెలువడివచ్చుటకుం ద్రోవదెలియక యొకచెట్టుక్రిందఁ గూర్చుండి యేడ్చుచుండ గా గృహస్థ సన్న్యాసాశ్రమములలో నేది శ్రేష్ఠమైనదని తెలియంగోరిన రాజును, దానిని నిరూపింప రాజునొద్దకు వచ్చిన సన్న్యాసియు నచ్చటికి వచ్చిరి. ఆ యిరువురు నా కన్నికాశిరోమణింజూచి నీవు వెఱవకుము మాకుం ద్రోవ తెలియును. అంధకారబంధురముగ నున్నది. నేటిరాత్రి యీచెట్టుక్రిందం బరుండి యరుణోదయంబున బయలు దేరవచ్చునని చెప్పిరి. వారు పస్తుండినదానింజూచి చెట్టుపయిం గూర్చుండియుండు నొక మగపక్షియు నాడుపక్షియు తమ మూడుపిల్లలతోడ నిట్లని యోచించినవి. మగపక్షి నామనోనాయకీ యేమి చేయనగును? మనగృహంబునకు ముగ్గురు విందారగింప వచ్చియున్నవారు. వర్షాకాలముగనున్నయది. అగ్నియు దొరకదాయెనని చెప్పుచు చెట్టువదలి యెచ్చటికో యెగిరిపోయి తననోటి నొక కొఱవికట్టె నిఱికించుకొని తెచ్చి యాముప్పురుండుస్థలమున వైచెను. వారలు దానిం జిదుగులతో మంటఁ జేసిరి. అంతతోడం దృప్తినొందక మగపక్షి తనభార్యనుజూచి యేమిచేయుదము. ఈ యతిథులకు నియ్యఁదగిన యాహారవస్తువులు మనవద్దలేవు. మనము వారలకు విందొనర్చవలసినది యావశ్యకము. ఇదిగో నా శరీరము నిచ్చెదనని గిఱగిఱందిరిగి యా యగ్నియందుఁబడెను. అతిథులు ముప్పురును

గాని కొనసాగకపోయెను. ఆ మగపక్షి దానింజూచి యిదిగో యీ ము వ్వురికిని నా నాథుని శరీరము చాలదు. నేనును వారల కాహారమై నా నాథుని మనోరథమును నెఱవేర్చెదనని తాను నగ్నియందుఁ బడి ప్రాణమువదలెను. తలిదండ్రులు చేసిన కృత్యముం జూచుచుం డిన యీ పక్షిపిల్లలు మూడును తమతలిదండ్రుల యభిప్రాయము నెఱవేర్చవలసినది యావశ్యకమని యగ్నియందుఁ బడినవి. అతిథు లు ముగ్గురు నీ పక్షులం భక్షింపక వాని ధర్మచింతంజూచి యాశ్చ ర్యము నొంది నాటిరాత్రియంతయు నుపవాసముండి కాలముగడపిరి. అప్పుడా సన్న్యాసి రాజుంజూచి, రాజా! నీవు గార్హస్థ్యధర్మము ననుసరింపఁ దలంచితివేని యీ పక్షులవలె నీ శరీరమును వదలసిద్ధ పడుము. సన్న్యాసి యాశ్రమము ననుసరింపఁ దలంచితివేని రాచ కుమారితను రాజ్యమునుపేక్షించిన బాలసన్న్యాసివలె నుండుము. ఇప్పుడు గార్హస్థ్యము, సన్న్యాసము అను నీ రెండును గొప్పవియే యని తెలిసికొంటివా యనెను. రాజును సంతోషించి జ్ఞానియా యెను.

వనేపి దోషాః ప్రభవంతి రాగిణాం
గృహేపి పంచేంద్రియ నిగ్రహస్తపః ।
నకుత్సితే కర్మణి యః ప్రవర్తతే
నివృత్తరాగస్య గృహం తపోవనం ॥

తాత్పర్యము ॥ కాముకులకు అడవియందును చెడుపులు పుట్టును; ఇంటియందును ఇంద్రియములనైదింటిని లోబఱచుటయే తపస్సుగా నున్నది; ఎవఁడు ఇంద్రియములను జయించి చెడ్డకార్యములయందుఁ ప్రవేశింపకయుండునో, అట్టివానికి ఇల్లే యాశ్రమముగానున్నది.

విగ్రహారాధన.

హిందువులగు మనము విగ్రహారాధనఁ జేయుచున్నామని యితరమతస్థులు హేళనము చేయుచున్నారు. మన హిందువులలోనే కొందఱి కిట్టితెగులు గలిగియుండ నితరమతస్థులనన నేల? వారలు విగ్రహారాధన యిట్టిదియని దాని తాత్పర్యము నెఱిఁగియుండిన నవ్విధమునఁ జెప్పరు. వారుచెప్పెడి విగ్రహారాధన ప్రతిమారాధనయె కాని వేఱుకాదు. ప్రతిమారాధనయన నేమి? ఒకనిరూపమునుంబోలె నొక ప్రతిమనేర్పఱచికొని దాని నారాధించుట ప్రతిమారాధన. విగ్రహారాధన మనునది యొకస్థలముననో లేక వస్తువునందో విశేషశక్తియగు నీశ్వరస్వరూపము నారాధించుట యని యర్థము. మనలను సృష్టించి కాపాడి తన పాదారవిందములఁ జేర్చుకొనెడి పరమేశ్వరునికి మనము నెనరుఁజూపవలసినది యావశ్యకము. అట్టిగుణమునకే కృతజ్ఞతయనిపేరు. ఒక్కొకమనుజునకీ గుణముండవలసినది యావశ్యకము. అట్టియైన స్వరూపముగల మనము అరూపియగు భగవంతునివిషయమై యెవ్విధమున మన కృతజ్ఞతఁ జూపనగును? అందులకై యొకశిలనుచేసి దానిని పరిశుద్ధమగు గుడియందు స్థాపించి కుంభాభిషేకము మొదలగువానిచే నా శిలయందు భగవంతునిశక్తి నావహింపఁజేసి ఈశ్వరుఁడు సర్వవ్యాపియనుట నిజమైనను ఆయన పూర్ణశక్తిని మహామంత్రములచేతను యంత్రస్థాపనలచేతను అందు దీపింపఁజేసి యటుల బరిశుద్ధవిగ్రహమున దీప్తిఁజెందిన నీశ్వరునకు మన దేహమునర్పించుచున్నారము. కరద్వయమును ఆయనకభిషేకాదులు చేయుట కుపయోగించుచున్నారము. ఆయనకుఁబూజఁజేయఁ బుష్పముఁ దీసికొనిరాను బయటికిఁ బోవుచున్నారము. ఆ భగవంతుని పాదారవిందముల సొగసునుంగని మననేత్రములానందించుచున్నవి. మనమనస్సు ఆయనయందుఁ బ్రవేశించుచున్నది. ఆయన దివ్యకథలను గుణములను వినుటయందే మన వీనులనుపయో

గడియలపర్యంతమైనను ఈశ్వరునియందుంచి సదా అటులనే ధ్యానించు వాడుకను కలుగఁజేసికొనుచున్నారము. మన పూర్వీకులగు మహర్షులు మిగుల బుద్ధిశాలులగనుకనే వారలు మనమందఱము కడతేఱుటకై విగ్రహారాధనము నేర్పఱచిరి. విగ్రహారాధనయనునది గుడియందు ఱాతిచేతను లోహముచేతను చేయఁబడు విగ్రహములను మాత్రము నిర్దేశించుచున్నదనుట బుద్ధిహీనత. బంకమట్టి పెళ్లను తీసికొని స్వామియని పూజచేయుటయు విగ్రహారాధనయే. శివాలయమునందు శివలింగమునకు ముక్కు కన్నులు కలవా? లేవు. అదియు విగ్రహారాధనయే. సాలగ్రామములకు కన్నులును ముక్కును గలవా! లేవు. అదియు విగ్రహారాధనయే. గురువును పూజించుచున్నాము. అదియును విగ్రహారాధనయే. పరమశివుఁడు, గుడియందుండు లింగమునందును, బిల్వదళమునందును, రుద్రాక్షయందును గురువునందును వెలయుచున్నాఁడు. శివపూజా ధురంధరుఁడగు అర్జునుఁడు తనకు గీతోపదేశముచేసిన కృష్ణుని పూజించి సందేహము కలిగి కైలాసమునకుఁబోగా తానర్పనఁజేసిన పుష్పములన్నియు పరమశివుని పయింబడియుండుటను చూచి యాశ్చర్యపడెను. సర్వేశ్వరుఁడు సర్వవ్యాపకుఁడను యభిప్రాయమునందఱకును నిశ్చయముగఁ దెలియపఱచుటకై యే మనపూర్వీకులు లింగము, సాలగ్రామము, బిల్వదళము, తులసిమాల, గురువు మొదలగునన్నింటిని బూజించునట్లు చెప్పుచున్నారు. అన్యమతస్థులు "మీదేవుఁడు తామ్రమునందును ఱాతియందునుండున్నాఁడు" అని తెలివిలేక వదరుచున్నారు. మనమొకఱాతిని రెండుగా పగులఁగొట్టి యొకటిని విగ్రహముగాఁ జేసి మిగులభక్తితోడంబూజించెదము. మఱియొకటిని వాకిటిగడపకు రాయిగా నుపయోగించి యనుదినమును కాలం ద్రొక్కుదుము. యంత్రస్థాపనము, మహామంత్రము, కుంభాభిషేకము మొదలగువానిచే విగ్రహమునకు ప్రాణప్రతిష్ఠనుజేసి దేవునియొక్క పరిపూర్ణశక్తిని యందావహింపఁ జేయుచున్నారమనునది యితరులకు దెలియుట లేదు.

ఇది యిట్లుండ మనుష్యుఁడనవరతము కర్మలం జేయుచుండవలయుననియు, ఒక్కొక కర్మయు స్వభావమున మంచిసెబ్బరలనెడి రెంటికి సంబంధించియున్నదనియు పలుమఱు మనము భగవద్గీతయందుఁబఠించుచున్నారము. మనము చేసెడి యేపనియందును మంచిసెబ్బరలు కలిసియేయుంటున్నవి. ఏదియైన నొక్కమంచిని జేసినయందుచే నెవనికైన నొక్కనికి చెఱుగుకలుగుననునది నిశ్చయము. ఒక్కొకపనియందు నిటుల మంచిసెబ్బరలు కలిసియుండియు మనమెప్పుడును కర్మమును చేయుచుండవలసినదియను విధి యేర్పడియున్నది. ఇందుల కేమిచేయనగును? ఈ కర్మను చేసిన నందుచేఁ బుణ్యపాపముల రెంటినిం జేసినవారలమగుచున్నారము. ఇందులకై భగవద్గీతయందుఁ జెప్పఁబడిన యుపాయమేదియన ఒక కర్మను చేయునపుడు మనము దానిఫలమునుం గోరక భగవత్ప్రీతిగఁ జేసినట్టయిన మనకందుచే నేకొంతయును కలుగనేరదు.

కర్మ నెప్పుడును చేయవలసినదేను. దానిఫలమును కోరను గూడదు. ఇదియే భగవద్గీతయందుఁ జెప్పఁబడిన విశేషము. మన మనస్సు నొకసరస్సువలె నుంటున్నది. అందు మనకుఁ గలుగు పుణ్యపాపచింతలా సరస్సునఁ గొట్టి యణిగెడియలలవలె నుంటున్నవి. ఆయలలు చూపునకు నణిగిపోయినట్లు తోచునవేగాని నిశ్చయమున నట్లుకాదు. ఆయలలు మరల కలుగనగును. అటులనే మనస్సనెడి సరస్సునఁగలిగెడి యలలనెడి బహిర్వస్తుజ్ఞానమను తలంపులును మణిగిపోయినట్లు తోచినను వాస్తవముగ నవి మణిగిపోయినవికావు. వాని గుఱుతులు మనస్సున నాటియున్నవి. ఇట్టి గుఱుతులనే సంసారములని చెప్పుచున్నాము. మనముచేసెడి యొక్కొకకార్యమును మన దేహమున నొక్కొకకదలికయు, మనము దలంచెడి తలంపును, మనస్సునఁ జేసియుండిన గుఱుతులు దానిపయిం దెలియకపోయినను లోననేయుండి సకలకార్యములను చేయఁగూడిన స్థితిలోనుంటున్నవి. మనమిప్పుడుండు నొక్కొకస్థితియు ముందేర్పడిన పైనఁజెప్పఁబడిన

యిదివఱకును నేనుచేసిన కర్మలచే నామనస్సునఁగలిగిన గుణములచే సంపర్కించినవేగాని వేఱుకావు. ఇదియే గుణముయొక్క తాత్పర్యము. మంచితలంపులగుణము లధికముగనుండిన సద్గుణములనఁబడుచున్నవి. చెడుగుణములుగనుండినేని గుణమును చేష్టదియగుచున్నది. ఒకమనుష్యుఁడెప్పుడును దుర్భావములొందుట, చెడుతలంపులందలచుట, చెడుకార్యములం జేయుచుండినట్టయిన వానిమనస్సు చెడుగుణములచేతనే నిండుచున్నది. ఆగుణములు మనకుఁ దెలియకనే మనతలంపును కార్యమును దుర్మార్గమునకే ప్రవర్తింపునట్లు చేయుచున్నవి. యథార్థముగనే యీ చెడుగుణములు సదా పనిచేయుచుండును. ఆకార్యముల ఫలము చెడుగేగాని వేఱుకాదు. కావున అట్టిమనుష్యుఁడు దుష్టుఁడే. వాఁడు సజ్జనుఁడుకానేరఁడు. మనచేతం జిక్కిన యంత్రము మనయిష్టానుసారము తిరుగును. యంత్రమునకు స్వాతంత్ర్యము లేదు. అటులనే మనలను సజ్జనులుగాను దుర్జనులుగాను చేయునది మనము పూర్వమునఁ జేసిన కర్మలేగనుక మనము వానికి లోబడిన యంత్రమువలె నుండుచున్నాము. అటులనే సత్కార్యములును మంచియెక్కువలును పలుమారు కలిగినట్టయిన మనమును మంచివారలమగుచున్నారము. పైనచెప్పఁబడిన సత్కర్మలు మిక్కిలిగానట్టయిన మనమెంతప్రయత్నించినను చెడుగు చేయఁజాలము. అట్టివాఁడు ఇంద్రియములను జయించినవాఁడై నిజమైనవస్తువును కనిపెట్ట సమర్థుఁడగుచున్నాఁడు. దీనికన్నను సుకృతస్థితి యెందుకలదు. అదియే ముక్తిని బొందవలయుననియెడియాశ. హిందూయోగులకుం దలచిన ముక్తిని బొందవలయుననుటయే ముఖ్యోద్దేశ్యము. కర్మచేతను ముక్తిబొందనగును. యోగముచేతను జ్ఞానముంబట్టి ముక్తిబొందనగును. బౌద్ధుడు జ్ఞానముచే నేముక్తిని బొందెనో యేసుక్రీస్తు యేధ్యానముచే నేయదివిని బడసెనో అట్టిముక్తినెప్పుడు లోకోపకారమనుష్యుఁడును కర్మచేఁ బడయనగును. ముక్తియనునది పుణ్యపాపములు లేకయుండునది. బంగారుగొలుసు ఇనుపగొలుసువలెనే యొకగొలుసే కదా? నాప్రేలియందు ముల్లుగ్రుచ్చుకొనియున్నది. దానిం దీసి

వేయు మఱియొకముంటి నుపయోగపఱచుచున్నాడను. ఆముంటినిం దీసినతరువాత రెండుముండ్లను పాఱవేయుచున్నాడను. రెండవ ముల్లు యావశ్యకము లేదు. ఏలనన రెండుముండ్లును ముండ్లే. అటువలెనే పాపకార్యములం బుణ్యకార్యములచేఁ బోఁగొట్టవలయును. వెంటనే మనస్సుననుండు చెడుతలంపులను మంచితలంపులచేఁ బోఁగొట్టవలయును. చెడుతలంపులన్నియు సమూలముగ నశించునందనుక మంచితలంపులను మనస్సుననుంచవలయును. అందుమీఁదట సత్కార్యలును వదలిపోవలసినదేను. ఎట్టులనగా పూర్వము మనకు సంబంధపఱచిన సత్కార్యలను పిదప మనకు సంబంధమును విడిపింపవలసిన కర్మను చేయుము. అయితే దానిగుఱుతు నీమనస్సున పడకుండునట్లు చేయుము. అలలను రానిమ్ము పోనిమ్ము. నీశరీరముచేత సకలకార్యములు చేయబడనిమ్ము. అయితే అవి నీమనస్సున నెట్టిబలీయమైన గుఱుతులు కలుగునట్లును చేయకుము. ఈస్థితి నెవ్విధముగఁ బడయనగును? మనలను సంబంధపఱచుకొనెడి కార్యముల గుఱుతులు మనమనస్సునువదలి చలింపక నెలకొనియున్నవి.

నేటిదినము నేను నూఱుమందిని త్రోవలో సంధించితిని. వారలలో నాకు మిగులఁ బ్రియముగలవాని నొక్కనిఁజూచితిని. నేను యింటికి రాగానే యిందఱిముఖములను జ్ఞాపకమునకుఁ దెచ్చుకొనుటకుఁ బ్రయత్నింప నాస్నేహితుని ముఖమే నాకెదుట నిలచినది. తక్కినముఖములు మఱిగిపోయినవి. శరీరతత్త్వశాస్త్రరీత్యా నేనుచూచిన యన్నిముఖములును నాకన్నులంబడి యాజ్ఞానము మెదడునకుం దీసికొనిపోఁబడెను. అయినను తక్కినముఖములకన్నను నాచెలికాని ముఖమే నామనస్సున దట్టముగ గుఱుతు కలుగఁజేసినది. కావున కర్మను చేయునపుడు దానిఫలమునసనుభవింప నిచ్ఛగింపకుము. ఏకర్మనుగాని యీశ్వరప్రీతిగా నొనర్పుము. ఏవిషయమునుగాని నీమనస్సునఁ జొరనీయకుము. చేతులు పనిచేయనిమ్ము. నీమనస్సు నూరకుండనిమ్ము. ఈ భూమియందు నీవన్యుడవు. పరదేశివలెనుండి కర్మనుచేయుము. సదా కర్మానుష్ఠానపరుఁడవుగ నుండుము. అయితే

ఈ భూమియందుండు వస్తువులపయిం బ్రీతినుంచకుము. బంధము చేయునది. భయంకరమైనది. ఈప్రపంచము మనము వసించవలసిన తావుకాదు. మనము పోవుమార్గములయం దెన్నియో నిలుచుతావు లున్నవి. అట్టితావులలో నీభూమి యొకటి. సాంఖ్యుఁడు చెప్పియు న్నాఁడు:—'ప్రపంచమాత్మకేగాని యాత్మ ప్రపంచమునకుగాదు' అను నట్లు ప్రపంచముండునదే యాత్మవిచారమునకుగాను. అందులకై యే సృష్టింపఁబడియున్నది. ఇదితప్ప ప్రపంచముండుటకు వేఱుకారణ ములేదు. దీనినే మనము జ్ఞాపకమునసుంచుకొనిన ఈ ప్రపంచము పయిని యాసనుంచము. నీవు యజమానునివలె పనిచేయవలసినదే గాని సేవకునివలె పనిచేయఁదగదు. నూటికిఁ దొంబదితొమ్మిది మంది బానిసలవలెఁ బనిచేసి బాధపడుచున్నారు. వారిపనులన్నియు స్వప్రయోజనమునకైన పనులు. ముక్తినిఁ బొందవలయుననెడి తలంపుతోడం బనిచేయుము. విశ్వాసముతోఁ గర్మఁజేయుము. ప్రియ మనునది కష్టమైనది. బంధముండునందనుక ప్రియముకలుగదు. ఒక బానిసను వెలకుఁగొని వానిం బనిచేయ నియమించిన వానికింగల ప్రియము నిజమైన ప్రియమేనా? అటులనే ప్రపంచమునందు సుఖ ములను బొందుటకై మనము చేసెడి కర్మలు ప్రియముతోడం జేయఁ బడుకార్యములు కానేరవు. లోకమునకు మనలను బానిసలుగఁజేసి కొనినట్టియున మనకర్మము ప్రీతితోడం బ్రకాశించుచున్నదని చెప్ప నగునా? అట్లు మనముచేయు కర్మము నిజమైన కర్మము కానేరదు. మనకుగాను చేయు కార్యములకును మనబంధువులకై చేయు కార్య ములకు నెంత వ్యత్యాసముకలదో అటువలెనే ప్రపంచముపయి యాశ నెదురుచూచుచుఁ జేసెడి కార్యమునకును ఈశ్వరప్రీతిగాఁ జేయుకార్యమునకును వ్యత్యాసముకలదు. స్వప్రయోజనము నుద్దే శించిచేసెడి కర్మ బానిసలు చేసెడి పనికి సమమగుచున్నది. ఎంత పనిచేసినను నిజమైన యానందము కలుగునో అదియే మంచిపని. మనము స్వప్రయోజనము నుద్దేశించి చేసెడి కర్మలన్నియు పాపమును ప్రకాశింపఁజేయుచున్నవి. కావున నవి సత్కర్మలు కానేరవు. ఒక

మనుష్యుఁడు తనభార్యవిషయమై ప్రియముగ నుండునట్లు తలంచు కొనుము. వాఁడు దానిని తనవద్దనే నుండుమని చెప్పుచున్నాఁడు. అది యెచ్చటనైనను బయటికి వెళ్లినట్లయిన సందేహించుచున్నాఁడు. తనసమీపమున నది కూర్చుండవలయుననునది వానియిష్టము. తా నుండుచోటఁ దనభార్యయు నుండవలయును. వాఁడు దేనిని భుజింపుచున్నాఁడో దానినే భుజింపవలయును. ఇటులనుండుటంజేసి వాఁడు దానికి బానిసయగును. అదియు వానికి బానిసయగును ఇట్లుండుట ప్రియమగునా? ఇది బానిసత్వమేగాని నిజమైన విశ్వాసము కానేరదు. ఇది కష్టమును గలుగఁజేయుటచే నిజమగు ప్రీతి కానేరదు. భర్త చెప్పునటుల తనభార్య చేయనియెడల వానికి మనఃఖేదము కలుగదో? ఈశ్వరభక్తియందిట్టికష్టముండదు. ఈశ్వరుని యందు మనముంచెడి విశ్వాసముచేత మనకు ఆనందమే కలుగుచున్నది. ప్రపంచముపై నుంచెడి ప్రీతిచే దుఃఖముకలుగుచున్నది. కావున నది నిజమైనప్రీతి కానేరదు. నీ భార్యాపుత్రబంధుస్నేహితులు మొదలగువారిపై నీకుఁగల ప్రీతి నీకు దుఃఖమును కలుగఁజేయనంత స్థితియందుండినట్లయిన అప్పుడే యేకర్మనుగాని నీవు ఈశ్వరార్పణము చేసినట్లెన్నఁబడుదువు. అప్పుడే నీకుఁగల ప్రపంచముపైయాస నిన్ను వదలిపదనవచ్చును. గృహస్థుఁడుగనుండియు సర్వసంగ పరిత్యాగి యని నిన్ను జ్ఞానులు దలంతురు.

కృష్ణభగవానులు చెప్పుచున్నారు:—“ అర్జునా ననుంజూడుము. నేనొకనిమిషమైనం బనిచేయకుండినట్లయిన నీ ప్రపంచమంతయు నశించును. అయినను ఈ ప్రపంచముచే నేను పొందవలసినదేమియులేదు. నేను ఏకమగు పరబ్రహ్మము. నాకు కర్మ యనావశ్యము అయినను నేనేల పనిచేయుచున్నాను? ప్రపంచమున నాకుఁగల విశ్వాసమే కారణము.” దైవము ప్రపంచమున సంబంధింపకుండుటకుఁ గారణము ఆయన దానిపై నిజమైన ప్రియము కలిగి యుండుటయే. కపట విశ్వాసమనునది ప్రపంచమునందువారలొకరినొకరు స్నేహించుట. ఇరువురు నొకరినొకరు స్నేహించియు

నొకటిగఁజేరకుండినట్టయిన దుఃఖము కలుగుచున్నది. ఇదియే కపట విశ్వాసముయొక్క ధర్మము. నిజమైన స్నేహితులు వేయిమైళ్లదూరమునందుండినప్పటికిని వారలవిశ్వాస మెప్పటికిని చెడదు. అట్టివిశ్వాసముచేత దుఃఖమనున దెంతమాత్రమును కలుగనేరదు.

ఈ ప్రకారము బంధములేక కర్మలంజేయునదియే బుద్ధిశాలి లక్షణము. ఇట్టిస్థితిని బడసినవెంటనే మనకు ముక్తి యతివేగముగఁ గలుగును. నీవు నీబిడ్డలకుంజేయు సహాయమునకై కూలియడిగెదవా? లేదు. వారలకు మేలు సకలవిధములచేతం జేయ నీవు ఋణపడియున్నావు. నీవు వారలకై పనిచేయవలసినది నీ పనియని యెంచెదవు. ఇతరులకై నీవుచేసెడి కార్యమును అటులనేయని భావింపుము. వారివద్దనుండి యెట్టి ప్రత్యుపకారమునైనను బడయఁగోరకుము. నీ సొత్తులను స్వర్గఫలమునుద్దేశించి నీవు దానముచేయునటుల నీ కర్మలను లోకోపకారార్థముగఁ జేసినట్టయిన బంధమునుండి విడుదలయగుదువు. మనముచేయు నుపకారమునకు ప్రతిఫలమును గోరుటచేత ప్రపంచబంధము కలుగుచున్నది. ఎవఁడు సకలజనక్షేమమునుద్దేశించి కర్మలంజేయునో వాఁడు తామరాకునకు సమానుఁడు. తామరాకు నీటియందుండియు దానిచేఁదడియకుండునట్లు ఈశ్వరార్పణముగఁ గర్మలనుఁజేయు కర్మయోగి లోకమున వసించియు సంసుఁదగుల్పడకనుండును. వానికి బంధములేదు. కావున పైనఁజెప్పఁబడిన కారణములచేత గృహస్థునిస్థితి సన్న్యాసిస్థితికన్నను సులభమని తెలిసికొనుచున్నారము.

ధర్మము.

కర్మయోగమున కర్మమనునది యేమియని తెలిసికొనుటయే గాక మన ధర్మమిట్టిదియనియు తెలిసికొనవలయును. నేనేకార్యమునైనను చేసి ముగింపఁగోరిన దానినిగుఱించి నేను చేయవలసిన ధర్మమిట్టిదియని తెలిసికొనవలయును. అటుమీఁదనే యాకార్యమును నేను చక్కఁగాఁ జేయనగును. ఒక్కొక దేశమందు నొక్కొక్క

టిని తన ధర్మముగా భావించుచున్నాఁడు. మహమ్మదీయుఁడు తన వేదమగు ఖురానునందున్నట్లు చేయుటయే తన ధర్మమనుచున్నాఁడు. హిందువు తన వేదమునందున ట్లనుసరించుటయే తనధర్మమను చున్నాఁడు. క్రీస్తువులు తమ వేదపుస్తకమునఁ జెప్పఁబడియుండునట్లు చేయుటయే తమ ధర్మమనుచున్నారు. మహమ్మదీయుఁడు పంది యనుమాటనే తనచెవుల వినుటలేదు. క్రీస్తువులు (స్వేతముఖులగు క్రీస్తువులు) పందిమాంసమును బహిరంగముగా భుజించుచున్నారు. హిందువు లేమాంసమును తినఁగూడదనుదురు. ఈప్రకారము ధర్మ మిట్టిదియని తెలియనందున కొందఱు మన మనస్సాక్షికి విరోధమ గుకార్యములం జేయకుండుటయు దానికనుగుణమగు కార్యములం దప్పక చేయుటయు ధర్మమనుచున్నారు. శత్రువునకుపకారముచేయు నంతటిపుణ్యమును చెఱుపుచేయునంతటి పాపమును లేదను న్యాయ ము మిగుల శ్రేష్ఠమైనది. ధర్మమిట్టిదియని నిర్దేశించుటకు దీనికన్న ను మేలైనన్యాయము వేఱేదియులేదు.

భగవద్గీతయందు జన్మస్థితులకుఁదగినట్లు ధర్ముండవలయు నని చెప్పఁబడియున్నది. కావున మనము జన్మించినదేశమునకును, కులమునకును, మనమనుసరించు మతమునకును దగిన ట్లెవరికిని బాధలేక కర్మలం జేయుటయే మన ధర్మమగును. ఒకేవిధమైన యాచార మెచ్చటను లేదనువిషయమును మనము మఱవఁదగదు. దీనిని మఱచుటచేతనే మనమొకరితోడనొకరు కలహించుచున్నార ము. కావున ధర్మమనుదాని నీ దిగువఁజెప్పఁబడినట్లు గ్రహింపవలెను. దేనింజేసినట్టయిన యాత్మజ్ఞానము కలుగునో అదియే మనధర్మము. దేనింజేసిన నరకప్రాప్తియగునో యది మనధర్మము కానేరదు. ఒక సమయమున ధర్మముగాఁ దోచు నొకకార్యము మఱియొక సమయ మున పాపమగును. ఒకనివధించుట పాపమని జడిసెడి యొకఁడు యుద్ధ వీరుఁడై యుద్ధరంగమునకు వెళ్లిన నొకప్రేటున నిఱువదిమందిని వధిం వేయుచున్నాఁడు. ఇందుచే వధ మొదటపాపమై పిదప ధర్మముగాఁ దోచుటలేదా? స్వప్రయోజనమును పాటింపక చేసెడి ధర్మమే శ్రేష్ఠ

మని యీదినువనుండు కథవలనఁ జక్కగా స్పష్టపఱచెదను. “ కురు క్షేత్రమునందు యుద్ధముముగిసినతర్వాత పంచపాండవులు గొప్పయ జ్ఞముంజేసి యనేకులకు దానధర్మములనుచేసిరి. అందఱు నింతప్రబల మైనయాగమును తామెన్నడును చూచినదిలేదని బ్రహ్మానందమొంద దిరి. ఇట్లుండ నొకముంగిస యా యజ్ఞశాలలోనికిఁజని యందలి యు చ్ఛిష్టములయందుఁ బొఱలుచుండెను. దానికివెంటనే శరీరమున సగ ము బంగారమాయెను. తక్కినసగమును బంగారము గావింపదలం చియు సాధ్యపడక నచ్చటనుండువారలం జూచి ఇది యొకయాగమని మీరందఱును వృథాగా పొగడుకొనుచున్నారనియెను. వారందఱు ను నీవుచెప్పునది యాశ్చర్యము. ఎందఱో బీదలన్నవస్త్రములు సంపాదిం చుకొని మిగులనానందము పొందిరి. అనేకులు తమ దారిద్ర్యమునుపో నాడి ధనికులయిరి. ఇదివఱకును నీప్రపంచమున నిట్టియాగము జఱి గినదిలేదనిరి. అందులకు ముంగిసచెప్పిన దేమన:—పూర్వకాలమున నొకగ్రామమున బీదబ్రాహ్మణుఁడుండెను. వానికి భార్య పుత్రుఁడు కోడలు వీరుముగ్గురు గలరు. వీరందఱును ప్రతిదినమున నుపాదాన మెత్తి జీవించుచువచ్చిరి. అప్పుడు మూఁడు సంవత్సరములు కఱవుకలిగి తుదకు ఐదు రోజులవఱకును వారలకాహారము దొరకక విశేష క్షుత్తుచే బాధపడుచుండిరి. ఎచ్చటనో కొంచెము గోధుమలు దొరకెను. దానిని పచనముచేసి నాలుగు భాగములుచేసి భక్షింపఁ దొడంగిరి. ఇంతలో నొక యతిథి యచ్చటికివచ్చి తానాకలిచేఁ బీడితుఁడగుచుండినట్లు చెప్ప నందఱును తమతమ యాహారము నొకటిగఁజేర్చి యాయనకిచ్చిరి. ఆ యతిథియు దృప్తినొంది వారి నాశీర్వదించి వెళ్లెను. నాటిరాత్రియే యా నలుగురును క్షుత్తుచే మృతినొందిరి. వారలు దానముచేసిన గోధుమలలో రెండుమూఁడు గింజలు భూమిపయిం బడియుండెను. వానిపయిం బొరలితిని, నాశరీర మున సగముమాత్రము బంగారమాయెను. అదిమొదలు ఎన్నియో యాగభూములయందు బొరలితినిగాని నిరుపయోగమాయెను. ఈ యాగమునందును బ్రాహ్మణులు భుజించిన యాకులలోఁ బొరలితిని.

నాతక్కిన సగము బంగారము కాకపోయెను. అందువల్లనే ఈ యాగము శ్రేష్ఠమైనదికాదని చెప్పితిని. ధర్మిష్ఠుల సంఖ్య మిగులఁ దక్కువ. హూణభాషయందుమం డొక గ్రంథమున నెవ్వఁడో బాలుఁడు కూలిపనిచేసి యందువలన సంపాదించిన ద్రవ్యమును తన తల్లిచేనిచ్చి యామెను సంరక్షించుచుండినట్లు వ్రాయఁబడినది. ఆబాలునిగుఱించి యాపుస్తకమున నాలుగు పుటలలో శ్లాఘ్యముగ వ్రాయఁబడియున్నది. ఇది సామాన్యమేకదా? ఇట్టి ధర్మమును మంచిచింతయు హిందూబాలునకు సర్వసాధారణము. ఇప్పుడు పశ్చిమఖండపువారి సంప్రదాయముల ననుసరించుటచేఁ బ్రతివాఁడును తాను సంపాదనఁజేసి తన కడుపుపోసికొనవలయునను తలంపు రానురాను మనకుఁ గలుగుచున్నది. మన నాగరికతకును ఐరోపియనుల నాగరికతకును వ్యత్యాసము గలదు. మనము మన జననీజనకులను, దారాపుత్రాదులను, బంధువులను అతిథులు మొదలగు నందఱినిం గాపాడ ఋణపడియున్నారము. వారలు తమతమ కడుపునకు కావలసిన వస్తువులను తామే సంపాదించుకొనవలయును. ఈ రెంటియందు నేదిధర్మము? ప్రపంచమున మృగములు పిల్లలనీని కొంతకాలము వఱకు వానినిరక్షించి విడనాడుచున్నవి. ఇంకను కొన్నిమృగములు తామీనిన పిల్లలనే భక్షించుచున్నవి. ఇందులకు నిదర్శనముఁగ శునకము నాలుగుపిల్లల నీనిన యొకటి రెండుపిల్లలం దినును.) ఇవ్విధమునఁ గరుణలేని స్వభావము మనుజులకుం గలిగినట్లయినఁ బిదప వారలకును మృగములకును భేదమేమి? కొందఱు తాము సంపాదించినవస్తువులను తామే యనుభవించుచున్నారు. ఇది తప్పు. తాము గడనసేయు వస్తువుల నితరులకు వినియోగించుటచేతఁగదా గౌరవము కలుగును? మనమితరులఁ బోషించుటకైయును మనశక్త్యానుసారము లోకమునకుపకారము చేయుటకైయును జన్మించియున్నారము. మన జీవితకాలమును సత్కార్యములయందే యుపయోగింపవలయును. ప్రతిదినము నెన్నివధలు చేయుచున్నారము? ఎన్ని [illegible]

రాజ్యాంగమువారలు వానిని విచారించి యురిదీయుచున్నారు. ఒక మేకను లేక పశువును జంపినవానిని యురిదీయుటలేదు. స్వల్పముగ దండింపుదురు. ఇదియు స్థలముననుసరించి దండన విధింపఁబడుచున్నది. జీవుఁడు మనుష్యునియందుండునట్లెగదా పశువునందునుంటున్నాఁడు. కావున పశువధయు వధయే. పైనఁజెప్పఁబడిన వధయనెడి పాపముచేయు మనుష్యునింజూచిన మనకెంతయు నసహ్యతకలుగుచున్నది. మనము ప్రతినిత్యము నెన్నియోజీవముల వధించుచున్నారము. దానిం గొంత గమనించిచూతము. మనము భూమిపై నడచునప్పుడు వేలకొలదిచీమలు మనపాదములక్రిందఁ జిక్కికొని యవి చచ్చుచున్నవి. త్రాగెడినీళ్లయందు కోటానకోటులు పురుగులుగలవు. అవి మనకన్నులకుం జక్కఁగఁగానరావు. భూతయద్దములమూలముగ నీళ్లను జూచినట్లయిన నందు నిండియుండు విశేషపురుగులం గనవచ్చును. ఇదియంతయు నుండనిమ్ము. అరటి, బెంకాయ మొదలగు చెట్లయందు జీవములేదా? వానినన్నింటిని మనముపయోగించుచున్నాము. ఇదియు వధవలన గలిగెడిపాపమే. అయితే దీనికేమిచేయవచ్చును? మనప్రాణము నెట్లు సంరక్షించుకొనవలసినది యనిన నితరుల ప్రయోజనమునకై మనప్రాణమును కాపాడవలసి మనము పైనఁజెప్పఁబడిన చెట్టుచేమలు మొదలగువాని నఱుకుటయు, చీమలు పురుగులు మొదలగువానిం బాదములచేఁ ద్రొక్కి వధించుటయు బాపముకానేరదు. ఇతరులఁ గాపాడుటకై మనము మాంసభక్షణ చేయవలసినది యవశ్యములేదు. కావున గొప్పపాతకమగు మాంసభక్షణమును నివర్తింపవలయును. ప్రాణసంరక్షణఁజేయుటకు వేఱు మార్గము లేదే యను నావశ్యకమగు దోషముచేత కాయగూరలను భుజింపనగునేగాని వేఱుగా భుజించుట దోషమగును. మన పూర్వికులు క్రమక్రమముగ శాకాదులను తగ్గించుచునేవచ్చి తుదకుఁ బర్ణభక్షణ జలభక్షణ వాయుభక్షణ మొదలగువానింజేసి యంత్యమున నేదియు లోఁగొనక యోగాభ్యాసఫలముచేఁ బ్రాణమును నిలిపికొనియుండలేదా? శాకాదులను భక్షించుటయందును, ఏ శాకమును

మనము కోసిన మొదటికే మోసము లేకయుండునో దానినే భుజింప నగును. మామిడిచెట్టుననుండు మామిడికాయను భక్షించుటచే మిగుల దోషములేదు. ఏలనన నందుచేఁ జెట్టున కేయపాయముం గలుగనేరదు. అదియుగాక మామిడికాయను మనము కోయకుం డిన నదియే పండి క్రిందఁబడుచున్నది. అందుచే మనకాలమును లోకములోని ప్రాణికోటికి నుపయోగించుటకై పైఁజెప్పఁబడిన శాకాదులను భక్షించి మిగులఁ గరుణతో సకలకర్తల నీశ్వరప్రీతిగఁ జేయవలయును. ఇదియే ఒకొ్క్కఁడును చేయవలసిన ధర్మమగుచు న్నది. ప్రాణోత్క్రమణసమయమందైనను ఇతరులకు ధర్మముఁజే యవలయును. ధర్మముఁజేయునప్పు డెట్టిప్రశ్నలనడుగఁదగదు. మనము చేయు దానమును శ్లాఘ్యముగఁ జెప్పుకొనకయు, మనముచేయు దానధర్మములన్నియు నీశ్వరార్పణముగను చేసి దానిఫలము నెదురు చూడకుండుటయే కర్మయోగసారము. ధర్మమెప్పుడును ప్రీతితో నుండుట యరుదు. విశ్వాసముతోడం జేయుకార్యమే చక్కఁగా ముగియుచున్నది. విశ్వాసముతోడం జేయఁబడని కార్యము కష్టతర ముగ ముగియుచున్నది. జననీజనకులు బిడ్డలకుఁ జేయునట్లును, భర్త భార్యకు చేయునట్లును మనము సకలకార్యములను లోకముననుండు సకలజనులకు నుపయోగించునట్లు విశ్వాసముతోడం జేయనగును. ఒకకార్యమును చక్కఁగాఁజేయవలయుననిన అందలి విశ్వాసముంచుట యావశ్యకము. విశ్వాసమనునది బుద్ధిస్వాధీనముచేఁ గలుగవలసిన విష యము. మనకుఁగలుగు కోపము, చూపోపమి మొదలగు చెడువిషయ ములకు మనము బానిసలుగ నుండునంతవఱకును మనకు బుద్ధిస్వాధీ నము కలుగనేరదు. మనకు ప్రతిదినముం గలుగు సకలకష్టములను లక్ష్యపెట్టక నోర్పుతోడనుండుటయే పైఁ జెప్పఁబడిన దుర్గుణములను జయింపఁగల సాధనము. ఎట్టి ముష్కరస్వభావమునైనను పుణ్యము బొత్తుగ మాన్పును. ప్రపంచమున స్త్రీలచే ననేకపురుషులును, పురు షులచే ననేక స్త్రీలును చెడిపోవుచున్నారు. ఇందుచేఁ గొందఱు పురుషులు వేఱుగ నొకమతమును నిర్మించుకొని స్త్రీలముఖముఁ

జూడకనే కాలయాపనము చేయుచున్నారు. కొందఱు స్త్రీలును కన్నికామతమున వసించుచు పురుషులముఖమును జూడకయే జీవితకాలమును గడుపుచున్నారు. ఇట్లు చేయుటకన్నను వేఱుగ సులభోపాయము గలదు. అదియేదియన నొక్కొక స్త్రీయు నితరపురుషులం జూచునప్పుడెల్ల వారిని తనగర్భమునంబుట్టిన బిడ్డలవలె భావించినట్లయిన చెడిపోనేరరు. అటులనే యొక్కొక మనుష్యుఁడును అన్యస్త్రీలను తనతల్లులవలె భావింపవలయును. మనము చూచెడి స్త్రీలనందఱిని పరదేవతలుగ భావించుకొనిన చెడిపోవుదుమో ?

ప్రపంచమున తల్లియొక్కస్థితి సర్వోత్కృష్టమైనది. ఆస్థితిని యొక్కొకఁడును చక్కగఁదెలిసికొనిన నేకర్మనుగాని యీశ్వరార్పణము చేయుట సులభమగును. తల్లియొక్క ప్రీతికి మించిన ప్రియము దేవుని ప్రియమొక్కటియే. తక్కిన ప్రియములన్నియు తల్లియొక్క ప్రీతికిఁ దక్కువమైనవియేగాని వేఱుకానేరదు. తల్లి మొదట తన బిడ్డలను సంరక్షించి పిదపఁ దనగతిఁ జూచుకొనును. అటులఁజేయక తలిదండ్రులు తమకడుపు బోసికొని బిడ్డలం బోషింపకుండిన వారలకును బక్షులకును భేదమేమి? పక్షిజాతులు తమ చిన్నపిల్లలను విడనాడి యెగిఱిపోవువాడుకఁ గలిగినవి. అటులనే చిఱుతప్రాయమున జననీజనకులచే నాదరింపఁబడని బిడ్డలు పెద్దవారలు కాగానే వారలఁబోషింపక తమతలిదండ్రులను విడనాడుదురు. ఏమనుజుఁడీ ప్రపంచముననుండు స్త్రీల నందఱిని పరాశక్తిస్వరూపులుగ భావించునో,వాఁడే పుణ్యశాలి. ఏ స్త్రీ పురుషులనందఱిని పరమేశ్వరుస్వరూపములుగ భావించునో ఆబిడయే భాగ్యశాలి. కర్మయనునది గౌరవముగనుండినను అగౌరవముగనుండినను బాధకములేదు. ఒక్కొకఁడును తనస్థితికిఁదగిన సత్కర్మను దృప్తిగఁజేయుట యావశ్యకము. అటులఁజేసిన క్రమక్రమముగ నా కర్మఫలము నుద్దేశింపక చేయు మంచివాడుక గలుగును. అట్టిమంచివాడుక గలిగిన మోక్షముకలుగుననుట కభ్యంతరములేదు. కాలికి నుపయోగించు మంచి పాద

రజకులంగుట్టుహీనకులస్థుఁడగు మాతంగుఁడు శ్రేష్ఠకులమున జన్మించి బుద్ధిహీనతచేఁ బ్రేలెడి యాచార్యుకన్న నుత్తముఁడు.

పూర్వకాలమున బాల్యుఁడగు నొకసన్న్యాసి వనమునం దపముం జేసికొనుచుండెను. పండ్రెండేండ్లు శ్రమతోడం దపమొనర్చిన పిదప నాయనశిరస్సున నెండినయాకులు చెట్టునుండిపడెను. ఇందులకేమి కారణమని తలయెత్తిచూడ నాకులంబడఁద్రోసిన కొక్కెయొకఁటి యెగిరిపోవుచుండెను. కొంతసేపటికి జ్వాలయొకటి కలిగి యాకొక్కెను భస్మముచేసెను. సన్న్యాసియు నాకింతటిశక్తి గలిగినదిగదాయని గర్వించి మిగుల నానందమొందెను. కొన్నిదినములకీ బాలసన్న్యాసి యొక గ్రామమున నింటింట భిక్షమెత్తికొనుచు వచ్చుచుండ నొకగృహమున తల్లీ భిక్షవేయుఁడని వేడఁ గొంతదడవు వేచియుండుమను శబ్దమొక్కటి లోపలినుండి వినవచ్చెను. అప్పుడా సన్న్యాసి తనమనమున వితర్కించుకొనినదేమనిన, ఆహా! ఈ దుష్టురాలు నా మాహాత్మ్యము నెఱుఁగలేదాయెనే. నన్ను వేచియుండుమని చెప్పిన యీ యిల్లా లన్యాయముగ మడియునేయని భావించెను. వెంటనే యింటనుం డాపతివ్రతారత్నము 'ఓరీ బాలుఁడా, యిచ్చట కొక్కెలును కాకులును లేవు' అనెను. సన్న్యాసికి మిగుల నాశ్చర్యము కలిగెను. కొంతసేపటి కాపతివ్రతాశిరోమణి భిక్షముం గొని బయటికి వచ్చెను. అంతట సన్న్యాసి యాయమ్మకు సాష్టాంగ ప్రణామము లాచరించి, అమ్మా నాతలంపు మీకెట్లు తెలియవచ్చెననెను. అందులకాయమ ఓరీ బాలకా, నీ యోగము నేనెఱుఁగను. నాకు యోగాభ్యాసముఁ దెలియదు. నేను సాధారణపు సంసారస్త్రీని. నాభర్త దేహాసౌఖ్యముగనున్నారు. ఆయనకుఁ బరిచర్య చేయుచుంటిని. అది నాధర్మము. మఱియు నా జీవితకాలమంతయు నేఁజేయవలసిన కర్మనుమాత్రమే పొరబాటులేక చేయుచువచ్చెదను. నేను వివాహమాడుటకు మునుపు కన్నికగా నుండునప్పుడును నాధర్మము నొనర్చితిని. ఈ యోగమునే నేనుచేయుచున్నాను. ఇటులఁ జేయుచువచ్చినందున నాకు జ్ఞానముకలిగినది. నేనిది మొదలు ప్రపంచమునునుం డెల్ల

చోట్లయందుఁ జఱుగు విశేషముల నిచ్చటనుండియే తెలిసికొనగలనని చెప్పెను. (ఇందుచే కర్మయోగపు మహిమ చక్కగా విశదమగుచున్నది.) అటువెనుక సన్న్యాసి యమ్మా కర్మయోగమునుగుఱించి ఇంకను నా కధికముగ వివరించి చెప్పవలయునన నాయమ " అయ్యా, మిథిలానగరమున మాంసవర్తకుఁడగు నొక ఛండాలుఁడు గలఁడు. వానివద్దకుంబోయి వేని కర్మయోగమహిమను తెలిసికొందువు.

సన్న్యాసియు నిది మిగుల నాశ్చర్యముగనున్నయది. ఛండాలున కేమి తెలియును. మిగుల హీనకులస్థుఁడై పాపకార్యములం జేయు వానివద్దకు నేనెట్లుబోవుదునని తలంచి, పిదపఁ బతివ్రతయొక్క మాటలబద్ధములు కానేరవని యటులనే పోయి యొక కటికవానియంగడిని సమీపించెను. అచ్చట నొక ఛండాలుఁడు మాంసమును కత్తిచే ఖండించుచు అమ్ముచుండెను. హరిహరీ! ఈఛండాలుఁడా నాకుఁ గర్మయోగమునుగుఱించి యుపదేశింపఁదగినవాఁడు. వీఁడు పిశాచివలెనుంటున్నాఁడు. వీనింజూచినంతనే భయంకరముగనున్నది. కొంతయేనిఁ గరుణలేని వీనివద్ద నేనేమి నేర్చుకొనఁబోయెదనని భావించెను ఇంతలో నాఛండాలుఁ డాయనంజూచి, స్వామీ, మిమ్ముల నాపతివ్రత పంపెనా? కొంతనిదానించుఁడు. నాపనిని ముగించుకొని వెంటనే వచ్చెదనని చెప్పెను. సన్న్యాసికిఁగల యాశ్చర్య మింతయని చెప్పనెవరితరము? వీఁడేమి చెప్పఁబోవునని యాయన తలంచెను. ఛండాలుఁడు మాంసము నంతయు విక్రయించి ద్రవ్యము సేకరించుకొని పిదప సన్న్యాసినిం దీసికొని తనయింటికింజని యాయనను బయట నిలిపి తాను లోనికింజనెను. వాఁడచ్చట తనజననీజనకులకు సర్వోపచారముల నొనర్చి పిదపఁ బయటవచ్చి జీవునిగుఱించియు ఆత్మను గుఱించియు నుపన్యాసముఁజేయ వానినన్నింటి నాలకించి సన్న్యాసి యాశ్చర్యపడి, అయ్యా, ఇంతజ్ఞానముగల మీరేల ఛండాలురుగ నున్నవారని యడుగ ఛండాలుఁడు బదులుచెప్పుచున్నాఁడు:— అయ్యా, ఎట్టికర్మయు హీనమైనదికాదు. నాజన్మస్థితికిఁదగినట్లు నాకు కర్మకలిగెను, నా చిఱుతప్రాయమునుండి నేనీపనిం జేయుచువచ్చు

చున్నవాఁడను. అయితే నాకెందును సంబంధములేదు. నా తలిదండ్రులంగాపాడుటకై యీకర్మ ననుష్ఠించుచున్నానేగాని వేఱుకాదు. అయిన నికార్యములయందు నామనస్సును సంబంధపఱచక నేను వానిం జేయుచువచ్చుచుండినందున నాకు దివ్యజ్ఞానము కలిగినదని చెప్పెను.

కర్మనుగుఱించి దానిం జక్కఁగాఁజేసి ముగించునుపాయము నొకయోగి చెప్పుచున్నాఁడు:—ఒక కర్మను చేయవలసిన యుపాయమును అందువలనఁ బొందెడి ప్రయోజనము నొక్కటియామెనేని యాకర్మ శ్రేష్ఠమయినది. నీవు కార్యమును చేయునపుడు దానిం జేయుటయందె దృష్టియుంచవలయును. దానిఫలమున నుద్దేశ్యముంచఁగూడదు. కర్మనుచేయుటయే ఈశ్వరధ్యానమని భావింపుము. పైనఁజెప్పఁబడిన కథయందలి ఛండాలుఁడును, పతివ్రతయు తమ తమ కార్యములను సంతోషముగ నొనర్చిరి. అందుచే జ్ఞానము బడసిరి. ఒక్కొకధర్మమును పరిశుద్ధమైనది. ధర్మమును పట్టుదలతోడం జేయుటయే విశేషము. అదియే జ్ఞానముంబడయఁదగిన సులభముగు సాధనము.

మనమే దేశమున నేజాతియం దేస్థితియందు జన్మించితిమో యందుల కనుగుణ్యముగ మనముచేయవలసినధర్మ మేర్పడుచున్నది. ఎవ్వఁడొకకార్యమును తనప్రయోజనమునకైఁ జేయునో వాఁడు దుఃఖమును బొందును. అయ్యో యీ మనకులాచారమును చేయవలసి వచ్చెనేయని తలంచువాఁడు ముక్తింబొందఁజాలఁడు. తనకే యని తనను సంబంధపఱచికొనక పనిచేయువాఁడు దివ్యజ్ఞానియగుచున్నాఁడు. వాఁడుచేయు కార్య మెంతహీనమైనను బాధకములేదు. మనమెల్లఱము మనలనుగుఱించి యతిశయముగ భావించుకొనుచున్నారము. నేను బాల్యమునందుండునపుడు నన్ను నేను చక్రవర్తియని భావించుకొనుటగలదు. అటులనే నీవును నిన్నుగుఱించి యతిశయముగా భావించుకొనియుందువనుట నిశ్చయమే. ఇవియన్నియు స్వప్నములేగాని వేఱుకావు. మనచేఁ గాఁగలకార్యములను మొద

టఁ దృష్టీకరములుగఁ జేయుటమంచిది. పిదపఁ గ్రమక్రమముగ నద్భుతకార్యములం జేయ నమకట్టనచ్చును. పోటీచేయుటచేఁ జూపోపమికలుగును. అందుచే పశ్చాత్తాపము చెడుచున్నది. గొణుగుకొనుచు కార్యముచేయువాని కేకార్యమును కష్టమే. ఏదియు వానికిం దృష్టిగనుండనేరదు. వాని జీవితకాలమంతయు దుఃఖకరముగనే గడచిపోవును. మన కేయేకార్యములు లభ్యమగుచున్నవో మనమాకార్యములం దృష్టిగఁజేసి తుదకు జ్ఞానమును బడయవలయును.

ఒక్కొక మతమునను (1) తత్త్వశాస్త్రము. (2) పురాణము. (3) కర్మము అనెడి మూడు విషయములు గలవు. మతసారమే తత్త్వమనఁబడును. ఈతత్త్వము నబద్ధపుకథలచేతేనో నిజమైన కథలచేతనో రెండును కలిసిన కథలచేతనో ప్రతిపాదించుటయే పురాణమనఁబడును. కర్మమనునది, తత్త్వమును వేఱుగా నెట్టిసాహాయ్యము గాని లేక తెలిసికొనుట దుర్లభము గనుక, శరీరముచేతను మనస్సుచేతను నిజమైనవస్తువును బడయుటకై చేయఁబడుకార్య మగుచున్నది. ఇక్కర్మను జేయకయే తత్త్వము నెఱుగఁ బ్రయత్నించువాఁడు మూఢుఁడగును. చిఱుతప్రాయమున మొదట దోగాడుచు పిదప లేచుచుం బడుచువాడుకయైన పిదపఁ జక్కగా నడువ సాధ్యపడును. అట్లుకాక యారంభముననే నడువ బ్రయత్నించిన కాలువిఱుగును. అటులనే కర్మనువదలి జ్ఞానమును వెంటనేఁ బడయఁబ్రయత్నించువాఁడు మూఢుఁడగుచున్నాఁడు.

గుడియందీశ్వరుని సూచించెడి గుఱుతుగ విగ్రహమునుంచెదము. మనమొకతలంపు తలంచెదము. దాని నేగుఱుతులచేత నితరులు తెలిసికొననగును? మనము మాటలాడెడి మాటలచేతగదా? కావున మాటలే మనతలంపుల గుఱుతులు. ప్రపంచము దైవముయొక్క గుఱుతు. ఈశ్వరుని నిర్దేశించెడి విగ్రహము మొదలగు గుఱుతులనొక్కొకమతమునను కొందఱు మేధావులు చేరి యేర్పఱచిరని తెలిసికొనవలయును. దీర్ఘముగ యోచించినట్టయిన మను

ష్యుఁడు సృష్టింపఁబడుటకు మునుపే యీప్రపంచమున దైవమును నిర్దేశించెడి గుఱుతులుండినవి. ఇందులకు నిదర్శనముగఁ గ్రీస్తువుల గుఱుతగు శిలువ వారలు జన్మించుటకుమునుపే, వారలవేదము వ్రాయఁబడుటకుమునుపే యుండినది. స్వస్తికమను గుఱుతు అన్నిమతములలోనుగలదు. స్వస్తికమనగా 卐. ఒకకాలమున బౌద్ధులీగుఱుతును దెచ్చిరట. అయితే బౌద్ధమతమను శబ్దము కలుగుటకుమునుపే యనాదిగ నీగుఱుతు వాడుకలోనుండియేయుండెను. బాబిలోన్, ఈజిప్టు మొదలగు పట్టణములలో స్వస్తికమను గుఱుతు వాడుకలో నుండెను. ఇయ్యది దేని నిర్దేశించుచున్నది? ఈ గుఱుతులన్నియు నాకస్మికముగ నుండియుండవు. వానికేదియో యర్థముకలిగియుండవలయును.

భాషయందుండు పదము లెవ్వరిచేఁ గలిగినవి? పదము కలిగినప్పుడే దానియర్థమును కలిగియుండవలయును. మనుష్యులందఱును సభచేరి మ్రాను అనుపేరు దానిచే (ఆపదముచేఁ) జూపఁబడు వస్తువునకు పెట్టిరా? లేక అటులనే యొక్కొకపదము నేర్పఱచుటసాధ్యమా? అట్లుకాదు. నామరూపములెల్లఱచే నేకకాలమున నుండినవని చెప్పుట యెంతయసంగతమో అటులనే పైనఁజెప్పఁబడిన గుఱుతులిట్టి కాలమున నిట్టివారిచేఁ గలిగినదని భావించుట బుద్ధిహీనత. మనము చేయు కర్మలలో మంత్రములును తంత్రములును గలవు. ఈ రెండు గుఱుతులును మన మతముయొక్క యుద్దేశ్యమును నిర్దేశించుచున్నవి. గుడులు, విగ్రహములు, శ్రాద్ధము మొదలగు కర్మలు ఇవి యన్నియు నిష్ప్రయోజనములైనవియని చెప్పుటసులభము. అయితే యట్లుచెప్పుట మౌఢ్యమేగాని వేఱుకాదు. విగ్రహారాధన విషయమై మన పూర్వీకులకుగల యుద్దేశ్యము కొంత పరిశీలనఁజేసి చూతము. ఒక తస్కరుఁ డొక ధనికునింటిబిడ్డను దొంగిలి నిర్జనప్రదేశమునకుం గొనిపోయి యా బిడ్డ ధరియించియుండు నాభరణముల నొలిచికొని యా బిడ్డను సంహరింపఁ దలంచుచున్నాఁడు. అప్పుడొక యదురువేటుశబ్దము వినవచ్చెను. ఈశబ్దమేమియన శ్రీ వరదరాజ

స్వామి వేంచేయునపుడు వేయcబడిన యెదురువేటు. వెంటనే కొలపాతకుcడగు నాతన్కుcడొకనిమిషమైనను స్వామినిc దలంచుచున్నాcడు. స్వామియందు దిక్కుకై తిరిగి చూచి మ్రొక్కుచున్నాcడు. ఇద్దురాత్ముcడగు కొలపాతకునకుc గొంతసేపైన నీశ్వరధ్యానము కలుగcజేసినది శ్రీ వరదరాజస్వామి యుత్సవముకదా? ఒక బిడ్డ పాలపాత్రము నంటవచ్చుచున్నది. తల్లి తనప్రియమైనబిడ్డను ఒకప్రక్కకీడ్చి ఓరీ ఆపాలనంటకుము. అది దేవపూజకుc గావలసినదని చెప్పుచున్నది. వెంటనే బిడ్డ మాఱుమాటాడక దేవపూజకని వినినతోడనే భయభక్తులతోడ నావలికిం బోవుచున్నది. దీనికన్నను మంచివాడుక వేఱుకావలయునా? వాడుకగాc బాలంగొనివచ్చు గొల్లనితో "అబ్బీ, నేటిదినము స్వామియొక్క యభిషేకమునకై యొకపడిపాలు కావలయును" అని చెప్పిన వాcడు స్నానముచేసి శుచితోడం దనగోవును కడిగి మిగుల భయభక్తులతోడం బాత్రమును చక్కగcగడిగి యందు పాలనుపిండి జలమును చేర్పకయే మిగుల భక్తిశ్రద్ధలతోడం గొనివచ్చును. ఈ గొల్లని కీశ్వరవిషయమై యింత విశ్వాసమును కలుగcజేసినది యీశ్వరారాధనయే కదా? ఇంకను మనవారలు తమబిడ్డలకు నారాయణుcడు, మహాదేవుcడు, కృష్ణుcడు, రాముcడు అని భగవంతుని దివ్యనామములుంచెదరు. వారి యభిప్రాయము లెవ్వి? ప్రపంచవిషయమై తమబిడ్డలను పిలుచునప్పుడు సహా యీశ్వరస్మరణను చేయునట్లుండవలయునని కదా? శైవులు దివ్యవిభూతిని ముఖమున ధరింతురు. వారలంజూచినంతనే ఓహో యొక శివసాంబమూర్తియే తెంచుచున్నాడని యాయనంజూచిన యెల్లఱును భావింతురు. వారు వారెట్టి లౌకికవిషయముగ నెంతయాశతో నెంత యవసరముగc బోవుచుండినను శైవునిముఖముననుండు విభూతినిం జూచినంతనే యొకనిమిషమైనను శివయను దివ్యనామమును ధ్యానింతురు. ఇవ్విధమున వారల నీశ్వరధ్యానము చేయునట్లు జ్ఞాపకపఱచునది విభూతియే. కావున విభూతిని ధరింపనివాcడు మతద్రోహియగుచున్నాcడు. సులభముగ ననేకులకుc జేయcగూడిన

సహాయమును భంగముచేసినవాఁ డగును. ఇటులనే తిరుమణికా ప్పను ముఖమున ధరింపనివైష్ణవుఁడును పాతకుఁడే. వాఁడును ద్రోహియే. హిందువులలో లలాటశూన్యులు మహాపాపులగుదురనుట కేసందేహమునులేదు. ఒక హిందువుయొక్క యింటిలోఁ బ్రవేశించుచున్నాము. వాకిట తిరుమణియు, శంఖచక్రములును వ్రాయఁబడియున్నవి. వానింజూచినంతనే శ్రీమన్నారాయణుని జ్ఞాపకము కలుగుచున్నది. ఆకాశమును చూచుచున్నాము. గరుడపక్షి యెగిరిపోవుచుండును. వెంటనే గరుత్మంతుఁడు విష్ణువాహనమగుటచే నాయనను ధ్యానించుచున్నాము. అప్పుడు మన కీశ్వరధ్యానముకలుగుచున్నది. పయనమై తరలిపోవునప్పుడు గోపురము దెలియుచున్నది. దానిం జూచినంతనే హరిహరియనిగాని హరహరయనిగాని దవడలు వాయించుకొనుచున్నాము. దీనినంతయును యోచించిన మనపూర్వీకులగు మహర్షు లెవ్విధమునైనం దమసంతతివారల కీశ్వరభక్తి కలిగియుండవలయునను సదభిప్రాయముతో వీని నేర్పఱచినట్లు తెలియవచ్చుచున్నది. మఱియు కావేరీనదిని చూచుచున్నాము. వెంటనే పరదేవతయని భక్తితోడ స్మరించెదము. వానిగట్టుననుండు నశ్వత్థముం జూచెదము. మూలమున బ్రహ్మస్వరూపమును, నడుమ విష్ణుస్వరూపమును, అగ్రమున శివస్వరూపమునున్నవని భావించి దానిం బ్రదక్షిణములఁగావించి నమస్కరించుదుము. ఇంకను నిట్టిదృష్టాంతములనేకములుగలవు. పైనఁజెప్పఁబడిన దృష్టాంతములచే హిందువులగు మనము సదా ఈశ్వరభక్తిఁగలవారమనియు మనదైవము గుడియందు మాత్రమేకాక యెల్లస్థలములయం దెల్లప్పుడును నిండియున్నాఁడనియు, దేనింజూచిన నీశ్వరస్వరూపముగ భావించుచున్నామనియు విశదమగుచున్నది. కావున నన్యమతస్థులు తామ్రమునను జాతియందును మీఁదైవముగలఁడనియెడి వదరుబోతుమాటలు మన పూర్వీకుల యభిప్రాయము నెఱుఁగనేఱక మౌఢ్యముచే వదరుచున్నారను విషయమును యోచించి వారల మతిహీనతకుఁ గాను మనము చింతిల్లవలయును. మనము చేయవలసిన యొక్కొక కర్మను

మనము క్రమముగఁ జేయుచువచ్చినట్టియిన జ్ఞానముంబడయుదుము. మనము మాటలాడు నొక్కొకమాటకును, చేయు నొక్కొకపని కిని ఫలితముగలదు. (కొందఱు మంత్రతంత్రములన్నియు వైదికులు ద్రవ్యమార్జించుమార్గములని చెప్పుదురు. వీరలు ప్రపంచస్వభావము చేతను మతిహీనతచేతను జన్మాంతర పాపవిశేషముచేతను ఇట్టుల నయోగ్యముగఁ జెప్పుటయే గాక వేఱుకాదు.) ఒక్కొకమంత్ర మునకు నొక్కొక తంత్రమునకును అర్థము, దానికై ఫలితము ఈ రెండును గలవు. అర్థము తెలియకనే సంధ్యావందనాదికర్మలం జేయుటచే నేమిఫలమని యడుగు బుద్ధిశాలులు బాల్యమున పాలగుణముం దెలియకనే యీపాల నేలద్రాగిరి? మఱియు శిశువై యుండుతఱి కన్నులమూసికొని తల్లి చనుబాల నేలద్రాగిరి? పాల ప్రయోజనముం దెలిసికొనిన తరువాతనే దానిం ద్రాగవలయు నని యప్పుడే చెప్పియుండినట్టియిన పైనడిగినఁ ప్రశ్న నడిగియే యుండరుకదా! అప్పుడే క్షుత్తుచేఁ గృశించి నశించియుందురు. ఒక వేళ శైశవమున మాటలాడ శక్తిగలిగినదికాదని బదులుచెప్పుదురేని మాటలాడుశక్తియు మాటలాడఁగలిగిన నోరును గల యిక్కాలము నంగూడ జ్వరపీడుతులై యుండుతఱి వైద్యుడిచ్చుమందు గుణమేఱు గకయే గుటుక్కుమని మ్రింగుచున్నారు. దానియందుఁ జేర్చఁబడిన వస్తువులిట్టివియని తెలిసి దానివలనిప్రయోజనముం బరీక్షించిచూచి పిదపనే యేల మందును లోనికిం గొనరాదు? వైద్యుఁడు జ్వరమున కై యిచ్చు నౌషధము గార్దభమూత్రమైనను ఏ యాటంకము లేక లోనికిం గొనుచున్నారు. అటులనే మనమనస్సుననుండు మలమగు జ్వరమును పోగొట్టఁదలచి మహర్షులేర్పఱచిన మంత్రతంత్రములతో నిమిడిన కర్మను జేయ నేమియాక్షేపణగలదు? అగ్నియని తెలియక చేతినుంచినను దహించుస్వభావ మగ్నికిఁగలిగినట్టులే కర్మయొక్క యర్థమును మనమెఱుగకపోయినను దానిఫలము మనకు నిశ్చయ ముగ లభించుననుట కెంతమాత్రమును సందేహములేదు. స్వామి యెచ్చటనున్నాఁడు? ఆయనంజూపుము. పుణ్యమెచ్చటనున్నది?

దానింజూపుమని కొందఱసంగతములగు ప్రశ్నలడుగుదురు. మఱి కొందఱు బ్రహ్మము నెఱుగుటయననేమి? దానినెఱుగుటచేఁ గలుగు యానంద మెట్టిందును? అని ప్రశ్నలడుగుదురు. వానికి సమాధానముగ నొకయోగి యీదిగువఁ జెప్పఁబడినటుల బదులుచెప్పుచున్నాఁడు. "ఒకయూరియందిరువు రక్కసెల్లెండ్రుండిరి. ఒకర్తు పదియేడేండ్లది. వివాహమయి పురుషునితోఁగూడఁ గాపురము సేయుచుండెను. మఱియొకర్తు యారేండ్లది. దానికి వివాహము కాలేదు. అది తనయక్కనుజూచి యేమేయక్కా! నీవు నీభర్తతోడఁ బ్రతిదినమును పడుకొనియెదవే. అందుచే నీకేమి సుఖముగలదనెను. దానికేమిబదులు చెప్పవలయును? కామశాస్త్రమంతయు బోధించినను ఆఱేండ్లపిల్ల సుఖముగనఁజాలదు. కావున పెద్దది యొకయుపాయము చేసెను. ఇంకను కొన్నిసంవత్సరములు గడిచినట్టయిన నీకు వివాహమగును. నీభర్తతోడ నీవును పడుకొనునట్లు తటస్థించును. అప్పుడు నాసహాయములేక నీవుగ నాయానందము నెఱుగుదువనెను. అటులనే కర్మఫలము, బ్రహ్మానంద మిట్టిదియనువిషయము, ఈరెండును వానింజేసి యనుభవించిననే తెలియునుగాని కర్మలం జేయకమునుపే వానినిగుఱించి సంశయించువాఁడు మతిహీనుఁడే. (మనకు సాధారణముగ నుపయోగములేనటులఁ దోఁచెడి యొకయల్పవిషయమును పరీక్షించి చూచి నేను నీకు ఐదడుగులదూరమునుండి నిన్నంటక యొక సంగతిఁ జెప్పెదను. నిన్నంటలేదని నీవు తలచుచున్నావు. నేనొక మాటను చెప్పినమాత్రముననే యాశబ్దము బయటివాయువును తగులుచున్నది. వెంటనే యావాయువాశబ్దమును నీచెవికిఁ గొనిపోవుచున్నది. చెవిలోనుండు నరములు మెదడునకుం గొనిపోయి దానిమూలముగ నీమనస్సున నొకగుఱుతు కలుగఁజేయుచున్నది. ఈగుఱుతును కలుగఁజేసినందున నిన్ను నేనంటినట్లు కాలేదా? ఈప్రకారము నేను నిన్నంటనట్లు చేసికొనుటకు నీకు సాధ్యమగునా? నీవు నాతోడ సంభాషింప నవశ్యమైనట్టయిన సాధ్యపడనేపడదు. ఇదియే పర్వదినములలోను శ్రాద్ధాదికర్మలు చేయుకాలములలోను పరిశుద్ధ

ముగనుండి (బ్రాహ్మణు లితరజాతులవారితోడ భాషింపకుండుటకుఁ గారణము.) మాటల మహిమను చూడుడు. ఒకఁడు మఱియొకని బుద్ధిహీనుఁడనుచున్నాఁడు. వెంటనే వానికిఁ గోపముగలిగి వానిం గొట్టవచ్చును. శాంతమగు మంచిస్థితియందుండు నొకమనుష్యుని మూర్ఖుఁడను చిన్నపద మాస్థితిని చెడిపి కోపమును గలుగఁజేసి తన్ను తామఱచునట్లు చేసి దుష్కృత్యముంజేయునట్లు బలాత్కారపఱచి నట్టయిన వేదమునందుండు మహామంత్రములచే నుపయోగములే దని చెప్పుట మిగుల మూర్ఖ్యముకదా? ఒక స్త్రీ యేడ్చుచున్నది దానిని మఱియొక స్త్రీ అమ్మా యేడువబోకుమని యోదార్చుచున్నది. వెంటనే యా స్త్రీ దుఃఖమును నిలిపి కొంచెము సంతోషపడుచున్నది. ఇప్పుడు మాటలమహిమం జూచుచున్నావుకదా? ఇట్టి మాటలశక్తిని కనుఁగొనుట కర్మయోగుల ధర్మమైయున్నది.

మనమితరులకుఁ జేయవలసిన ధర్మమనగా వారలకు సహాయము చేయవలయునని యర్థము. మనము లోకమున కుపకారము చేయుటయనునది నిజమైనను దానిచే మనకే మేలుకలుగుచున్నది. మనము వారలకుఁ జేయు ధర్మము మనకుఁ జేసికొనుడి ధర్మమై యుంటున్నది. మనము లోకమునకుపకారము చేయవలయునని విధి కలిగియుండినను, ప్రపంచము మన సహాయము నెదురుచూడలేదు. ప్రపంచమునఁ గష్టపడువారల రక్షించుట మనధర్మమైనను, అట్లు చేయుటయందును మనధర్మమును చేయుచున్నాముగాని వేఱుకాదు. ఈప్రపంచము మంచిదియుకాదు, చెడుదియుకాదు, మనము మంచి నడత నిచ్చుట వృద్ధిపఱచుచున్నాము. ఒక్కొక మనుష్యుఁడును తన మేలుకొఱకై యొకప్రపంచము నేర్పఱచుకొనుచున్నాఁడు. బాలురు ప్రపంచమును మంచిదిగను వృద్ధులు చెడుదిగను భావించుచున్నారు. ఇరువురును మూర్ఖులే. ఈప్రపంచజీవితము మంచియు కాదు, చెడుగునుకాదు. వానివాని మతికిఁదగినటుల నిది మంచిదిగను చెడుదిగను తోచును. మిగుల ననుభవశాలియగువాఁ డీప్రపంచ మును మంచిదనియు చెప్పఁడు, చెడుదనియు చెప్పఁడు. ఇందులకు

నగ్నిని దృష్టాంతముగఁ దీసికొనెదము. చలికాలమున దానిప్రక్కనఁ గూర్చుండిన మిగుల నానందముగనుండును. అపుడు దానిని మంచి దనుచున్నాము. ఆయగ్నియే మన వ్రేలిని దహించినట్టయిన దానిని చెడుదియనుచున్నాము. అది స్వభావమున మంచిదియుకాదు చెడు దియుకాదు. ఈప్రపంచము నటులనేయున్నది. మన సహాయము లేకనే ఈప్రపంచము జీవింపఁగలదు.

అయినను మనము లోకమునకు మేలుచేయ ఋణపడియు న్నాము. మేలును చేయుటచే నితరులకుపకారము కలదని తెలిసికొ నిన మనము దాని నవశ్యము చేయవలయును. చేత చిన్నడబ్బు నుం చుకొని గొప్పమేడపై నిలచి, ఓరీ భిక్షుకుఁడా, ఇదిగో చిన్నడబ్బిచ్చె దను తీసికొనుమని గర్వముతోడం బలుకుటఁదగదు. మనము మం చిని చేయుటకైయును సద్గుణమును వృద్ధిచేయుటకైయును అను కూలముగ అయ్యో బీదవాఁడుగనున్నాఁడే యని వానికి మేలు చేయవలయును. వానికి నమస్కరింపవలయును. నీవు బిచ్చగాని కేదియో మంచిచేసిన క్షేమించుచున్నావు. బయటికట్లు తోచుచున్నదే గాని వాస్తవముగ నట్లుకాదు. నీవు ధర్మముచేయుటచే నీశ్వరుఁడు నిన్నాశీర్వదించును. అందున నీకు మేలుకలుగును. ఏవియో సత్ర ములును, చావళ్లు, శాలలును హెచ్చుద్రవ్యము పెచ్చు చేయఁబడి కట్టఁబడినట్లును, అనేక జనులకు మేలును చేసినట్టును తలంచు చున్నావు. ఒకపిడుగు పడినట్టయిన నీవు కట్టిన సత్రములును శాలలును నాశమగునే. పిదప నీవు జనులకుఁ జేసినమే లెచ్చట నుండును? పెనుగాలి గొట్టినట్టయిన నీవు కట్టిన కట్టడములు దూది పింజ లెగిరిపోవున ట్లెగిరిపోవును. కావున మనము లోకమున కేదియో యుపకారము చేసినట్టు తలంచిన తలంపును వదలవలయును. లోక ము నీవు ధర్మము చేయఁబోవుచున్నావని కాచుకొని యుండలేదు. మనమెప్పుడును మంచిచేయుటచే మనకు నిలుకడయైనస్థితి నెదరు చున్నామేగాని వేఱుకాదు. మనమొకరికి మంచిచేసినట్టు తలంచుట తప్పు. అందుచే మనకు దుఃఖము సంభవించుచున్నది. ఒకనికి మం

చిచేయునట్లు భావించి వాఁడు కృతఘ్నుఁడుగనున్నాఁడేయని తలంచు
ట వ్యసనముంగలిగించు కదా? కావున లోకమునకుఁ జేయు మేలు
నిశ్చయముగ మనకే చేసికొనునట్లు భావింపవలయును. మనము చేయు
నుపకారమునకై యితరులు ప్రత్యుపకారము చేయవలయునని తలం
చుట సరికాదు. మనముపచరించు నతిథులను దైవస్వరూపులుగ
నెంచుటయావశ్యకము. వారేకదా మనమంచివృద్ధికిఁ గారణమయి
రని తలంచి వారలకుఁ గృతజ్ఞతం జూపవలయును. మనలను సంబం
ధపఱచని మనము ఫలమును నుద్దేశింపక నన్నిటిని యీశ్వరార్పణము
చేయుట మంచిది. అందుచే మనకు దుఃఖమనునదే కలుగక మనము
మంచిస్థితిలోనుందుము. ఈ ప్రపంచమున నెల్లప్పుడును మంచిసెబ్బ
రలు మిళితమైయే యుండును. కావున మంచిని బడయునప్పుడు ప్ర
పంచమును భూషించుటయు, సెబ్బరకలుగునప్పుడు దానిని దూషిం
చుటయుఁ గూడదు.

ఒక కాలమున నొక గ్రామవాసి తనకైశ్వర్యముకలుగనలయు
ననియు నందులకై యొకపిశాచమును స్వాధీనపఱచుకొనవలయునని
యుఁ దలంచి యొక సాధువువద్దకువెళ్లి యాయనకు నమస్కరించి,
స్వామీ! ఒక పిశాచమును నాకు స్వాధీనపఱచవలయునని యడుగ
నాయన ఓరీ బుద్ధిహీనుఁడా, అవలపొమ్మని తరిమెను. వాఁడు మఱల
నేతెంచి యాయనను బ్రార్థించినందున నొకమంత్రము నుపదేశించి
దానిని నూటయెనిమిదిమాఱు లుచ్చరించిన పిశాచము ప్రత్యక్షమగు
నని పలికెను. అటులనే వాఁడుచ్చరించిన వెంటనే యొక పిశాచ
మగపడెను. అది వెంటనే వానింజూచి నాకెప్పుడును నీవు పనియి
ప్పించకపోయినట్లయిన నిన్నుఁ జంపివేయుదుననెను. గ్రామవాసియు
దానింజూచి యిదిగో ఈయరణ్యమును నాశముచేయుమనెను. అటు
లనే యరణ్యము నొకక్షణమున నాశముచేసెను. అటువెనుక నీస్థల
మున గొప్పయింటినికట్టి దానిని సకలసామగ్రిచే నిండింపుమనెను.
వెంటనే యాపిశాచమట్లే యింటిని నిర్మించి దానిని సామగ్రిచే నిం
డించెను. అందుమీఁదట నేమిపనియనియడుగ గ్రామవాసి యేపని

యును చెప్పఁదెలియక మిణకరించెను. అంతటఁ బిశాచమునకుఁగోపము కలిగి యిదిగో నీవు పనిపెట్టకపోయినట్లయిన నిన్ను మ్రింగెదనని నోరు తెఱచెను. గ్రామవాసి భయపడిపాఱిపోయెను. పిశాచియు వెంటఁదగిలి వానికిముందువచ్చి నిలచెను. తుదకు దాని యుపద్రవము నోర్వఁజాలక సాధువునద్దకు వెళ్లి మొఱబెట్టుకొనెను. ఆయన ఓరీ మూఢుఁడా, అప్పుడేచెప్పితినే. నీవు నామాటను లక్ష్యపెట్టవైతివి. మంచిది! అదిగోయుండు శునకపువాలమును నఱికి తెమ్ము. దానిని పిశాచమువద్ద నిచ్చి దానివంపును దీర్చితెమ్మని చెప్పుమనెను. ఆగ్రామవాసియు నట్లే చేయుమని పిశాచమున కాజ్ఞాపించెను. అది మిగులఁ బ్రయాసపడి తోకను సాగఁదీసి చూచెనుగాని వెంటనే యాతోఁక మరల ముడుచుకొనెను. ఇటులనే చాలాకాలమువఱకును శునకపువాలమును గుణపఱచఁ బ్రయత్నపడియు నిష్ప్రయోజనమై యది వాడుకచొప్పున ముడుచుకొనిపోవుటను చూచి వ్యసనము పొంది గ్రామవాసివద్ద కేతెంచి నిన్ను నేఁ జంపక వదలెదను. నన్ను నీవు వదలుమని ప్రార్థించి తాఁ జేసిన నిష్ప్రయోజనకార్యమును వదలెను. అటులనే ఈప్రపంచమున స్వమతమూఢభక్తులు తమ మతమునకై కష్టపడునట్లు ఇతరమతస్థులను త్రిప్పునట్లును భావించుకొని యితరుల నిందించుచు సమయమువచ్చినపుడు ప్రాణత్యాగముఁజేసికొనుచున్నారు. ఇట్టిస్వమత వెఱ్ఱిభక్తిని కుక్కతోఁకను గుణపఱచుటకు సరిపోల్పవచ్చును. ప్రపంచము మనచేఁదిరుగునని మనమెంచుట సరికాదు. ఇదివఱకును చేసినప్రసంగములో జ్ఞాపకమున నుంచఁదగు ముఖ్యయంశము లేవియన:—(1) మనమెల్లఱము ప్రపంచమునకుఁ గష్టపడ బాధ్యపడియున్నారము. లోకముమనకేమియుఁజేయ బాధ్యపడియుండలేదు. ఈ లోకమున మనధర్మమును మనము చేయునట్లీశ్వరుఁడు కరుణించియున్నాఁడేయని భావింపవలయును. లోకమునకు మనముపకారము చేయునపుడు మనకేమేలును గలుగఁజేసికొనుచున్నామను విషయమును మఱవఁదగదు. (2) ఈ జగత్తున దేవుఁ

[illegible] చరించుచున్నా

మని భావింపఁదగదు. ఈశ్వరుఁడెప్పుడు నిచ్చటనుండియే సకలజను లను రక్షించుచున్నాఁడు. ఆయన నాశరహితుఁడు. సదా చుఱుకును జాగ్రతయుగలవాఁడు. ఈ ప్రపంచమంతయు నిదురించునపుడు సహా ఆయన నిదురించుట లేదు. ప్రపంచమునఁగల సకలవిధ భావనలును మాఱుపాటులును ఆయనకార్యములే. (3) మనమెవరిపయింగాని యసహ్యపడరాదు. ఈలోకమున నెప్పుడును మంచిసెబ్బరలు మిళితమైయేయుండును. దీనులవిషయమై దయఁజూపుట మనధర్మము. చెఱుపుచేయువాని విషయమైయును మనము దయకలిగియుండవల యును. ఈలోకమే మన మంచినడతయగు మార్గమున నడచుటకు స్థానము. (4) మనము స్వమతముపై వెఱ్ఱియభిమానముకలిగి దుష్కృత్యములం జేయఁదగదు. స్వమత మూఢభక్తులు కొందఱు "మేము పాపులపై యసహ్యపడుట లేదు. వారలయందుండు పాపముపై యసహ్యపడుచున్నాము" అనుదురు. పాపిని, పాపమును వేఱుజేయువార లీప్రపంచముననుండుటరుదు. అట్లు వేఱుచేయుట సాధ్యపడదు. మతముపైని వెఱ్ఱిభక్తినివదలి శాంతముగ మనధర్మముం జేసి ముక్తింబొందవలయును.

మంచి—సెబ్బర.

మంచికార్యములఁ జేయువాఁడు ఎప్పటికిని మంచికార్యములనే చేయఁ బ్రయత్నించును. చెడుకార్యములఁ జేయువాఁ డెప్పుడును చెడుకార్యములనే చేయఁ బ్రయత్నించును. ఇందుల కేమికారణము? మనముచేయు నెక్కొకకార్యమును మనవద్దనే చేరునట్లు మనము చేయుకార్యము నితరులయందును జేరును. వారలు చేయు కార్యము మనయందును జేరును. నేనొకపని చేయునప్పుడు నామనస్సున కదలిక కలుగుచున్నది. ఇదేస్థితియందుం డన్నిహృదయములు నీ కదలికచేత కదలును. కావున మనము మంచిచేయుటచే మనకేగాక యితరులకు నుపకారము చేసినవారమగుదుము. చెఱుపు చేయుటచే మనకును ఇతరులకును చెఱుపు చేయుదుము.

మనము చేయుదుష్కృత్యము నూరుసంవత్సరములు గడచి మన సంతతివారిని బాధించుటయు గలదు? అయమును కాంతమాకర్షించు నట్లు మన హృదయముయొక్క స్థితినిపోలిన మఱియొకని హృదయము కూడ మనము చేయుకార్యములను, తలంచెడి తలంపుల నాకర్షించుచున్నది.

కర్మయోగమునఁ జెప్పఁబడినప్రకార మొక్కొక కార్యమును దానిఫలమును బడసిన తరువాతనే విడువనగును. మంచికార్యముం జేసినట్టయిన మంచికలుగును. చెడుకార్యముజేసినం చెడుగేకలుగును. నేను పాపముచేసినట్టయిన దానిఫల మవశ్యమనుభవింపక తప్పదు. దాని నడ్డుపఱప నెవరితరమునుకాదు. కారణముండిన కార్యమును వెంటనేయుండదా? మనము చేయు ప్రతికార్యమునందును మంచి చెబ్బరలు కలిసియేయుండును. కడవఱకును మంచికార్య ముండఁజాలదు. ఇందులకొకదృష్టాంతముఁ జెప్పెదను. నేను మీతోడ భాషించుచుండునపుడు మీకేదియో మంచినిజేయునట్లు భావించెదను. ఇదేసమయమున నాకసముననుండు నల్పములగు చిన్నపురుగులు నావల్ల కలిగెడి యుష్ణవాయువుచే దహింపఁబడుచున్నవి. కావున మీకుపకారముఁజేయఁదలంచినప్పుడే యాకసమునఁ గన్నులకుఁగానరాక యెగురుచుండెడి చిన్నపురుగులను వధఁజేయుచున్నాను. కనుక కడవఱ్ఱ మంచికార్యముండనేరదు. మంచికార్యము జేయునప్పుడు చెడుకార్యమొకటి సందర్భించుటయు, చెడుకార్యము జేయునప్పుడు సత్కార్యమొకటి కానఁబడుటయును గర్మయోగలక్షణము.

ఇందుచే మనమితరులకుఁ గీడుఁజేయుచునేయున్నామని యేర్పడుచున్నది. (మనము లోనికింగొను నొక్కొక పిడిచెడన్నమును మఱియొకనివద్ద నపహరించినదే. మఱియొకఁడు భుజింపంగొనిపోయెడియన్నమునే మనమూడబెఱికికొని నోట వేసికొనుచున్నాము. కావున నెవ్విధమైన కర్మను జేసిన నందుచే నెవ్వరికైనం గొందఱికి బాధకరముగనుండకఁబోఁజాలదు. నీవెన్నిసంవత్సరములు కష్టించి

క్తైనం గొందటికిఁ గీడుకలుగుననుటయు నందుచేఁ బాపములు నిన్నుం జుట్టుకొనుటయు నిశ్చయము.

అందుచేఁ గర్మముఁ జేయవలసినదనుటకుఁ దాత్పర్యమేమి? కర్మములనన్నింటిని ఫలమును గోరకయే యీశ్వరార్పణముగఁ జేసినట్టయితేనేగాని కర్మముచే ముక్తిని బొందజాలము. జ్ఞానము, భక్తి, కర్మ అనువాని పర్యవసానమొక్కటియే. "నేను" అను వ్యవహారమునువదలి యంతయు "నీవు" అని చెప్పనదే కర్మయోగపుగుణము.

ఈ ప్రపంచమున మనుష్యులలో మూడు తెగలు గలవు. (1) తమప్రాణము నిచ్చియైన నితరులకుపకారము చేయు దైనమహిమగల సాధువులు. ఈ తెగసాధువులు నూరుగురుండిన నందఱను కడ తేరవచ్చును. (2) తమకు మేలుకలుగఁజేసికొనుచు నితరులకునుపకారముచేయువారలు. (3) తమకు మేలుకలుగుటకొఱకై యితరులకుఁ జెఱుపుచేయువారలు. ఈ మూడు తెగలుగాక నాల్గవతరగతియు గలదు. వారలు తమకు మేలుకలుగకయుండినను వృధాగా నితరులకుఁ గీడుఁజేయ నాసఁగొనువారలు. వారలకే ప్రయోజనము లేకపోయిన నితరులకుఁ గీడుఁజేయుటయే వారల స్వభావము. ఈ భావము గల పద్యమొక్కటి భర్తృహరి తననీతిశతకమున వ్రాసియున్నాఁడు:-

"తమకార్యంబుఁబరిత్యజించియుఁ బరార్థప్రాపకుల్ సజ్జనుల్ ।
తమకార్యంబుఘటించుచుం బరహితార్థవ్యాపృతుల్ మధ్యముల్ ।
తమకై యన్యహితార్థఘాతుకజనుల్ దైత్యుల్ వృధాన్యార్థభం ।
గముగావించెడువారలెవ్వరొ యెఱుంగం శక్యమే యేరికిం ॥"

నేను, నా సంబంధమైనది, అను వ్యవహారములు ప్రవృత్తి యనఁబడును. సాధారణముగ జనులకందఱికిని ప్రవృత్తిమార్గమే యలవాటయియున్నది. ఈ మార్గమును విడువఁ బ్రయత్నించిన నివృత్తికలుగును. ఈ నివృత్తియే యెల్లమతములకు నాధారము ఇదియే మంచికి మూలమగును. సకల కర్మలయందును మంచియు చెడుగును కలిసియుండుటచే మనము కర్మనెట్లుచేయనగును? ఎవ్వఁ

మున ముక్తిఁ బొందదగును? ఈ ప్రశ్నలకు జైనులు మృతినొందు టయే ముక్తియందురు. భగవద్గీతలలో నిందులకు సమాధాన మీ దిగువ వ్రాయువిధముగఁ జెప్పఁబడియున్నది. "నీవు ప్రపంచమునుండి వేఱుగా నుండునట్లు భావించి యందు నీవుచేయుకార్యములను నీకని చేయకయు, ఫలమునుద్దేశింపకయు చేసినట్టయిన నీకు మితిమీరిన మేలుకలుగును. మోక్షమును కలుగును." ఈ శ్లాఘ్యమగు వాక్య ప్రకారము మనము నడచుకొనవలయును. నీవు నీకుగాను సత్కర్మను చేసినట్టయిన దానివలన మంచిఫలము నిన్నుబొందును. నీవు నీకు గాను దుష్కార్యముఁ జేసినట్టయిన దానివలన చెడుఫలము నిన్ను బొందును. నీవు నీకనిగాక ఈశ్వరప్రీతిగ మంచి చెడుగులనుఁ జేసి నట్టయిన వాని పుణ్యపాపములు నిన్నంటవు. కావున కర్మయోగ మున "ప్రపంచమును వదలకుము. ప్రపంచమునందే వాసముచేసి నీవల్ల సాధ్యమైనంతవఱకు అందుండియే యనుభోగించుము. నీసుఖ మునకై యొక కార్యమునుం జేయకుము. సుఖమనుభవించుటయే ముఖ్యమని భావింపకుము. నీయందుండు నహంకారముం బోనా డుము. పిదప ప్రపంచమననుభవింపుము" అని చెప్పంబడియున్నది. మూఢులగు తలిదండ్రులు తమబిడ్డలకీదిగువఁ జెప్పఁబడురీతిగ నుపదే శించుచున్నారు. "దేవుఁడు నాకుగా నీప్రపంచమున సూర్యచంద్రు లను సృజించెను." అనునట్లు దేవునకు వేఱుపనిలేక వీరలబిడ్డలకై యీ ప్రపంచమును సృజియించినట్లు భావించుకొనుచున్నారేమో. మఱియు గొందఱు మతిహీనులు "ఈ ప్రపంచము మనుష్యునికై సృజియింపఁబడినది. ఈపశు పక్ష్యాదులు మనుష్యులకాహారముగ భగవంతుఁడు సృజించియున్నాఁడు" అని చెప్పుచున్నారు. అట్ట యిన పులులన్నియు భగవంతునిఁ జూచి "స్వామీ తమరు మాకా హారముగ మనుష్యులను సృజించితిరి. ఆ పాపులు మా సమీపము నకువచ్చి యాహారమయి తమ నిబంధనను నెఱవేర్చుటలేదు కా వున తమరు వారలను దండింపవలదా? అని జపమొనర్పనగును.

మునకై సృష్టింపఁబడియున్నాము. మన సుఖమునకై లోకము సృజింపఁబడినదని చెప్పుట మతిహీనము. ఒక్కొకసంవత్సరమును కోటానుకోటులు మనుష్యులు దీనిని వదలిపోవుచున్నారు. ప్రపంచము వారలకై వ్యసనపడుటలేదు. కావున నీకర్మను నీవుచేయుటకై మొదట నీకందుగల సంబంధమును వదలించుకొనుము. నా యాచార్యుఁడు "నీబిడ్డలవిషయమై నీవు దాదియుండునట్లుండుము" అని పలుమఱు చెప్పుటకలదు. నీబిడ్డలను రక్షించుటకై నీవు నియమించుదాది పనియందుండునంతవఱకును నీబిడ్డను తనబిడ్డవలెనే భావించి బిడ్డశిరస్సు నాఘ్రాణించి మిగులఁ బ్రేమతోడ నాడించుచుం బెంచుచుండును. దానిని నీవు పనినుండి ద్రోసినతక్షణమే దానికి నీబిడ్డయందుండు ప్రేమయు తుట్టమర విడి పోవుచున్నది. అటులనే నీ భార్యా పుత్రాదులయందు నీకు మితయాశగలిగి యుండవలయును. దానికన్న నధికయాశయుంచుట మనోచంచలనమునకుఁ గారణమగుచున్నది.

ముందుకాలమున వ్యాసులను మహర్షియొకరుండిరి. ఆయన యొక్క పూర్వీకులందఱును ముక్తులగుటకుఁ బ్రయత్నించియు విఫలమాయెను. ఆయనయు పూర్ణమగు ముక్తిఁబడయఁ జాలఁడాయెను. అయితే ఆయనపుత్రుఁడగు శుకులు బ్రహ్మముంబొందిరి. ఆశుకులు చిఱుతప్రాయముననుండునపుడు జ్ఞానయోగమును నేర్చుకొనుటకై జనకమహారాజువద్దకుఁ బంపఁబడెను. జనకునకు విదేహుఁడనియు పేరు. ఆ జనకుఁడు రాజుగానుండియు తన్నుఁదాస్థూలమని భావింపక నాత్మగనే భావించెను. ఆయనజ్ఞానముం బొగడనివారు లేరు. శుకులు వచ్చుచున్నారని జనకరాజెఱిగియు నాయనను లోనికాహ్వానము చేయకయు నుపచరింపకయు నుదాసీనముగనుండెను. శుకులు మూఁడు రోజులు కోటవాకిటఁగాచియుండెను. ఆయనను బిలచికొనిపోవ నెవ్వరును రారైరి. నాల్గవరోజు రాజుయొక్క మంత్రిప్రధాను లొకయందమగు పల్లకిం గొనివచ్చి శుకులనందు గూర్చుండఁబెట్టుకొని నగరికిం గొనిపోయి ఏడురోజులపర్యంతము దివ్యభోజనముతోడ విందొనర్చిరి.

ఎనిమిదవరోజున జనకరాజువద్దకు శుకులంగొనిపోవ నాయన తన మొగమున వ్యసన సంతోషచిహ్నములు లేక యొకే తన్మయావస్థయందు గంభీరముగనుండెను. ఆసభయందుండు ఆటపాటలను శుకులావంతయేనిం గమనింపరైరి. వెంటనే జనకమహారాజు ఒకపాత్రమును పాలచేనిండించి దానిని శుకులచేనిచ్చి దానిం గొంచెమేని చిందక నీసభనేడుమాఱులు చుట్టుడనిచెప్పెను. అప్పుడు సభయందుండు రంభవంటివేశ్యలు కేళికనర్తనాదుల నొనర్చిరి. ఒక్కొకవస్తువును నేత్రములకు మిఱుమిట్లు గొలుపునట్లుండెను. సంగీతనాదమాగెను. ఇంకను మనోహరములగు యనేకవిధయాటలన్నియు జఱిగెను. శుకులు దేనినిం గమనింపక పాలతోనిండిన పాత్రము చేకొని సభనేడుమాఱులు చుట్టి జనకరాజువద్ద కేతెంచిరి. ఆయన శుకులకు నమస్కరించి స్వామీ, తమరు దివ్యజ్ఞానులు తమరు నావద్ద కాచియుండవలసిన యవశ్యమే లేదని పంపిరి. ఇటుల సర్వసద్విషయముల హృదయమున నిలుపువానిని పాపము లేమిచేయఁగలవు? ఎవ్వనికేవస్తువునం దాశయుంచని నిర్మలమనస్సుగలదో వాఁడే ప్రపంచమున వసింపఁదగినవాఁడు.

ముక్తి.

ఫలమునిచ్చునదియు, తలంపును కర్మమని చెప్పఁబడును. ముందుచేసిన కార్యముయొక్క ఫలము కర్మమే. ఏలనన నీఫలము ననుభవించుటచేత మఱియొకఫలము కలుగును కావున కర్మమను నది కారణకార్యముల రెంటిని సూచింపుచున్నది. ఇట్టికర్మ సకల ప్రాణులయందును కలదు. దీనిం దప్పింప నెవరికిని సాధ్యపడదు. కారణకార్యము లొకటివెంబడి మఱియొకటికలుగునది నిజమైన పక్షమున మొదటఁ జెప్పఁబడినదానిని కారణమనియు, పిదపఁ జెప్పఁబడినదానిం గార్యమనియుఁ జెప్పుచున్నాము. పైఁజెప్పఁబడినవానినే న్యాయశాస్త్రజ్ఞులు వ్యాప్తియనుచున్నారు. ఒకదానినుండి మఱి [illegible] చెప్పుదురు.

మనచిత్తమున నొకతలంపు గలిగినపుడు దానింబోలిన తక్కిన తలంపులు నుదయించుచున్నవి. జనకుఁడను తలంపు మనహృదయమున నుదయించిన బిడ్డయను తలంపుకూడఁ బుట్టుచున్నది. దీనినే సంస్కృతమున వ్యాప్తియందుము. కార్యకారణములనునవి మనహృదయమున నుదయించునవేగాని బయటనుండి వచ్చునవికావు. ఎప్పుడును క్రమముగ (అనగా) నొకటివెంబడి మఱియొకటి కలుగుభావనలు మన మనస్సుచే గ్రహింపఁబడుటకు సులభమైనవిగ నున్నవి.

మనుష్యుఁడు మరణము నొందుచున్నాఁడు, రాత్రింబగళ్లు మాఱిమాఱి వచ్చుచున్నవి, అనునివ్విషయము లెప్పుడును నిశ్చయములైనవి. అనగా, పైనఁ జెప్పఁబడినవిషయము లీప్రపంచమున నెప్పుడు నుండఁదగినవి. ఈ ప్రపంచమనునది దేశకాలనిమిత్తములచే మనము తెలియఁగూడిన కొంతభాగమునుమాత్రమే నిర్దేశించుచున్నది. కావున నీభాగమునే ప్రపంచమనినట్టయిన దీని కావల నుండు తక్కినభాగములలో కార్యకారణములను వ్యవహారము లేదని యేర్పడుచున్నది. ఏలనన కార్యకారణములనునవి మనహృదయములో సంబంధించిన విషయములగుటచే దానికందని లోకము యొక్క తక్కినభాగములయందుండ సాధ్యపడదు. మనహృదయమునకును పంచేంద్రియములకు నావలనుండు లోకమున వ్యాప్తి యనునదే లేదు. నామరూపములేని వస్తువు నెవ్విధమగువస్తువైనను బాధింపఁజాలదు. దేశకాలనిమిత్తము లుండునందనుక మోక్షమనువ్యవహార ముండనేరదు. ఈప్రపంచ మెవరిచే నిర్మింపఁబడినదనియు, దేనిపైనున్నదనియు నెచ్చటికిఁ బోవుచున్నదనియు ననేకులడుగుదురు. ప్రపంచము దేశకాలనిమిత్తముల కతీతమగు బ్రహ్మమునందుండి కలిగినదనియు బంధముపైనుంటున్నదనియు మఱల బ్రహ్మమునందె లయించుచున్నదనియు శాస్త్రములు ఘోషించుచున్నవి. మనుష్యుఁడు తానే బ్రహ్మమనుటను మఱచి యీప్రపంచమునందు నల్పవిషయములగు సంతోషము, దుఃఖము, ఓర్పు మొదలగు గుణములను స్వీకరించుకొని ఈప్రపంచసుఖమే ఘన

మని తలంచుచున్నాఁడు. పలుమాఱు వియోగమునుబొందు నాశను గొనుచున్నాఁడు. మోక్షముఁ బడయవలయు నేని ఈప్రపంచమును విడనాడవలయును. ఏలనన దేశకాలనిమిత్తములకు లోఁబడిన నీ ప్రపంచమున మోక్షములేదు. మన పంచేంద్రియములను మనస్సునుపోఁగూడిన నేస్థలమునను మోక్షములేదు. జన్మమున మనకాశరహితముకానియెడ మోక్షమబ్బుట దుర్లభము. కావున బంధమునుండి విడుదల కావలయుననినట్టయిన నీప్రపంచమును విడనాడవలయు.

అయితే ఈప్రపంచమును వదలుట సులభమైన విషయము కాదు. మిక్కిలి కొందఱే యట్లుజేయగలుగుదురు. మన శాస్త్రములయందుఁ జెప్పఁబడినట్లు ప్రపంచము వదలుటకు రెండుమార్గములుగలవు. ఒకటి "నేతినేతి" (ఇదికాదు ఇదికాదు) అనునది. మఱియొకటి, "ఇతి ఇతి" అనునది. మొదటిమార్గము ననుసరించుట యసాధ్యము. అందఱిచేతను గానేరదు. ఒకేనిలుకడగనుండఁ గూడి, వైరమును విడనాడిన హృదయముగలవారలగు మహనీయులకే నేతిమార్గమలవడును వారలకు శరీరము, మనస్సు లోఁబడి ప్రవర్తించును. అయితే యట్టి మహనీయులు మిగులఁ గొందఱేగలరు. తక్కినవారలందఱును ఇతి మార్గమునే యనుసరింతురు. ముంటిని ముంటిచేతనే తీయునట్లు ప్రపంచబంధముల నాబంధములచేతఁ ద్రెంచుదురు. దీనిని విడుఁ వలసినదే. అయితే ఈమార్గమున ముక్తిఁబడయఁ బెద్దకాలంబగును. మొదటిమార్గము జ్ఞానమార్గమనియు, రెండవది కర్మమార్గమనియుఁ జెప్పఁబడును.

కర్మయోగమననేమి? కర్మయొక్క రహస్యము నెఱుగుటం కర్మయోగమనఁబడును. ప్రపంచముననుండు నందఱును కర్మను యుచున్నారు. ఎందులకై చేయుచున్నారు? మోక్షముఁబొందుట: తెలిసియో తెలియకనో పిపీలికాదిమనుష్యపర్యంతము సమస్తప్రాణులును మోక్షముపొందుటకై యే కర్మను చేయుచున్నారు. ఒకొ

ర్యచంద్రాదులు బంధమునుండి విముక్తిఁబొందఁ బ్రయత్నించుచు న్నారు. కర్మ నేప్రకారము చేయవలసినదనుదానిని కర్మయోగముఁ జమవుటచేఁ దెలిసికొనుదుము. ఈప్రపంచమున మనము కొన్నిరో జులే జీవింప సాధ్యమగుననియు నిచ్చటనుండు సుఖదుఃఖముల నను భవించియే కావలయుననియు నీప్రపంచమున కావలనే మోక్షముగల దనియు నామోక్షమును బడయుటకు మనలను సంబంధపఱచుకొనక నీశ్వరార్పణముగ సర్వకర్మలంజేయవలయుననియు కర్మయోగి తెలిసి కొనుచున్నాఁడు. బంధముచేతనేగాని కర్మచేత దుఃఖము కలుగనేర దని కర్మయోగి యభిప్రాయము. మనముచేయుకర్మను మనము సం బంధపఱచుకొనినట్టయిన నందుచేఁగలుగు సుఖదుఃఖఫలములు మన లను బొందును. ఇతరులపోలికపటము మందుచుండుటఁజూచు మన మంతదుఃఖపడుట లేదు. మనపటమే కాలినట్టయిన మనకుగల వ్యసన మింతయని జెప్పనలవిగాదు. ఏల? రెండును అందముగలపటములే కదా? ఒకటి కాలినట్టయిన కొంతదుఃఖము మఱియొకటి కాలినట్ట యిన నధికవ్యసనముంబొందనేల? ఏలనన నొకపటమితరులదనియు మఱియొకటి మనదనియుఁ దలచుటయే కారణము. ఏదైన నొక వస్తువును నాదని చెప్పుటచే వెంటనే నాకు దుఃఖముగలుగుట నిజమే. నాశరీరము నాబిడ్డ నాగృహమని చెప్పుదుము. శరీరము నీదియు కాదు నాదియుకాదు. ఇతరులకును సొంతముకాదు. ఈశ్వరాజ్ఞచే నవి వచ్చుచుం బోవుచున్నవి. మనము సాక్షియేగాని వేఱుకాదు. బంధము లేకుండుటయే యోగముల కన్నిటికిని పునాది. గృహము లను సొగసగు వస్త్రములను మంచి భోజనవస్త్రములను వదలి యడ వికిఁబోవువాఁడు ఆశను వదలినవాఁడు కానేరఁడు. వాని శరీరముపై వానికాశఁగలిగియుండనగు. దానిం బోషించుకొన వాఁడు పాటుప డును. కావున బంధములేదనుట మనస్సును సంబంధించియున్నదే గాని శరీరమునకు సంబంధింపలేదు. సింహాసనమునఁ గూర్చుండి యుండు నొకమనుష్యుఁడు బంధములేక యుండవచ్చును. చింపిగుడ్డల దగించి వచ్చుమనుష్యుఁడు బంధముకలిగియుండవచ్చును. మనలను

మనము చేయు సకలకార్యములను ఈశ్వరార్పణము చేయుట మిగుల శ్లాఘ్యము. ఒక భక్తుఁడు చెప్పుచున్నాఁడు:—"నేను ద్రవ్యమును వెదకఁ గమకించితిని. నీవే నాకు ద్రవ్యమైతివి. నన్ను నీకే యర్పణముఁ జేసెదను. నాయాశకుం దగిన నొకని వెదకుటకు వెళ్లితిని. నీవే నా యాశకుఁ బాత్రుఁడవైతివి. నీకే నన్ను దత్తముఁ జేసెదను. నీవు తప్ప నాకు వేఱువస్తువక్కఱలేదు." ఇట్లనే మనము ప్రతినిత్యమును ఈశ్వరునింగూర్చి జపింపవలయును. ఇందులకుఁ బ్రమాణముగ నొక భక్తుఁడు వ్రాయుచున్నాఁడు:—

శ్లో॥ నాహంవందేతవచరణయోర్ద్వంద్వమద్వంద్వహేతోః
కుంభీపాకంగురుమపిహరే నారకంనాపనేతుం।
రమ్యారామామృదుతనులతానందనేనాపిరంతుం
భావేభావే హృదయభవనే భావయేయంభవతం॥
నాస్థాధర్మే నవసునిచయేనైవకామోపభోగే
యద్యద్భవ్యం భవతుభగవన్ పూర్వకర్మానురూపం।
ఏతత్ప్రార్థ్యం మమబహుమతం జన్మజన్మాంతరేపి
త్వత్పాదాంభోరుహయుగగతానిశ్చలాభక్తిరస్తు॥
దివివాభువివామమాస్తు వాసోనరకేవా నరకాంతకప్రకామం।
అవధీరితశారదారవిందౌచరణౌతే మరణేపి చింతయామి॥

కర్మయోగమును జక్కఁగ ననుష్ఠించినవాఁడొకఁడుండెను. ఆయనయే గౌతమశాక్యముని యను బుద్ధుఁడు. ఆయన "నేనీశ్వరుని గుఱించి యోచింపలేదు. మంచిని చేయుము, మంచివాడుగనుండు మనెడి సిద్ధాంతమునే నేననుసరించెదను. ఈసిద్ధాంతము ననుసరించు వారలు మోక్షము బొందుదురు" అని చెప్పియున్నాఁడు. ద్రవ్యముం బ్రఖ్యాతికై యును, మఱిదేనికై యునుగాక, తమను సంబంధపఱచుకొనక ఈశ్వరార్పణముగనే సకలకర్మలం జేయు మహానుభావులే కర్మయోగులు.

ఓమ్

శ్రీశాన్తానన్ద

సరస్వతీస్వామినశ్చరణారవిందాభ్యాంనమోనమః.

సువివేకదర్పణమ్.

సకల ముముక్షు జనానుకూలంబుగ నుండుటకై

ప్రచురింపఁబడియె.

విక్రయమునకుగాదు.

Madras:

PRINTED BY THOMPSON AND CO.,
161, POPHAM'S BROADWAY.

1896.

ఓమ్

సువివేకదర్పణమ్.

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీసుద్దత్తాత్రేయగురు పర్యాలిపారంపర్య శ్రీమత్సద్గురుసదానంద సరస్వతిస్వాములవారి శిష్యులగు శ్రీమత్సద్గురు శాన్తానన్ద సరస్వతీస్వాములవారిని, ముముక్షువులగు కొందరు తమ సంశయనివృత్తికై అప్పుడప్పుడు ప్రశ్న చేయగా వారు కరుణగలిగి సంశయనివృత్తికై ఆయాఅవసరమున ప్రత్యుత్తరమిచ్చిన వేదాన్తశాస్త్రములయందలి విషయములలో కొన్నియంశములను ముముక్షుజనంబుల కత్యంతోప యుక్తంబుగ నుండునని దలంచి వారి శిష్యులలోనొకరు సన్మార్గబోధిని పత్రికకువ్రాసిబంపి ఆవల దానినెత్తి పుస్తకరూపముగ బళ్లారిశారదాముద్రాక్షరశాలయందు యచ్చొత్తించి ముముక్షువుల కిప్పింపబడెను. ఆ కాపీలైపోయినందున 1896-వ సం॥ జూన్ నెల మఱికొన్ని అంశములచేర్చి చెన్నపురి తామ్సన్ కంపినియను ముద్రాక్షరశాలయందు భాగవతాగ్రగణ్యులును "పరోపకారార్థమిదం శరీరం" అను వాక్యానుభవముగల కొందఱిసహాయముచే బ్రకృతమున అచ్చొత్తింపబడియె. విక్రయమునకుగాదు. శబ్దదోషఅర్థదోషాదులను గమనించలేదు. దీనియం దట్టి దోషాదులుండినను, తమ బిడ్డలయొక్క మృదు మధురాలాపములతప్పులున్నను ఒప్పులుగాభావించి ప్రీతితోడ నపేక్షించునట్లు సులభోపాయముగ జెప్పబడిన పరబ్రహ్మైక్యజ్ఞానమును సాధించునట్టి సంగతులను గ్రహించి, సదాచార నిరతులై, అహంకార వర్జితులై, దిగ్దేశ కాల వ్యవస్థలులేక సచ్చిదానంద వస్తువునందు గలిసి సదానంద సాగరమున మునిగి సంతతము సమాధినిష్ఠులై కృతార్థత నొందుదురని ప్రార్థించెదము.

శ్లో॥ నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం।
విశ్వాతీతం గగన సదృశం తత్త్వ మస్యాది లక్ష్యం।
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షి భూతం।
[illegible] సద్గురుం తం నమామి॥

"నీచోవదతి నకురుతే నవదతి కురుతే సజ్జనః"

ధర్మోవర్ధతివర్ధతి

ఓమ్.

* శ్రు " ప్రమాదో బ్రహ్మనిష్ఠాయాం న కర్తవ్యః కదాచన
ప్రమాదో మృత్యురిత్యాహుర్విద్యాయాం బ్రహ్మవేదినః"

(అధ్యాత్మోపనిషత్)

"దైవేబలేదుర్బలే"

శ్రు "సద్భావవాసనాదార్ఢ్యా ద్వాసనాలయమశ్నుతే"

---

* బ్రహ్మనిష్ఠయందు అజాగ్రత కలిగి యుండగూడదు-అట్టి అజాగ్రత మృత్యువువలె వినాశకరమని బ్రహ్మవేత్తలు చెప్పెదరు.

ఓమ్.

శ్రీమత్సద్గురుశాన్తానన్ద సరస్వతీస్వామిసచ్చరణార

విన్దాభ్యాం నమోనమః.

సువివేకదర్పణమ్.



౧ "తా వనమబ్రువన్నా యతనంనః ప్రజానీహియస్మిన్ ప్రతిష్ఠితా అన్నమదామేతి తాభ్యోగామానయత్తా అబ్రువన్న వైనోఽయ మలమితి తాభ్యోశ్వమానయత్తా అబ్రువన్న వైనోఽయమల మితి తాభ్యఃపురుషమానయత్ తా అబ్రువన్ సుకృతంబతేతి" "దుర్లభోమానుషోదేహః" "దేహోయంమానుషోజన్తోః బహుకష్టైక సాధనం" ఇత్యాదిశ్రుతి స్మృతి ప్రమాణములరీతిని లోకమునందుండు జంతుజాలములోనంతయు, మానవజన్మము ఉత్తమము. అదిజన్మాంతరసుకృతపరిపాకవిశేషముచేతఁగలుగవలసినదేగాని మఱియొక దానివలనఁ గలుగునదిగాదు. అట్టిదుర్లభమైన జన్మము లభించియు యథార్థజ్ఞానము పట్టువడకపోయిన నది వ్యర్థమైపోవును. కాబట్టి "ఉత్థాయోత్థాయబోద్ధవ్యంమహద్భయముపస్థితం,మరణవ్యాధి శోకానాంకిమద్యనిపతిష్యతి" అను ప్రమాణముచేత బుద్ధిమంతులైన మానవులుప్రొద్దు పొడుపున లేచినతోడనే యీశరీరమనిత్యమనినిన్న "స్వప్నేస్వాంతర్గతంవిశ్వంయథాపృథగవేక్షతే,కోజాగ్రతి విశేషోస్తి జగదేతద్విమృశ్యతాం"అనురీతినిస్థూలదేహావస్థయైనజాగ్రత్తలోనున్న ప్పుడుతాముచూచినదేవతలు-రాజులుమొదలగువారును- తామువిన్న దేవేంద్రాదివృత్తాంతములును-ఆలోచనచేసిన-సమస్తవిషయములును సూక్ష్మదేహావస్థయైన స్వప్నములోతమకేతోచినట్టుగా,తమచేతచేయ

బడిన పుణ్యపాప మిశ్రకర్మఫలములు మఱుసటిజన్మమున తామనుభవించుటకై సూదివెంటదారమువచ్చినట్టుగాతమవెంటతప్పక వచ్చునని యోచించియథార్థజ్ఞానమవలంబించవలయును-దేహేంద్రియాదిప్రపంచమునకంతకును విలక్షణమైయున్న ఆత్మస్వరూపమును దెలిసికొనుటయేయథార్థజ్ఞాన మనఁబడును. ఇట్టి యథార్థజ్ఞానము బోధించుటకొఱకు శ్రుతిస్మృతి పురాణేతిహాసములు యేర్పడియున్నవి. ఆ శ్రుతిస్మృతిపురాణేతిహాసములయందుకర్మ,భక్తి,జ్ఞానములను మార్గములను మూఁటిని క్రమముగఁ బ్రతిపాదింపఁబడియున్నవి. వాటిలో నొక్కొక్కటియును మనఃపరిపాకమునకుఁ దగినట్టుగ మనుజుల కనుసరింపఁ దగినదై యుండును. పూర్ణముగ అజ్ఞానమున మునిఁగియున్న వారికి దేహమే తామనియు, దృశ్య ప్రపంచమంతయు నిత్యమనియుఁ దోఁచుట సహజము. గనుక అట్టివారవశ్యముగ మనశ్శుద్ధికొఱకు సత్కర్మాచరణమునం దిచ్ఛగలిగి వర్తింపవలసినది. వారికంటెఁ కొంతయెక్కువ వివేకముగలవారికి జీవమే తామనియు,దృశ్యప్రపంచమంతయు కాలక్రమమున వేఱురూపముగ మాఱుటవలన నిత్యమనియు దోఁచుట నైజము. గనుక అట్టివారు సత్వగుణ విశిష్టులై భక్తిమార్గ ప్రవిష్టులై వర్తింపవలసినది. ఆవల తీవ్రమోక్షేచ్ఛ బుట్టును. అట్టిముముక్షువులుఆత్మతత్వమునువిచారింపవలసినది. పురాకృత సుకృత విశేషముల కనుగుణ్యముగఁ గొందఱికి జ్ఞానమార్గము సులభముగనుండును, కొందఱికి భక్తిమార్గము సులభముగనుండును. కర్మముల నాచరింపకున్న భక్తి కుదురదు. భక్తి కుదురకున్న జ్ఞానముసిద్ధించదు. సగుణము లవణమువంటిది. నిర్గుణము జలమువంటిది. జలము లవణమగునన్న విషయ మందఱికిఁ దెలిసినదేగదా ? కావున జ్ఞానము సిద్ధింపకున్న ముక్తి గలుగదు. కర్మ పిండివంటిది, భక్తి

సించుచు తానే బ్రహ్మమని అహంకరించి జ్ఞానయోగమును బూని సుఖించక - సద్భక్తిని జ్ఞానయోగమును నిరాకరించువారు జననమరణము లనెడి అలలుగల సంసారనదీ ప్రవాహమందుమును ఁగుచు తేలుచు,అనేకదురవస్థల ననుభవించుదురనియు అనంతకల్పాంతరములు గడచినను వారికి భగవదనుగ్రహము లేశమైనఁగలుగనేర దని శ్రుతిస్మృత్యాను సారముగ పెద్దలు నుడివెదరు. మఱియు భక్తి మార్గము బాల్యమనియు, కర్మయోగము లేక యోగమునకు పూర్వార్థానుసంధానము యౌవనమనియు - జ్ఞానము, తత్సంబంధ జ్ఞానయోగము, అనఁగా యోగమునకు త్తరార్థానుసంధానము, లేక మౌననిష్ఠ నవలంబించి నీవు నేననెడి ద్వైతభావమునుమాని తుర్య దృష్టిఁగలిగి నిర్మలత నొందియుండు ఆనందము ననుభవించుట వార్థకమనియుఁ జెప్పఁబడును. బాల్యావస్థయందును, వార్థికావస్థయందును, అహంకార మమకారములుడిగియున్నట్లు భక్తి, జ్ఞానముల నవలంబించిన యవసరమున అహంకార మమకారములు మొదలగు వికారములు బొత్తిగ నణఁగియుండుననియు- యవ్వనమునందహంకారము తలచూపుట సహజమైనట్లు యోగముయొక్క పూర్వార్థానుసంధానము నుపక్రమించినవారికిశాపానుగ్రహ శక్తిగలవారమనియు, అణిమాదిసిద్ధులు బొందినవారమను అహంకారము మనస్సునందు తలచూపు చుండును.వారికి నిత్యానందానుభవము దూరమయ్యే యుండును. ఎవరికి జ్ఞానసంపదను బొందవలెనని ఇచ్ఛగలిగినదో అట్టి ముముక్షువులు "శుభస్యశీఘ్రం" అనురీతిని శీఘ్రముగ ఆత్మతత్వమును విచారించవలసినది. ఆత్మతత్వ మలవడిన పక్షమున అద్వితీయభావము సిద్ధించుననుటకు సందేహములేదు. ఆత్మతత్వము నెఱుంగుటకుఁ దత్వజ్ఞానమవశ్యముగ కావలసినది. తత్వజ్ఞానమనఁగా, ఘటమును తత్కారణమగుమృద్ద్వ్యతి రిక్తముగాదని యథార్థస్వరూపమునుగుత్తెఱుఁగు

నట్టు "బ్రహ్మణోన్యంనకించన" "వికారభ్యాయమానోపి ప్రత్యా గాత్మానమంతరా। న్ననిరుప్యో స్త్యణురపిస్వాచ్ఛేచ్ఛిత్సమ ఆత్మవత్" ఇత్యాది అనేకప్రమాణములనుబట్టి ప్రపంచమునానావికారములుగా తోచుచున్నను దానినిచూచెడు ప్రత్యగాత్మయే అదిగాని, వేఱుకాదని షడ్విధలింగములచేత ప్రబలశ్రుతుల తాత్పర్యముగ్రహించి- నిధిధ్యాసమునకు దెచ్చుకొని ఆనందించుటయే తత్త్వజ్ఞానము. ఆప్రకారముగ గుర్తెఱుఁగక పోవుటగూడ కలదా యనిన? "పీతత్వంహియథాశుభ్రే శ్రేషాద్భవతికస్యచిత్" అను ప్రమాణము రీతిని పిత్తవికార దోషమువలనఁ గన్నులకుం దెల్లనిబట్ట పచ్చగ గనఁబడినట్లును, ప్రకృతిదోషమువలన లొట్టిపిట్టకు వేఁపాకు తీఁపుగ నున్నట్లును, అవస్థాంతరదోషమువలన నిద్రబోవువానికి స్వప్నమందు పశుపక్ష్యాదులు సంభాషించినట్లును, అననుభవదోషమువలన జెముడు పాలు ఆవుపాలుగఁ దలచినట్లును, అపరిచయదోషమువలనఁ గ్రొత్తగ స్నేహముచేసిన దుర్మార్గుని సన్మార్గునిగనెంచినట్లును, అంధకారదోషము వలనస్థాణువునుజూచిపురుషుఁడని భ్రాంతిపడినట్లును, అనభ్యాసదోషము వలనమూఢునకక్షరములు చిత్రరేఖలుగఁదోచినట్లును, అజ్ఞానవిపరీత సందేహాది దోషములచే దూషితమైన మనస్సుగలపురుషునకుయథార్థ స్వరూపమిట్టిదనికనిపెట్టుటకు వీలుగాక, అయథార్థభావభ్రమబుట్టును. ఇట్టిభ్రమవలన అనర్థములు పెక్కులు సంభవించును. యథార్థజ్ఞాన మబ్బినపక్షమున కామధేనువుఁ గట్టుకొన్నవానికిక్షీరమునకు కొఱఁత లేనట్లును - ఆరోగ్యస్నానముఁ జేసినవానికి పథ్యసేవనము లేనట్లును- దుఃఖనివృత్తిపూర్వకమైన సదానందమం దోలలాడును. సత్సహవాసముచేతఁ దానెఱుఁగఁగోరిన పదార్థముయొక్క యథార్థస్వరూ

చేరువ, త్రాటిపక్రత ఈమూడును ముఖ్యకారణములు - ఇందువలన గలిగిన భయకంపాది వికారములు కార్యములు. ఈకార్య కారణ ములంబట్టి కల్పిత సర్పస్థితిఁ దెలిసికొనవలసియున్నఁగారణపరిజ్ఞానము కావలసివచ్చును- ఒకడుదుకాణమునకు వెళ్ళిడబ్బిచ్చిత్రాటినికొనివచ్చి దూడమెడకుఁగట్టి పట్టుకొని పొలములో మేపుచున్న విషయము నించుక యోచించినపక్షమున, నాపగ్గమేమైనదనివిచారముగలుగును; ఆవిచారమువలన దూడమెడనున్న త్రాడువిప్పి అచ్చట నేయుంచిన సంగతి స్మృతికివచ్చును; అందువలన అక్కడ కనుబడుచున్న సర్పము త్రాడుగనుండునేమోయని యూహగలుగును; ఆ యూహవలనకొంత భయముపోయి పాతికసంశయముతీఱును; అయినను పలువునందు సర్పముజాడ పూర్ణముగఁ గనఁబడుచున్నందున దగ్గఱకు వెళ్ళుటకు ధైర్యములేక పరిశోధించి చూడవలెనన్న బుద్ధిపుట్టి చేతికఱ్ఱతో నా సర్పమును మెల్లఁగత్రోయఁ దానియందు గమనాగమనఫూత్కారాఁ సర్పకార్యములేవియుఁ గనుబడకపోఁగా సర్పముగాఁదని సగమ సంశయముదీఱును; అందుమీఁద గొంతతెగువచేసి దానిని కఱ్ఱతొ బొడి, యిటుఅటుత్రోసి,నడుమకఱ్ఱవేసి, మీఁదికెత్తిచూడ దానియందఁ చలనమేమియు లేకపోవుటచే ముప్పాతిక సంశయముతీఱును; ఆపై ధైర్యమవలంబించి చేతితో తాకిజూచి గట్టిగనుండుటవలన సర్పమ గాదనియు, తానువేసిన త్రాడనియు, దృఢముగఁ దెలియవచ్చును అంతటితో సంశయముపూర్ణముగఁదీఱును. "సర్పస్యరజ్జుతానా నాస్తిరజ్జోబుజంగతా" సర్పమునకు రజ్జుస్వభావములేదురజ్జువునంద ర్పత్వములేదు.అంధకారసంబంధమువలననిదిసర్పముగగనుబడునప్పు చూచువారికందఱకుదెందములందు భయమును విశేషముగఁగల్పిఁ చుండినదిగాని విషము నేమియుధరించినదిగాదు. భయమునుపుట్టిఁ

బెట్టరు.ఇందుకువివరణము-బ్రహ్మముపగ్గమువంటిది ; మాయసర్పము వంటిది, దుఃఖమువిషమువంటిది,అందు భయపడుచున్న వాఁడుజీవుడు. ఈదృష్టాంతమును మఱియొకవిధమున యోచింతము. అదెట్లనిన. రజ్జువునందుతోచు సర్పముసత్తా? అసత్తా? యనుప్రశ్నలకు సత్తనిన.రజ్జువని యెఱిఁగినపుడుసర్పముతోచవలెను- తోచలేదుగాన సత్తనరాదు. అసత్తని చెప్పుదమనిన వంధ్యాపుత్రునివలెఁ దోచకనేయుండవలెను; తోచుటచే అసత్తని చెప్పందగదు. సదసత్తని జెప్పందగదా? యనిన, రెండుధర్మము లొక్కటియందే యుండదుగాన-సర్పము సదసద్విలక్షణమనే జెప్పవలెను; అనఁగా ఇట్టిలక్షణముగలది యనిచెప్పుటకవకాశమివ్వని అనిర్వాచనీయమనే జెప్పవలెను. ఇట్లే లోకమును సదసద్విలక్షణ యనిర్వాచనీయము. అసత్తనిచెప్పినది,లోకముసత్తను వారికి సత్తుకాదని చెప్పుటకుమాత్రమే గాని వేఱుగాదు. వంధ్యాపుత్రుఁడు మిథ్యయేను. ఆకాశ తామర మిథ్యయేను. రజ్జు సర్పము మిథ్యయేను. యెండమావుల యందు నీరు మిథ్యయేను స్వప్నప్రపంచము మిథ్యయేను. "కింమిథ్యాయద్విద్యానాశ్యంతు" విద్యచేత నాశపఱచబడునది యేదో అది మిథ్య. ఇట్లనుటయందనేక భేదములు గలవు. ఒక్కొక్కసమయములో నొక్కొక్క దృష్టాంత ముపయోగపడును. అక్కడక్కడ వేఱువేఱు దృష్టాంతము లిచ్చుటచే విరోధము సంభవించు ననిన నది వారివారి మనఃపరిపాకమునను సరించి యుండును. అవియన్నియు అవసర భేదముగ దృష్టాంతము లుదహరింపఁ బడినవి.

లోకమొక్కటే యున్నది. అది నశించుట లేదనువారిని జూచి, అయ్యా! లోకముకార్యమేగాని కారణముగాదు;కారణమైనది యంతటనిండియుండు పరతత్వమేను; అదెట్లనిన? తల్లిగర్భమునందుండిశిశువుయెట్లుద్భవించెనో, అట్లేపరతత్వమునందుండిలోకము

పుట్టినదని పెద్దలుబోధింప నప్పుడు వారుమనఃపరిపాకముఁగలవారై ఇట్లు శంకచేయఁగా, తల్లిగర్భమునందుండియుద్భవించిన శిశువువలె పరమాత్మయందుండిలోకముపుట్టె ననిన ? తల్లియు-శిశువును వేర్వేరు వస్తువులు, అదిగాక రెండును ఖండవస్తువులు - ఈయుపమాన ప్రకారముపమేయమును జూచుతఱి పరమాత్మయుఖండవస్తువు, లోకమును ఖండవస్తు వగుచున్నది; దీని నంగీకరించినపక్షమున

శ్రు "పూర్ణమదః పూర్ణమిదంపూర్ణాత్పూర్ణముదచ్యతే,
పూర్ణస్యపూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే"

శ్రు "యచ్చకించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపివా।
అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణస్థితః"

శ్రు "భోక్తాభోగ్యంప్రేరితారంచమత్వా,
సర్వం ప్రోక్తంత్రివిధంబ్రహ్మమేతత్"

"వాసుదేవ స్సర్వమితి" పరమాత్మ పరిపూర్ణమని ఘోషించు ఇత్యాది శ్రుతి స్మృతులకు వైయర్థము సంభవించు చున్నదే? యని యడుగ, అయ్యా ! లోకమేసత్యమనియు దానికి కారణ మింకొక్కటి లేదనియు జెప్పువారికి కారణమొకటి యున్నదని బోధించుటకై యీయుపమానముచెప్పఁబడినది; అదియేసిద్ధాంతము గాదు.

పాలుపెరుగైనట్లుపరిణామవాదకారణమునంగీకరింపుడు. ఇందు శిశువువేరు తల్లివేరన్నందుచే పరమాత్మపరిపూర్ణుఁడని ఘోషించు శ్రుతి స్మృతులకువైయర్థముపచ్చునంటివే,అట్టిదోషమిందుండదు.ఈ యుప మానమునకుపమేయము పరమాత్మ యేలోకముఅనఁగా, అయ్యా! పర మాత్మపరిపూర్ణుఁడనుటకే దోషము లేకపోయినను వేఱు మహాదోష ముసంభవించుచున్నది. అదేది యనిన ! క్షీరమే పెరుగగుటలో పాలు చెడి పెరుగగుచున్నది. ఈ యుపమాన ప్రకారము పరమాత్మ చెడి

లోకమగుచున్నది. అంతటితో పోక పాలు చెడి పెరుగగుటచేత పెరుగు అదేరూపముతో నుండదు. అది చెడి మజ్జిగై, యది చెడి వేఱై, ముగింపుకు యీస్థితియందున్న దనుటకు వీలులేకపోవుచున్నది. అట్లే పరమాత్మ చెడి లోకమై, యదిచెడివేఱై, యదిచెడివేఱై, ముగింపుకు ఈ పరమాత్మ యిట్లున్న దనుటకు వీలులేకపోవును గదా యనిన, అది నిశ్చయమేను. పరమాత్మ పరిపూర్ణుఁడనుటకు దోషము సంభవించక యుండుటకు మాత్రమున్ను; వస్తువులు రెండుగాదనుటకు మాత్రము, పాలు పెరుగను ఉపమానము చెప్పినదేగాని అది సిద్ధాంతము కాదు.

మఱియు మృత్తు, ఘటమువలె కారణ కార్యములు. ఇందు మృత్తు చెడకనే ఘటాకృతిని బొందినట్లు పరవస్తువు చెడకనే లోకమగు చున్నది. ఇందులోనున్ను దోషములేక పోలేదు. మృత్తు వికారపడియే గదా ఘటమగుచున్నది ? అట్లే పరవస్తువు వికారపడియే గదా జగదాకృతిగావలె ? నిర్వికారమైన పరవస్తువుకు వికారమును గల్పించుట న్యాయము కాదే ? యథార్థమేను. పాలుచెడి పెరుగయ్యేటట్టు మృత్తుచెడి ఘటముకావడము లేదనుటకున్ను, పెరుగు మరల పాలుకాకుండపోవునట్లు గాక, ఘటము మరల మృత్తగుననుటకేయుపమానమేగాని వేరు విషయమునకు గాదు. ఇట్లు వికారపడని యుపమానము చెప్పెదము. అదేదియనిన ?

సూర్యుఁడున్ను వానిప్రతిబింబమువలె- సూర్యుఁడువికారపడకనే యెట్లు ప్రతిఫలించునో యట్లేపరవస్తువు యేవికారమును బొందకనే ప్రతిఫలించు చున్నది. ఇందులోను దోషములేక పోలేదు. బింబము ప్రతిబింబించుటకాధార మొకవస్తువు కావలెను. సూర్యుఁడు ప్రతిబింబించుటకు జలమెట్లాధారమో యట్లే పరవస్తువు ప్రతిబింబించుటకాధార మొకటియుండవలెను, ఏదిమఱియొక యాధా

రమునందు ప్రతిబింబించునోయది అపరిపూర్ణవస్తువుగా నుండవల యునేగాని, ఒకప్పుడు పరిపూర్ణవస్తువుగాదు. జలమందు ప్రతిబింబించు సూర్యుఁడున్ను, అద్దమున ప్రతిబింబించుమనముఖమున్ను, పరిపూర్ణ వస్తువగునా ? సూర్యుఁడు మనముఖమొకచోటయున్ను, జలము అద్దము మఱియొకచోట నుండుటచేత బింబప్రతిబింబ వుపమానము అపరిపూర్ణవస్తువుకే లభ్యమగును. ఈ యుపమాన ప్రకారము పరమాత్మ యపరిపూర్ణవస్తువగుచున్న దే ?

బింబప్రతిబింబదృష్టాన్తము పరమాత్మ వికారపడుట లేదనుటకు మాత్రమేగాని వేరు కాదు. మఱియువేదాన్త వాక్యములయందు ప్రతి బింబదృష్టాన్తముచెప్పుట బింబమువలె ప్రతిబింబము సత్తుగాదనుటకు మాత్రమే యంగీకరింపఁబడియున్నది.

ఇకపరిపూర్ణత్వమునకుఁదోషములేక వేరొకదృష్టాన్తముచెప్పఁ బడుచున్నది. అదియెట్లియనిన ? శుక్తికయందురజితమెట్లుతోచుచున్న దో యట్లేపరమాత్మయందు చిజ్జడరూపప్రపంచము తోచుచున్నది.

ఈయుపమానము ప్రశ్నకు చోటిచ్చుచున్నది. అదెట్లనిన ? శుక్తికకు వేరుగారజితము లేదని యెఱిగిన పిమ్మట రజితము తో చుటయే లేదు. ప్రపంచము కారణవ్యతిరిక్తముగ లేదని యెరిగినను మఱల ప్రపంచ ప్రతీతియున్న దే ?

దృష్టాన్తమేక దేశము. ప్రపంచమువస్తువు కాదనుటకుమాత్రమే శుక్తికరజిత దృష్టాన్తము చెప్పఁబడినదేకాని వేరు కాదు. ఇట్టిదోషము సంభవించకుండా యుండులాగున యెండమావులదృష్టాన్తము నంగీక రింప వచ్చును. ఈ యుపమానమునందు మరుభూమికి వేరుగా జల మనునది త్రికాలములయందు లేదని యెరిగినను, మఱలనీరుండులాగున తోచురీతిని ప్రపంచమసత్తని తీర్మానించినను ప్రపంచముతోచవచ్చును.

ఎండమావుల యందు జలములేదని తెలిసినపిమ్మట జల ముండునట్లు తోచినను, అనుభవయోగ్యము గాకయున్నదే! అనగా స్నానపానాదులకు నీరుయుపయోగపడక యున్నది. ప్రపంచమో అట్లుగాక శబ్ద స్పర్శ రూప రస గంధాదులనుభవింపఁ బడుచున్నదిగాన ఈ దృష్టాంతమునందు దోషమున్నదే? ప్రపంచమసత్తని యెరిగినను మఱలఁదోఁచవచ్చుననుటకు మాత్రమే యెండమావులదృష్టాంత మంగీకరింపఁ బడవలసినది. అనుభవమునకు వచ్చుచున్నదే యనుటకు వేరుదృష్టాంతము కలదు. అది యెద్ది యనిన?

స్వప్నమందుఁదోఁచుప్రపంచమువంటిది. స్వప్నమందుఁ దోఁచు కార్యజాలము సంకల్పమాత్రమై యుండిన్ని, అనుభవ యోగ్యత గలిగియున్నది. బ్రహ్మము సమస్తమైయున్న దనుటలో ఆ పర వస్తువే యల్లైనదనికాదు అద్వైతుల సిద్ధాంతము. రజ్జువు సర్పమైనది, మరుభూమిక జలమైనది, ఐంద్రజాలశక్తి పలువస్తువులైనను మనస్సు స్వప్నప్రపంచ మాయెననుటలో సర్పము మొదలగునవి, దోఁచుటయే గాని వస్తుత్వము లేదనుటయే అద్వైతుల సిద్ధాంతము- రజ్జు, సర్పము వలెఁ దోఁచుటకు మునుపు- సర్పముగాఁదోఁచు నవసరమున -సర్పముకాదు - త్రాడనేజ్ఞానము కలిగిన వెనుక త్రాడుత్రాడుగానే వుండెను, అది వికారపడలేదు. కార్యరూపమును ధరించనులేదు, అనగా సర్పరూపమునుధరించలేదు, వికాశసంకోచములు లేవు, ఉన్నవి యనినచో,తోచుటమాత్రమని చెప్పఁ బడుచున్నది. అట్లే బ్రహ్మము ప్రపంచముగఁ దోఁచు అవసరమునను ప్రపంచాకృతితోచని తుర్యజాగ్రతయందును బ్రహ్మముబ్రహ్మముగానేయున్నది. దానికి యేవిధహానియులేదు- "వ్యాప్యవ్యాపక తా మిథ్యా సర్వమాత్మేతిశాసనాత్" అనుయోగశిఖోపని షద్వాక్యము వంటి అనేక శృతి స్మృతియుక్త్యనుభవములచేచూడ బ్రహ్మము ప్రపంచ

బ్రహ్మజ్ఞానియగుఆగురువుబాహ్యేంద్రియాంతరింద్రియోపరమను గలిగి తన సమీపమునకు వచ్చియుండెడివారు యేజ్ఞానముచేతసత్యస్వరూపమైన నాశనరహితమైన పరమాత్మను తెలిసికొందురో అట్టి బ్రహ్మవిద్యనుయథార్థముగా చెప్పవలయుననియుండు ప్రమాణమునుబట్టియున్ని మరియు "గుకారంచగుణాతీతం - రుకారం రూపవర్జితం- గుణాతీతమరూపంచయోదద్యాత్సగురుస్మృతః"అనగాగువర్ణము సత్వాదిగుణముల నతిక్రమించినది -రువర్ణము ప్రకృత్యాకారశూన్యమైనది-ఇట్టి సత్వాది గుణరహితప్రకృత్యాకారశూన్యమైనస్వస్వరూపమునుయెవడు బోధించునోఅతడే గురువని చెప్పబడుచున్నది మరియు "బోధాచార్యులు లేరనిసాధించినరాజయోగిసంతతికిని। దద్బోధంబునకు దదీయసమార్థకి బాధకనువచ్చుమదికడులేమిక"

"గురుసన్నిధిమాత్రేణసాలోక్యంసామీప్యంహస్తమస్తకం।
దీక్షామాత్రేణసారూప్యం సాయుజ్యంసమరసైక్యతాం"

"తల్లితండ్రిలేనితనయునిపోలికె సతికిబతియులేనిచందమునను
గురువులేనివిద్యగూడదెందులకైన నజునికైననిజమునరసిచూడ"

"గుశబ్దస్త్వంధకారస్స్యాద్రుశబ్దస్తన్నివర్తకః।
అంధకారనివర్తిత్వాద్గురురిత్యభిధీయతే"

గుఅనగా అంధకారము-లేకఅజ్ఞానము-రుఅనగాదాని నివారించువాడు-అజ్ఞాననివర్తకుడెవడో వాడుగురువనినిర్ణయించుచున్నది-ముముక్షువులకు పరోక్షగురువు ప్రత్యక్షగురువు అనిగురువు లిద్దఱుకావలెను-పరోక్షగురువు తనకుబ్రహ్మవిద్యబోధించువాడు అతడుపదేశించిన శాస్త్రానుభవములు రెండునుశ్రవణమననములుచేసి యిదిసరియాసరి కాదాయనినిదిధ్యాసముచేయునపుడు ఆహాశాస్త్రమునుస్వానుభవమును రెండునుసరిపోయినవి-ఇందులో యేమాత్రముసందేహములేదని తనబుద్ధికితోచినపుడు ఆ బుద్ధియే ప్రత్యక్షగురువుకాబట్టి ముందు పరో

త్సుగురువును సంపాదించుకొని, అతనివాక్కున బ్రహ్మవిద్యనభ్యసించి-దానిని మనన నిదిధ్యాసములవల్ల మనస్సున దృఢపఱచుకొని అందు మీదనెవ్వరైనను అసంభావనలు చేసినను, తనకే తోచినను మునుపు వినిన శాస్త్రానుభవములచేత పరాహతము చేయుచు నుండవలయును-మరియు, "అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా। చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవేనమః" అనగా ధనము మనయింటనే భూస్థాపితమైయుండుననె-తనకు తెలియక మిక్కిలి దరిద్రమనుభవించువానికి, అదృష్టవశాత్తుగా, ధనాంజనగాడు తటస్థపడి, వానికన్నులకంజనము వేసినప్పుడు - వాడు ధనమును కనుక్కొని సుఖపడునుగాని - ధనము చిక్కుపర్యంతము నిర్భాగ్యుడై యెట్లు దుఃఖించుచుండునో, అట్లనే బ్రహ్మవిద్యాధనమును పొందుటకు బ్రహ్మవిద్గురువు అవశ్యము కావలసినది. మరియు- సర్వవ్యాపకుడగు భగవంతుడు లోపల వెలుపల యెక్కడను వున్నాడనుట "సర్వము నీలోనిదిగా సర్వాత్ముడవాత్మసంపన్నుడవై సర్వమయుడవగు నీకును సర్వేశ్వరలేవులోను సందులు వెలియుకొ" శ్రు "స్వేనావృతం సర్వమిదం ప్రపంచం-పంచాత్మకం పంచసువర్తమానం" ఇత్యాది శ్రీమద్భాగవత-నారదపరివ్రాజకోప నిషద్వాక్యములద్వారా వాస్తవమేయైనను దాని సూక్ష్మమిటువంటిదని దెలుపుటకు సద్గురువొక్కడు కావలసియేయున్నందున శ్రద్ధకూడ సాధ్యము కాదు. సర్వాంతర్యామియైన సర్వేశ్వరుండై, సకల ప్రాణులకిష్టార్థములను సమకూర్చి రక్షించెడి పరమేశ్వరుని సద్భక్తితో పూజింప వలసినదనుట యథార్థమైనను అందులోని మర్మము దెలుపుటకొకయాచార్యుడు కావలసియేయున్నందున క్రియగూడ సాధ్యము కాదు. ఉశ్వాసనిశ్వాసరూపమున దేహమున సంచరించు ప్రాణవాయువును వశపఱచుకొని, యింద్రియవ్యాపారములను బంధించి వాయువును సహస్రారమున కెక్కించి, జ్యోతిర్దర్శనము చేయవలయుననుట యోగమునకు పూర్వార్థమని నిశ్చయమైనను, దానిరహస్యమెఱిగించుటకును దానికి

ఉత్తరార్థమున్నదని దెలిసినను దానిరహస్య మెఱింగించుటకు నుదేశి కుఁడొక్కఁడు గావలసియేయున్నందున యోగముకూడ సాధ్యముగా దు. తానేబ్రహ్మము, బ్రహ్మమేతానను నెడియభేదప్రపత్తిగలిగి యానంద మొందవలెననుట నిజమేయైనను, అందులోని కీలుతెలియఁజేయుటకు కారణాచార్యుఁడొక్కఁడు కావలసియే యున్నందున, జ్ఞానముకూడ సాధ్యముగాదు. సత్కర్మానుష్ఠానపరులకే ముక్తియనియు,భక్తినిష్ఠాప రులకే పరమపద కైలాసములనియు, జ్ఞాననిష్ఠానువర్తులకే కైవల్య మనియుపలువురుపలువిధములఁబలుకుచుందురు. వీఁటిలోనుత్తమమైన విదియని దృఢముగ దెలిసికొనుటకైన నొకయాచార్యుండు గావలసి యేయుండును. గాన, ఏ విధమునజూచినను గురువును సంపాదించు కొనినూదియుదారమును, పాలును నీరును, శరీరము నీడయువలె గలసి మెలసిసద్గురువునందు విశ్వాసపాత్రులైయున్న గాని, యెంతబుద్ధిమం తునికైననుయత్నము కొనసాగదని నధ్యవసించి గుర్వనుగ్రహమును పొందుట కుసత్వగుణము నవలంబించవలెను. ఈమర్యాదనుల్లంఘించి-తానేబ్రహ్మమును తెలుసుకొనెదనని యెవఁడుప్రయత్నముచేయునో-వాఁడుశాస్త్రజాలమనెడి సముద్రములో మునిఁగి బహు క్లేశములకు పాత్రుఁడగుటయే గాక, గట్టెక్కనేరఁడనుటకు ప్రమాణము-"శాస్త్ర జ్ఞానంబహుక్లేశం, బుద్ధేశ్చలనకారణం,ఉపదేశాద్ధరేర్బుధ్వార మతేసర్వకర్మసు"- మరియు సత్వగుణము సద్ధర్మమువలన గలుగును. సద్ధర్మముశ్రుతిస్మృతులయందు విధింపఁబడిన విషయములనెల్లఁజక్కఁగా విచారించుటవలనఁ గలుగును. ఆవిచారజ్ఞానము సజ్జనసహవాసము వలనగలుగును. సజ్జనసహవాసము కామాద్యరిషడ్వర్గమును నిగ్ర హించుట వలనఁగలుగును. అరిషడ్వర్గనిగ్రహము భూతదయవలన గలుగును. భూతదయ యీశ్వరానుగ్రహము వలనఁగలుగును. ఈశ్వరానుగ్రహమెట్లుగలుగుననిన? అతనికిమనకునుజన్యజనకత్వమని,

ప్రాప్యప్రాపకత్వమని, ఆధిపత్యాధిపత్యమని, ప్రేర్యప్రేరకత్వమని, వేద్యవేదకత్వమని, అంశాంశకత్వమని, కలిగియుండుషడ్విధసంబంధమును దెలిసికొని సద్భక్తి సలిపిన ఈశ్వరానుగ్రహముగలుగును. ఇందు జన్య జనకత్వ మనఁగా, అతఁడు మాయా వృత్తిచే మనలను జనింపజేసినవాఁడు, మనము అవిద్యావృత్తిచే జనించినవారమనుట. ప్రాప్య ప్రాపకత్వమనఁగా, జ్ఞాన కర్మాదులచే మనమతనిఁబొందవలసిన వారము, అతఁడు మనలను తనలోఁ జేర్చుకొనవలసిన వాఁడనుట. ఆధిపత్యాధిపత్యమనఁగా, మనమతనిలీలా విభూతికి లోఁబడినవారము, అతఁడు మనల నేలెడి వాఁడనుట. ప్రేర్యప్రేరకత్వమనఁగా, మనము పుణ్య పాపముల కాశ్రయమైన స్వర్గ నరకములను పొందెడివారము, కర్మానుసారముగా నతఁడు మనలను స్వర్గ నరకములను బొందించు వాఁడు. వేద్యవేదకత్వమనఁగా, మనము ఇంద్రియములకు గోచరములగు పదార్థముల నెల్ల గ్రహింప వలసిన వారము, అతఁడు మనకు పదార్థాభిజ్ఞానమునుగలిగించు వాఁడనుట. అంశాంశకత్వమనగా, మనమతనిస్వరూపమువలన నుద్గమించినవారము, అతఁడు మనయుద్గమమునకాశ్రయమైనవాఁడనుట. లోకమునందు సాధారణముగా భర్తమరణమొందినపుడు పాణిగ్రహణ సంబంధముగల పతివ్రతయు, కులమువారికాపద సంభవించినపుడు జాతిసంబంధముగల బంధువులును, బీదసాదలకేదైన బాధకలిగినపుడుధర్మాత్ములైన సత్పురుషులునుఅత్యంత ప్రియమైన తమకాయములను తృణప్రాయములుగ నెంచి యొప్పగించుచుండఁగా-దయామయుఁడునుదీనబంధువుఁడునునైన పరమాత్మయందు సద్భక్తితో ప్రపత్తిచేయు జీవకోటియొక్క దుఃఖములనెల్లఁదొలఁగించిమోక్షమును ప్రసాదించి రక్షింపకమానఁడు.

"ఈశ్వరానుగ్రహా దేవపుంసామద్వైతవాసనా" యనియు—
"కారణంవినాకార్యంనోదేతిభ క్తిర్వినాబ్రహ్మజ్ఞానంకదాపినజాయతే"

అను ప్రమాణములరీతిని ఇట్టిషడ్విధసంబంధములను దెలిసిభక్తి చేయగా జ్ఞాన ప్రతిపాద్య త్రివిధ సంబంధముల లక్ష్యము తప్పక తేటపడును. అదియెట్లనిన ? "అత ఏవ వేదాన్త శాస్త్రంచ తత్పదస్య త్వం పదస్యచ సంబంధ త్రయేణాప్యఖండతాం బోధయతి"

గాన వేదాన్త శాస్త్రములు తత్పదమునకునుత్వంపదమునకును సంబంధత్రయముచేత, అఖండత్వమును బోధించుచున్నవి. "సంబంధ త్రయకిమితిచేత్ పదయోః స్సామానాధికరణ్య సంబంధః, పదార్థయోః విశేషణవిశేష్యభావ సంబంధఃపదాభ్యాంసహవాపదార్థాభ్యాంసహ వాప్రత్యగాత్మనో లక్ష్యలక్షణభావ సంబంధః ఏవంసంబంధత్రయం" అనగా సంబంధత్రయమెట్టిదనిన ? రెండువాక్యములు సమానాధికరణ్య సంబంధము, రెండుపదార్థములకు విశేషణవిశేష్యభావసంబంధము. రెండుపదములతోనైనను రెండు పదార్థములతోనైనను ప్రత్యగాత్మకు లక్ష్య లక్షణ సంబంధము. ఇట్లు సంబంధము **మూడు** విధములు. "అస్యదృష్టాన్తః, సోయందేవదత్త ఇత్యత్ర ఇదం సంబంధ త్రయమస్తి సఇతిశబ్దస్యఅయమితిశబ్దస్యచ ఏకఏవదేవదత్తపిండ ఏవ సమానాధికరణ ఇతి తయోః శబ్దయోః స్సామానాధికరణ్య సంబంధోస్తి,తథా తత్పదస్య త్వంపదస్యచ ఏకమేవచైతన్యం సమానాధికరణం తస్మాత్పదద్వయస్యాపి సామానాధికరణ సంబంధోస్తి," ఇందుకు దృష్టాన్తము (సోయందేవ దత్తః)=ఆ ఈదేవదత్తుడు యనుటలో, సః=వాడు, అయం=వీడు, దేవదత్తః=దేవదత్తుడు. ఇందుండు "వాడు" అను పదమునకున్ను "వీడు" అనుపదమునకున్ను దేవదత్తపిండమే సమానాధికరణము. అనగా, ఆదేవదత్తుడె వీడు, అని చెప్పినట్లైనది. "ఆ" లేకవాడు, అనినందుచే పూర్వముచూడబడ్డవాడె యిప్పుడు చూడబడువాడు.

ఇందుచే జూడబడిన పురుషుడొకడైనను, వాడు, వీడుఅను రెండుపదములు దేవదత్తుడను నొక్క దేహమునే జూపించుచున్నది

గాని వేఱొకటిని జూపుటలేదు. ఇదిసమానాధికరణ సంబంధమని చెప్పఁబడియున్నది. గాన రెండుశబ్దములకు సమానాధికరణ సంబంధమున్నది. ఈ సంబంధమునుబట్టి యోచించగా కడవలోని జలమందును, మేఘములోనిజలమందును, ప్రతిబింబించినయాకాశములు, వానికి కలిగిన ఘటాకాశ మేఘాకాశములను పేర్లు అసత్యములగును. కుండకును, మేఘమునకును వెలుపలలోపలనుంచెడియాకాశములు రెండును కల్పితములుకానందున యెల్లప్పుడు నొక్కటే యనునట్లు తత్పదమునకు త్వంపదమునకు చైతన్యమొక్కటేయనుటలోసమానాధికరణ్యముగాన రెండుపదములకు సమానాధికరణ్య సంబంధమున్నది. "తత్కాలతద్దేశవిశిష్ట దేవదత్తవాచక స ఇతిశబ్దార్థస్య ఏతత్కాలై తద్దేశవిశిష్టదేవదత్త వాచక "అయం" శబ్దార్థస్యావ అన్యోన్యభేద వ్యావర్తకత్వేన అన్యోన్యం విశేషణ విశేష్యభావపిసంబంధో స్తి తథా సర్వజ్ఞత్వ పరోక్షత్వాది విశిష్టచైతన్యవాచక తత్పదార్థస్య కించిజ్ఞత్వా పరోక్షత్వాది విశిష్టచైతన్యవాచకత్వం పదార్థస్యచ అన్యోన్యభేదవ్యావర్తకత్వేన అన్యోన్యం విశేషణ విశేష్యభావసంబంధో స్తి." ఆకాలము, ఆదేశను మొదలగువాటితోకూడిన దేవదత్తవాచకమైన "వాఁడు" అనుపదముయొక్క అర్థమునకు, ఈ కాల మీదేశను మొదలగు వాటితోఁగూడిన దేవదత్తవాచకమైన "వీఁడు" అను శబ్దముయొక్క అర్థమునకును, పరస్పరముండుభేదములను విడిచి చూచుటచే, అనగా ముందొక్క దేశమందొకకాలము నొకవయస్సు, నొకరూపము, నొకవేషము, నొకవ్యాపారమునసున్న నొకపురుషునిఁ మఱియొకఁడుచూచి పిమ్మట బహుకాలము జరిగినవెనుక నాపురుషుని మఱియొకదేశమునందు,మఱియొకకాలమందు, మఱియొకవయస్సున మఱియొకవేషమున, మఱియొకరూపమున, మఱియొకవ్యాపారమును చేయునపుడు చూచి మునుపుచూచినజ్ఞప్తిచేత నాలోచించి వాని

తో మాటలాడి యాదేశము, ఆకాలము, ఆవయస్సు, ఆవేషము, ఆరూపము, ఆవ్యాపారమును, ఈదేశము, ఈకాలము, ఈవయస్సు, ఈవేషము, ఈరూపము, ఈవ్యాపారమునువదిలి, యాపురుషునివదలక ఆపురుషుఁడె ఈపురుషుఁడని తెలియఁ జేయుటచే, నొకటి కొకటి విశేషణ విశేష్యముగుచున్నదిగాన నిందు విశేషణవిశేష్యభావసంబంధమున్నది. అటువలెసర్వజ్ఞత్వ అపరోక్షత్వాదులతోఁగూడిన చైతన్యవాచ్యార్థతత్పదార్థమునకును కించిజ్జ్ఞత్వ పరోక్షత్వాదులతోఁగూడిన చైతన్యవాచ్యార్థ త్వంపదమునకును, ఒకటికొకటియందుండు భేదమును వదలుటచే నన్యోన్యవిశేషణవిశేష్యభావసంబంధమున్నది. "సోయం పదయోఃపదార్థయోర్వా అఖండార్థదేవదత్తపిండమాత్రగ్రహణే విరుద్ధాంశంవిహాయ-అవిరుద్ధాంశ దేవదత్తమాత్రలక్షకత్వేన లక్ష్యలక్షణభావ సంబంధోస్తి- తథాతత్త్వంపదయోః తత్త్వంపదార్థయోర్వా అఖండ సచ్చిదానందమాత్రగ్రహణే విరుద్ధాంశంవిహాయ-అవిరుద్ధాంశ భూతచైతన్య మాత్రలక్షకత్వేనలక్ష్యలక్షణభావసంబంధోస్తి." "వాఁడు" "వీఁడు" అను పదములకైనను, ఆపదములయొక్క అర్థములకైనను, అఖండార్థమైన, దేవదత్తపిండమును, యెత్తుకొనుటచేత విరోధాంశములను వదలి విరోధములేని "దేవదత్తుడు" అను లక్ష్యముచే లక్ష్యలక్షణభావ సంబంధమున్నది. అటువలె తత్ త్వంపదములకుగాని ఆపదముల యర్థములు అఖండసచ్చిదానందమును మాత్రమంగీకరించుటలో విరోధాంశమును విడిచి విరోధములేని యంశమైన చైతన్యమును మాత్రము లక్ష్యముగఁదీసుకొనుటచే, అనగా యెఱ్ఱావునకును, నల్లావునకును, శరీరములును, అవయవములును, గుణములును, భేదములైయుండుటచే ఐక్యముకలుగనందుచే విరోధాంశములనువదలి యెఱ్ఱావు నల్లావుపాలునందు విరోధాంశములు లేనందుచే సమత్వమును గ్రహించు నటులతత్పద త్వంపదము-

నైక్యముగ్రహించుటచేత లక్ష్య లక్షణ భావసంబంధమున్నది. ఈ లక్ష్యలక్షణభావసంబంధమునే జహాజహల్లక్షణమనిన్ని చెప్పుదురు. ఇట్టిఐక్యానుసంధానానుభవముచేత మాయావరణ నివారణమే మోక్షమనిస్పష్టమగును.మాయయనఅజ్ఞానము.ఈయజ్ఞానమువలననే లోకములో జీవకోటికంత కనర్థము పెక్కులు సంభవించుచున్నది. జ్ఞానసూర్యోదయమైననగాని మనస్సును ముంచుకొన్న యజ్ఞానాంధకారము నశించదు. జ్ఞానమనఁగా, సూర్యుడును చీకటియు నొకచోట వాసముచేయ నెట్లుసంబంధపడదో యాలాగుననే చిద్రూపుఁడైన పురుషునకును జడరూపమైనమాయకును సంబంధము కలుగనేరదని దృఢముగా దెలిసికొనుట. ఈ మాయను తొలగించి చూచిన యెడల తానేపరబ్రహ్మమనుటఁ దెల్లమగును. ఈప్రకారముగాఁదన్ను పరబ్రహ్మమని తెలిసికొను తెలివి సహజమేకాని జన్యముకాదు.జన్యమైన పక్షమున దానికి కాలాంతరమున నాశము కలుగును.

ఇట్టియథార్థజ్ఞానము ప్రకాశించకఁబోవుటకు ముఖ్యకారణము ప్రతిబంధమేకాని వేఱుగాదు. ఆప్రతిబంధము భూతప్రతిబంధమని, వర్తమాన ప్రతిబంధమని, భావిప్రతిబంధమని మూఁడువిధములుగ నుండును. ఒకఁడు పుత్రమిత్రకళత్రాది బంధములెల్ల కాలవశమున నివృత్తిఁజెందఁగా విరక్తినొంది సన్న్యాసమవలంబించి సద్గురుసాన్నిధ్యమున శ్రవణముజేసి లక్ష్యానుసంధానముఁజేయుచుండగా-పూర్వాశ్రమమున తనకత్యంతప్రియముగనుండిన యొకవస్తువట్టి కాలమున దనకుఁ గనబడుట భూతప్రతిబంధ మనఁబడును. ఆప్రకారముగ తనకగుబడు వస్తువుయొక్క అస్తి, భాతి, ప్రియ, నామ, రూపములను లక్షణములైదింటి లోపల నామరూపముల రెంటినిఁ ద్రోసివేసి, అస్తి, భాతి, ప్రియములను మాత్రమే తానని చింతించుచున్న పక్షమున, ఆ ప్రతిబంధము కొంతకాలములోపలనే నశించిపోయి

సచ్చిదానందస్వరూపము నిస్సంశయముగఁ బట్టుపడును-

వర్తమానప్రతిబంధము, విషయాసక్తి లక్షణమని, ప్రజ్ఞామాంద్యమని, కుతర్కమని, విపర్యయదురాగ్రహమని నాలుగు విధములుగ నుండును, విషయాసక్తి లక్షణమనఁగా మన్మథునికంటె పరమాత్మ వేఱులేదని దోచుటయు, శృంగారప్రబంధములకంటెనతిశయించినవి యుపనిషత్తులు గావనుటయు, భోగభాగ్యములు పలుకులకంటె వేదవాక్యములు వేఱుగఁ గావనియు, కోకశాస్త్రమునకంటె వేదాన్తశాస్త్రము లెక్కకుఁ గావనియు, నటవిటగాయక విదూషకులే మహాపండితులుగాని తక్కినవారు ఎంతవారైనను పండితులనుటకుఁ దగనివారనియు, విషయభోగములకంటె నతిశయించిన రాజయోగమొకటి యున్నదనుటగగనారవిందమువంటిదనియు, ఆవిషయానందమునకంటె బ్రహ్మానంద మొక్కటియున్నదనుట కల్లయనియుఁ దలచుచు, సమస్త విషయములయందును గాఢమగు నాసక్తిఁగలిగియుండుట.

ప్రజ్ఞామాంద్యమనఁగా, గురువులుపదేశించిన యర్థము బుద్ధికి పట్టకపోవుట.

కుతర్కమనఁగా, గురువులుబోధించిన యర్థమునకు విపరీతార్థములుదోచుట.

విపర్యయదురాగ్రహమనఁగా, నేను పండితుఁడను, శ్రోత్రియుఁడను, భక్తుఁడను, విరక్తుఁడనని, దేహేంద్రియాదులయందాత్మత్వబుద్ధి గలుగుట. వీనిలో విషయాసక్తి లక్షణము కాలకర్మవశాత్తుగలభించు సత్సహవాసము వలనఁ గలుగు శమదమాదుల వలనను, ప్రజ్ఞామాంద్యము నిరంతరశ్రవణము వలనను, కుతర్కము మననమువలనను, విపర్యయదురాగ్రహము నిదిధ్యాసము వలనను నశించిపోవును. ఇవి నశించినతోడనే, ఆత్మతత్వము కరతలామలకమగును.

కాలనియతిలేక సంభవించు సంచితపాపకర్మములవలన నొకవి

ధముగ దయారూపమగు వాసక్తి బుట్టును. అదియే భావిప్రతిబంధ మనఁబడును. ఈప్రతిబంధము చేతనే, జడభరతునకు మూఁడుజన్మములును, నుతిగొందఱకు పెక్కు జన్మములునుఁగలిగినవి. కాఁబట్టి ఈ బంధత్రయమును జక్కఁగవిచారించి, సాధ్యమైనంత శీఘ్రముగ వానిని, నివర్తిచేసికొనవలసినది. ఏజన్మమున వీనివాసన లేశమైన లేకపోవునో యాజన్మమున ముక్తిగలుగును. ఇట్టిముముక్షువులు శుద్ధచిత్తతనుబొంది, భూమి, పర్వతము, వృక్షము, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యచంద్రులు, కపోతము, అజగరము, సముద్రము, మిడత, తేనెటీఁగ, తుమ్మెద, ఏనుఁగు, జింక, చేఁప, వేశ్య, కురరపక్షి, శిశువు, కన్య, శరకర్త, పాము, సాలెపురుగు, భ్రమరము వీని గుణములను జక్కఁగగ్రహించి యాప్రకారముగ మెలఁగుచున్న పక్షమున,నిందుదహరింపఁబడిన ప్రత్యగాత్మబ్రహ్మైక్యసాక్షాత్కారజ్ఞానముచేఁగలిగిన మహదానందమును సంతత మనుభవించుదురని బ్రహ్మవేత్తలందురు. వాని గుణములనెట్లు గ్రహించి మెలఁగవలయునని?—

1. భూమి, సమస్తచేతనముల కాశ్రయమై వానికార్యములనెల్లను సహించుకొనియున్న లాగుననుముముక్షువెప్పుడును క్షమతోఁగూడి యుండవలసినది. క్షమలేక తక్కిన గుణము లెన్నియున్నను బ్రయోజనము లేదను నిశ్చయముగలిగియుండవలెను.

2. పర్వతము, జీవకోటికంతకు నుపకరించుతృణ, వృక్ష, గుల్మాదులు, నదీప్రవాహనులు మొదలగు వానినెల్లను శిరమున వహించుకొని యున్న రీతిని, స్వార్థపరత్వమునుమాని, యితరులవిషయమై నిరంతర ముపకారస్మృతి గలిగి యుండవలసినది.

3. వృక్షము. మూలచ్ఛేదము చేసినను, కొమ్మలు నఱికివేసినను, నారలుచెక్కివేసినను తనలకునిని సోఁకింపనట్లుగ తనలనిని తన

తమకాపదవచ్చినను నిశ్చలచిత్తతతో వెనుకదీయకుండవలయును- తన్నునఱుకవచ్చిన వానికిఁగూడ నీడనిచ్చునట్లు, అపకారికిఁగూడ నుపకారముఁజేయవలయును.

4. జలము పారిశుద్ధమాధుర్యాది గుణములచేత, స్నానపానములకు పాత్రమైయున్నట్లు ముముక్షువు సత్ప్రవర్తనముచేత నెల్లప్పుడును శుచిర్భూతుఁడై యుండవలయును.

5. అగ్ని యెప్పుడును

(1). అంధకారముతోఁ జేరక తేజోమయమై యున్నలాగున ముముక్షు వెప్పుడు నజ్ఞానముచేఁ గప్పఁబడక, సుజ్ఞాన విశిష్టుండై యుండవలెను. మఱియు,

(2) సమిధలు మొదలగువాని సంయోగముచే నగ్ని వెలుఁగునట్టుగ, ముముక్షువు శుద్ధతపస్సుచేత వెలుఁగవలసినది.

(3) తర్జన భర్జనాది విధులచేత నగ్ని తిరస్కరింపఁ బడినట్లు, ముముక్షువును పరులవలని సంక్షోభమును బొందకుండవలయును.

(4) అగ్ని హోమాత్రమప్రయత్నముగఁదనకులభించినవస్తువులను నిలువయుంచకతక్షణమే భక్షించునట్టుగ,ముముక్షువులును,భావికాలాపేక్షలేక,యెప్పటికేదిదొరికినదానినప్పటికేవినియోగించుకొనవలసినది.

(5) అప్రయత్నముగ సంప్రాప్తమైన పదార్థములందు, అగ్నిహోమాత్రము రుచిపక్వము లెంచనట్లు ముముక్షువులును దమకులభించిన వస్తువులందు రుచిపక్వము లెంచఁగూడదు.

(6) అరణినిమథించి యగ్నిని ప్రజ్వలింపఁ జేయునట్లు ముముక్షువులు నిదిధ్యాసమథనముచేత జ్ఞానమును బ్రజ్వలింపఁజేసి, పరమాత్మను దర్శింపవలెను.

(7) అగ్ని తన్ను పాసించువారిపాపముల నిరసించుచు, దనయందు వేల్చినహవ్యకవ్యముల నెల్లస్వీకరించునట్లు,ముముక్షువులుతమ్మాశ్రయిం

చినవారిపాపములనుదొలగించుచు, వారుసమర్పించిన పదార్థములను స్వీకరింపవలెను.

(8) స్వరూపోచితమైన,జ్ఞానమునకు తిరోధానకమైయున్న ప్రకృతి చేత సృజింపఁబడిన సదసల్లక్షణములుగల, దేవ,తిర్యఙ్మనుష్యాదిశరీరను లందు జీవుఁడు ప్రవేశించి చంద్ర కొఱవి, చింత కానుగు మొదలగు కాష్ఠవిశేషములందు జ్వాలా భేదములచేత నగ్ని ప్రకాశించునట్లుగ వివిధరూపములఁ బ్రకాశించుచున్నాఁడని యెఱుఁగవలయు.

(9) ఉదయ లయములు, అగ్ని జ్వాలల కేగాని, అగ్నికి లేనట్లు కాలానుగుణముగ భూతములకుత్పత్తినాశములు,నియతమైయున్నను, జీవునకు మాత్రమెప్పుడును లేవని గ్రహింపవలయును.

6. <u>వాయువు</u>-మంద వేగములు,సుగంధదుర్గంధములు,చల్లన వేడుము లు మొదలగు గుణములతోఁగూడి వీచునదియేమైనను నాగుణములెల్ల వాయువునకు సంసర్గదోషము చేతఁగలిగినవేగాని సహజములుగానట్లు, దేహమున వసించు నాత్మకు, కర్మవశమున సంభవించు సుఖదుఃఖములు మొదలగువికారములెల్లను, అజ్ఞానవశమున దోచునవేగాని సహజము లుగావని యెఱుఁగవలసినది.

7. <u>ఆకాశము</u>-చరాచరరూపమైన సమస్తపదార్థములయందంతటను నిండియున్నదయ్యును, దేనియందుఁదగులక, విలక్షణమైయున్నట్లుపర మాత్మ సకలవస్తువులయొక్క బహిరంతరములనెక్కడను నిండుకొని యున్నదయ్యును, వానికన్నిటికిని విలక్షణమైయున్నదనియు, ఆకాశము తనయందుఁదోచెడిమేఘములు,మెఱుపులు మొదలగువానినిస్పృశింపన ట్లై పరమాత్మయు కాలవశమునఁదనయందుఁదోచు వుత్పత్తిస్థితినాశ ములను బొందక, సచ్చిదానందముగ విలసిల్లునని గ్రహింపవలయును.

8. <u>సూర్యుఁడు</u>-తనకిరణములచేత జలములనాకర్షించుచున్నను, తా నుపయోగించుకొనక, మరల కిరణములగుండ భూమికివదలివేసినట్లుగ,

ముముక్షువును శ్రోత్రాదికములైన యింద్రియములచేత శబ్దాదివిషయములను గ్రహించినను, మనస్సునందు నెలకొలుపక, వానిని వెంటనే దొలగింపవలసినది.

9. చంద్రుడు-వృద్ధిక్షయములు చంద్రకళలకేగాని చంద్రునకులేనట్లు షడ్భావ వికారములు శరీరమునకేగాని యాత్మకులేవని యెఱుంగవలయును.

10. కపోతము-తనదారాపుత్రాదులయందుగల స్నేహానుబంధముచేతవలలోబడగులుకొనినశించునట్లుగ,ముముక్షువువారినిభగవత్సంతతియని గ్రహించక, మమకారప్రవర్తనముచేత, బద్ధుడై, దుర్లభమైన మానవజన్మమును, వారియొక్క సంయోగ వియోగాదులచే, దుఃఖసముద్రమునమునిగి ఆయువునువ్యర్థపుచ్చి తుదకు దుస్తరమైన భవసంసారసాగరమునబడి సంతతదుఃఖమునననుభవించునని యెఱుంగవలసినది.

11. అజగరము-అప్రయత్నముగ దనకుదటస్థించినయాహారమునుగొని, తృప్తిజెందులాగున, జ్ఞానియుకర్మవశముచేత నల్పముగనో యధికముగనో లభించిన రుచిగలపదార్థమునుగాని రుచిలేని పదార్థమునుగాని యుపయోగించవలయును.

12. సముద్రము-యెప్పుడునుగాంభీర్యప్రసన్నతలుగలిగి చొచ్చుటకును దాటుటకును సాధ్యముగాక కలతనొందక నిశ్చలతనొందివర్షకాలమున పెక్కునదులువచ్చిచేరిన నుప్పొంగకయు, వేసవికాలమున జలమింకిపోయి నదులు రాకపోయినదనతగ్గిపోకయు, నొక్కటేవిధముగనుండునట్లు, జ్ఞానవంతుడెప్పుడును వెలుపల ప్రసన్నతయు, లోపలగాంభీర్యమునుగలిగియితరులకులోబడక పరులవలన క్షోభనొందక, జ్ఞానవైరాగ్యములచేత చిత్తస్థైర్యమునుబొంది, కర్మవశమున సంభవించు లాభ నష్టములయందు మోదఖేదములను జెందక సమచిత్తుడైయుండవలసినది.

13. మిడత-యుక్తాయుక్తములను విచారింపక పోవుటచేత, రాత్రివేళ అగ్నిం జూచి భ్రమించి యందులోఁబడి నాశమొందునట్టుగ, యుక్తాయుక్తవిచారణలేని మందబుద్ధి పరస్త్రీలహావభావచమత్కారములను గనుగొని భ్రమపడి రౌరవాది నరకములందు బడుననియు దెలిసికొని మెలఁగవలసినది.

14. తేనెటీఁగ-తాను దినకకూడఁబెట్టినఁదేనియ నితరుల పాలుసేసి చెడిపోవునట్టుగ నతిసంచయేచ్ఛచేత వర్తించువాఁడు నశించునని తెలిసికొని యథాలాభ సంతుష్టిగలిగి, లభించినదానిని తాననుభవించి, చేతనవర్గమున కుపయోగపఱచి, సుఖముతో మెలఁగవలసినది.

15. తుమ్మెద- వివిధపుష్పములయందలి బహువిధ రసములను పానముచేసి సంతుష్టిఁజెందులాగున ముముక్షు వెప్పుడు నుపనిషద్రహస్యార్థములఁ గ్రహించి సంతుష్టిఁ జెందవలసినది.

16. గజము-పురుషగజము స్త్రీగజముతోడి సంపర్క సుఖమునకుఁదలపెట్టిమనుజులకు జిక్కినట్లు పరస్త్రీ స్పర్శసుఖము నపేక్షించిన పక్షమున మోహపాశముచేతఁగట్టుపడి శిక్షలలోఁ బడవలసివచ్చునని దెలిసికొనవలసినది. "మాతృవత్పరదారాంశ్చ" యను ప్రమాణరీతిని నడుచుకొనవలయును.

17. లేఁడి-వీనులకింపుగ వినఁబడినరాగమునకు మోహపడి యురులలో జిక్కినట్టుగముముక్షువు గ్రామ్యగీతలకుఁజెవియిచ్చిన పక్షమునఁ జెడిపోవలసివచ్చును

18. చేఁప-గాలమునఁ గ్రుచ్చియున్న యామిషమునకాశపడి తన ప్రాణమునకు ముప్పు తెచ్చుకొనులాగున జిహ్వాచాపల్యమునకు జిక్కి రుచ్యములగు పదార్థముల నిచ్ఛయించినపక్షమున దుఃఖమున కెఱగా వలసివచ్చునని దెలిసికొని జాగ్రతపడవలసినది. జిహ్వాచాపల్య మెం [illegible] యాచాపల్యములుబో తిగవిడువవు.

రసనేంద్రియ మొక్కటిజయింపఁబడిన పక్షమున తక్కిన యింద్రియ ములెల్లను సులభముగఁజయింపఁబడును. సన్మార్గమునవర్తించు సజ్జనుఁడైనను, జిహ్వాచాపల్యమునకుఁ గొంతచిక్కిన యెడల తక్కిన యింద్రియములెల్లను బలఁపడి మనస్థైర్యమునుఁజెడగొట్టును. రుచిపక్వములు నించుకయు విచారింపక ఆహారమును గొనుచున్న పక్షమున యింద్రియము లెల్లఁదనకువశపడును. రోగనివారణార్థమైయౌషధము నుపయోగించునట్లుగ దేహధారణార్థమై ముఖ్యముగ నాహారము ను గొనవలసినది. "కూడులేనరాదటంచును కొందరయ్యలేలకో వెఱ్ఱిదోవల నెఱుకలేక కూడువిడిచిన విడుచునా కుటిలబుద్ధి" యను వాక్యమును జ్ఞప్తియందుంచుకొనవలయును, ఆహారమును బొత్తిగవదలిన పక్షమున దేహమన్నమయము గనుక నదిబలహీనమగును. బలహీనమైనచో దెలివితక్కువబడి మనస్థిరత చెడిపోవును. మనస్థిరతచెడినమీఁదటనాత్మాను సంధానము తిన్నగా జఱుగదు. ఆత్మానుసంధానము లేక పోయినగడ దేఱుటకుమార్గముగలుగనేరదు. కాఁబట్టి "భిక్షాన్నందేహరక్షార్థం" అనువాక్యరీతిని యాహారమును బుచ్చుకొనవలయును.

19. వేశ్య-నానావిధములైన మాయోపాయములచేత నింటికివచ్చిన విటులనందఱి, నటమటించి, ధనము సంపాదించి, పలుగాకిపోకలఁబోవుచు, జాతినీతులెంచక, జారులతో భోగించుచు, వ్యాధి బాధలననుభవించుచు, ఘోరపాతకముల నార్జించుచు, కుటిల వర్తనమున సంచరించుచుండులాగున జీవుఁడు బుద్ధియన్న సుందరీరత్నముతోఁగూడి, ఇంద్రియములన్న చెలికాండ్రను, విషయములన్న చెలికత్తెలను, సంతతము సేవింపుచు, జాగ్రత్స్వప్నసుషుప్తులయందుఁగలిగెడు సుఖములననుభవించి, తుదకుదురంతక్లేశములకుఁబాత్రుఁడుగాఁగూడదనియు, మఱియు వేశ్య యొక్కనితో సరసములాడుచు, నొక్కనితోరహస్యము పలుకుచు, నొక్కనితోయలుకవహించి కలహించుచు,

నొక్కనితో భోగించుచు, నందఱియందు మిగుల ననురాగము గలిగి యున్నరీతిగ నభినయించుచు, తుదకెవ్వనికి మనసీక మధురవచనముల తో నుబ్బించి మెల్లఁగ డబ్బును లాగుకొనుటకే ప్రయత్నముసేయు చు, మెలకువతో మెలఁగులాగున, జననమరణ దుఃఖములకు జన్మస్థాన మైన యజ్ఞానమను ప్రవాహములోగూలి, యహంకారమమకారసు లను సుళ్ళలోఁజిక్కి త్రొక్కట పడుచున్న పురుషుఁడు, సత్కర్మవి శేషపరిపాకముచే చిత్తశుద్ధిగలిగి ఆహా తళుకు బెళుకులుచూపి విటు లను భ్రమింపఁజేసి ధనమును జూఱఁగొని, తుదకు దుఃఖముల పా లుచేయు భోగఁపు చానవలెమాయయు, బహువిధ భ్రమలు కల్పించి సుజ్ఞానమును జూఱఁగొని జననమరణరూపమైన సంసార సముద్రము లో బడవేసి లోకమును సంతతదుఃఖముల బాలుసేయుచున్నది. దీని నిదాటుటకుపాయమెద్ది? యనియోచించి,సాధన చతుష్టయ సంపన్నుం డై, సద్గురువులనాశ్రయించి, వారివలన శ్రవణమును, శ్రవణమువల నమననమును, మననము వలన నిదిధ్యాసమును, నిదిధ్యాసము వలన నిశ్చయాత్మతత్వమను జ్ఞానసంపత్తును బొందుటకే సర్వకాల సర్వా వస్థలయందులక్ష్యముంచవలెననియు నావల "నాహంమనుష్యోనచదేవ యక్షోన బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రః నబ్రహ్మచారీనగృహీవనస్థోభిక్షు ర్నచాహంనిజబోధరూపః" అనుశ్రుతి వాక్యరీతిని తాను బోధానంద ఘనుఁడనే జ్ఞానము లభించినపిదప దేహముండు పర్యంతము, అన్నఁగా మేఘావరణము అంధకారకార్యముగాదు, గనుక అంధకారము నశించి నను మేఘావరణముండ వచ్చునుగాని దేహాది ప్రపంచమజ్ఞానకార్య మగును. కారణము నశించినప్పుడు కార్యమేలాగుననిలువఁగలుగునని శంకగలుగునేని ముఖ్యకారణమైన వేరుపోయినను కార్యమైన కల బందమాత్రము నిలుచునట్లును, ముఖ్యకారణమైన నిప్పుచల్లారినను కార్యమైన పొగమాత్రము నిలుచునట్లు ముఖ్యకారణ యజ్ఞానము

నశించినను తత్కార్యమైన దేహాది ప్రపంచముందు పర్యంతమింద్రి
యములు వాటివాటి పనులయందు ప్రవర్తించినను మనస్సున, వాస
నలను వదిలనివ్వక, నిరంతరము స్వస్వరూపమందు చిత్తమును గుత్త
ముగ నిలుపవలెనని నిశ్చయించుకొనవలెను.

20. కురరము లనుపక్షులు తమలో నొకపక్షి శ్రమపడి మాంస
మును సంపాదించి తెచ్చుకొన్నప్పుడు, మాంసము దొరకని తక్కినప
క్షులెల్ల,దానిమీఁదపడి ముక్కులతో నొక్కి కాళ్లతో రక్కి పలువిధముల
బాధలుపెట్టి, యదిమాంసఖండమును వదలి వేసినతోడనే, దానిజోలి
కిపోక పూనుకొనుచున్నవి. కాఁబట్టి, తానునిర్గుణుఁ డైయుండియు
మాంసమయ దేహమును ప్రాణేంద్రియ మనోధర్మములనెల్ల, తనయం
దారోపించుకొని, దిట్టముగ ప్రకృతి గుణముచేతఁగట్టఁబడి తానిట్టి
వాఁడని తెలిసికోలేక కుటుంబ భారమును నిర్వహించునిమిత్తము రే
యుఁబగళ్ళు శ్రమపడుచు, అట్లుశ్రమపడినను,వారుతృప్తిలేనివారుగా
న వారిచేపీడింపఁబడుచు, పెక్కుకర్మములుచేసి కర్మానుగుణముగ
సంభవించెడి, దేవతిర్యఙ్మనుష్యాది జన్మములయందు స్త్రీపున్నపుంసక
రూపములధరించును. క్షుద్బాధచేత శునక మింటింటదూరి, దుడ్డుకఱ్ఱ
దెబ్బనుగాని కమికెడుచౌర్యాన్నమునుగాని సంపాదించుకొన్నలాగున
దైవవశముగ సుఖదుఃఖముల ననుభవించుచుండియొకానొకజన్మమున
సుకృత పరిపాక విశేషముచేత, సద్గురుముఖేన, దేహేంద్రియాది
ప్రపంచమంతయు, అనిత్యమై, అశుద్ధమై, జడమై, దుఃఖమై, దృశ్యమై,
వికారమై, పరిచ్ఛిన్నమై, సంకల్పమై,ఆధేయమై, సావయవమైఆద్యంత
సహితమై, సజాతీయ విజాతీయ స్వగతభేదసహితమై, కార్య
ములుగుణయుతమై యుండుననియు, సమష్టివ్యష్టిరూపమైన శరీ
రత్రయమే, అనాత్మయనియు, వీనికివిలక్షణమై, అనగా, నిత్యమై,
శుద్ధమై, సత్తై, సుఖమై, దృక్కై, నిర్వికారమై, అపరిచ్ఛిన్న

మై, స్వప్రకాశమై, నిస్సంకల్పమై, ఆధారమై, నిరవయవమై, అద్వంతరహితమై, యుండునదేయాత్మయనియు, ఆయాత్మయే తానని నిశ్చయించి, యాత్మావలోకనపరులై యుండుటే సుఖమని తెలుసుకొనవలయును.

21. శిశువు అజ్ఞానవశమున, మానావమానములు, శత్రుమిత్రులు, సుఖదుఃఖములు మొదలగువానినిదలఁచక, తనయాటలయందే, యాసక్తిఁగలిగి యానందించులాగున, ముముక్షువును,జ్ఞానవశమునమానావమానములు, సుఖదుఃఖములు మొదలగునవి యెల్లను శరీరమునకేఁగాని, పరమాత్మకు లేవని దెలిసికొని, నిర్విచారముగ సంతతము, బ్రహ్మాత్మైక్యాను సంధానముచేఁగలుగు ఆనందమందు క్రీడించుచుండవలెను.

22. కన్య-బీదకుటుంబములోని యొకకన్య, తనయింటికి కొందఱు బంధువులురాఁగా, వారికన్నముచేసి పెట్టుటకు, బియ్యములేకపోయినందున,ధాన్యమునుదంచనారంభించి,దంచునప్పుడు తనముంజేతులనున్నగాజులు, ఘల్లుఘల్లుమని రొదజేయఁగావిసికికొని, అవి విశేషముగనున్నందున, శబ్దమధికముగఁగలుగుచున్నదని గ్రహించి, వానినొక్కటొక్కటిగపగులఁగొట్టి, చేతికి రెండేసిగాజులవంతున నుంచుకొన్నను మఱలనవి ధ్వనిచేసినందున, పుణ్యస్త్రీత్వసూచకముగ,చేతికొక్కొక్కటి యుంచుకొని,తక్కినవానిని దీసివేసి, దారిద్ర్యసూచకమగు కంకణధ్వని బొత్తిగ నణగినందుకు సంతసపడి, నిర్విచారముగ కార్యములనెఱవేర్చుకొన్నదికాఁబట్టి, పలువురతోఁగూడి ముచ్చటలకుఁదలపెట్టినచో గుట్టుచెడి, కలహములుకార్పణ్యములు, మొదలగునవి సంభవించి, మనోవిచారముగలుగునని యెఱిఁగి,ముముక్షువు లెప్పుడును స్వస్వరూపవిచారములేని యజ్ఞానులతోఁజేరకుండవలసినది. సదసద్వివేక చతురత

23. శరకారుఁడు-తాను జేయుచున్న బాణము యొక్క ఋజుమార్గమును జూచుచున్న సమయమున, రాజువచ్చి తనముందట నిలుచుచున్నను, నెఱుఁగక తదైక ధ్యానముతో నున్నలాగున, ముముక్షువు దృఢా భ్యాస యోగముచేత మనస్సును జెదరకుండ నిలిపి, యితరచింత లేక పరమాత్మయందే దృష్టి యుంచవలసినది.

24. సర్ప మెప్పుడు నొంటరిగ జరించుచు, విషముకలదనిగాని, విషము లేనిదియనిగాని, పరీక్షించుటకును కాళ్ళున్నవనిగాని, లేవని గాని, గ్రహించుటకును శక్యముగానంత వేగముతోఁబఱుగెత్తుచు, మితముగ బుసగొట్టుచు, మెలఁగుచున్నలాగున జ్ఞానవంతుఁడు, "ఏకాన్తేన శ్రవణాద్యనుసంధానం భవతి" యనుఉపనిషద్వాక్యరీతి శ్రవణమున సిద్ధించిన, దృశ్యాదృశ్యములు మఱచి స్వస్వరూపమాత్రమున నిలచి సుఖింపుచు, తానుజ్ఞానవంతుఁడనిగాని, అజ్ఞానవంతుఁడనిగాని, స్మృతిగలిగి నడుచుచున్నాననిగాని, స్మృతిలేక నడుచుచున్నాననిగాని, గ్రహించుటకు శక్యముగానట్లు మెలఁగుచు మితసంభాషణముఁగలిగి నిర్విచారముగనుండవలసినదని తెలిసికొనవలయును.

25. సాలెపురుగు-"ఊర్ణనాభిర్యథాతంతూన్ సృజతే" యనువాక్యరీతిని తనకుసంబంధ పడినవస్తువుతోనే తంతువును నిర్మించుచు, నిర్మించిన తంతువులకంటె, తానన్యముగనుండి క్రీడించుచు, మఱలనాతంతువులను భక్షించుచు, ఉపాదాన కారణమును నిమిత్తకారణమును తానై యున్నట్లుగ సర్వశక్తుఁడైన భగవంతుఁడు, తనమాయచేత స్థావర జంగమాత్మకమైన సర్వప్రపంచమును సృజించి, యాప్రపంచమునకంటె విలక్షణముగనుండి, లోక సంబంధములైన సుఖదుఃఖములు, పుణ్యపాపములు, మొదలగువానిని బొందకఁ గ్రీడింపుచు మఱల వానిని లయింపఁ జేయుచు, సమస్తమునకుఁదానొక్కఁడే కారణభూతుఁడైవర్తించుచున్నాఁడని గ్రహింపవలసినది. మఱియు, జ్ఞానియు బ్రహ్మనిష్ఠుఁడు...

ప్రపంచాభి ముఖమైనపుడును, బుద్ధి భ్రంశములేక సాలెపురుగువలె మెలఁగవలెను.

26. భ్రమర మొక కుమ్మరపురుగును దెచ్చి, తనగూటఁబెట్టుకొని దానిచుట్టు ఝుంకారముచేయుచు, దిరుగ మొదలుబెట్టి నప్పుడాపురుగు భయముచేత, తనలక్ష్యమునంతయు, నాకందిరీగయందేయుంచి, తుదకు దానిరూపమును వహించునట్లె, యీదిన మొక శవమును మోసికొని పోయిన యీదేహమునుమఱియొకదినము మఱియొకరు మోసికొని పోవలసిన యోగముతటస్థింపక మానదనియు, యేనిమిషముననో, యేక్షణముననో, యేగడియనో, యేముహూర్తముననో, యేయామముననో, యేదినముననో, యేరాత్రియో, యేవారముననో, యేపక్షముననో, యేమాసముననో, యేఋతువుననో, యేయయనముననో, యేసంవత్సరముననో, యీశరీరము తనకుదెలియకయే పడిపోవును. ఇందునకీకాలము ఆకాలమని యొక నియతిలేదు. భూమిమీఁదయెన్ని దినములుబ్రతికినను,తుదకొకనాటికిగాటికిపోవుటతప్పదు. జాగరముననో, స్వప్నముననో, సుషుప్తిననో, గ్రామముననో, వనముననో, కూర్చునియున్నపుడో, నిలుచుకొనియున్నపుడో, నడుచుచున్నపుడో,పారుచున్నపుడో,పరుండియుండునపుడో, లేచినపుడో,తినుచున్నపుడో,త్రాఁగుచున్నపుడో,యిపుడో,యేవిధముననో,ప్రాణములు దేహమునువదలి లేచిపోవునుగాని స్థిరముగనుండవు.గాలిలోనుంచిన దీపమును,పండుబారిన పత్రమును, పరిపక్వమగు ఫలమును, నీటిమీఁది బుగ్గయు, నూనెకుండమీఁది వ్రాతయు, తృణాగ్రజలకణమును, వడిగా విసరు సుడిగాలియు, నాడుచున్న బొంగరమును.మెఱయుచున్న మెఱపునుఆస్థిరమ్మలైనట్లు దేహములుసయితమస్థిరములనుట యనుభవవేద్యమైయున్నది.ఆహా! కాలముగడుచుచున్న కొలదినిఆయువునుక్షయించుచున్నది.నిత్యమును మృత్యువుమిక్కిలిజాగ్రతఁగలిగి ఆయువనుధాన్య

మును, రవియనుతూముతోఁగొలిచికొలిచితుదకొక్కనాడు, ప్రాణము
లనలిపినోటవేసికొనుచున్నది. యథార్థజ్ఞానమును సంపాదించుకొనుట
కు మిక్కిలి సహాయకారిగనున్న యాయువును వ్యర్థముగ బోఁగొట్టు
కొనుట, యెంతయు పరితాపకరమైన దనితలఁచి, శిశువునకు తల్లియు,
వృక్షమునకు జలమును, భక్తులకు దైవమును, లోకులకు రాజును,
దరిద్రునకుదాతయు, దినమునకు సూర్యుఁడును, రాత్రికి చంద్రుఁడును,
ధర్మమునకుశాంతమును, వీరునకుధైర్యమును, రాజునకు సైన్యమును,
భార్యకుభర్తయు, భర్తకు భార్యయు, పురుషునకు విద్యయు, మంత్రికి
యుక్తియు, వర్తకునకు ధనమును, లోకమునకు వర్షమును, సహాయ
ముగనున్నట్లు, బ్రహ్మానందానుభవమునకు కారణాచార్యుని సహాయ
ము లేకసమకూడదనినధ్యవసించి, వారినియాశ్రయించి, దీపమన్న మా
త్రమున చీఁకటితొలఁగనేరదు. తత్వమన్న మాత్రమున అహంకారము
నశింపనేరదు. వేదాన్తమన్న మాత్రమున సంశయములు నివర్తింపవు.
మంత్రమన్న మాత్రమున నభీష్టములు సిద్ధింపవు. ఔషధమన్న మా
త్రమున రోగముతీరదు. గురువన్న మాత్రమున గుణములు గలుగ
నేరవు. ఆ ప్రకారముగనే మనఃపరిపాక హీనమైనజ్ఞానమువలనయెప్పు
టికి బ్రహ్మానందానుభవముగలుగనేరదు గాన, వీరుబోధించు సగుణో
పాసనమునుగాని, నిర్గుణోపాసనమునుగాని, యవశ్యముగ జేసి, ఆయు
పాసనవలన, ఆగామికర్మసంచయమెల్లను, నిప్పులోఁబడ్డ సొరుగాకుల
వలెకాలిభస్మమైపోవును. కర్మమునశించుటచేత ధర్మమభివృద్ధినొందును,
ధర్మమభివృద్ధి నొందుటచేత, ననిత్యమగు సంసారము దుఃఖకరమై,
దోచును. అపల మోక్షేచ్ఛగలుగును. ఆయపేక్షగలిగిన మీఁదట
సద్గురువుల వారి వాక్యములయందు విశ్వాసముగలుగును. ఆమీఁద
నిరంతరము భక్తిశ్రద్ధలతోఁగురుసేవఁజేయనారంభించివారుపదేశించిన
రీతిగ నేకాంతమున నిశ్చలచిత్తతతో మహావాక్యమును విడువక

మననము జేసి యామననము చేత కుంభగత దీపకళిక చందమున చంచల
ములుతీరి యావల దేహసంబంధమగు వికారములను, దేహమునందు
తిరుగు ప్రాణవాయువును, దేహమునందు బొడము చున్న యంతఃకరణ
మును, అజ్ఞానవశమున తానని తలంచెడి జీవాత్మను, యిట్టితలంపున కా
శ్రయముగనున్న యవిద్యను, జాగ్రత్స్వప్నాద్యవస్థలయందు గలుగు
ఇంద్రియవికారములను, సుషుప్త్యవస్థయందు గలుగు శూన్యభావము
ను, గనుంగొనుచు, సాక్షిమాత్రముగనున్న తనకును, యీప్రకారము
గనే, చరాచరరూపమైన ప్రపంచమునంతయును నిరంతరము చూచుచు
సర్వసాక్షిగనున్న, పరబ్రహ్మమునకును, భేదము లేదని బాహాటముగ
ఘోషించు సకలోపనిషద్రహస్యార్థములమనసునపదిలపఱచుకొనిన-
బుద్ధిని ఆవరించికొనియున్న యజ్ఞానము సూర్యోదయమైన మా
త్రమున, దిశలముంచుకొన్న అంధకారమునశించునట్లు నశించిపోవును.
అజ్ఞానము నశించిన తోడనే దేహ మనిత్యమనియు, తాను నిత్యమ
నియు, ఇంద్రియములుదుఃఖమయములనియు, తానానందమనియు అంతః
కరణము చలనశీలనమనియు, తానునిశ్చలమనియు, దేహమునకు ప్రాణ
మాధారమనియు తానుసర్వమునకాధారమనియు, జీవుడహంభావమని
యు, తాననహంభావమనియు, అజ్ఞానము కేవలశూన్యమనియు, తానఖండ
పరిపూర్ణమనియు, నద్యవశించినతోడనే చవిటినేల విత్తినవిత్తనముల
లాగున సందేహములు తలయెత్తక నాశమగును, ఇట్లు సంశయనివృత్తి
యైనవెనుక, వృత్తిదోచినను చెరువులోనినీరుతూముదారిని బయలుదేరి
కాలువలరూపమున పొలములోఁ బ్రవేశించి పొలము లేవిధముగనున్న
నావిధముగ త్రికోణ చతుష్కోణాది రూపములుగలిగి నిలుచునట్టుగ,
తేజస్సంబంధమైన చిత్తముకన్ను మొదలగు యింద్రియములమూలముగ
ఘటపటాదివిషయములలోఁ బ్రవేశించి, యాఘటాదులవలె పరిణమిం
చుచున్న దేగాని సర్వసాక్షిమాత్రముగ వెలసెడి పరబ్రహ్మమే తానని

యొడి సర్వోత్కృష్టమైన తుర్యదృష్టితో సంతుష్టినొంది ప్రారబ్ధ కర్మా ధీనమగు దేహమునకు సంభవించు సుఖదుఃఖముల ననుభవింపకదప్పద నియు, యేలననగా - యెంతవారికైన కర్మానుభవ మలంఘనీయమని బోధించుటకొఱకే తారకమంత్రస్వరూపుడైన శ్రీరామమూర్తికిగూడ, వనవాసాయాసమునకుజిక్కి సీతనెడబాసిమిక్కిలిదుఃఖపడవలసివచ్చెన నిన్ని-మృత్యుంజయుడగు శివునకుగూడ, బ్రహ్మకపాలమును చేతబట్టు కొని బిక్షమెత్తవలసి వచ్చెననిన్ని-సకల జగన్నిర్మాత యైన బ్రహ్మకు గూడ, తలబోగొట్టుకొని, అవమానపడవలసి వచ్చెననిన్ని - నిష్కళ నిరంజన నిరవద్య నిర్ద్వంద్వఅద్వితీయ పురుషోత్తమునకుగూడ,భూలోక మున అవతరింపవలసివచ్చెననిన్ని - లోకమును వెలిగించు ఆదిత్యునికి గూడ,దంతములుపోయి చింతింపవలసి వచ్చెననిన్ని - శ్రీకృష్ణమూర్తికి గూడ, కిరాతుని బాణఘాతముచేత దేహ వియోగము నొందవలసి వచ్చెనని పురాణేతిహాసము లుద్ఘోషించు చున్నవి - గాన రానున్నది రాకమానదు, పోనున్నది పోకమానదు, కానున్నది కాకమానదని, నిశ్చయించి మనస్సునందు గలిగెడి పలువిధము లైనసంకల్పములను, యింద్రియముల వెంబడి పోనీక, కనుగలిగి జలచరములఁదిను కొంగ చందమున వానినెల్ల మ్రింగివేయుచు వినుట, పలుకుట మొదలగు కార్యముల నెల్లను కలలోఁ గన్న విధముగ ననుభవింపుచు దేనియందు, దగులక సంతుష్టి నొంది, మెలఁగు చుండిన, ఆ పురుగు, భయముచేత తనలక్ష్యమంతయు ఆకందరీగయందేయుంచి తుదకుదాని రూపమును వహించునట్లు ఆరోపదేహధారి యేపదార్థమునందు దృఢ ముగ మనసుంచినిలుచునో ఆపదార్థముయొక్కస్వరూపమును నిస్సం దేహముగ బొందునని తెలిసికొనినిరంతరముస్వస్వరూపానుసంధాన మందుండుటచే సచ్చిదానంద స్వరూపుఁడై జీవన్ముక్తుఁడగును. ఈగుణ ములనెల్ల మనస్సున స్థిరముగనిలిపి జననమరణములు,సుఖదుఃఖములు,

లాభనష్టములు, స్నేహవిరోధములు మొదలగునవి యేవియుతనస్వస్వ రూపతుర్య దృష్టియందుతనకు లేవనినిశ్చయించుకొని వానినెప్పుడు దలంచక బాహ్యకృత్యముల నాచరించుచున్నను, తుర్యమందు లక్ష్య ముంచి, వర్తించుచున్న పక్షమున అహంకార మమకారములు నశించి నిర్వికల్ప బ్రహ్మానందము తనంతట సిద్ధించును. అయితే,

"పుత్రేణలోకాన్జయతి" "అపుత్రస్యగతిర్నాస్తి" అనుప్రమా ణములరీతి,నిపుత్రులు గలవారికే ఇహపరలోకములయందు, సుఖములు గలవని, లేనివారికి సుఖములు లేవనిన్ని-పుత్రులుతల్లితండ్రులవంశముల నెల్ల పుణ్యలోకములకు బంపుదురనిన్ని-పుత్రుల వలననేగాని పితృ ఋణంబుతీఱదని ఘోషించువాక్యములు,పుత్రహీనులనేకులకు దుఃఖ ము కలుగజేయుచున్నవిగాన-ఆవాక్యముల నిజార్థము విచారద్వారా తెలిసితేగాని దుఃఖనివృత్తిగాదని పెద్దలుసుడివెదరు-గాన ఆవాక్యముల నిజార్థమును దెలుపవలయునని ప్రార్థింప ? బహుజన్మకృత పుణ్య పుంజ ములచేతపవిత్రాంతఃకరణముగల ఓగురుపుత్రుడ ! ఆవాక్యములనిజార్థ మును బ్రహ్మజ్ఞానానుభవ రసికులుశ్రుతియుక్తి యుక్తముగ జెప్పుటను సావధానంబు గావినుము - శ్లో॥ "దేహోహమితియత్ జ్ఞానం తదేవ నరకం స్మృతం"=దేహమునేననెడి యేజ్ఞానముకలదో యదియనరకమన బడును - "దేహోహమితిసంకల్పోహృదయగ్రంధిరీరితః"=దేహము నేననెడి సంకల్పము హృదయ గ్రంధి యనబడును - "దేహోహ మితి యాబుద్ధిః సాచావిద్యేతి భణ్యతే" =దేహము నేననెడి యేబుద్ధి గలదో యది అవిద్యయనిచెప్పబడును- " దేహోహమితి సంకల్పో మహాపాపమితి స్ఫుటం"=దేహము నేననెడి సంకల్పము మహాపాప మని చెప్పబడును - (తేజోబిందూపనిషత్) ఇట్టిఆరోపదేహధారి యైన పురుషునికి, గర్భవాసము మొదలు శరీరావసానపర్యంతము సర్వావస్థల యందును దుఃఖమే కలుగు చున్నది - యెట్లనిన ?

జంతువు మిగుల సూక్ష్మమగు శరీరము కలదై - అనేక మలములతో గూడిన గర్భమునం దొక విధముగ తోలుచే మూయ బడి మిగుల వంపబడిన వీపుయొక్కయు, కంఠముయొక్కయు,యెముకలు గలదై, తల్లిభుజించునట్టి షడ్రసముల సారము దేహముమీద సోకుటచే మిగుల వేదనను జెందుచు, మలమూత్రములనెడి యడుసులో బడియుండి ప్రసూతివాయువుచే తలక్రిందుగ త్రిప్పబడి మిగులకష్టముతోడ,తల్లి గర్భమునుండి వెలుపటవచ్చును-ఇట్లు వ్రణ సదృశమగు యోనిద్వార మునుండి పురుగువలె భూమియందు పడిన పిదప తానుగాగోఁకుకొనుట కును, పొరలుటకును శక్తిలేక, స్నానఆహారాదులను, పరుల యిచ్ఛాను గుణముగ జెందుచు-మూత్రాదులచే అశుద్ధమగు పడకయందు పడియుండి చీమలు దోమలు మొదలగు జంతువులు తన్ను గఱచునపుడు వానిని, నిగ్రహింపలేక యేడ్చుచు,అశక్తుడైయుండుట దుఃఖమేగదా- గాననే:(అమేధ్య పూర్ణం క్రిమిజాలసంకుల స్వభావ దుర్గంధమశౌచ మధ్రువం కళేబరం మూత్ర పురీష భాజనం రమంతి మూఢా నరమన్తి పణ్డితాః) అను ప్రమాణరీతిని అమేధ్యముచేనిండింపబడినదై, క్రిమి సమూహముతోగూడి నదై-దుర్గంధమునే స్వభావముగ గలదై, శుచి లేనిదై,అస్థిరమైయుండునిట్టిదేహమునసౌందర్యకాంత్యాది గుణములు కలవనిమూఢులుభ్రాంతిచేరమింతురు-పండితులురమింపరనిపెద్దలందురు- మరియు,అన్నపానములచేఆకలిదప్పులుతీరుటయు,ఆయాయుపాయము లచేశీతోష్ణాద్యుపద్రవములుమానుటయు, సుఖమనివివేకులుతలవకూడదు-యేలననిన? అన్నపానాదులనుసంపాదించుటకై చేయుప్రయత్నములచేతకలుగు దుఃఖము చెప్పదరమా! బహుదుఃఖమనే వివేకులు తప్పక అంగీకరింతురు- మరియు, లోకమునందొక్కొక్క పదార్థమును దుఃఖమునేకలుగజేయుచున్నది-అయిననుఆయాపదార్థములుస్వీకరించు వారల కర్మాను గుణముగ భోగ్యముగను అభోగ్యముగను తోచు

చున్న దేగాని యథార్థముగవిచారించిన భోగ్యతఅభోగ్యత ఆపదార్థ ములయందు లేవని తేటపడును-యెట్లులనిన ? ఒక పురుషునకే యొక అవసరమునభోగ్యముగనుండువస్తువుమఱియొక అవసరమునఅభోగ్య మైయుండుట కనివిని అనుభవించి యున్నారము-ఆకలిగొన్నవానికి భోగ్యమైయుండుఆహారను అజీర్ణముతోయుండువానికిఅభోగ్యమయ్యే గదాయున్నది-చలిచే అగ్నియు,దాహముచే ఉదకమును-ఆకలిచే అన్న మును, సుఖముగతోచుచున్నవి-శైత్యదాహక్షుత్తులు లేనపుడు-సుఖ మనితోచిన అగ్నిజలాన్నములుదుఃఖకరమైయుండుటఅనుభవవేద్యమే గదా-మఱియు స్త్రీ పురుషులచే కామింపబడిన సుందరమైనఅవయవము లుగల పురుషులును-స్త్రీలును వయోవృద్ధత్వముచే- లేకవ్యాధులచే- తనశరీరము కృశించిన అవసరమున వారల అంగస్పర్శము హేయమై తోచుట యథార్థమేగదా మరియు స్త్రీపురుషులు స్వీకరించు మిగుల శ్లాఘ్యములగు చందన కుసుమ తాంబూలాదులుకొంతసేపటికి వారలయుచ్ఛిష్టస్వేదముల సహవాసముచే పరులకు అస్పృశ్యములై హేయములగుటఅందరిఅనుభవంబేగదా - ఇట్టిదుఃఖమయమై హేయ మైన దేహధారి, నానావిధ క్రీడావిశేషములచేబాల్యమును, చందన కుసుమవనితాదిభోగపరవశతచేయౌవనమును,అశక్తిచేవార్ధక్యమును, గడపుచు, తమయాయువును వ్యర్థపుచ్చి మృత్యువశుడగుటయు-లేక గంగాప్రవాహమునందుండినను, చాకలవాడు దాహము కలిగినపుడు నీరుద్రాగక,ఈవస్త్రమును గుంజి కానిమ్ము, ఈవస్త్రమును గుంజికా నిమ్మయనికాలము బోగొట్టునట్లు-బాల్యము గడచిన పిదప యౌవన మునభగవద్భక్తి చేసికొని యెదననియు-యౌవనమును జెందియుండు నపుడువార్ధిక్యమున శ్రేయమగు జ్ఞానముసంపాదించెద ననియు, పిదప వార్ధిక్యము సంభవించి, ఇంద్రియములు బలహీనములైనపుడు - ఇకనే నేమి చేయుదునని వెనుకటికాలమును దలచి ముందుకాలము వ్యర్థము

చేయుటయు కని విని యున్నాముగదా - ఇట్టి దుఃఖ హేతువగు శరీర యాత్రమాన్పుటకును - నిరతి శయానన్దమోక్ష పదవి నొసంగుటకు- మరియొక దుఃఖ హేతువగు పుత్రుడను శరీరోత్పత్తి హేతు వగునని శ్రుతి స్మృతులుఘోషించునా! ఘోషించవు-అయితే పుత్రులు దుఃఖ హేతువగు టెట్లు? యోచించిచూడగా పుత్రులు పుట్టకమునుపును పుట్టిన వెనుకను-పుట్టి గిట్టిన తర్వాతను అధిక దుఃఖమునే కలిగించు చున్నారని తేటపడును-యెట్లులనిన? పుత్రులు లేనివారు దుఃఖముచేత ఒక్క బ్రాహ్మణునిరప్పించి-స్వామీ!మాకుపుత్రులులేకపోయిరే-మాకేమి గతియన-వారు-మీరు పాపకర్ములు గాన పుత్రులు లేనివారైరితిరి-పుణ్య తీర్థములను సేవించిన, పాపములునశించి పుత్రవంతు లగుదురనగా, ఆమేరకు తీర్థయాత్రలను బహుదినములుచేసి స్నాన దానములు, తిల హోమములు, సర్పశాన్తులు, నాగ ప్రతిష్ఠలు,అశ్వత్థప్రదక్షిణములు చేసి చేసి విసికి వేసరి,దారినడచు బడలికచేతను, చక్కని భోజనాదులు లేక పోవుటచేతను కలిగెడి కాయక్లేశము మొదలగు సకల దుఃఖముల ననుభవించెదరు గాననే "అలభ్యమాన స్తనయః పిత రేక్లేశయచ్చిరం" యని యాజ్ఞవల్క్య పనిషత్తు ఘోషించుచున్నది.

అయితే పుట్టిన పుత్రులు దుఃఖపెట్టుట యెట్లనిన ? దైవాధీనం బున తనంతటనే గర్భము నిలిచి కొన్నిదినములకు ఏదియైన ఒకకర్మ మువలన కడుపు దిగబడిన-తల్లితండ్రులు దుఃఖింతురు-అట్లు గాక పది నెలలు నిండునంతవరకు నిలిచియుండెనేని ప్రసవకాలమందు కలుగు బాధల చూడజాలక-కుమారునికి ఆశపడి నందుకు కొండ నాలుకకు మందు పెట్టితే వున్న నాలుక వూడి పోయినట్టు పెద్ద ప్రాణమునకే వండవచ్చెననిదుఃఖింతురు. అట్లుసుఖముగాప్రసవించెనేని-ఆశిశువునకు పక్షిదోషము మొదలైనవి తాకినపుడును మాంద్యవ్యాధి మొదలగు వ్యాధులుకలిగినపుడు దుఃఖమే కలుగుచున్నది.అటులగాక నిశ్చింతగా

పెరిగెనేని, దుష్టుడై ఊరిలో గల చిన్నవాండ్రతో కలహములు పెట్టుకొనినను దుఃఖమే కలుగును-ఆవిధమునగాక-బుద్ధిమంతుడై యుండియు చదువరిగాకపోయిన-వేదన చెందుచుందురు. చదువరియైనను గొప్ప ఉద్యోగము లభించక-వివాహము జరుగకయుండిన యెడల యున్ను-దుఃఖమే కలుగుచున్నది-గొప్పఉద్యోగము లభించి వివాహమైయున్ను-వానికి సంతానము కలుగకపోయెనేని దుఃఖమే సంప్రాప్తమగుచున్నది-అథవా, వానికిబిడ్డలుపుట్టి దరిద్రము సంభవించిన యెడల అతను దరిద్ర దశవలన బిడ్డల తోడకష్టపడుచుండ జూచి తల్లితండ్రి దుఃఖింతురు-ఇట్లు పుత్రుడుదుఃఖపెట్టువాడగును-కాబట్టియే, పుత్రులు కలిగినను దుఃఖమే కలుగుచున్నది యని "లబ్ధోవాగర్భపాతేనప్రసవేనచబాధతే। జాతస్యగ్రహరోగాదికుమారస్యచధూర్తతా। ఉపనీతేప్యవిద్యత్వమను దాహశ్చ పండితే। యూనశ్చ పరదారాది దారిద్ర్యంచకుటుంబినః। పుత్రదుఃఖస్యనాస్త్యన్తోధనీచేన్మ్రియతేతథా। ఏవంవివిచ్య పుత్రోసా ప్రీతింత్యక్త్వా నిజాత్మని। నిశ్చిత్య పరమప్రీతిం వీక్ష్యతేతదహర్నిశం" యాజ్ఞ్యవల్క్యోపనిషత్తు ఘోషించుచున్నది-మరియు - తల్లితండ్రులు మరణించిన తరువాత వారినిగురించి పుత్రులు చేయు దానములు, శ్రాద్ధములు, తర్పణములు, మొదలగునవి వారికి సద్గతిని, తృప్తినిగలిగించునని శృతిస్మృతులువక్కాణించుచున్నవియని వానికి నిజార్థములనుదెలియక బ్రహ్మవేత్తలకంటె, ఇతరులైన కొందరు శాస్త్రవేత్తలును పామరులును విపరీతార్థముల నూహించి చెప్పుటను విని 'పుత్రుడు పుట్టి గిట్టినను పుత్రుడే మేలను' లోకోక్తిని బట్టి దుఃఖములెన్నిగలుగజేసినను పుత్రుడుండినజాలునందురు. ఈపుత్రులు చేయు దానశ్రాద్ధాదులు తల్లితండ్రులకు సద్గతిని, తృప్తిని కలిగించు ననుట సత్యమైనపక్షమున-తల్లితండ్రులు బ్రతికియుండునపుడు-పుత్రుడు వారిపేరు చెప్పికొందఱు బ్రాహ్మణులకు మంత్రసోపేతముగ ఇష్టపదార్థ

ములతో తుష్టిగభోజనము పెట్టి-తల్లితండ్రులకుభోజనము పెట్టని యెడల-ఆబ్రాహ్మణ భోజనము ఆతల్లితండ్రులఆకలితీర్చి వారికితృప్తికలిగించుట లేదు - ఇట్లుండగ వారు మరణించిన వెనుక వారిని గురించిపుత్రులు చేయు దాన శ్రాద్ధాదికము - వారికి సద్గతిని తృప్తిని కలిగించుననుట వంచకులుపన్నిన తంత్రములేగాని నిజముకాదని తత్వవేత్తలందురు-అయినను పితృదేవతల నుద్దేశించి చేయు దానములు, శ్రాద్ధములు తర్పణములు వ్యర్థములుకావు-యేలననిన ? కారణములేక కార్యంబు గలుగదుగానవారి పేరు బెట్టిపుత్రులు చేయుదానాదులుఆపుత్రులసద్గతికే కారణమగుచున్నది- మరియు తమతమ పుణ్యకర్మలచేతనే సద్గతులు కలుగుతవియని శాస్త్రములుఘోషించుచున్నవి- మరియుకర్మకాండ విదులు స్థూల శరీరమును వదలి, జీవుడు సూక్ష్మ శరీరంబు తోడచంద్ర లోకంబు చేరి సమస్తభోగంబు లనుభవించి మేఘములోపడి జలమై ఆజలముతన జన్మానుగుణమగుజంతువునకు ఆహారంబగు ధాన్యంబులో బడి అన్నమై ఆవల రక్తమై శుక్లమై స్త్రీగర్భంబు నందు ప్రవేశించి జన్మించునందురు-వైరాగ్యోపరతిగల జ్ఞానకాండవిదులు జీవుడు తేజో మార్గమున సూర్యలోకమునుబొంది అవ్వలబ్రహ్మలోకంబుచేరి బ్రహ్మ తోడి ముక్తినొందు నందురు,మఱికొందరు-పచ్చికలో తిరిగెడు జలగ ఒక్కకసువు పోచమీదతనముందరికాళ్లను చక్కగా మోపి వెనుకటి కాళ్లనుడన్న తావునుండి యెత్తునట్టుగా జీవుడును, తన పుణ్యకర్మముల చేత లభించిన బ్రహ్మేంద్రాది దేవతా శరీరములయందు గాని పాప కర్మములచేతప్రాప్తించిన సర్పవ్యాఘ్ర, శునకాది శరీరములయందుగాని-మిశ్రకర్మములచేత కలిగిన మనుష్య శరీరము నందుగాని ప్రవేశించి పూర్వ శరీరమును విడుచు నందురు-మరియు " విషయ స్వీకృతిర్జన్మ తత్త్యాగోమరణం స్మృతం। యద్ధ్యాయ తేయ థాయోగీతజ్జన్మేతితదోచ్య తే। ప్రాణావసానసమయే మనోయద్విషయేస్థితం। తేనదేహీతమాశ్రిత్య

తజ్జన్మాభవతిధ్రువమ్। విస్మృత్యైకంవిషయం గృహ్ణాతి విషయాంతరం। తదైవమరణం తస్యపునర్జన్మేతి నిశ్చినుః ఇత్థందినేదినేనేనజన్మప్రాప్తి శ్శరీరిణః। అసంఖ్యాతా త ఏవోక్తా నిద్రా విషయ విస్మృతిః। దైనం దినోహి ప్రళయోవాసనామాత్రశేషవాన్। సఏవ పునరుత్థానహేతుర్జన్మాంతరా ప్తయే। కారణంచ తదజ్ఞానంస్యాత్తజ్జ్ఞానేన నాశయ। ఏతజ్జన్మ రహస్యంతేప్రోక్తం మతిమతాంవర"=మనోవృత్తియందేదియైన నొక విషయమునుగ్రహించుటేజన్మప్రాప్తియనిన్ని-ఆవిషయమును పరిత్యజించుటే మరణమనిన్ని-మనసున యెప్పుడు దేనిని సంకల్పించునో అప్పుడదియే జన్మమనిన్ని-ఇట్లుండి ఈఆరోపస్థూలదేహావియోగకాలమునమనో గతవిషయమే అనంతరజన్మమగుననిన్ని-ఒక్కదివసముననే అనేకవిషయములు స్మృతికివచ్చి తప్పిపోవునుగాన-అనేకజననమరణములయ్యెననిన్ని-సర్వసంకల్ప విస్మృతిరూపంబైన సుషుప్తియే దైనందిన ప్రళయమనిన్ని-ఆప్రళయమందు అజ్ఞానప్రపంచ మంతయు వాసనామాత్రముగనణగియుండునుగాన-అదియే మఱల మేల్కొనుటకును-జన్మాంతరమునకును కారణంబగుననిన్ని ఇట్టి అజ్ఞానవాసనా బీజంబును-బ్రహ్మాత్మైకత్వావలోకనపరులైనాశముజేయ-అదియాత్యంతికప్రళయంబను మోక్షమనదగును యని ఇట్టి జన్మమరణరహస్యంబును - తన్నివృత్తికి వుపాయంబును బ్రహ్మవిద్వరిష్ఠులగువసిష్ఠులు జెప్పియున్నారు-మరియు-"యంయంవాపిస్మరన్ భావంత్యజత్యంతేకళేబరమ్" అనిభగవద్వాక్యమున్నది-ఇట్లుండ పుత్రులు యెట్లు తమతల్లిదండ్రులకు తృప్తి, సద్గతిని కలుగజేయుదురు ? కలుగజేయరనేశ్రుతియుక్త్యనుభవముల ద్వారా సిద్ధించుచున్నది-అయినను "పుత్రేణలోకాన్జయతి" "అపుత్రస్యగతిర్నాస్తి" అనుప్రమాణములు అసత్యములుకావు-యెట్లనిన? "పున్నామ్నో నరకాత్త్రాయత ఇతిపుత్రః, పున్నామ్నోనరకాద్యస్మాత్పితరంత్రాయతేస్వయంతస్మాత్పుత్ర ఇతిప్రోక్తస్స్వయమేవస్వయంభువః"-పుత్-అనగా

పాతయతీతిపుత్ =క్రిందికిత్రోయుదానికి పుత్తనిపేరు-మరియు 'పుం' అనెడు ఘోరనరకమునుండి లేవనెత్తి రక్షించువాఁడు పుత్రుఁడు-నరక మనగా ? "అసత్సంసారవిషయ జనన సంసర్గ ఏవనరకః" అనినిరాలంబో పనిషద్వాక్యరీతిని మధు బిందుగ్ర హణమున్నకై కమలమున ప్రవేశించి సూర్యాస్తమయ సమయమునముకుళించినపద్మమున జిక్కిబయలువెడ నేరని భృంగమువలె ఇట్టిమహాదుఃఖకరమైన సంసారవలలో జిక్కి తిక్కగొని పొక్కుచు ఉసురులు తొరుగవలయుననునిశ్చయముగలిగి యుండునపుడు, తనకు జ్ఞాన సూర్యోదయముచే దేహము మొదలుగా గలప్రపంచమెల్ల మిథ్యయనిన్ని ఆప్రపంచము అస్తత్కల్పితమని త్రోసి తద్విలక్షణుడై వెలుగు పరబ్రహ్మమొక్కటియే సత్యము,అసత్య జ్ఞానానంద స్వరూప పరబ్రహ్మమునగు నాకుదుఃఖము లెక్కడివియను సాధనాంతర నిరపేక్షయాస్వయంప్రకాశమే తానసెడివిజ్ఞాన పుత్రుచే తన్నుద్ధరించునది- ఇట్టివిజ్ఞాన పుత్రుడు గలిగిన వైకుంఠకైలాస స్వర్గ నాకలోకాదులు గూడ జ్ఞానదృష్టియందు స్వరూపేతరము లేదనిన్ని, అట్లులేదను నిశ్చయనిర్వాసనా మానసుఖస్థితియే, పైజెప్పినలోకాదుల యందుగలుగు సుఖస్థితియని పెద్దలువైకుంఠాది పదములకు నిజార్థము ననుభవించి వక్కాణించెదరు-సముద్రమున కంటె జలకణమును, నిప్పుకంటె మిడుగురును, నేలకంటె ధూళియు నేప్రకారముగ నన్య ములుగావో, ఆప్రకారముగనే పరబ్రహ్మమునకంటె నేను వేఱుగానని స్వయంప్రకాశమై వెలుఁగు బ్రహ్మనిష్ఠచే, నిత్యానంద మోక్షసామ్రా జ్యమునుఁబొంది సుఖింపక, శుష్కవేదాంతముతోఁగాలమునువ్యర్థపు చ్చఁగూడదు. ఇచ్చవచ్చినన్ని చెప్పవచ్చును. నడువఁదొడఁగి నప్పుడు కష్టముదోచును.కానిపోని కుతర్కయుక్తులునాలుగు నేర్చుకొని క్రిందు మీదులు చేసినమాత్రమున తత్వజ్ఞులుకానేరరు. సద్గ్రంథములఁజదివియు, తుర్యసుఖము ననుభవింపనివారు మహాలక్ష్మినిఁబూజించి పెద్దమ్మను దెచ్చు

కొన్నట్టును, పాతాళాంజనము వేసిశల్యము నెత్తినట్టును, చక్ర
సమిధలు వేడుకొను దౌర్భాగ్యులకు తుల్యులేయని బ్రహ్మవేత్త

ఓం శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

“నమోऽనంతాయ సూక్ష్మాయ కూటస్థాయ విపశ్చితే।
నానావాదానురోధాయ వాచ్యవాచకశక్తయే”
“నమో గుణప్రదీపాయ గుణాత్మచ్ఛాదనాయ చ।
గుణవృత్త్యుపలక్ష్యాయ గుణద్రష్ట్రే స్వసంవిదే” ఇట్లు ప్ర
పరమాత్ముడవగు నిన్నును
“త్వామాత్మానం పరంమత్వా పరమాత్మానమేవచ।
ఆత్మాపునర్బహిర్మృగ్య అహో అజ్ఞజనాజ్ఞతా” శరీర
గాను, శరీరాదికమును పరబ్రహ్మస్వరూపుడవగు నిన్నును గా
యెచ్చోటనో వున్నాడవని వెతుకునట్టి మూఢుల యొక్క బు
మేమనవచ్చును. ఎంత ఆశ్చర్యము !! (శ్రీమద్భా

సువివేకదర్పణమ్

సమాప్తము.

నారాయణ, నారాయణ, నారాయణ.

శ్రీమదఖండ నిత్యనిర్మలాద్వయ సచ్చిదానంద పరబ్రహ్మ
శ్రీమత్సద్గురు శాన్తానన్ద సరస్వతీ స్వామిన
శ్చరణారవిన్దాభ్యాం నమోనమః

ఓమ్.

